

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

వందేళ్ల.. గంధర్వ మహల్

అబ్బురపరుస్తున్న చారిత్రక కట్టడం



3

శుక్రవారం | 19-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 94 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి రా. 7.41 తదుపరి చతుర్దశి; నక్షత్రం: మూల రా. 2.55 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: ఉ. 11.15-12.49, రా. 1.21-2.55; దుర్ముహూర్తం: ఉ. 8.29-9.20, మ. 12.47-1.38; అమృతఘడియలు: రా. 1.21-2.55; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 5.54; సూర్యాస్తమయం: 6.48 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో నీట మునిగిన జాతీయ రహదారి

ముంచెత్తిన వాన

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

ఏజెన్సీ గ్రామాల్లో స్తంభించిన రాకపోకలు

పలు ఇళ్లు నేలమట్టం.. కొట్టుకుపోయిన పశువులు

కృష్ణా, గోదావరికి భారీగా వరద.. వరదలో చిక్కుకున్న 30 మంది

రక్షించిన ఎన్డీఆర్ఎఫ్.. కొండవాగులో కొట్టుకుపోయిన కారు

కారులో ఐదుగురు.. కాపాడిన గ్రామస్థులు

యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన సీఎం చంద్రబాబు

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం.. 48 గంటల్లో భారీవర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

తీవ్ర అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఏజెన్సీలో అనేక గ్రామాల్లోకి వరద నీరు పోటెత్తింది. దీంతో జనం సమీప కొండలపైకి పరుగుతీసి ప్రాణాలు కాపాడుకున్నారు. గురువారం కోస్తాంధ్రలో అక్కడక్కడ, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో కొన్ని చోట్ల కుండపోతగా వాన పడింది. ఉదయం 8 నుంచి రాత్రి 7 గంటల వరకు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో 137.25 మి.మీ., కొయ్యలగూడెంలో 111, కోనసీమ జిల్లా మండపేటలో 96.75, తూర్పుగోదావరి జిల్లా కడియంలో 92, నిడదవోలులో 91, తాడేపల్లిగూడెంలో

మిగతా 11వ పేజీలో...

గంజాయి మత్తు వదిలేదెలా?

జగన్ పాలనలో గంజాయి వనంగా ఏపీ

సాధారణంగా ఐటీ, పరిశ్రమలు, విద్య, వ్యవసాయం వంటి రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు రాష్ట్రాలు పోటీ పడతాయి. జగన్ ఐదేళ్ల పాలనలో ఈ రంగాల్లో ఏపీ అట్టడుగున ఎక్కడో ఉంది. కానీ గంజాయి రవాణాలో మాత్రం మొదటి స్థానం సాధించింది. గంజాయి సాగు, సరఫరాకు కేంద్రంగా విశాఖ మన్యం మారిందని సాక్షాత్తు ఎన్‌సీబీ నివేదికలో పేర్కొంది.

వాడవాడలా చిల్లర కొట్లు... కాలేజీల్లో కూడా గంజాయి దొరుకుతోంది. రాష్ట్రంలో మాదక ద్రవ్యాలకు అలవాటు పడ్డ బాధితుల సంఖ్య గత ఏడాది చివరి నాటికి సుమారు 23 లక్షలు. గత జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా మైనర్లు, విద్యార్థులు, యువత మత్తుకు బానిసలుగా మారారు. ఈ మహమ్మారిని నిర్మూలించడం చంద్రబాబు సర్కారు ముందున్న అతిపెద్ద సవాల్.



విశాఖ మన్యం కేంద్రంగా సాగు

మైనర్లు, విద్యార్థులు, యువతపై వల

వాడవాడలా అమ్ముతున్న ముఠాలు

గతేడాది చివరికి బాధితులు 23 లక్షలు

రాష్ట్రం నుంచి దేశమంతా అక్రమ రవాణా

ఎక్కడ పట్టుబడినా ఏపీ పేరే

2019, 2021లో రవాణాలో ఏపీ టాప్

కట్టడికి చంద్రబాబు సర్కారు చర్యలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ గంజాయి వనంగా మారిపోయింది. జగన్ ప్రభుత్వం ఉదాసీనత, వైసీపీ నాయకుల కమీషన్ల కక్కుర్తితో వాడవాడలకూ గంజాయి రవాణా విస్తరించింది. ఎంతోమంది విద్యార్థులు, యువత, మైనర్లు మత్తుకు బానిసలయ్యారు. గంజాయి మత్తును వదిలించడం కూటమి సర్కారుకు సవాల్‌గా మారింది. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు ఏపీలోనే కనిపిస్తున్నాయి. ఉత్తరాంధ్ర మన్యం పేరు వినిపిస్తోంది. రాష్ట్రానికి పట్టిన గంజాయి మత్తు వదిలించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చంద్రబాబు సర్కారు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా పోలీసు అధికారులు గంజాయి దందాపై ఆరా తీస్తున్నప్పుడు అనేక సంచలన

మిగతా 11వ పేజీలో...



వైసీపీ నేత పీఎస్ ఖాన్‌తో నిందితుడు షేక్ జిలానీ (ఫైల్)

'చావు' రాజకీయం!

హతుడు రషీద్, హంతకుడు జిలానీలు గతంలో ఖాన్ ముఠాలో సభ్యులే

ఖాన్ వినుకొండ వైసీపీ అధ్యక్షుడు.. ఐదేళ్లుగా 'గ్యాంగ్'తో దందాలు 11

గత తొలి ఏకాదశి రోజున గ్యాంగ్‌లో వార్.. రషీద్, జిలానీ మధ్య విభేదాలు

జిలానీ, ఆయన అన్న అరెస్టు.. మళ్లీ తొలి ఏకాదశి రోజునే రషీద్ హత్య

టీడీపీపై నెపం వేసి.. నేడు వినుకొండలో జగన్ పరామర్శ యాత్ర

పుంగనూరులో హైటెన్షన్!

పోలీసులకు సమాచారం ఇవ్వకుండా వచ్చిన ఎంపీ మిథున్‌రెడ్డి

మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంట్లో మకాం.. నేతిగుట్టపల్లి 'రిజర్వాయర్' పరిహారం కోసం వచ్చిన రైతులు

టీడీపీ కార్యకర్తలతో కలిసి రెడ్డెప్ప ఇల్లు దిగ్బంధం.. ముందే సిద్ధం చేసుకున్న రాళ్లు, బాటిళ్లు, కర్రలతో మిథున్‌రెడ్డి బృందం దాడి.. ప్రతిఘటించిన టీడీపీ శ్రేణులు 12

దాడుల్లో కానిస్టేబుల్ సహా 12 మంది టీడీపీ కార్యకర్తలకు గాయాలు.. 9 వాహనాలు ధ్వంసం

గాల్లోకి కాల్పులు జరిపిన ఎంపీ గన్‌మెన్.. పోలీసు బందోబస్తుతో తిరుపతికి మిథున్‌రెడ్డి

మిగతా శ్వేతపత్రాలు సభలోనే!

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

22 నుంచి 26 వరకు అసెంబ్లీ సమావేశాలు

తొలిరోజు గవర్నర్ ప్రసంగం

మర్నాడు ధన్యవాద తీర్మానంపై చర్చ-ఆమోదం

మిగతా 3 రోజుల్లో రోజుకో శ్వేతపత్రంపై చర్చ 12

సెప్టెంబరులో పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలు!

ఆగస్టు 15న అన్న క్యాంటీన్లు

ఆహారం సరఫరాకు టెండర్లు

22న ఖరారు చేస్తాం

రూ.5కే ఆహారం 12

డ్రైన్ల పూడికతీతకు 50 కోట్లు

పది రోజుల్లో పనులు పూర్తి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

చెత్త పన్నుపై సీఎంతో చర్చించి నిర్ణయం

మునిసిపల్ కమిషనర్లతో మంత్రి నారాయణ సమీక్ష

పరీక్ష కేంద్రాల వారీగా నీట్ ఫలితాలు

నగరాల వారీగానూ..

రేపు 12లోపు ప్రకటించాలి

ఎన్‌టీఏను ఆదేశించిన సుప్రీంకోర్టు 2

వయసును ఇక అడ్డుకోవచ్చు!

వయసుతోపాటే శరీరాన్ని క్షీణింపజేసే ఐఎల్-11 ప్రోటీన్‌ను గుర్తించిన శాస్త్రవేత్తలు

వాషింగ్టన్, జూలై 18: ఎక్కువ కాలంపాటు జీవించటం, ఆరోగ్యంగా జీవితాన్ని గడపటం.. ఎన్ని తరాలు మారినా, ఎన్ని శతాబ్దాలు గడిచిపోయినా.. ఎప్పటికప్పుడు మనుషులు కోరుకునేది ఇదే. కాలం గడుస్తున్నకొద్దీ మనిషి సగటు జీవిత కాలం పెరుగుతోంది. అయితే, దానిని మరింత పెంచటానికి, ముఖ్యంగా వయసు పెరుగుతున్న కొద్దీ సంభవించే శారీరక దుర్బలత్వాన్ని అధిగమించటానికి అనేక (యాంటీ ఏజింగ్) పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ దిశగా.. సింగపూర్ శాస్త్రవేత్తలు తాజాగా ఓ ముందంజ వేశారు. వయసు పెరుగుదలకు కారణమవుతున్న ఓ ప్రోటీన్‌ను వారు తొలిసారిగా గుర్తించారు. ఈ ప్రోటీన్ ఉత్పత్తిని అడ్డుకోవటం ద్వారా.. వయసు పెరుగుతున్న కొద్దీ సంభవించే శారీరక క్షీణత ప్రక్రియ వేగాన్ని తగ్గించవచ్చని తెలిపారు. తద్వారా దీర్ఘ కాలం జీవించే అవకాశం ఉంటుందన్నారు. సింగపూర్‌లోని డ్యూక్-ఎన్‌యూఎస్ మెడికల్ స్కూల్ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన నిర్వహించారు. మనుషుల్లో గుండె, మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తుల పనితీరులో ఇంటర్‌ల్యూకిన్ (ఐఎల్-11) అనే ప్రోటీన్ కీలక ప్రభావం చూపుతున్న విషయాన్ని వీరు గుర్తించారు. ఈ ప్రోటీన్ ఉత్పత్తి పెరుగుతున్నా కొద్దీ కాలేయంలో, పొట్టలో కొవ్వు పేరుకుపోతోందని, కండరాలు బలహీనపడుతున్నాయని వెల్లడైంది. ఇవన్నీ శారీరక ధృడత్వాన్ని తగ్గించి.. తద్వారా వయసు పెరుగుదల ప్రక్రియను కొనసాగించే లక్షణాలే.

ఆడ ఎలుకల్లో ఆయుర్దాయం మరింత వృద్ధి

సింగపూర్ శాస్త్రవేత్తలు తమ పరిశోధన కొనసాగిస్తూ ఎలుకలపై ప్రయోగాలు నిర్వహించారు. వాటి నుంచి ఐఎల్-11 ప్రోటీన్‌ను తొలగించటం, ఐఎల్-11 నిరోధక చికిత్సను నిర్వహించటం వంటివి జరిపారు. దీని ద్వారా ఎలుకల్లో.. వయసు పెరుగుతున్న కొద్దీ సంభవించే శారీరక క్షీణత, వ్యాధులు, బలహీనత మొదలైన వాటి నుంచి రక్షణ లభించింది. వాటి సగటు జీవితకాలం 24.9% పెరిగింది. 75 వారాల వయసులో ఉన్న ఎలుకల్లో (ఇది మనుషుల్లో దాదాపు 55 ఏళ్ల వయసుతో సమానం) ఐఎల్-11 నిరోధక చికిత్సను ప్రారంభించి అవి మరణించే వరకు కొనసాగిస్తే.. మగ ఎలుకల సగటు జీవిత కాలం 22.5%, ఆడ ఎలుకల సగటు జీవితకాలం 25% పెరిగింది. అంతేకాదు, ఆరోగ్య సమస్యలు తీసుకొచ్చే తెల్ల కొవ్వు బదులు క్యాలరీలను ఖర్చు చేసే బ్రౌన్‌ఫ్యాట్ ఉత్పత్తి ఎలుకల్లో మొదలైంది. గుండె సంబంధిత సమస్యల నుంచి కూడా వాటికి రక్షణ లభించింది. ఈ ఫలితాలపై డ్యూక్-ఎన్‌యూఎస్ డీన్ ప్రొఫెసర్ థామస్ కాఫ్‌మన్ మాట్లాడుతూ, ఐఎల్-11 ప్రోటీన్ గురించి తాజాగా వెల్లడైన అంశాలు.. వృద్ధులు మరింత ఎక్కువకాలం ఆరోగ్యంగా జీవించటానికి దోహదపడతాయని చెప్పారు. కండరాల పటుత్వం, శారీరక ధృఢత్వం పెరగటం ద్వారా వృద్ధులు జారి పడిపోయే ప్రమాదం కూడా గణనీయంగా తగ్గుతుందన్నారు. 'ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఆరోగ్యవంతమైన దీర్ఘకాలిక జీవితాలు గడిపేలా ఐఎల్-11 చికిత్సను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్నది మా లక్ష్యం' అని పరిశోధనలో పాలుపంచుకున్న శాస్త్రవేత్త స్టార్ట్ కుక్ పేర్కొన్నారు. ఈ పరిశోధనకు సంబంధించిన వివరాలు తాజాగా సైన్స్ జర్నల్ నేచర్‌లో ప్రచురితమయ్యాయి. వయసు పెరుగుదల ప్రక్రియను నెమ్మదింపజేసే పరిశోధనలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నాయి. మనుషుల జీవితకాలాన్ని ఒక ఏడాది కాలం పాటు పొడిగిస్తే.. అది 38 ట్రిలియన్ డాలర్ల (రూ.83,62,225 కోట్ల) సంపదను సృష్టిస్తుందని అంచనాలున్నాయి.

లోకం తీరు



వయస్సును తగ్గించే మందు కనుగొన్న శాస్త్రవేత్తలు

సుప్రీంకోర్టు జడ్జీలుగా కోటీశ్వర్ సింగ్, మహదేవన్ ప్రమాణం



న్యూఢిల్లీ, జూలై 18: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్, జస్టిస్ ఆర్.మహదేవన్ బాధ్యతలు చేపట్టారు. గురువారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ వారితో ప్రమాణం చేయించారు. దీంతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 34కు చేరింది. ఈశాన్య రాష్ట్రం మణిపూర్ నుంచి సుప్రీంకోర్టు తొలి జడ్జిగా జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌కు ప్రాతినిధ్యం దక్కిన సంగతి తెలిసిందే.. అంతకుముందు జమ్మూ కశ్మీర్, లడఖ్ ప్రధాన న్యాయమూర్తిగా కోటీశ్వర్ సింగ్, మద్రాస్ హైకోర్టు తాత్కాలిక న్యాయమూర్తిగా మహదేవన్ పనిచేశారు.

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు కరోనా

వాషింగ్టన్, జూలై 18: అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార పర్వం కీలక దశలో ఉండగా.. ఆ దేశ అధ్యక్షుడు జో బైడెన్(81) కరోనా బారిన పడ్డారు. కరోనా పాజిటివ్‌గా తేలడంతో ఎన్నికల ప్రచారానికి తాత్కాలికంగా దూరమయ్యారు. అధ్యక్షుడు జో బైడెన్ కరోనా పాజిటివ్‌గా తేలడంతో టీకా తీసుకున్నారని, తన స్వగృహంలో ఐసోలేషన్‌లో ఉన్నారని వైట్ హౌస్ వర్గాలు బుధవారం ప్రకటించాయి. బైడెన్ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఇంటి నుంచే విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నాయి. తాను అనారోగ్యానికి గురయ్యాయని బైడెన్ కూడా ఎక్స్(ట్విటర్)లో పోస్ట్ చేశారు. కరోనా పాజిటివ్‌గా తేలడంతో లాస్‌వెగాస్‌లో బుధవారం తలపెట్టిన ప్రచార కార్యక్రమాన్ని బైడెన్ చివరి నిమిషంలో రద్దు చేసుకున్నారు. కాగా బుధవారం ఓ ఇంటర్వ్యూలో బైడెన్ మాట్లాడుతూ.. తనకు తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తితే వైద్యుల సూచన మేరకు అధ్యక్ష ఎన్నికల బరి నుంచి తప్పుకోవడంపై ఆలోచిస్తానని చెప్పారు. ఆ ప్రకటన చేసిన కాసేపటికే ఆయన కరోనా బారిన పడ్డారు.

వాహనం అద్దానికి 'ఫాస్టాగ్' అంటించకపోతే రెట్టింపు రుసుము!

న్యూఢిల్లీ, జూలై 18: జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులారా జాగ్రత్త! ఇకపై ఎవరైనా ఉద్దేశపూర్వకంగా తమ వాహనం ముందు అద్దానికి 'ఫాస్టాగ్'ను అంటించకపోతే టోల్ ప్లాజాల్లో రెట్టింపు రుసుమును వసూలు చేస్తారు. ఈ మేరకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) గురువారం మార్గదర్శకాలు జారీ చేసింది. ఫాస్టాగ్ ఉన్నప్పటికీ దాన్ని వాహనం ముందు అద్దానికి లోపలి నుంచి అతికించకుండా టోల్ లేన్‌లోకి వచ్చిన వారి నుంచి రెట్టింపు చార్జీ వసూలు చేయాలని స్పష్టం చేసింది. ఇలాంటి వారి వల్ల టోల్‌ప్లాజాల్లో అనవసర జాప్యం చోటుచేసుకుంటుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఫాస్టాగ్ అంటించకపోతే రెట్టింపు రుసుము వసూలు చేసే విషయాన్ని అన్ని టోల్ ప్లాజాల్లో ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించింది.

మళ్లీ తెరుచుకున్న రత్న భండార్

పూరీ, జూలై 18: పూరీలోని 12వ శతాబ్దానికి చెందిన ప్రముఖ పుణ్యక్షేత్రం జగన్నాథ ఆలయం ట్రెజరీ రత్న భండార్‌ను వారంలోనే రెండోసారి గురువారం తెరిచారు. రత్న భండార్‌లో మిగిలి ఉన్న బంగారం, విలువైన నగలను భారీ భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఒడిసా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పర్యవేక్షక కమిటీ సభ్యులు జగన్నాథుడికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయంలోకి ప్రవేశించారు. పూరీ మాజీ రాజు గజపతి మహారాజ దివ్యసింగ్ దేవ్ ఆలయ సముదాయంలోని స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించారు. ట్రెజరీలోని బంగారం, విలువైన నగలను భారీ భద్రత మధ్య తరలిస్తున్నట్టు వెల్లడించారు.

రైతును అవమానించిన జీటీ మాల్‌కు ఏడురోజులు తాళం: కర్ణాటక మంత్రి వెల్లడి

బెంగళూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): రైతును అవమానించిన బెంగళూరులోని జీటీ మాల్‌కు ఏడు రోజుల పాటు తాళం వేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తామని కర్ణాటక రాష్ట్ర నగరాభివృద్ధి శాఖ మంత్రి భైరతి సురేశ్ తెలిపారు. హావేరి జిల్లాకు చెందిన నాగరాజు, తన తండ్రి ఫకీరప్పతో కలిసి జీటీ మాల్‌కు వెళ్లారు. ఫకీరప్ప పంచెకట్టుతో ఉండటంతో జీటీ మాల్‌కు వచ్చినప్పుడు సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్న విషయం తెలిసిందే. దీంతో కన్నడ సంఘాలు, రైతుసంఘాలు బుధవారం ఆందోళనకు దిగాయి. దీంతో మాల్ యాజమాన్యం బహిరంగ క్షమాపణలు చెప్పింది. అవమానానికి గురైన రైతును పిలిపించి సత్కరించింది. ఈ నేపథ్యంలో గురువారం శాసనసభ సమావేశాలు ప్రారంభం కాగానే రైతును అవమానించిన సంఘటనను కాంగ్రెస్ సభ్యులు ప్రస్తావించారు. దీంతో నగరాభివృద్ధి శాఖ మంత్రి భైరతి సురేశ్ స్పందించారు.

దేశవ్యాప్తంగా 25 వేల మందికి ఉద్యోగాలిచ్చా

- నా పిల్లలు కర్ణాటకలో ఉద్యోగానికి అనర్హులా?
- ఫోన్‌పే కో ఫౌండర్ సమీర్ నిగమ్

బెంగళూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలో ప్రైవేటు రంగ సంస్థలు, పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇవ్వాలనే విషయమై ప్రభుత్వం వెనకడుగు వేసినా.. ప్రముఖుల అసంతృప్తి మాత్రం కొనసాగుతూనే ఉంది. ఫోన్‌పే కో ఫౌండర్, సీఈవో సమీర్ నిగమ్ ఈ మేరకు 'ఎక్స్' ద్వారా ఆసక్తికర పోస్టు చేశారు. తన వయస్సు 46 ఏళ్లు అని, తన తండ్రి ఇండియన్ నేవీలో పనిచేశారని, తాను ఎక్కడా 15ఏళ్లు కూడా నివసించలేదని పేర్కొన్నారు. తన కంపెనీల ద్వారా దేశవ్యాప్తంగా 25 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చానని తెలిపారు. కానీ తన పిల్లలు కర్ణాటకలో ఉద్యోగాలు చేయడానికి అర్హులు కారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇటువంటి బిల్లులను తీసుకురావాలని భావించడం సరికాదని అభిప్రాయపడ్డారు.

శ్రీకాకుళంలో అకాడమీ ఏర్పాటు చేయండి

- కరణం మల్లీశ్వరికి కేంద్ర మంత్రి రామ్మోహన్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో వెయిట్ లిఫ్టింగ్ అకాడమీని ఏర్పాటు చేయాలని సిడ్నీ ఒలింపిక్ కాంస్య పతక విజేత కరణం మల్లీశ్వరికి కేంద్ర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. గురువారం, ఇక్కడ రాజీవ్ గాంధీ భవన్‌లో మంత్రితో కరణం మల్లీశ్వరి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వెయిట్ లిఫ్టింగ్ అకాడమీ ఏర్పాటుకు కావాల్సిన భూమి, నిధులు, మౌలిక సదుపాయాలను కల్పిస్తామని తెలిపారు. మంత్రి విజ్ఞప్తికి మల్లీశ్వరి సానుకూలంగా స్పందించారు. క్రీడల పట్ల ఆయనకున్న ఆసక్తి, క్రీడరంగం అభివృద్ధి కోసం ఆయన తన ఆలోచనలను పంచుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాగా, మల్లీశ్వరి విజయగాథ భావి చాంపియన్లకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని మంత్రి రామ్మోహన్‌నాయుడు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.



రామ్మోహన్‌నాయుడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కరణం మల్లీశ్వరి

దొరల్లో దొంగలు!

నకిలీ ధ్రువపత్రాలతో ఆలిండియా సర్వీసులకు ఎంపిక



నకిలీ సర్టిఫికెట్లు, తప్పుడు చిరునామాలు, అడుగడుగునా ఉల్లంఘనలు, మోసాలతో అక్రమంగా ఆలిండియా సర్వీసెస్‌కు ఎంపికైన ట్రైనీ ఐఏఎస్ పూజాఖేద్కర్ వివాదం నేపథ్యంలో.. అలాంటి అక్రమార్కుల వివరాలు మరిన్ని వెలుగులోకి వస్తున్నాయి! ఉదాహరణకు.. కేరళకు చెందిన 2016 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అసిఫ్ కె.యూసుఫ్ తమ కుటుంబానికి క్రీమీలేయర్ స్థాయి కంటే తక్కువ ఆదాయం ఉందంటూ తప్పుడు సమాచారంతో ఓబీసీ సర్టిఫికెట్ పొందినట్టు తాజాగా వెల్లడైంది. దీంతో.. 'ఇదుగో ఈ అభ్యర్థులు సివిల్స్‌కు అక్రమంగా ఎంపికయ్యారు' అంటూ చాలా మంది 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేస్తున్నారు. వారు పేర్కొంటున్న అధికారులందరూ అక్రమ మార్గాల్లో సివిల్స్‌కు ఎంపికయ్యారని చెప్పడానికి ఆధారాలు లేవుగానీ.. కొందరు మాత్రం నిజంగానే తప్పుడోవ పట్టినట్టు ఫొటోలు, వీడియోలు, ఇతర ఆధారాల ద్వారా బయటపడిపోతోంది. తాజా కేసులే కాదు.. గతంలో ఇలా తప్పుడు పత్రాలు సమర్పించి దొరికిపోయిన వారి వివరాలూ ఇప్పుడు బయటకు వస్తున్నాయి. ఉదాహరణకు.. 2008 బ్యాచ్ ఐఆర్‌ఎస్ అధికారి నవనీత్‌కుమార్.. యూపీఎస్సీ పరీక్ష రాసే వయసు దాటిపోవడంతో ఏకంగా తన పేరు, వయసునే మార్చేసుకుని, నకిలీ పత్రాలతో పరీక్ష రాశారు. ఆ పత్రాలతో ఉద్యోగం సంపాదించి.. 2017 దాకా పనిచేశారు. తర్వాత ఆ విషయం బయటపడడంతో సీబీఐ ఆయనపై కేసు నమోదు చేసింది. నవనీత్ కుమార్ అసలు పేరు రాజేశ్‌కుమార్ శర్మ అనే విషయం సీబీఐ దర్యాప్తులో బయటపడింది. తాజా కేసులను పరిశీలిస్తే.. 2011 బ్యాచ్‌కు చెందిన అభిషేక్ సింగ్ దివ్యాంగుల కోటాలో ఐఏఎస్ అధికారి అయ్యారు. 2023 దాకా ఆయన పదవిలో ఉన్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో చెప్పా పెట్టకుండా సెలవు పెట్టడంతో యూపీ సర్కారు ఆయన్ను సస్పెండ్ చేసింది. దీంతో ఆయన తన పదవికి రాజీనామా చేసి.. నటుడిగా మారారు. నిజానికి ఆయన ఐఏఎస్‌గా ఉండగానే పలు మ్యూజిక్ వీడియోల్లో నటించారు. దివ్యాంగులో కోటాలో ఐఏఎస్ అయిన అభిషేక్ సింగ్ జిమ్‌లో కసరత్తులు చేస్తున్న వీడియోలు, పాటలకు నృత్యం చేస్తున్న వీడియోలు.. ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. అవే కాదు.. సన్నీలియోన్, అదా శర్మ వంటివారితో ఆయన చేసిన మ్యూజిక్ వీడియోలనూ పలువురు షేర్ చేసి.. తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు. అలాగే.. 2023లో మధ్యప్రదేశ్‌కు చెందిన దివ్య యాదవ్ సివిల్స్‌కు ఎంపికయ్యారు. ఆమె తండ్రి రాజు యాదవ్ ఏఎస్‌ఐగా పనిచేస్తున్నారు. ఒక ఏఎస్‌ఐ కుమార్తె సివిల్స్ సాధించిందంటూ మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు వచ్చాయి. కానీ.. ఆమె ఎస్సీ కోటాలో ఎంపికయ్యారన్న విషయం బయటపడడంతో.. విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే.. ఐఈఎస్ (ఇండియన్ ఎకనమిక్ సర్వీస్) అధికారి కుమార్తె అయిన సర్జానా యాదవ్ 2019లో సివిల్స్‌కు ఓబీసీ-నాన్ క్రీమీలేయర్ కోటాలో ఎంపిక కావడం ఏమిటని విమర్శిస్తున్నారు. ఇలాంటి కేసులు.. ఇంకా చాలానే ఉన్నాయని సమాచారం.

అది మరింత ఆందోళనకరం..

నకిలీ ధ్రువీకరణ పత్రాలతో యూపీఎస్సీ పరీక్ష రాసి ఆలిండియా సర్వీసెస్‌కు ఎంపికైనవారు ఏదో ఒక దశలో దొరికిపోయే అవకాశాలే ఎక్కువని.. దీని కన్నా, తప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చే వ్యవస్థే మరింత ప్రమాదకరమని రవికపూర్ అనే ఐఆర్‌ఎస్ అధికారి ఆందోళన వ్యక్తం చేశారు. సివిల్స్ రాసిన పలువురు దివ్యాంగ అభ్యర్థులు.. తాజా పరిణామాల నేపథ్యంలో తాము పడుతున్న కష్టాల గురించి వివరిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. మరికొందరేమో.. "నీట్, యూపీఎస్సీ, యూజీసీ-నెట్.. ఇలా పరీక్ష ఏదైనా, అక్రమాలు మామూలు అయిపోయాయి. ఇలాంటివన్నీ చూస్తుంటే ఈ పరీక్షల విశ్వసనీయత మీదే నమ్మకం పోతోంది. పరీక్ష రాయాలన్న ఆసక్తీ పోతోంది" అని నిర్వేదంగా అంటున్నారు. వీటన్నింటి నేపథ్యంలో.. పూజా ఖేద్కర్, అసిఫ్ కె.యూసుఫ్, అభిషేక్ సింగ్ వంటివారిని ఎంపిక దశలోనే ఏరివేసేలా యూపీఎస్సీ కఠిన చర్యలు తీసుకోవాలని.. ఎంపికప్రక్రియను మరింత పారదర్శకంగా తీర్చిదిద్దాలని, సర్టిఫికెట్ల తనిఖీ మరింత మెరుగ్గా చేయాలని పలువురు నిపుణులు సూచిస్తున్నారు. ఇలాంటి కేసులు బయటపడినప్పుడు.. నిందితులపై వేగంగా కఠిన చర్యలు తీసుకుంటే.. తర్వాత మరొకరు ఆ తప్పు చేయడానికి భయపడతారని అభిప్రాయపడుతున్నారు.

- సెంట్రల్ డెస్క్

ఈడబ్ల్యూఎస్ కోటాలో మస్క్.. ఓబీసీ కోటాలో గేట్స్

తప్పుడు ధ్రువపత్రాలతో కొంతమంది ఆలిండియా సర్వీసులకు ఎంపికవుతున్న వార్తలు వరుసగా వస్తుండడంతో.. సోషల్ మీడియాలో ఈ అంశంపై మీమ్స్ వెల్లువెత్తుతున్నాయి. "అపర కుబేరుడు ఎలాన్ మస్క్ ఆర్థికంగా బలహీన వర్గాల (ఈడబ్ల్యూఎస్) కోటాలో సివిల్స్‌కు దరఖాస్తు చేస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం" అంటూ 'ఎక్స్'లో ఒక వ్యక్తి వ్యంగ్య పోస్ట్ పెట్టారు. మస్క్‌ను స్ఫూర్తిగా తీసుకుని బిల్ గేట్స్ సైతం ఓబీసీ-నాన్ క్రీమీ లేయర్ కోటాలో యూపీఎస్సీకి దరఖాస్తు చేయాలనుకుంటున్నారంటూ ఆ వ్యంగ్యపోస్టుకు మరికొంత మసాలా దట్టించారు. చాలామంది.. బాలీవుడ్ చిత్రాల్లోని ఇంటర్వ్యూ సన్నివేశాలతో సివిల్స్ ఎంపిక ప్రక్రియలో లోపాలపై మీమ్స్ సృష్టించి వాటిని వైరల్ చేస్తున్నారు.

పూజా ఖేద్కర్ తల్లి అరెస్టు

హత్యాయత్నం కేసు.. రెండు రోజుల కస్టడీ

ముంబై, జూలై 18: వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ తల్లి మనోరమ ఖేద్కర్‌ను ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. భూ వివాదంలో రైతులను గన్‌తో బెదిరించిన వీడియో వైరల్ అయిన నేపథ్యంలో మనోరమతోపాటు ఆమె భర్త దిలీప్ ఖేద్కర్‌పై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆ దంపతులిద్దరూ పరారీలో ఉన్నారు. పుణె జిల్లా మహద్‌లోని ఓ లాడ్జిలో దాక్కున్న మనోరమను గురువారం ఉదయం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా, జడ్జి రెండు రోజుల పోలీసు కస్టడీకి అప్పగించారు. ఆమెపై భారతీయ న్యాయ సంహిత చట్టంలోని వివిధ సెక్షన్లతోపాటు తాజాగా హత్యాయత్నం అభియోగాలను నమోదు చేశారు. ఇప్పటికే ఆమె కుమార్తె పూజా ఖేద్కర్‌కు నకిలీ పత్రాలతో ఐఏఎస్‌కు ఎంపికైన, అధికార దుర్వినియోగానికి పాల్పడిన కేసుల్లో ఉచ్చు బిగుస్తోంది. మరోవైపు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో దిలీప్ ఖేద్కర్‌పై బహిరంగ విచారణ జరపాలంటూ పుణె ఏసీబీ(అవినీతి నిరోధక బ్యూరో)కి ఫిర్యాదు అందింది. మహారాష్ట్ర రిటైర్డ్ ప్రభుత్వ అధికారి అయిన దిలీప్ వ్యాపార వేత్తలను ముడుపులు డిమాండ్ చేసిన అభియోగాలతో రెండు సార్లు సస్పెన్షన్‌కు గురైనట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. 'దిలీప్‌పై ఇప్పటికే అహ్మద్‌నగర్ యూనిట్‌లో నాసిక్ ఏసీబీ బహిరంగ విచారణ జరుపుతోంది. తాజాగా, ఆయనపై బహిరంగ విచారణ జరపాలని ఫిర్యాదుదారు నుంచి మాకు అభ్యర్థన అందింది. ఫిర్యాదుదారు వాంగ్మూలాన్ని నమోదు చేసి, దానితోపాటు ఆధారాలను ఏసీబీ ప్రధానకార్యాలయానికి పంపించాం' అని పుణె ఏసీబీ ఎస్పీ అమోల్ తాంబే చెప్పారు. తాజా ఫిర్యాదును ఇప్పటికే కొనసాగుతున్న దర్యాప్తులో కలిపి విచారించాలా? లేక విడిగా విచారణ జరపాలా? అనే విషయంపై ఏసీబీ ప్రధాన కార్యాలయం నుంచి మార్గనిర్దేశం కోరామని తెలిపారు.

పరీక్ష కేంద్రాల వారీగా నీట్ ఫలితాలు

న్యూఢిల్లీ, జూలై 18: నీట్ పేపర్ లీకేజీపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరుపుతున్న సుప్రీంకోర్టు గురువారం జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ(ఎన్‌టీఏ)కు కీలక ఆదేశాలు జారీ చేసింది. పరీక్ష కేంద్రాలు, నగరాల వారీగా ఫలితాలను ప్రకటించాలని స్పష్టం చేసింది. శనివారం మధ్యాహ్నం 12 గంటల్లోపు ఫలితాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టాలని సూచించింది. విద్యార్థుల గుర్తింపును బహిర్గతం చేయొద్దని పేర్కొంది. నీట్-యూజీ పరీక్షలు మే 5న దేశవ్యాప్తంగా జరగ్గా.. పట్నా, హజారీబాగ్‌లలో పేపర్ లీకేజీ కేసులు నమోదయ్యాయి. గుజరాత్‌లోని గోధ్రా, మరికొన్ని ప్రాంతాల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో.. సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశించిన విషయం తెలిసిందే..! దీంతో మే 5న జరిగిన నీట్ పరీక్షను రద్దు చేయాలని, తిరిగి పరీక్షను నిర్వహించాలని కోరుతూ పలువురు విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎన్‌టీఏ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని కలుపుకొని.. మొత్తం 40 పిటిషన్లను కలిపి విచారిస్తామని సుప్రీంకోర్టు ప్రకటించింది. ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ చేపట్టింది. ఈ నెల 11న జరిగిన విచారణలో సీబీఐ, ఎన్టీఏ వాదనలను నమోదు చేసుకుంది. గురువారం మరోమారు విచారణ చేపట్టింది. శనివారం ఫలితాలను నగరాలు, పరీక్ష కేంద్రాల వారీగా విడుదల చేయాలని జస్టిస్ డీవై చంద్రచూడ్ ఈ సందర్భంగా ఎన్టీఏను ఆదేశించారు. ఈ నెల 22న మరోమారు విచారణ చేపడతామని సూచించారు. పేపర్ లీకేజీ దేశంలోని అన్ని ప్రాంతాల్లో జరగలేదని అభిప్రాయపడ్డ ధర్మాసనం.. కేవలం పట్నా, హజారీబాగ్‌కే పరిమితమైనట్లు వెల్లడించింది. గుజరాత్, ఇతర ప్రాంతాల్లో పేపర్ లీక్ అవ్వలేదని చెప్పలేమని పేర్కొంది. గోధ్రాలో కేవలం అభ్యర్థుల తరఫున ఇతరులు ఓఎంఆర్ షీట్లను నింపినట్లు తేలిందని వివరించింది. పిటిషనర్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. "పేపర్ లీకేజీ అనేది దేశవ్యాప్తంగా జరగలేదు. అలా జరిగిందనడానికి వేర్వేరు నగరాల్లో కాంటాక్ట్‌లను గుర్తించలేదు. లక్షల మంది విద్యార్థులు ఈ కేసు తీర్పు కోసం ఎదురు చూస్తున్నారు. పరీక్ష పవిత్రత విస్తృత స్థాయిలో దెబ్బతిన్నదని గుర్తిస్తేనే మరోమారు పరీక్ష నిర్వహణకు ఆదేశాలు జారీ చేయగలం. దీనిపై సీబీఐ దర్యాప్తు జరుగుతోంది. సీబీఐ ఇప్పటి వరకు మాకు చెప్పిన దర్యాప్తు వివరాలను మేం బహిర్గతం చేశాం" అని వ్యాఖ్యానించింది. ప్రశ్నపత్రం లీకేజీ కొన్ని కేంద్రాలకే పరిమితమైందా? లేదా దేశవ్యాప్తంగా వ్యాపించిందా? అనే విషయాలు తెలియాలంటే.. పరీక్ష కేంద్రాల వారీగా ఫలితాల విడుదల కీలకమని అభిప్రాయపడింది. విద్యార్థుల గోప్యత దృష్ట్యా వారి వివరాలను బహిర్గతం చేయకూడదని ఎన్‌టీఏకు సూచించింది. కాగా, నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ గురువారం పట్నా ఎయిమ్స్‌లో చదువుతున్న నలుగురు విద్యార్థులను అదుపులోకి తీసుకుంది. వీరిలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న చందన్‌సింగ్, రాహుల్ అనంత్, కుమార్ షాను, రెండో సంవత్సరం విద్యార్థి కరణ్ జైన్ ఉన్నారు.

కఠిన చట్టాల పేరుతో బెయిలివ్వకుండా ఆపలేరు

రాజ్యాంగ విలువలకు కోర్టులు కట్టుబడి ఉండాలి: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, జూలై 18: నేర శిక్షాస్మృతిలోని కఠిన చట్ట నిబంధనలు నిందితులకు బెయిలివ్వకుండా రాజ్యాంగబద్ధ కోర్టులను ఆపలేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 21వ రాజ్యాంగ నిబంధన ప్రసాదించిన జీవించే హక్కు, వ్యక్తి స్వేచ్ఛ విస్తృతమైనవీ, పవిత్రమైనవని తేల్చి చెప్పింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం(ఉపా) కింద అరెస్టయిన నేపాలీ పౌరుడు షేక్ జావేద్ ఇక్బాల్‌కు బెయిలు మంజూరు చేస్తూ విడుదల చేయాలని ఆదేశించింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. ఎంత కఠినమైన శిక్షాస్మృతి చట్ట నిబంధన అయినా దాని అర్థాన్ని తీసుకొనే సమయం లో రాజ్యాంగ న్యాయస్థానం(హైకోర్టు, సుప్రీంకోర్టు) రాజ్యాంగ విలువలకు, చట్టబద్ధ పాలనకు కట్టుబడి ఉండాలని చెప్పింది. ఆ రెండింటిలోనూ వ్యక్తి స్వేచ్ఛ అంతర్లీనంగా ఉంటుందని వివరించింది. ఈ నేపాలీ వ్యక్తి కేసులో రాజ్యాంగ న్యాయస్థానం బెయిలు ఇవ్వొచ్చు.. ఇవ్వకపోవచ్చు కానీ ఫలానా చట్టం కింద బెయిలు ఇవ్వడం కుదరదని చెప్పడం తప్పే అవుతుందని స్పష్టం చేసింది. ఇక్బాల్ నేపాల్లో భారతదేశపు నకిలీ నోట్లను చెలామణి చేస్తున్నట్లు అంగీకరించాడని పోలీసులు ప్రకటించారు. అతని మీద 489(బి), 489(సి) కింద నకిలీ నోట్లు ఉంచుకున్నాడని, నకిలీ నోట్లు చెలామణి చేస్తున్నాడని కేసు పెట్టారు. దానికి తీవ్రవాదులపై ప్రయోగించే ఉపా చట్టాన్ని జోడించారు. ఇక్బాల్ తొమ్మిదేళ్లుగా కస్టడీలో ఉన్నాడని, ఈకేసు ఇప్పట్లో తేలే వాతావరణం కనబడటం లేదని నిందితుడి తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇక్బాల్ తీవ్రమైన నేరానికి పాల్పడ్డాడని, నేపాలీ పౌరుడు అయినందున దేశం విడిచి పారిపోయే ప్రమాదం ఉందని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ న్యాయవాదులు సుప్రీంకోర్టుకు విన్నవించారు. నత్తనడకన నడుస్తున్న ఈ కేసు ఎప్పట్లోగా తేలుతుందో స్పష్టత లేదని కోర్టు అభిప్రాయపడింది. పాస్‌పోర్టు, పౌరసత్వ పత్రాలను తీసుకొని అతన్ని విడుదల చేయాలని ఆదేశించింది. ఇప్పటికే స్వాధీనం చేసుకుంటే ట్రయల్ కోర్టుకు అప్పగించాలని పేర్కొంది. ట్రయల్ కోర్టు విచారణకు క్రమం తప్పకుండా హాజరు కావాలని నిందితుడికి చెప్పింది. విచారణ పూర్తయ్యే దాకా పక్షం రోజులకు ఒకసారి పోలీసు స్టేషన్‌కు వచ్చి సంతకం పెట్టాలని ట్రయల్ కోర్టు నిబంధన పెట్టొచ్చని సూచించింది.

పట్టాలు తప్పిన మరో రైలు

- చండీగఢ్- దిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రమాదం
- ఒకరి మృతి.. 35 మందికి గాయాలు

గోండా, న్యూఢిల్లీ, జూలై 18: సరిగ్గా నెల రోజుల వ్యవధిలో మరో రైలు ప్రమాదం.. పశ్చిమబెంగాల్‌లో గత నెలలో కాంచన్ జంగా ఎక్స్‌ప్రెస్‌ను గూడ్స్ రైలు ఢీకొట్టిన ఘటనను మర్చిపోకముందే యూపీలోని గోండా జిల్లాలో రైలు పట్టాలు తప్పింది. గోండా-గోరఖ్‌పూర్ సెక్షన్ మోతీగంజ్, ఝులాహీ స్టేషన్ల మధ్య గురువారం చండీగఢ్-దిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో ఒకరు మృతిచెందారు. 35 మందికి గాయాలయ్యాయి. ఈ రైలు బుధవారం అర్ధరాత్రి పంజాబ్‌లోని చండీగఢ్ నుంచి అసోంలోని దిబ్రూగఢ్‌కు బయల్దేరింది. యూపీ చేరాక.. గురువారం మధ్యాహ్నం ఝులాహీ స్టేషన్ సమీపంలో పట్టాలు తప్పింది. మొత్తం 23 బోగీలకు గాను 5 ఏసీ బోగీలు సహా 8 పట్టాలు తప్పాయి. ప్రమాద విషయం తెలియగానే యూపీ సీఎం యోగి సహాయక చర్యలకు ఆదేశించారు. అసోం సీఎం హిమంత ఘటనపై ఆరా తీశారు. 40 మందితో కూడిన వైద్య బృందం, 15 అంబులెన్స్‌లు సహాయ చర్యల్లో నిమగ్నమయ్యాయి. ఈ మార్గంలోని 13 రైళ్లను దారి మళ్లించారు. మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం ప్రకటించింది. క్షతగాత్రులకు రూ.2.5 లక్షలు, స్వల్పంగా గాయపడినవారికి రూ.50 వేలు ఇవ్వనున్నట్లు తెలిపింది. దుర్ఘటనపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. తాను పెద్ద శబ్దంతో పేలుడు విన్నట్లు చండీగఢ్-దిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్ రైలు డ్రైవర్ తెలిపాడు.

బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లపై రగడ

- ఘర్షణల్లో 33 మంది మృతి
- 2వేల మందికి పైగా గాయాలు

ఢాకా, జూలై 18: బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. ఇప్పటి వరకు 33 మంది పౌరులు మృతి చెందగా.. 2వేలకు పైగా ప్రజలు గాయపడ్డారు. గురువారం ఒక్కరోజే 19 మంది మరణించినట్లు అక్కడి అధికారులు తెలిపారు. బంగ్లాదేశ్ విముక్తి కోసం 1971లో అశువులు బాసిన వారి వారసులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 30 శాతం కోటాను కల్పించారు. ఈ పద్ధతిని సంస్కరించి ప్రతిభ ఆధారంగా పట్టం కట్టాలని అక్కడి వర్సిటీ విద్యార్థులు, ప్రజలు కొన్నిరోజులుగా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం ఆందోళనకారులు రెండు బస్సులకు నిప్పు పెట్టారు. నిరసనలు హింసాత్మకంగా మారడంతో పోలీసులు రబ్బరు బులెట్లు, టియర్ గ్యాస్ ప్రయోగించారు. కొన్నిచోట్ల అధికార అవామీ లీగ్ విద్యార్థి సంఘం నాయకులు.. ఆందోళనకారులను అడ్డుకునే ప్రయత్నం చేయగా ఘర్షణల్లో ఆరుగురు పౌరులు మరణించారు. చాలా మంది గాయపడ్డారు. గురువారం రాంపురా ప్రాంతంలోని టెలివిజన్ భవన్‌లో మీడియా ప్రతినిధులతో సహా చాలా మంది చిక్కుకుపోయారు. ఘర్షణలు తీవ్రతరం కావడంతో ప్రధాని షేక్ హసీనా పరిస్థితిని సమీక్షించారు. భద్రతా బలగాలను రంగంలోకి దింపారు. దేశవ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. విద్యాసంస్థలు, మదర్సాలను మూసివేయాలని, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు తెరవద్దని అధికారులు ఆదేశించారు.

బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా మౌర్య?

మోదీ, అమిత్ షాలకు అత్యంత సన్నిహిత నేత

- యూపీలో పలు ఎంపీ సీట్లలో ఓటమికి యోగిని బాధ్యుడిని చేయాలని ఎత్తులు



న్యూఢిల్లీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్యను నియమించవచ్చునని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మౌర్య యూపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కాలంలోనే 2017లో యూపీలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని, పార్టీలో కింది స్థాయి నుంచి ఎదిగిన ఆయనకు అవకాశం కల్పించవచ్చని చర్చ జరుగుతోంది. మౌర్య వెనుకబడిన వర్గాలకు చెందిన నేత కావడంతో బీసీలను తమ వైపునకు తిప్పుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని బీజేపీ అగ్రనేతలు భావిస్తున్నారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాలకు అత్యంత సన్నిహితుడైన మౌర్యను 2017లోనే యూపీ ముఖ్యమంత్రిగా నియమించాలనుకున్నప్పటికీ.. యోగీ ఆదిత్యనాథ్ రంగంలోకి దిగడంతో అది సాధ్యం కాలేదు. మౌర్యకూ యోగికీ పచ్చగడ్డి వేస్తే భగ్గుమన్నట్లు విభేదాలున్నాయని, యోగి ప్రతి కదలికనూ ఆయన ఢిల్లీకి చేరవేస్తారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాగా, పార్టీ కంటే ఎవరూ గొప్పకాదని బుధవారం మౌర్య చేసిన ప్రకటన చర్చకు దారి తీసింది మంగళవారం మౌర్య ఢిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్ షాలను కలిసి వెళ్లిన తర్వాత ఈ ప్రకటన చేయడంతో మౌర్య ద్వారా ఢిల్లీ నేతలు యోగికి సందేశాలు పంపినట్లు భావిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పలు సీట్లు కోల్పోవడంపై యోగిని జవాబుదారీ చేయాలని అధిష్ఠానం భావిస్తోంది. అయితే, ఈ ఓటమితో తనకు సంబంధం లేదని, తనను సంప్రదించకుండా అభ్యర్థులను ఎంపిక చేశారని యోగి అన్నట్లు సమాచారం. త్వరలో యూపీలో పది అసెంబ్లీ స్థానాలకు జరిగే ఉప ఎన్నికలు యోగి భవిష్యత్తును నిర్ణయించవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్‌తో పాటు 9 మంది ఎమ్మెల్యేలు లోక్‌సభకు ఎంపిక కావడం, ఒక సమాజ్‌వాదీ ఎమ్మెల్యేపై అనర్హత వేటు పడడంతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ పది సీట్లలో గతంలో ఐదు సీట్లు ఎస్పీ గెలుచుకున్నవే. ఈ ఉప ఎన్నికలకు ముందే బీజేపీకి జాతీయ అధ్యక్షుడిగా కేశవ్ ప్రసాద్ మౌర్యను నియమిస్తారా..? లేదా..? అన్నదానిపై స్పష్టత లేదు. అయితే యోగి మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న మౌర్యనే జాతీయ అధ్యక్షుడిగా నియమించడం ద్వారా యోగిని ఇరకాటంలో పెట్టాలని బీజేపీ అగ్రనేతలు భావిస్తున్నట్లు సమాచారం.

వందేళ్ల.. గంధర్వ మహల్



పశ్చిమగోదావరి జిల్లా ఆచంటలోని గంధర్వ మహల్




గంధర్వ మహల్ సింహద్వారం, అబ్బుర పరిచే సెంట్రల్ హాల్

» అబ్బురపరుస్తున్న చారిత్రక కట్టడం

ఎత్తైన భవనం.. నాలుగు వైపులా కోట మాదిరి బురుజులు.. బర్మా టేకుతో చేసిన సింహద్వారాలు.. తలుపులపై అందంగా చెక్కిన కళా రూపాలు.. విశాలమైన గదులు.. మయసభను తలపించే సెంట్రల్ హాలు.. ఓ రకంగా మైసూర్ ప్యాలెస్‌ను తలపించేలా వందేళ్ల క్రితం నిర్మించిన అద్భుత భవనమది. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట జమీందార్ గొడవర్తి నాగేశ్వరరావు 1924లో అర ఎకరం విస్తీర్ణంలో ఈ గంధర్వ మహల్‌ను నిర్మించారు. 1918లో పనులు ప్రారంభించి 1924లో పూర్తి చేశారు. అప్పట్లో సుమారు రూ.10 లక్షలు వెచ్చించినట్లు అంచనా. విద్యుత్ సౌకర్యం పూర్తిస్థాయిలో లేని రోజుల్లో విదేశాల నుంచి విద్యుత్ దీపాలు తెప్పించి జనరేటర్ ద్వారా భవనం అంతా రంగు రంగుల దీపాలతో జిగేల్‌మనిపించేవారని పూర్వీకులు చెబుతారు. మహల్ నిర్మాణం కోసం బర్మా నుంచి టేకు, కలప, బెల్జియం నుంచి అద్దాలు, లండన్ నుంచి ఇనుప గడ్డర్‌లు దిగుమతి చేసుకున్నారు. అడుగడుగునా రాచఠీవితో నాటి జమీందారీ వ్యవస్థ వైభవానికి ప్రతీకగా గంధర్వ మహల్ నిలిచింది. వందేళ్లు దాటినా ఈ మహల్ ఇప్పటికీ చెక్కు చెదరలేదు. మాజీ ముఖ్యమంత్రులు మర్రి చెన్నారెడ్డి, ఎన్టీరామారావుతో పాటు ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు, మాజీ మంత్రులు ఈ భవనంలో ఆతిథ్యం స్వీకరించారు.

నేడు వేడుకలు

గంధర్వ మహల్ నిర్మించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా జమీందార్ గొడవర్తి నాగేశ్వరరావు వారసులు శుక్రవారం వేడుకలు నిర్వహించనున్నారు. నాగేశ్వరరావు అనంతరం మూడోతరం వారసులు గంధర్వ మహల్‌లో నివసిస్తున్నారు. నాలుగో తరం వారం కొందరు విదేశాలలో స్థిరపడ్డారు. మూడు, నాలుగు తరాల వారంతా ప్రస్తుత వేడుకలకు హాజరయ్యారు. - (ఆచంట)

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

» స్వల్ప అస్వస్థతతో స్విమ్స్‌లో చేరిన జస్టిస్ దుర్గాప్రసాదరావు



తిరుమల ఆలయం వద్ద జస్టిస్ దుర్గాప్రసాదరావు

తిరుపతి(వైద్యం)/తిరుమల, జూలై18 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాదరావు గురువారం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. న్యాయమూర్తికి వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. కాగా, తిరుమలలో స్వల్ప అస్వస్థతకు గురైన జస్టిస్ దుర్గాప్రసాదరావును స్విమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆర్‌ఐసీయూలోని ప్రత్యేక వార్డులో ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. చిన్నపాటి సాధారణ అస్వస్థతకు గురయ్యారని, ఎలాంటి ఇబ్బంది లేదని స్విమ్స్ వైద్యులు తెలిపారు.

శ్రీవారి సేవలో నితిన్ గడ్కరీ



గడ్కరీకి శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

తిరుమల, జూలై18 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి కోసం పనిచేసే శక్తిసామర్థ్యాలను ప్రసాదించాలని శ్రీవారిని ప్రార్థించినట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. బుధవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆయన గురువారం వేకువజామున ఆలయంలో జరిగిన అర్చన సేవలో కుటుంబ సమేతంగా పాల్గొని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

శ్రీవాణి ఆఫ్‌లైన్ కోటా కుదింపు

» రోజుకు వెయ్యి టికెట్లకే పరిమితం చేసిన టీటీడీ

తిరుమల, జూలై18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో జారీ చేసే శ్రీవాణి దర్శన టికెట్ల కోటాను టీటీడీ కుదించింది. శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ పెరుగుతున్న క్రమంలో సామాన్య భక్తులకు ప్రాధాన్యత పెంచేందుకు వీలుగా 22వ తేదీ నుంచి శ్రీవాణి దర్శన టికెట్లను రోజుకు వెయ్యికే పరిమితం చేస్తూ టీటీడీ నిర్ణయం తీసుకుంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజాప్రతినిధుల సిఫార్సులకు కొద్దిరోజులు బ్రేక్ పడిన విషయం తెలిసిందే. ఆ క్రమంలో వీఐపీ బ్రేక్ దర్శనం కోసం భక్తులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఎలాంటి పరిమితి లేకుండా శ్రీవాణిటికెట్లను జారీ చేస్తూ వచ్చారు. ఆన్‌లైన్ కాకుండా ఆఫ్‌లైన్‌లో రోజుకు 2 వేల వరకు టికెట్ల కేటాయింపు జరిగింది. అయితే ప్రస్తుతం రద్దీ పెరుగుతున్న క్రమంలో ఆన్‌లైన్‌లో 500తో పాటు ఆఫ్‌లైన్‌లో మరో వెయ్యి టికెట్లు మాత్రమే జారీ చేయాలని టీటీడీ నిర్ణయించింది. ఇందులో 900 టికెట్లను తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో మొదటవచ్చిన వారికి మొదట ప్రాతిపదికగా జారీ చేస్తారు. ఇక, మరో వంద టికెట్లను రేణిగుంటలోని విమానాశ్రయంలో కేటాయిస్తారు. బోర్డింగ్ పాస్ ద్వారా వీటిని భక్తులు పొందవచ్చు.

తిరుమల అతిథిగృహంలోకి నాగుపాము



తిరుమల, జూలై18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని జీఎంఆర్ అతిథిగృహంలోకి గురువారం ఆరడుగుల పొడవున్న నాగుపాము ప్రవేశించింది. అతిథిగృహం సిబ్బంది పామును గమనించి భయంతో బయటకు పరుగులు తీశారు. పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర నాయుడికి సమాచారమిచ్చారు. ఈలోపు పాము అతిథిగృహంలోని డ్రైనేజీలోకి ప్రవేశించింది. కొంతసమాయానికి అతిథిగృహం వద్దకు చేరుకున్న భాస్కర నాయుడు పామును బయటకు తెప్పించేందుకు డ్రైనేజీలో వేడినీళ్లు పోశారు. దీంతో బయటకు వచ్చిన పామును చాకచక్యంగా పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

భార్యాభర్తల మధ్య విభేదాలు

చిన్నారుల సంరక్షణకు అవరోధం కారాదు

» తల్లిదండ్రుల ప్రేమ, ఆప్యాయత పొందడం చిన్నారుల కనీస మానవహక్కు.. స్పష్టం చేసిన హైకోర్టు

అమరావతి, జూలై18 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య విభేదాలు, గొడవలు చిన్నారుల సంరక్షణకు అవరోధంగా మారడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. చిన్నారులకు తల్లి, తండ్రి ఇద్దరి ప్రేమ.., ఆప్యాయత, సంరక్షణ అవసరమని పేర్కొంది. అది చిన్నారుల కనీస మానవహక్కు అని తేల్చిచెప్పింది. తన ఏడేళ్ల కుమారుడికి తనను సహజ సంరక్షకుడిగా ప్రకటించాలని కోరుతూ కడపజిల్లాకు చెందిన ఓ వ్యక్తి 2020లో అనంతపురం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అక్కడ సానుకూల ఉత్తర్వులు రాకపోవడంతో 2023లో హైకోర్టును ఆశ్రయించారు. బిడ్డను కలుసుకొనేందుకు అవకాశం ఇవ్వాలని అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. తన భార్య మరో వివాహం చేసుకొని సౌదీలో నివాసం ఉంటోందని, ప్రస్తుతం తన బిడ్డ ఇండియాలో ఆమె తండ్రి వద్ద ఉంటున్నాడని వివరించారు. మహిళ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... పిటిషనర్ మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే వారు విడిపోయారన్నారు. చిన్నారిని తన సంరక్షణకు ఇవ్వాలని కోరే హక్కు పిటిషనర్‌కు లేదన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... భార్య, భర్తల మధ్య ఈగోతో మొదలవుతున్న చిన్న చిన్న వివాదాలు పెద్దగొడవలుగా మారి కోర్టు వరకు చేరుతున్నాయని సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తుచేసింది. పిల్లలను తమకే అప్పగించాలని వేస్తున్న వ్యాజ్యాలతో చిన్నారులు బాధితులుగా మారుతున్నారని సర్వోన్నత న్యాయస్థానం గుర్తు చేసిందని పేర్కొంది. తల్లిదండ్రుల ప్రేమ, ఆప్యాయత, సంరక్షణ పొందే కనీస మానవహక్కు చిన్నారులకు ఉందని తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో కదిరిలో తాత వద్ద ఉంటున్న బిడ్డను కలుసుకొనేందుకు తండ్రికి వెసులుబాటు ఇస్తున్నట్టు పేర్కొంది. చిన్నారి నివాసం ఉంటున్న దగ్గరకు వెళ్లి వారానికి ఒకసారి రెండుగంటలపాటు కలుసుకొనేందుకు వెసులుబాటు కల్పించింది. ప్రతిరోజు పిల్లవాడితో కొద్ది నిమిషాలు ఫోనులో మాట్లాడేందుకు అనుమతించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

కళ్ల ముందే కాలుష్యం.. అయినా బుకాయింపు

» ద్వారంపూడి రొయ్యల ఫ్యాక్టరీల బరితెగింపు

» వెదజల్లుతున్న కాలుష్యంపై పీసీబీ సీరియస్

» గురజనాపల్లి, లంపకలోవ ఫ్యాక్టరీలు

» గతంలో పవన్ కల్యాణ్ ఆదేశాలతో వాటిలో తనిఖీలు చేపట్టిన అధికారులు

» లంపకలోవ ఫ్యాక్టరీ నుంచి భారీగా కాలుష్య వ్యర్థ జలాలు వెదజల్లుతున్నట్లు గుర్తింపు

» శుద్ధిచేయకుండానే నేరుగా పంటపొలాల్లోకి

» రెట్టింపు సామర్థ్యంతో గురజనాపల్లి ఫ్యాక్టరీ

» షోకాజ్ నోటీసులకు నిర్లక్ష్యంగా జవాబులు



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం లంపకలోవలోని ద్వారంపూడి రొయ్యల ఫ్యాక్టరీ

కాకినాడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి రొయ్యల ఫ్యాక్టరీల నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాల కాలుష్యంపై చర్యలకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు (పీసీబీ) చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. కళ్ల ముందే కాలుష్యం కనిపిస్తున్నా.. ఆయా ఫ్యాక్టరీలు అదేమీ లేదని బుకాయించాయి. దీంతో నిబంధనలను ఉల్లంఘించి నడుపుతున్న ఫ్యాక్టరీలను సీజ్ చేయనున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ రొయ్యల ఫ్యాక్టరీల అరాచకాలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు స్థానికుల నుంచి అనేక ఫిర్యాదులు అందడంతో ఈ నెల 2న కాకినాడ కలెక్టరేట్‌లో ఆయన జిల్లా అధికారులతో సమీక్ష జరిపారు. ఆ ఫ్యాక్టరీల్లో కాలుష్యం భారీగా ఉన్నా ఎందుకు పట్టించుకోవడం లేదని వారిపై మండిపడ్డారు. ద్వారంపూడికి చెందిన వీరభద్రా ఆక్వా ఎక్స్‌పోర్ట్ కంపెనీపై తనకు ఇప్పటికే చాలా ఫిర్యాదులు వచ్చాయని, కంపెనీ ఆక్వా వ్యర్థ జలాలను పక్కనే పంట డ్రెయిన్లలో కలిపేస్తున్నా ఎందుకు తనిఖీలు చేయలేదని నిలదీశారు. 24 గంటల్లో నివేదిక ఇవ్వాలని పీసీబీ ఈఈ సందీప్‌రెడ్డిని ఆదేశించారు. ఈ నేపథ్యంలో హుటాహుటిన జిల్లా పీసీబీ అధికారులు కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని గురజనాపల్లి, ప్రత్తిపాడు నియోజకవర్గం లంపకలోవలోని వీరభద్ర ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ పేరుతో ఉన్న రెండు రొయ్యల ఫ్యాక్టరీల్లో తనిఖీలు చేపట్టి నిబంధనల ఉల్లంఘనలను గుర్తించారు. లంపకలోవ ఫ్యాక్టరీ నుంచి కాలుష్య వ్యర్థ జలాలను భారీగా వెదజల్లుతున్నారని, శుద్ధిచేయకుండా నేరుగా పంటపొలాల్లోకి వదిలేస్తున్నారని తేల్చారు. గురజనాపల్లి ఫ్యాక్టరీ నిర్దేశించిన దానికంటే రెట్టింపు సామర్థ్యంతో నడుస్తోందని గుర్తించారు. అత్యంత ఇరుకు ప్రాంతంలో అత్యధిక కాలుష్యం మధ్య ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నట్లు తేల్చారు. ఈ నేపథ్యంలో ఈ ఫ్యాక్టరీలపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో సంజాయిషీ ఇవ్వాలని ఈనెల 3న పీసీబీ నోటీసులు జారీ చేసింది. అదే సమయంలో విశాఖ నుంచి కాలుష్య నియంత్రణ బోర్డు జోనల్ మేనేజర్ కార్యాలయం నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలు కూడా ఆ రొయ్యల ఫ్యాక్టరీల్లో తనిఖీలు చేసి వ్యర్థజలాల కాలుష్యం అధికంగా ఉందని, కంపెనీ పూర్తి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని నిగ్గుతేల్చాయి. తీవ్రంగా పరిగణించిన పీసీబీ.. ఈనెల 3న షోకాజ్ నోటీసులు జారీచేసింది. అయితే వీటికి ద్వారంపూడి రొయ్యల కంపెనీల నుంచి నిర్లక్ష్యపు సమాధానం వచ్చింది. తమ కంపెనీ తక్కువ సామర్థ్యంతో పనిచేస్తోందని బుకాయించింది. వ్యర్థజలాలను శుద్ధి చేస్తున్నామని, అందులో కాలుష్యం లేదని, పంట పొలాల్లోకి విషవాయు వ్యర్థజలాలను వదలడం లేదని అబద్ధాలాడింది. తమ రొయ్యల ఫ్యాక్టరీలు నిబంధనల ప్రకారమే నడుస్తున్నాయని, ఎక్కడా ఫిర్యాదులు లేవని తెలిపింది. వాటి తీరుపై ఆగ్రహించిన పీసీబీ రెండు, మూడ్రోజుల్లో చర్యలకు ఉపక్రమించనుంది. సంబంధిత ఉత్తర్వులు విశాఖ జోనల్ కార్యాలయం నుంచి జారీ కానున్నట్లు తెలిసింది.

» ఇద్దరు మనవరాళ్లపై ఇనుప రాడ్‌తో దాడి

» తిరుపతిలో గంజాయి బానిస ఘాతుకం

వృద్ధురాలి గొంతుకోసి దారుణ హత్య



జయలక్ష్మి

తిరుపతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గంజాయికి బానిసైన ఓ జులాయి.. వృద్ధ మహిళను గొంతుకోసి దారుణంగా హత్య చేశాడు. ఆమె ఇద్దరు మనవరాళ్లపైనా ఇనుప రాడ్‌తో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిలో 14 ఏళ్ల బాలిక పరిస్థితి విషమంగా ఉంది. తిరుపతి నగరంలో గురువారం సాయంత్రం ఈ దారుణం చోటుచేసుకుంది. బాధితుల ఎదురింట్లో ఉండే యువకుడే ఈ ఘాతుకానికి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. నిందితుడు మూడేళ్లుగా మృతురాలి పెద్ద మనవరాలి వెంటపడి వేధిస్తున్నాడని, ఆమె అతని ప్రేమను తిరస్కరించింది. వృద్ధురాలు కూడా పలుసార్లు మందలించింది. దీంతో ఆ యువకుడు కక్ష పెంచుకుని దారుణానికి పాల్పడినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. తిరుపతికి చెందిన జయలక్ష్మి (67) కుటుంబానికి శానిటరీ మార్ట్ దుకాణం ఉంది. భర్త మూడేళ్ల కిందట మరణించగా కొడుకు శ్రీనివాస్, కోడలు రక్ష, మనవరాళ్లు ప్రేరణ (18), నియత (14)తో కలసి రాయల్‌నగర్‌లో నివాసముంటున్నారు. గురువారం సాయంత్రం కొడుకు శ్రీనివాస్ దుకాణంలో ఉండగా కోడలు రక్ష, పెద్ద మనవరాలు ప్రేరణ డ్రైవింగ్ క్లాసుకు వెళ్లారు. సాయంత్రం 6.30 గంటల సమయంలో ఇంట్లోకి చొరబడ్డ నిందితుడు తొలుత సెకండ్ ఫ్లోర్‌లో జయలక్ష్మిని గొంతు కోసి హతమార్చాడు. ఆ తర్వాత నియత తలపై ఇనుప రాడ్‌తో మోదాడు. అనంతరం కిందకి దిగుతుండగా జయలక్ష్మి కోడలు రక్ష, పెద్ద మనవరాలు ప్రేరణ ఎదురుపడ్డారు. దీంతో ప్రేరణపై కూడా ఇనుప రాడ్‌తో దాడి చేశాడు. అనంతరం వారినుంచి స్కూటీ తాళాలు లాక్కుని దానిపైనే పరారయ్యాడు. దుండగుడి దాడిలో తీవ్రంగా గాయపడిన నియత పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎస్పీ సుబ్బరాయుడు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. అధికారులు, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లు కూడా చేరుకుని దుండగుడి ఆధారాలు సేకరించే పనిలో పడ్డాయి.

ప్రేమను తిరస్కరించిందన్న కక్షతో..

పోలీసుల ప్రాథమిక విచారణలో దుండగుడిని గుర్తించినట్టు తెలిసింది. 30-35 ఏళ్ల వయసు ఉంటుందని, తలకు టోపీ, ముఖానికి మాస్కు ధరించాడని పారిపోతుండగా చూసిన స్థానికులు చెబుతున్నారు. బాధితుల ఇంటి ఎదురుగా అద్దె ఇంట్లో ఉండే శ్రీనివాస్ గంజాయికి అలవాటుపడి జులాయిగా తిరుగుతుంటాడని, మూడేళ్లుగా జయలక్ష్మి పెద్ద మనవరాలు ప్రేరణ వెంటబడి వేధిస్తున్నాడని తెలిసింది. నాయనమ్మ జయలక్ష్మి కూడా పలు సందర్భాల్లో ఆ యువకుడిని మందలించినట్టు సమాచారం. అయినా వేధింపులు ఆగకపోవడంతో ప్రేరణను ఢిల్లీలో ఉంచి చదివిస్తున్నారని తెలిసింది. ఇటీవలే బాలిక ఇంటికి అమర్చిన సీసీ కెమెరాలను కూడా ఆ యువకుడు ధ్వంసం చేశాడు. హంతకుడి వివరాలు తెలియడంతో అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు.

ఎంపీడీవో అదృశ్యంపై పూర్తిస్థాయి దర్యాప్తు!

» ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ

» కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పరామర్శ

» ఇంటికెళ్లి మాట్లాడిన కలెక్టర్, ఎమ్మెల్యే

» రెండో రోజూ ఏలూరు కాలువలో గాలింపు

» ఇంకా లభించని వెంకట రమణారావు ఆచూకీ



ఎంపీడీవో కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తదితరులు

విజయవాడ, భీమవరం, నర్సాపురం(ఆంధ్రజ్యోతి), నరసాపురం రూరల్, జూలై 18: నరసాపురం ఎంపీడీవో ఎం.వెంకట రమణారావు ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు కొనసాగుతోంది. ఒక పక్క పోలీసు, మరోపక్క ఎన్డీఆర్ఎఫ్ బృందాలు విస్తృతంగా గాలిస్తున్నాయి. వరుసగా రెండోరోజూ విజయవాడలోని ఏలూరు కాల్వలో చీకటిపడే వరకూ గాలింపు కొనసాగింది. మధురానగర్ నుంచి గన్నవరం మండలం కేసరపల్లి వరకు కాల్వలో గాలించినా ఆచూకీ లభించలేదు. ఈ నెల 15వ తేదీన విజయవాడ కానూరులోని మహాదేవపురం కాలనీలో ఇంటి నుంచి వెళ్లిన ఆయన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు వాట్సాప్‌లో సూసైడ్ లేఖ పంపి అదృశ్యమైన విషయం తెలిసిందే. నాలుగు రోజులు దాటినా ఇప్పటికీ ఆయన జాడ లేకపోవడంతో కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారు. కాగా, ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ఫోన్‌లో వెంకట రమణారావు సతీమణి సునీత, పెద్ద కుమారుడు సాయిరామకృష్ణతో మాట్లాడారు. ఇంటి నుంచి వెళ్లేటప్పుడు ఏం చెప్పారు? ఆయన ఒత్తిడికి లోనవ్వడానికి కారణాలు ఏమిటి? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. రేవు నిర్వహణ కాంట్రాక్టరు చిన్న రెడ్డప్ప దవేజీ సక్రమంగా కాంట్రాక్టు డబ్బులు చెల్లించకుండా రాజస్థాన్ తదితర ప్రాంతాల నుంచి సౌరభ్‌మీనా, సంతోష్ అనే వ్యక్తులతో ఫోన్లు చేయించి బెదిరింపులకు పాల్పడేవాడని, అలా తమ నుంచే రూ.4.5 లక్షలు ఆన్‌లైన్ ద్వారా వసూలు చేశారని సునీత సీఎంకు వెల్లడించారు. ఘటనపై పూర్తి దర్యాప్తు చేయిస్తామని, అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. సీఎం ఫోన్ చేసినప్పుడు పెనుమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు ఎంపీడీవో ఇంట్లోనే ఉన్నారు. ఎప్పటికప్పుడు వివరాలు తనకు తెలియజేస్తుండాలని మాధవనాయుడును చంద్రబాబు ఆదేశించారు. మరోవైపు ఎంపీడీవో కుటుంబాన్ని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి, ఆర్డీవో అంబరీష్ పరామర్శించారు. నరసాపురం డీఎస్పీ శ్రీనివాస్, సీఐ స్వామి గురువారం మండల పరిషత్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. రేవుకు సంబంధించిన వివరాలను, రికార్డులను పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని డీఎస్పీ చెప్పారు. ఎంపీడీవో సెల్‌ఫోన్‌కు వచ్చిన అపరిచిత కాల్స్‌పై దృష్టి సారించి విచారణ చేస్తున్నట్టు పెనుమలూరు సీఐ రామారావు చెప్పారు.

1.30 కోట్లు నష్టపోయా: కాంట్రాక్టర్

ఎంపీడీవో అదృశ్యంలో తనపై వస్తున్న ఆరోపణలపై రేవు నిర్వహణ కాంట్రాక్టర్ చిన రెడ్డప్ప దవేజీ స్పందించారు. తాను ఏ తప్పూ చేయలేదని, ప్రభుత్వానికి రూ.56 లక్షలు కట్టాల్సింది వాస్తవమని, రేవు నిర్వహణ వల్ల రూ.1.30 కోట్లు నష్టపోయానని, మాజీ ఎమ్మెల్యే ముదునూరి తనకు సహాయ సహకారాలు అందించలేదని, ఇదే క్రమంలో రూ. 50 లక్షల విలువ చేసే పంటును మండల పరిషత్ స్వాధీనం చేసుకుందని, ఇవి కాకుండా ప్రభుత్వం నుంచి తనకు రూ.11 లక్షలు రావాల్సి ఉందని, ఇవన్నీ లెక్కిస్తే తాను ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని వీడియోలో పేర్కొన్నారు. పత్రికలకు కూడా ప్రకటనను విడుదల చేశారు. గతేడాది రూ.3.61 కోట్లకు రేవు పాడి పూర్తిగా చెల్లించానని పేర్కొన్నారు.

ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం ఇచ్చే రేవు

» పాటదారుడు డిఫాల్టర్.. అయినా కొనసాగింపు

» వైసీపీ నేతల ఒత్తిడే కారణం..

పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నుంచి కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మధ్యలో గోదావరిపై రాకపోకలకు మాధవాయిపాలెం వద్ద రేవు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం ఇచ్చే రేవు ఇదే. ప్రతి రోజు 10 వేల మంది మాధవాయిపాలెం-సఖినేటిపల్లి మధ్య రాకపోకలు సాగిస్తారు. రెండు జిల్లాలో తీర ప్రాంత ప్రజలకు ఈ రేవే ఆధారం. ఇక్కడ రేవు నిర్వహణను దక్కించుకున్న కాంట్రాక్టర్ చిన రెడ్డప్ప దవేజీ వెనుక వైసీపీ నేత, అప్పటి ఎమ్మెల్యే ముదునూరు ప్రసాదరాజు అండదండలు ఉన్నాయి. వైసీపీతో సంబంధం ఉండడంతో రేవు పాట దక్కించుకోగలిగారు. 2023-24 సంవత్సరానికి రూ.3.66 కోట్లకు దవేజీ పాడుకున్నారు. ప్రతి ఏటా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మరుసటి ఏడాది మార్చి 31వ తేదీ వరకు పాట మనుగడలో ఉంటుంది. ప్రతి నెలా ప్రభుత్వానికి పాటదారుడు నిర్ణీత సొమ్ము చెల్లించాలి. బకాయి పడడానికి వీలులేదు. దవేజీ ఆగస్టు నెలాఖరుకు రూ.44 లక్షలు బకాయిపడి డిఫాల్టర్ అవడంతో జిల్లా అధికారులు రంగంలోకి దిగి దవేజీ పాటను రద్దు చేశారు. కొత్త పాట కోసం నోటిఫికేషన్ జారీచేయగా, దవేజీ బకాయిపడ్డ రూ.44 లక్షలు తిరిగి చెల్లించారు. దీంతో రేవుపాట నోటిఫికేషన్‌ను అధికారులు రద్దు చేశారు. దీని వెనుక అప్పటి ఎమ్మెల్యే ప్రసాదరాజు ఒత్తిడి ఉందన్న విమర్శలున్నాయి.

దారులన్నీ దర్గావైపే!

» నెల్లూరుకు పోటెత్తుతున్న భక్తజనం.. ఉత్సాహంగా రొట్టెల పండుగ



భక్తులతో కిటకిటలాడుతున్న స్వర్ణాల చెరువు ఘాట్

నెల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రొట్టెల పండుగ సందర్భంగా నెల్లూరులోని బారాషాహీద్ దర్గా ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోతోంది. పండుగ రెండో రోజు గురువారం భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. మతాలకు అతీతంగా భక్తులు తరలిరావడంతో స్వర్ణాల చెరువు తీరం సందడిగా మారింది. బారాషాహీద్ దర్గా దర్శనం కోసం క్యూలైన్లు కిటకిటలాడాయి. కాగా, గురువారం అర్ధరాత్రి తర్వాత అత్యంత పవిత్రమైన గంధమహోత్సవం జరిగింది.

జర్నలిస్టులపై దుర్భాషలా?

» విజయసాయిపై జర్నలిస్టు సంఘాల మండిపాటు



విజయవాడ మహాధర్నాలో పాల్గొన్న జర్నలిస్టులు

విజయవాడ (ధర్నాచౌక్), జూలై 18: మీడియా సంస్థల అధినేతలు, జర్నలిస్టులను కించపరచేలా వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిపై జర్నలిస్టు, ప్రజాసంఘాలు, పలు పార్టీలు ధ్వజమెత్తాయి. రాజ్యసభ సభ్యుడిగా ఉండి జర్నలిస్టులను దుర్భాషలాడటం సిగ్గుచేటని పలువురు వక్తలు మండిపడ్డారు. సాయిరెడ్డి జర్నలిస్టులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జర్నలిస్టు సంఘాల జేఏసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్‌లో గురువారం మహాధర్నా జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అనేక కేసుల్లో ఏ2గా ఉన్న వ్యక్తికి మీడియా యాజమాన్యాలను విమర్శించే అర్హత లేదన్నారు. విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ అధినేత జగన్ స్పందించపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఏపీజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నవరపు బ్రహ్మయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, కాంగ్రెస్ పార్టీ నేతలు నరహరిశెట్టి నరసింహారావు, కొలనుకొండ శివాజీ, టీడీపీ రాష్ట్ర నేత బ్రహ్మం, బీజేపీ నగర నేత ఎస్.వెంకట్, జర్నలిస్టు సంఘాల నేతలు షేక్ బాబు, చావా రవి, దారం వెంకటేశ్వరరావు, పలువురు ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యోగిపై అసమ్మతి

ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఉత్తర్‌ప్రదేశ్‌లో 33సీట్లకే పరిమితం కావడం, అది కేంద్రంలో మోదీ మూడో రాకను తీవ్రంగా ప్రభావితం చేయడంతో యూపీ బీజేపీని అసమ్మతి స్వరాలు, అంతర్గత వైరాలు చుట్టుముట్టాయని వార్తలు వస్తున్నాయి. రాష్ట్ర బీజేపీ నాయకులు ఢిల్లీ వెళ్ళివస్తున్నారు, ఏవో నర్మగర్భ వ్యాఖ్యలు చేస్తున్నారు. కొందరు అక్కడే తిష్టవేసి, ఇంత కాలమూ దాచుకున్న ఆగ్రహాన్ని వెళ్ళగక్కే ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కీ, ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్యకీ మధ్య విభేదాలు మరింత స్పష్టంగా బయటపడ్డాయి. యూపీ బీజేపీ అధ్యక్షుడు భూపేందర్ చౌదరి రాజీనామాకు సిద్ధపడితే పెద్దలంతా సముదాయించారని, ఓబీసీ మౌర్యకు మరింత ప్రాధాన్యం పెంచి, ఠాకూర్ యోగిని నియంత్రించాలని అనుకుంటున్నారని ఏవో విశ్లేషణలు వెలువడుతున్నాయి. రాష్ట్రంలో పది అసెంబ్లీస్థానాలకు ఉప ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈమాత్రం హడావుడి సహజం.

తమకు తగ్గడం కంటే, సమాజ్‌వాదీ–కాంగ్రెస్ కూటమికి మరో పదిలోక్‌సభ స్థానాలు ఎక్కువ రావడం యూపీ బీజేపీ నేతలను భయపెడుతోంది. ఈ ఎదురుగాలి మరింత బలపడి రేపటి ఉప ఎన్నికలమీద ప్రభావం చూపుతుందన్న అనుమానం వారిని వెంటాడుతోంది. భారతీయ జనతాపార్టీని ఈ మారు యూపీ ఎన్నటికీ మరవనంత దెబ్బకొట్టింది. చార్‌సౌ పార్, తీన్‌సౌ పార్ ఎటూ లేకపోగా, సొంతకాళ్ళమీద కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయలేని స్థితిలోకి ఆ పార్టీ జారుకోవడంలో యూపీ పాత్ర ప్రధానమైనది. మోదీ దశాబ్దకాలపు ఏకపార్టీ పాలనకు ముగింపు పలికి, మిత్ర పక్షాలమీద ఆధారపడాల్సిన పరిస్థితిని కల్పించింది. 80స్థానాలున్న రాష్ట్రంలో ఐదేళ్ళకంటే 29స్థానాలు తగ్గి 33సీట్లకు పడిపోయి, ఎనిమిదిశాతం ఓట్లను ఆ పార్టీ కోల్పోయింది. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బాలరాముడి ప్రతిష్ఠ జరిగిన అయోధ్య (ఫైజాబాద్)లో ఆ పార్టీ అభ్యర్థి ఓడిపోవడం, దళితుడైన ఓ సమాజ్‌వాదీ అభ్యర్థి అక్కడ మంచి మెజారిటీతో గెలవడం, వారణాసినుంచి పోటీచేసిన మోదీకి గతంలో కంటే మెజారిటీ సగానికి తగ్గిపోవడం వంటి విచిత్రాలు సైతం యూపీలో అనేకం జరిగాయి.

బీజేపీ ప్రవచించే డబుల్ ఇంజన్ సర్కార్‌కు ఆది, పునాది యూపీయే. మోదీ–యోగి ద్వయం మిగతా బీజేపీ ముఖ్యమంత్రులకు నిన్నటివరకూ ఆదర్శం. ఎన్‌కౌంటర్లు, బుల్‌డోజర్ల భాష కూడా వారికి యోగి నేర్పిందే. యోగి ఆధ్వర్యంలో ఇప్పటివరకూ జరిగిన నాలుగు ఎన్నికల్లోనూ బీజేపీ మంచి ఫలితాలే సాధించింది. ఈ మారు ఆయన అభ్యర్థుల ఎంపికను పూర్తిగా అధిష్ఠానానికి వదిలేసి పెద్ద పొరపాటుచేశారని కొందరు అంటారు. ఓ నలభైమంది సిట్టింగ్‌లకు టిక్కెట్లు ఇవ్వవద్దని ఆయన ప్రతిపాదిస్తే ఢిల్లీ పెద్దలు పట్టించుకోలేదని మరికొందరు అంటారు. కారణాలు ఏమైనప్పటికీ, ఈ ఫలితాలతో యోగి తన ప్రాభవాన్ని కోల్పోయిన మాట నిజం. నిజానికి ఈమారు కూడా ఎప్పటిలాగానే ఎన్నికల ప్రచారంలో మోదీదే కీలకపాత్ర. రాష్ట్రాన్నే కాదు, యావత్ దేశాన్నే ఆయన చుట్టేశారు. నాలుగువందలో, కనీసం మూడువందలో సాధించి ఉంటే, ఆ ఘనత సహజంగానే మోదీఖాతాలో పడివుండేది. కానీ, ఫలితాలు భిన్నంగా ఉండటంతో యోగి చుట్టూ వేడిరాజుకుంటోంది. చిన్నాచితకా కులపార్టీలు యోగిపై వ్యాఖ్యలు చేయడం కంటే, సొంత పార్టీలోనే విమర్శలు రేగడం విశేషం. పరీక్షాపత్రాల లీకులు, అగ్నివీర్, కొత్త పెన్షన్ వంటి విధానాల మీద ప్రజాగ్రహం, యాదవేతర ఓబీసీల ఓట్లు బీజేపీకి తగ్గి ఎస్పీవైపు మళ్ళడం, దళితుల ఓట్లు బీఎస్పీనుంచి కాంగ్రెస్‌కు పోవడం, రాజ్యాంగం మార్పు మాట అణగారినవారిని భయపెట్టడం ఇత్యాదివి అనేకం బీజేపీ వెనుకంజకు కారణాలైనాయి. హిందూత్వాన్ని అధిగమించి సామాజిక న్యాయం ఎజెండా పనిచేయడంతో ఫలితాలు తారుమారైనాయి.

రాష్ట్రంలో రాబోయే ఉప ఎన్నికల్లో బీజేపీ తన సత్తా చూపని పక్షంలో అప్రదిష్టకు తోడు, అనేక కొత్త రాజకీయసమస్యలు పుట్టుకొస్తాయి. యోగి, మౌర్య చౌదరీలను ఏకతాటిమీదకు తెచ్చి ఈ గండం దాటాలని బీజేపీ పెద్దలు భావిస్తున్నారు. ఉపఎన్నికల వరకూ మార్పుచేర్పులేవీ చేపట్టకుండా, ఆ ఘట్టం దాటాక సమూల ప్రక్షాళన జరపాలన్న ఆలోచన కూడా ఉండివుండవచ్చు. ఎస్పీ–కాంగ్రెస్ కూటమి బలపడుతున్న దశలో యూపీ బీజేపీని గాడిన పెట్టడం అధిష్ఠానానికి పెద్ద పరీక్షే.

ఆగనున్న మానవ మహాగమనం!





■ రాహుల్ కుమార్

మానవజాతి చరిత్ర అంటే ఒక మహాగమనం! మరి ఇది ఎప్పుడు మొదలైంది? ఈ గమనంలో కీలక అడుగు ఎప్పుడు పడింది? పరిణామక్రమంలో మనిషి రెండు కాళ్లమీద నడవగలిగినప్పుడా? నిప్పును నియంత్రించగలిగినప్పుడా? భాషను కనిపెట్టినప్పుడా? భగవంతుడిని సృష్టించుకుని భరోసాతో కఠోర జీవితానికి ఎదురొడ్డి నిలిచినప్పుడా? వావివరసలకు అడ్డుగీతలు గీసినప్పుడా? సహజ కోరికలను అణచుకుని సంఘ జీవితానికి లోబడినప్పుడా? ప్రభుత్వ వ్యవస్థను ఏర్పరచుకున్నప్పుడా? అక్షరలిపితో భావితరాలకు జ్ఞాన ప్రసార దారులు తెరిచినప్పుడా? శ్రమవిభజనతో భిన్న ఉత్పత్తుల తయారీని మొదలుపెట్టినప్పుడా? వ్యవసాయాన్ని ఆరంభించి గ్రామ జీవితానికి పునాదులు వేసుకున్నప్పుడా? నగరాలను నిర్మించినప్పుడా? ఆవిరి యంత్రం కనిపెట్టి పారిశ్రామిక విప్లవాన్ని ఆరంభించినప్పుడా? బొగ్గు–చమురును ఇంధనంగా వాడటం నేర్చినప్పుడా? ఖండాంతరాలకు వలసలు పోయినప్పుడా?.. ఇవన్నీ మనిషి మహాగమనానికి సంబంధించి మహా ప్రశ్నలే! వీటికి జవాబులు చెప్పుకోకుండా మానవ చరిత్రను అర్థం చేసుకోలేం. అయినా లక్షల ఏళ్ల మానవ చరిత్రలో మహాగమన మైలురాళ్లపై, కీలక మలుపులపై కొత్త ప్రతిపాదనలు వస్తూనే ఉన్నాయి. ఇటీవల కాలంలో అలాంటి కొత్త ప్రతిపాదన చేసిన వాళ్లలో ప్రముఖ పర్యావరణ చరిత్రకారుడు జాన్ రాబర్ట్ మక్‌నీల్ ఒకరు. పీటర్ ఎంగెల్కీతో కలిసి 'ద గ్రేట్ యాక్సెలరేషన్' అనే పేరుతో 1945 నుంచి ఇటీవల వరకూ పర్యావరణ చరిత్రను చక్కని చిక్కని భాషలో తేలికగా అర్థమయ్యే రీతిలో వివరించారు.

మానవజాతి చరిత్రను యుగాలుగా విభజించటం అందరికీ తెలిసిందే. మనుషులు వాడే పనిముట్లు, ఆయుధాలు వేటితో తయారయ్యాయన్న దాన్ని బట్టి ఒక విధమైన యుగవిభజన జరిగింది. రాతి, కంచు, ఇనుము యుగాల పేర్లు అలా వచ్చినవే. అక్షరలిపి లేనప్పటి దశను చరిత్రకు పూర్వయుగమనీ, రాతకోతలు తెలిసిన తర్వాత స్థితిని చరిత్ర ఆరంభయుగంగానూ వర్గీకరించారు. ఇక భూమి చరిత్రను కూడా 19వ శతాబ్దం నుంచి ఎన్నో యుగాలుగా విభజించారు. ప్రధానంగా భూ పర్యావరణలో, జీవపరిణామంలో చోటుచేసుకున్న మార్పుల ఆధారంగానే ఈ విభజనలు జరిగాయి. మనం ఇప్పుడు జీవిస్తున్న యుగాన్ని హోలసీన్ యుగంగా పిలుస్తారు. 11,700 సంవత్సరాల నాడు ఇది ప్రారంభమైంది. సరళంగా చెప్పుకోవాలంటే మంచుకాలాల మధ్య వచ్చిన సాధారణ ఉష్ణోగ్రతల కాలంగా దీన్ని భావించొచ్చు. ఈ సాధారణ ఉష్ణోగ్రతల వల్లే ప్రపంచంలో అనేక చోట్ల 11వేల సంవత్సరాల క్రితం వ్యవసాయానికి అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. వ్యవసాయంతో ఆహారధాన్యాల లభ్యత పెరిగింది. కొంతశాతం ప్రజలు ఆహారధాన్యాల ఉత్పత్తిలో పాల్గొనకపోయినా వారికీ ఇవ్వగలిగే స్థాయిలో ఉత్పత్తి జరిగేది. అట్లా కొందరికి గ్రామాలకు దూరంగా నగరాల్లో ఉండే అవకాశం లభించింది. తిండి గింజల లభ్యతల వల్లే కొందరు ఇతర వృత్తులు చేపట్టగలిగారు. ప్రభుత్వాలు కూడా అప్పుడే ఉనికిలోకి వచ్చాయి. ప్రభుత్వం అంటేనే సైన్యం, పోలీసులు, ఉద్యోగులు, ప్రభువుల సమాహారం. వీరి మనుగడకూ ఆహారధాన్యాల్లో వాటాలే కీలకం. ప్రాచీన, మధ్య యుగాలతో పాటు 18వ శతాబ్దంలో ఆరంభమైన పారిశ్రామిక విప్లవం కూడా ఈ హోలసీన్ యుగంలో ఏర్పడిన వాతావరణం వల్లే సాధ్యమైంది.

ఇంతటి ప్రాధాన్యం ఉన్న హోలసీన్ శకం ముగిసిందనీ భూచరిత్రలో కొత్త యుగం ప్రారంభమైందనీ మక్‌నీల్ ప్రతిపాదించారు. దీని స్థానంలో ఆంత్రపసీన్ అనే యుగం మొదలైంది. ఆంత్రపసీన్ యుగభావనను బాగా వాడకలోకి తెచ్చింది నోబెల్ బహుమతి (1995) గ్రహీత పాల్‌కర్జన్. భూపర్యావరణంపై మనుషుల కార్యకలాపాల ప్రభావం విపరీతంగా పెరిగిపోయిందనీ కార్బన్‌డయాక్సైడ్ లాంటి వాయువులతో ధరిత్రికి చెందిన వ్యవస్థలన్నీ పెను ప్రభావాలకు లోనవుతున్నాయనీ కర్జన్ ప్రతిపాదించారు. జీవమనుగడకు తీవ్ర ముప్పుగా పరిణమించిన ఈ ప్రభావాలతో భూచరిత్రలో తీవ్ర మానవ ప్రభావిత యుగం (ఆంత్రపసీన్) మొదలైందనీ ఇది 18వ శతాబ్దం చివరలో ఆరంభమై ఇప్పటికీ కొనసాగుతోందనీ కర్జన్ చెప్పారు. బొగ్గు వినియోగంతో ప్రారంభమైన ఈ యుగం ఆ తర్వాత చమురు, సహజ వాయువుల వినియోగంతో పరుగులెత్తింది. కర్జన్ తర్వాత ఆంత్రపసీన్ గురించి చాలా విశ్లేషణలు వచ్చాయి. నిప్పు వినియోగంతోనే అది మొదలైందని కొందరు భావించారు. వ్యవసాయం, పశుపోషణల నాటి నుంచే ఆ యుగారంభాన్ని చూడాలని మరికొందరు చెప్పారు. మక్‌నీల్ మాత్రం 1945 నుంచి ఈ యుగం మొదలైనట్లుగా భావించాలని ప్రతిపాదించారు. బొగ్గు, చమురు, సహజ వాయువుల (శిలాజ ఇంధనాలు) వాడకం 1945 తర్వాత విపరీత స్థాయిలో పెరిగిపోయిందనీ, దానితో పాటుగా జనాభా పెరుగుదల విజృంభించి భూవ్యవస్థలు చరిత్రలో మునుపెన్నడూ లేనీ రీతిలో ప్రభావితం అయ్యాయని చెప్పారు. పర్యావరణంలో అతి కీలక మార్పులన్నీ ఈ రెండింటి (శిలాజ ఇంధనాలు –జనాభా) కారణంగానే జరిగాయి. మహాగమనానికి చోదక శక్తులుగా వీటినే ప్రధానంగా చెప్పుకోవాలి. శిలాజ ఇంధనాల వాడకం యంత్రాలు, వాహనాలకే పరిమితం కాలేదు. విద్యుత్తు, ఎరువులు, ప్లాస్టిక్ లాంటి వెన్నో వీటి మీద ఆధారపడి ఉన్నాయి.

ఏటా ఇంధన వినియోగాన్ని మిలియన్ చమురు టన్నుల పరంగా లెక్కిస్తారు. 1965లో అది 3,813 మిలియన్ టన్నులు ఉంటే 2015 నాటికి 12,730 మిలియన్ టన్నులకు పెరిగింది. ఇందులో చైనా (2,852), అమెరికా వాటా (2,266)లే ఎక్కువ. భారత్ వినియోగం 595 మిలియన్ టన్నులే. చరిత్ర దృష్టితో చూస్తే శిలాజ ఇంధనాల వినియోగంలో ఎక్కువ వాటాలున్న దేశాలు ఇతర దేశాలపై పెత్తనం చలాయించాయి. ఒకనాటి బ్రిటన్ పాత్రే దీనికి నిదర్శనం. ఇప్పుడు ప్రపంచాధిపత్యం చైనా, అమెరికాలదే. శిలాజ ఇంధనాల వాడకం 2013 నాటికి 87 శాతం (చమురు–33శాతం, బొగ్గు–30శాతం, సహజవాయువు–24శాతం) ఉంది. జల (7శాతం), అణు (4శాతం) విద్యుత్తు వాటా 11 శాతం మాత్రమే. జంతు, వృక్ష శిలాజాల్లో ఇంధనం నిక్షిప్తం కావటం అనేది పెద్ద ప్రక్రియ. ఇలా ఏటా నిక్షిప్తమయ్యే ఇంధనాన్ని మించి ఎక్కువగా వాడటం 1870ల నాటికే మొదలైంది. నిక్షిప్త నిల్వలను ఖాళీ చేయటంలో చివరి దశకు వచ్చేశాం. శిలాజ ఇంధనాల వల్ల కలిగే వాయు, జల, నేల కాలుష్యాల గురించి మనందరికీ తెలిసిందే. 1950 నుంచి 2015 వరకూ వాయు కాలుష్యంతో మూడు నుంచి నాలుగు కోట్ల మంది చనిపోయారు. ఇక చెర్నోబిల్, ఫుకుషిమా అణు విద్యుత్తు కేంద్రాల ప్రమాదాలతో అవీ సురక్షితం కావని తేలింది. అయినా 50 చోట్ల వాటి నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఉన్న 440 కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి జరుగుతోంది. జల విద్యుత్తు, సాగునీటి కోసం కట్టే డ్యాంలు ఎన్నో పర్యావరణ సమస్యలకు దారితీస్తున్నాయి. కోట్ల మంది దాకా నిర్వాసితులయ్యారు. భారత్‌లోనే 2 కోట్ల వరకూ నిర్వాసితులు ఉన్నారన్న అంచనాలు ఉన్నాయి. కట్టిన 15–20 ఏళ్లలోనే భారీగా పూడికలు ఏర్పడటం, దిగువ ప్రాంతాల్లో జీవవైవిధ్యానికి ముప్పుగా పరిణమించటం సర్వసాధారణమైంది. సంక్షిప్తంగా చెప్పుకోవాలంటే భూమికి చెందిన అయిదు ప్రధాన వ్యవస్థలు వాతావరణం (అట్మస్ఫియర్), నీటి నిల్వల భాగం (హైడ్రాస్ఫియర్), జీవ ప్రాంతం (బయాస్ఫియర్), ఘనభాగం (జీయోస్ఫియర్), మంచుమయ ప్రాంతం (క్రయోస్ఫియర్) 1945 తర్వాత విపరీతంగా కకావికలయ్యాయి. మానవ, జంతు, వృక్ష కోటి మనుగడకు హానికరంగా మారిపోతున్నాయి.

జనాభా సంగతిని చూసినా భయానక చిత్రమే కన్పిస్తుంది. 1945లో 230 కోట్ల మంది జనాభా ఉంటే 2015 నాటికి 720 కోట్లకు చేరింది. ఈ ఏడాదికి 820 కోట్లు అవుతుంది. లక్షల సంవత్సరాల చరిత్రలో మానవుల జనాభా 100 కోట్లకు చేరటానికి యుగాలపాటు పట్టింది. 1800–1820ల నాటికి ఆ సంఖ్యకు మనుషులు చేరుకున్నారు. ఆ తర్వాత 1930ల నాటికి 200 కోట్లు అయ్యారు. అంటే రెట్టింపు కావటానికి వందేళ్లు పట్టింది. కానీ మరో 30 ఏళ్లలోనే 300 కోట్లకు చేరుకున్నారు. ఆ తర్వాత 15 ఏళ్లకు 400 కోట్లకు, మరో ఏడేళ్లకు 500 కోట్లకు చేరుకున్నారు. 1950–1955లో ఏటా సగటున 4.7 కోట్ల మంది పెరిగితే, 2010–2015 వచ్చేటప్పటికీ అది 8.2 కోట్లకు చేరుకుంది. అధిక జనాభా అంటే అధిక ఆహారోత్పత్తి. అధిక ఇంధన వినియోగం.. అధిక కాలుష్యం.. అధిక ఆర్థికాభివృద్ధి.. అధిక పర్యావరణ నాశనం.. అధిక వలసలు.. ఇవన్నీ కలిసి వందల సంవత్సరాల పాటు సరిదిద్దలేని విధ్వంసానికి దారితీస్తాయని మనుషులు భావించలేదు. విషాదం అదే! సొంత అవసరాలు, లాభాలు, అందివచ్చిన అవకాశాలతో పర్యావరణంతో ఆడుకున్నారు. 1970ల నుంచి పర్యావరణ ప్రమాదంపై చైతన్యం కలిగినా వందలేళ్ల పాటు హోలసీన్ యుగంలో మనుషులు ఏర్పరచుకున్న భావాలు, సిద్ధాంతాలు విరుగుడు అడుగులను ముందుకు పడనీయటం లేదు. గరిష్ఠంగా వినియోగం ద్వారా ప్రకృతిని వనరులను కొల్లగొట్టి ఆర్థికాభివృద్ధిని సాధించాలనే భావాలే హోలసీన్ యుగంలో మనుషులను శాసించాయి. ప్రముఖ ఆర్థికవేత్తలందరిదీ ఇదే పాట.

ఏ కొలమానం నుంచి చూసినా మనుషుల కార్యకలాపాలతో భూమికి సంబంధించిన వ్యవస్థలన్నీ తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. మొత్తం భూచరిత్రలోనే ఇదొక అపూర్వ దశ. మానవ చేష్టలతో విపరీతంగా ప్రభావితమైన భూవ్యవస్థలన్నీ కలిసి మానవ కార్యకలాపాలకు అడ్డుకట్టగా మారితే అవాంఛనీయ శకం ప్రారంభమైనట్లే! ఇది అనివార్యమా? అంటే కాదనీ చెప్పలేం. ప్రత్యామ్నాయ ఇంధనాల ద్వారా భూవ్యవస్థలను గాడిలో పెట్టొచ్చనే అవగాహన క్రమేపీ పెరుగుతోంది. మరోవైపు జనాభా పెరుగుదల రేటు మందగిస్తోంది. ఇంకో యాభై ఏళ్లకు జనాభాలో తగ్గుముఖమూ కనపడుతుంది. శిలాజ ఇంధనాల శకమూ ముగుస్తుంది. ఈ పరిణామాల వల్ల 1945 నుంచీ మొదలైన మానవ మహాగమనం మందగిస్తుంది! ఇప్పటికే కనిపిస్తున్న చిత్రం అదే! తప్పడగులు వేస్తే మానవగమనానికే ముప్పు రావచ్చు!

> ఏ కొలమానం నుంచి చూసినా మనుషుల కార్యకలాపాలతో భూమికి సంబంధించిన వ్యవస్థలన్నీ తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. మొత్తం భూచరిత్రలోనే ఇదొక అపూర్వ దశ. మానవ చేష్టలతో విపరీతంగా ప్రభావితమైన భూవ్యవస్థలన్నీ కలిసి మానవ కార్యకలాపాలకు అడ్డుకట్టగా మారితే అవాంఛనీయ శకం ప్రారంభమైనట్లే! ఇది అనివార్యమా? అంటే కాదనీ చెప్పలేం. ప్రత్యామ్నాయ ఇంధనాల ద్వారా భూవ్యవస్థలను గాడిలో పెట్టొచ్చనే అవగాహన క్రమేపీ పెరుగుతోంది. మరోవైపు జనాభా పెరుగుదల రేటు మందగిస్తోంది. ఇంకో యాభై ఏళ్లకు జనాభాలో తగ్గుముఖమూ కనపడుతుంది. శిలాజ ఇంధనాల శకమూ ముగుస్తుంది. ఈ పరిణామాల వల్ల 1945 నుంచీ మొదలైన మానవ మహాగమనం మందగిస్తుంది!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

యూరోపియన్ యువత వైపరీత్యం

యూరోపియన్ దేశాలలో యువ ఓటర్లు మితవాద పార్టీల వైపు ఎందుకు మొగ్గుతున్నారు? వాతావరణ మార్పును నియంత్రించే విషయమై తమ ప్రభుత్వాల నిష్క్రియాపరత్వం పట్ల ఆగ్రహంగా ఉన్న యూరోపియన్ యువజనులు, మానవాళిని మహా సమస్యలపాలు చేస్తున్న వాతావరణ విపత్తును ఉపేక్షిస్తున్న పార్టీలకే ఎందుకు ఓటు వేశారు? ఏమిటీ వైరుధ్యం? అంతకంతకూ వేడెక్కుతూ, తీవ్ర ప్రమాదంలో పడుతున్న ధరిత్రి పరిరక్షణపై ఆ యువ ఓటర్ల రాజకీయ నిర్ణయం ఎలాంటి ప్రభావాన్ని చూపనున్నది?



■ సునీతా నారాయణ్

మట్టివాసన

యూరోపియన్ పార్లమెంటుకు గత నెలలో జరిగిన ఎన్నికలలో 30 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ఓటర్లు ఎఎఫ్‌డి (జర్మనీ), నేషనల్ ర్యాలీ (ఫ్రాన్స్), వోక్స్ (స్పెయిన్), ది బ్రదర్స్ ఆఫ్ ఇటలీ (ఇటలీ), వ్లామ్స్ బెలాంగ్ (బెల్జియం), ఫిన్స్ పార్టీ (ఫిన్లాండ్) తదితర కరడుగట్టిన మితవాద పార్టీలకే ఓటు వేశారు. 2019 ఎన్నికలలో పర్యావరణవాద పార్టీలకు ఓటు వేసిన యువ ఓటర్లు 2024లో చాల వరకు పచ్చి మితవాద పార్టీలకు మద్దతునిచ్చారు. ఈ పరిణామాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? వాతావరణ మార్పును నియంత్రించేందుకు చేపట్టవలసిన చర్యల ఆవశ్యకతను యూరోపియన్ యువత ఎందుకు గుర్తించడంలేదు? పర్యావరణ పరిరక్షణ కంటే నిరుద్యోగిత, వలస సమస్యల పరిష్కారానికే వారు అగ్రప్రాధాన్యమిస్తున్నారా? మితవాద పార్టీలు సైతం వాతావరణ మార్పును అదుపు చేసేందుకు ఇప్పటికే అమలులో ఉన్న ప్రక్రియలను కొనసాగిస్తాయని వారు విశ్వసిస్తున్నారా?

వాస్తవమేమిటంటే తీవ్ర, వినాశనకర వాతావరణ వైపరీత్యాలతో యూరోపియన్ దేశాలూ మిగతా ప్రపంచ దేశాల వలే బాగా ప్రభావితమవుతున్నాయి. కర్బన ఉద్గారాలను తగ్గించడంలోను, ప్రపంచ సగటు ఉష్ణోగ్రత పారిశ్రామిక యుగ పూర్వ స్థాయికి కంటే 1.5 డిగ్రీ సెంటీగ్రేడ్ మాత్రమే ఎక్కువగా ఉండేలా పరిమితం చేయడంలోను యూరోపియన్ దేశాలు చిత్తశుద్ధితో చర్యలు చేపట్టడం లేదన్నది కూడా వాస్తవమే. ఈ పరిస్థితుల్లో బాగా వేడెక్కుతోన్న భూగ్రహం, వినాశనకర పర్యావరణాన్ని వారసత్వంగా పొందే యువజనులు, తమ శ్రేయస్సుకు హానికరంగా వాటిల్లుతున్న ఆ పరిణామాల పట్ల ఆందోళన చెందుతున్నారు. తమ భవిష్యత్తు విషయమై కలత చెందుతున్నారు.

వాతావరణ మార్పు విషమిస్తోంది. ఈ సమస్యను, కాదు సంక్షోభాన్ని గతంలో వలే కేవలం పర్యావరణవాద పార్టీలు, వామపక్షాలు మాత్రమే పట్టించుకుంటే సరిపోదు. అధికారానికి వస్తున్న రాజకీయ పక్షాలు అన్నీ దాన్ని పరిష్కరించేందుకు విధిగా పూనుకోవాలి. వాతావరణ మార్పుపై మితవాద పార్టీల వైఖరిని గమనిస్తే ఆ పరిణామాన్ని అవి పూర్తిగా నిరాకరించడంలేదు. కాకపోతే దాన్ని పట్టించుకుంటున్న తీరులో ఒక స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. అయితే ఆ మార్పు ఆశాజనకంగా లేదు. కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు అనివార్యంగా చేపట్టే ఇబ్బందికరమైన, కఠినమైన చర్యల పట్ల మరింత ప్రతిఘటన ఉంటుంది. డచ్ రాజకీయ పక్షం ఫ్రీడమ్ పార్టీనే తీసుకోండి. మాంసాహారం తినాలా వద్దా, విమానంలో ప్రయాణించాలా లేక పెట్రోల్, డీజిల్ కార్లలో వెళ్లాలా తదితర విషయాలపై ప్రజల నిర్ణయాలనే కానీ బ్రసెల్స్ (ఈయు ప్రధాన కార్యాలయం ఉన్న బెల్జియం రాజధాని)లోని అధికారుల ఆదేశాలను కాదని ఫ్రీడమ్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొంది. ఇంధన ధరల పెరుగుదల వల్ల ప్రజలపై మరింత ఆర్థిక భారం పడిందని ఆ మేనిఫెస్టో నిరసన వ్యక్తం చేసింది.



యూరోపియన్ యూనియన్ పార్లమెంటుకు గత నెలలో జరిగిన ఎన్నికలలో యువ ఓటర్లు మితవాద పార్టీల వైపు మొగ్గారు. వాతావరణ మార్పు పర్యవసానాలు, వలసల సమస్యలను సమర్థంగా ఎదుర్కొనేందుకు యువ యూరోపియన్ల రాజకీయ నిర్ణయం ఎంత మాత్రం దోహదం చేయదు.

శిలాజ ఇంధనాలపై పన్నుల భారాన్ని తగ్గించాలని సూచించింది. శిలాజ ఇంధనాల నుంచి పునరుద్ధరణీయ ఇంధన వనరులకు మారేందుకు ఇతర మితవాద పార్టీలు కూడా తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేశాయి. రైతులోకంలోను వ్యతిరేకతలు వ్యక్తమవుతున్నాయి. క్రిమిసంహారక మందుల వినియోగాన్ని యూరోపియన్ రైతులు వ్యతిరేకిస్తున్నారు; పశుగణాన్ని తగ్గించుకోవాలన్న ప్రతిపాదన వారి ఆమోదం పొందడం లేదు; మాంసాహారం తీసుకోవాలా వద్దా అనే ఉద్వేగాత్మక విషయమై నెలకొన్న వివాదం మొదలైన వాటిపై మితవాద పార్టీలు ఒకే తీరులో ప్రతిస్పందిస్తున్నాయి. ఇప్పటికే గ్రీన్ డీల్ (వాతావరణ మార్పు పర్యవసానాలను సమర్థంగా ఎదుర్కొనేలా ఆర్థిక వ్యవస్థలను రూపొందించేందుకు 2020లో యూరోపియన్ యూనియన్ దేశాలు ఆమోదించిన విధానాలు) బలహీనపడింది. వాతావరణ మార్పు నియంత్రణ కంటే జాతీయ పారిశ్రామిక ప్రయోజనాలను కాపాడుకోవడమే ప్రాధాన్యం పొందుతోంది. యూరోపియన్ యువజనులు వాతావరణ మార్పును నియంత్రించేందుకు చేపట్టే కఠిన చర్యలను సమర్థిస్తారా లేక జీవన వ్యయాన్ని భారం చేయని, ఇంధన ధరలు పెంచని, తమకు ఇష్టమొచ్చిన రీతిలో ప్రయాణించేందుకు వెసులుబాటునిచ్చే పరిష్కారాలనే ఎంచుకుంటారా? ఇదే ఇప్పుడు మనముందున్న ప్రశ్న. వాతావరణ మార్పును తక్షణ ప్రాతిదికన నియంత్రించవలసి ఉన్నది. ఆ సంక్షోభ తీవ్రత అటువంటిది. ఐరోపాతో సహా సంపన్న దేశాలు తమ కర్బన ఉద్గారాలను తగ్గించలేదు. మరి ఈ పరిస్థితులలో యూరోపియన్ ప్రభుత్వాల నిర్ణయాలు పెరుగుతోన్న భూతాపాన్ని తగ్గించగలుగుతాయా?

వర్తమాన ఐరోపాలో మరొక వైరుధ్యం కూడా ఉన్నది. అది పారిశ్రామిక ప్రపంచమంతటా ఉన్నది. ఇతర దేశాల నుంచి వలస వచ్చినవారు తమ ఉద్యోగాలను స్వాయత్తం చేసుకుంటున్నారని యూరోపియన్ యువత ఆందోళన చెందుతున్నది. తత్కారణంగానే వారు మితవాద రాజకీయ పక్షాల వైపు మొగ్గుతున్నారు. వలసకారులను అనుమతించకూడదని ఈ మితవాద పార్టీలు ఏనాటి నుంచో డిమాండ్ చేస్తున్నాయి. కొన్ని పక్షాలు అయితే బహిరంగంగానే జాతి వివక్షను చూపుతున్నాయి.

వాస్తవమేమిటంటే తమ ఆర్థిక వ్యవస్థల పటిష్ఠ నిర్వహణకు వలస వచ్చిన శ్రామికులు, నిపుణుల సేవలు ఐరోపాకు అవసరం. వలసకారులు లేకుండా ఐరోపా మన లేదు. తమ పంటల సాగుకు, రైళ్లను నడిపేందుకు, ఫ్యాక్టరీలలో పని చేసేందుకు, నగరాలను శుభ్రం చేసేందుకు ఇతర దేశాల నుంచి వచ్చే వారి అవసరం ఐరోపాకు ఎంతైనా ఉన్నది. 2020లో 8.70 కోట్ల మంది అంతర్జాతీయ వలసకారులు ఐరోపాలో నివశిస్తున్నారని 'వరల్డ్ మైగ్రేషన్ రిపోర్ట్–2024' వెల్లడించింది. 2015లో కంటే ఇది 16 శాతం అధికం.

సరే, అక్రమ వలసకారుల గురించి ప్రస్తావించక తప్పదు. వీరు ఎంత మంది ఉంటారన్న విషయమై కచ్చితమైన అంచనా లేదు. ఐరోపాకు వీరు ఎంత అధిక సంఖ్యలో వస్తున్నారంటే చేరిన గమ్యాలలో స్థానికులను సైతం స్థానభ్రంశం చేస్తున్నారు. వాతావరణ మార్పు పర్యవసానాలు కూడా వేనవేల మందిని నిర్వాసితులను చేస్తున్నాయి. దీనివల్ల కూడా వలసలు విపరీతంగా పెరుగుతున్నాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే వాతావరణ మార్పును నియంత్రించడంలో యూరోపియన్ దేశాలు ఎట్టి పరిస్థితులలోను అలసత్వం చూపకూడదు. ఆ నిర్లక్ష్యం వల్ల యూరోపియన్లే కాకుండా విశాల ప్రపంచ ప్రజలు కూడా మరింతగా చిక్కుల్లో పడతారు. వాటిల్లే విపత్తులను ఎదుర్కోవడం వారికి కష్టమవుతుంది. డోనాల్డ్ ట్రంప్ –వచ్చే నవంబర్‌లో జరగనున్న అధ్యక్ష ఎన్నికలలో ఈయన మళ్లీ విజయం సాధించే అవకాశమున్నది– అమెరికాలో కూడా వాతావరణ మార్పు నియంత్రణపై విముఖత బాగా ఉన్నది. వలసకారులపై వ్యతిరేకత పెరుగుతోంది. ఈ రెండు అంశాలు అమెరికా సమాజంలో విద్వేష ధోరణులకు ఎంతైనా ఆస్కారమిస్తున్నాయి. ఏతావాతా మన ప్రపంచం సమస్యల సుడిలో కొట్టుమిట్టాడుతోంది.

(సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

జాతీయీకరణతో సర్వతోముఖాభివృద్ధి

భారతదేశంలో 18వ శతాబ్దం మధ్యలో ఆధునిక బ్యాంకింగ్ ఉద్భవించింది. తొలిగా హిందుస్థాన్ బ్యాంకు, 1770లో స్థాపించబడింది. తరువాత జనరల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 1786లో మొదలైంది. ఇవి విఫలమయ్యాక 1809లో బెంగాల్ బ్యాంకు, 1840లో బొంబాయి బ్యాంకు, 1843లో మద్రాస్ బ్యాంకులు స్థాపించబడ్డాయి. ఈ మూడు బ్యాంకులను కలిపి 1921లో ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యం వచ్చాక 1955లో ఇది భారతీయ స్టేట్ బ్యాంక్‌గా ఆవిర్భవించింది. 1935లో భారతీయ రిజర్వు బ్యాంకు స్థాపించబడింది. మన దేశంలో ప్రభుత్వం మొదట జాతీయీకరణ చేసిన బ్యాంకు ఇదే.

బ్యాంకులు సామాజిక బాధ్యత మరచి కొందరికే సేవలు అందిస్తూ కేవలం లాభాల కోసమే పనిచేయడం. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను నిర్లక్ష్యం చేయడం. గ్రామీణ ప్రాంతాల్లో శాఖలను విస్తరించక, రుణాల మంజూరులో నిర్లక్ష్యం వహించడం. పెద్ద వ్యాపార సంస్థలు, పరిశ్రమల అవసరాలను తీరుస్తూ వ్యవసాయం, ఎగుమతులు, చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి దోహదం చేయకపోవడం. ప్రాంతీయ అసమానతలు, పేదరికం బాగా పెరగడం. ప్రైవేటు వ్యక్తుల నియంత్రణతో సమాజంలో అభివృద్ధి నిరోధక శక్తులుగా పనిచేయడం వంటి అంశాలు బ్యాంకుల జాతీయీకరణకు దారి తీశాయి. దీంతో 1969లో భారత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి అవసరాలను తీర్చడానికి 14 బ్యాంకులను జాతీయీకరణ చేసింది. అనంతరం 1980లో సామాజిక సంక్షేమం, ప్రాధాన్యతా రంగాలకు రుణాలు మంజూరు, ప్రజల జీవనస్థాయిని పెంపొందించడం లక్ష్యంగా మరో ఆరు బ్యాంకులను జాతీయం చేసింది. జాతీయీకరణ వల్ల ప్రభుత్వరంగ బ్యాంకుల్లో డిపాజిట్లు పెరిగాయి. 1969లో 43 బిలియన్లు ఉంటే, 2023లో 1,70,087 బిలియన్లకు పెరిగాయి. అలాగే రుణాల మంజూరు 34 బిలియన్లు ఉంటే, 2023లో 1,22,587 బిలియన్లకు పెరిగాయి. ప్రభుత్వ యాజమాన్యంలో బ్యాంకులు పనిచేయడం వల్ల ప్రజలలో బ్యాంకుల పట్ల నమ్మకం పెరిగింది. గ్రామీణ ప్రాంతాలకు కూడా శాఖలు విస్తరించాయి. హరిత విప్లవం విజయవంతం కావడానికి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి బ్యాంకుల జాతీయీకరణ ఎంతగానో దోహదపడింది. దేశంలో పొదుపు భావన పెరిగింది. అన్ని రంగాలలో దేశం అభివృద్ధి చెందింది. దేశ సర్వతోముఖాభివృద్ధిలో జాతీయీకరణ కీలకపాత్ర పోషించింది.

– పినక సాంబయ్య, కానూరు, విజయవాడ

(నేడు బ్యాంకుల జాతీయీకరణ దినోత్సవం)

హిందూ మతగ్రంథాలపై ఇంత విద్వేషమా?

'మూఢవిశ్వాసాల ఊబిలో చిక్కుకున్నాం' అంటూ జూలై 13న గుమ్మా వీరన్న రాసిన వ్యాసం హిందూ మత వ్యతిరేక పైత్యాన్ని బహు చక్కగా స్పష్టీకరించింది. హిందువుల ఆచారాలు, సాంప్రదాయాలు, ఆధ్యాత్మిక గ్రంథాలపై, అనవసర దూషణలు వ్యక్తీకరించడం, ఈ దేశంలో అన్ని సమస్యలకు హిందూ మతం కారణమని వ్యాఖ్యలు చేయడం ఒక ఫ్యాషన్‌గా మారింది.

లౌకికవాద ముసుగు వేసుకున్న వారికీ, హేతువాదులమని బోర్డు తగిలించుకున్న వారికీ, అంబేడ్కరిస్టులకు, ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులకు, మానవహక్కుల సంఘాలకు, హిందూ వ్యతిరేక హిందువులకీ, హిందువులను దూషించి, ద్వేషిస్తే ముస్లింల, క్రైస్తవుల ఓట్లు గుండుగుత్తగా తమకే పడతాయని ఆకాంక్షించే రాజకీయ నాయకులకు హిందువుల మతం విమర్శలకు ఒక వస్తువుగా మారింది. భిన్న మతాలకు, భిన్న సంస్కృతులకు భారత భూమి కేంద్రం కావడానికి 'ఏకం సత్ విప్రా బహుధావదన్తి' (సత్యం ఒక్కటే, జ్ఞానులు అనేక రకాలుగా చెప్పుకుంటారు) అని భారతీయ మహర్షులు ప్రవచించిన మూలసూత్రం ప్రధాన భూమిక అనే విషయం హిందూ మతాన్ని అనవసరంగా దూషించే వారికి ద్వేషించే వారికి ఎప్పటికీ అర్థం కాదు. బౌద్ధం, జైనం, శైవం, వీరశైవం, ద్వైతం, అద్వైతం, విశిష్టాద్వైతం ఇత్యాది ఆధ్యాత్మిక ధారలు ఈ దేశంలో పరిఢవిల్లడానికి పై మూలసూత్రమే కారణమనే విషయం చాలామందికి బోధపడదు. ప్రపంచంలోని 52 ముస్లిం దేశాలలో ఇస్లాం తప్ప అందుకు భిన్న సంస్కృతి ఎందుకు మనుగడలో లేదనే ప్రశ్నకు సమాధానం దొరకదు. పోనీ 1947 వరకు అఖండ భారత్‌లో భాగంగా ఉన్న పాకిస్తాన్, బంగ్లాదేశ్ లలో ఇస్లామేతర సంస్కృతి ఎందుకు మనగలగడం లేదు?

బ్రాహ్మణుడైన పుష్యమిత్ర శుంగుడు మౌర్యరాజైన బృహద్రథుని సంహరించి రాజ్యాధికారం చేపట్టడం భారతదేశ చరిత్రలో ఎంతో విషాదకర ఘట్టమని చెప్పడం వ్యాసకర్తకు చారిత్రక అవగాహనారాహిత్యం మెండుగా ఉన్నట్లు రుజువయింది. ఇక్కడ కుల ప్రస్తావన అవసరమా? 'రాజ్యం వీర భోజ్యం' గ్రీకులు, హూణులు, శకులు, తురుష్కులు, మొఘలులు భారత భూభాగాలను ఆక్రమించి రాజ్యాలను ఏలిన విషయం చరిత్రలో ఉన్న ఘట్టాలే కదా! ఇక మనుస్మృతిని అంబేడ్కర్ తగులబెట్టిన విషయాన్ని గొప్పగా డప్పు కొట్టుకోవడంలో విచిత్రం ఏమీ ఉండదు. అది హిందువులకు సంబంధించిన గ్రంథం కాబట్టి అంబేడ్కర్‌కు ఆ ధైర్యం వచ్చింది. పైగా ఏ మత గ్రంథమైనా ఆనాటి సామాజిక పరిస్థితులకు అనుగుణంగా లిఖించబడి ఉంటుంది. మారుతున్న పరిస్థితులకు అది సరిపోకపోవచ్చు. సామాజిక రాజకీయ అంశాలలో మనుస్మృతిని అమలు చేయమని ఏ హిందువు అడగడం లేదు.

భారత రాజ్యాంగం ద్వారా నిర్మాణమైన సుప్రీంకోర్టు తీర్పు మా మతానికి విరుద్ధమని ముస్లింలు అన్నట్టు ఏ హిందువు వాదించడం లేదనేది ఇక్కడ గమనార్హం. వర్ణ ధర్మానికి కుల వివక్షత కొనసాగటానికి ఎలాంటి సంబంధం లేదు. నల్ల క్రైస్తవుల పట్ల తెల్ల క్రైస్తవులు వివక్ష చూపడానికి పాశ్చాత్య సమాజంలో భారతదేశంలో ఉన్నట్లు స్మృతులు ఏమీ లేవు కదా? క్రైస్తవ సమాజంలో నీగ్రోల పట్ల, ఇస్లాం సమాజంలో అహ్మదీయులు, మొహాజర్లు, పస్మందాల పట్ల వివక్షత ఉన్నట్లే, హిందూ సమాజంలో కూడా నిమ్న వర్గాల వివక్షత నేటికీ కొనసాగుతూ ఉందనేది కాదనలేని సత్యం. ఈ వివక్షకు హిందూ ధర్మ గ్రంథాలు, పురాణాలు, ఇతిహాసాలు కారణమని చెప్పడం మూర్ఖత్వం. ఇస్లాం, క్రైస్తవ సమాజాలలో ఏర్పడ్డ రుగ్మతలకు వారి మత గ్రంథాలు కారణమని చెప్పే ధైర్యం, సాహసం, తెగువ, నిష్పాక్షికత హిందూ వ్యతిరేకులైన హేతువాదులకు ఉందా?

హిందూ సమాజంలో నెలకొన్న వివక్షతలను రూపుమాపడానికి ఈ సమాజంలో అనేకమంది రుషితుల్యులు వందల సంవత్సరాల తరబడి అవిరళ కృషి సల్పుతూనే ఉన్నారు. ఇస్లాం, క్రైస్తవ సమాజాలలో సంస్కరణలను అంగీకరించే మానసిక స్థితి ఉందా? కోపర్నికస్, బ్రూనో, గెలీలియోలకు, అన్వర్ షేక్‌లకు పట్టిన గతి ఏమిటి? సైన్సును ఈ దేశం మతంగా ఏనాడు అంగీకరించలేదు. భూకేంద్రిత సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది హిందూ మతం కాదు.. క్రైస్తవం. ప్రపంచ దేశాల్లోని మానవులు గుడ్డ కట్టుకోవడం నేర్చుకోని సమయంలోనే ఈ విశ్వాన్ని అండపిండ బ్రహ్మాండమని సూత్రీకరించారు భారతీయ మహర్షులు. ప్రధాని మోదీపై ఏర్పరచుకున్న వ్యతిరేక ధోరణితో భారతదేశంలో పరిఢవిల్లిన పురాతన శస్త్ర చికిత్సను నిరాధారమైనదని ఎందుకు కొట్టిపారేస్తారు?

హిందువుల ఆధ్యాత్మిక గ్రంథాలను గుడ్డిగా వ్యతిరేకించే కుహనా మేధావులకు ఆ గ్రంథాల లోతుపాతుల విషయంలో కనీస పరిజ్ఞానం ఉండదనేది అక్షర సత్యం. హిందూ సమాజాన్ని కులాలవారీగా విడగొట్టడానికి, వైషమ్యాలు సృష్టించి, బలహీన పరచడానికి బ్రిటిష్ పాలకులు చెప్పిన చిలుక పలుకులను వల్లెవేసి, మేధావులుగా చలామణి కావడానికి ఆరాటపడుతూ, హిందూ మత గ్రంథాలను దూషించడం అనే పనిలో నిమగ్నమై ఉంటారు.

రామాయణం, భారతం, భాగవతం కట్టుకథలని చెప్పడం హిందూ వ్యతిరేక పైత్యానికి పరాకాష్ఠ! పైగా ఆదిశంకరాచార్యపై అవాకులు చవాకులు పేలడం, బౌద్ధ ఆరామాలు ఆక్రమించి, దేవాలయాలు నిర్మించాడని అసంబద్ధ వ్యాఖ్యలు రాయడం విడ్డూరంగా ఉంది. బౌద్ధం నాశనం కావడానికి ఆయన కారణమని చెప్పడం ప్రతీకాత్మకంగా ఉంది. బౌద్ధం భారతదేశంలో ఎందుకు మనుగడ సాగించలేకపోయిందో, శ్వేతంబరులు, దిగంబరుల బౌద్ధ సిద్ధాంతాలలోని పొరపొచ్చాలు, స్త్రీలను బౌద్ధ సన్యాసినులుగా స్వీకరించడం, ఈ విషయంలో బౌద్ధ భిక్షువుల నైష్ఠికత దెబ్బతినడం ఇత్యాది విషయాలపై సమగ్ర అవగాహన ఉన్న ప్రపంచ మేధావులు బౌద్ధం ఈ దేశంలో ఎందుకు మనుగడ సాగించలేకపోయిందో స్పష్టీకరించారు. బౌద్ధాన్ని సరైన కోణంలో అర్థం చేసుకోవాలంటే కొన్ని కులాలపై ద్వేష భావన ఉంటే ఈ లక్ష్యం నెరవేరదు.


బ్రాహ్మణ కులాన్ని సంరక్షించడం కోసమే భగవద్గీత చెప్పించబడిందని వివరణ ఇచ్చిన వ్యాసకర్తకు భగవద్గీతలో ఎన్ని అధ్యాయాలు ఉన్నాయో ఏ అధ్యాయంలో మానవుని ఆలోచనల పరంపర గురించి ఏమి వివరించబడిందో ప్రాథమిక పరిజ్ఞానం కూడా లేనట్లు తేలింది. 'యద్య దాచరతి శ్రేష్ఠః తత్రదేవేతరో జనః సయత్ ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే' (శ్రేష్ఠులు దేనిని ప్రామాణికంగా స్వీకరించి, ఆచరిస్తారో సామాన్య జనం దానినే ప్రామాణికంగా తీసుకుంటారు) అనే భగవద్గీత శ్లోకం హిందువుల్లో చాలామందికి అర్థం కాదు. ఇక హిందూ వ్యతిరేకులైన హేతువాదుల పరిస్థితి ఇంతకంటే భిన్నంగా ఉంటుందా?

ఇక చివరగా సమాజానికి చెడు చేసే ఏ మత సాంప్రదాయాన్నీ సమాజంలోని విజ్ఞులు అంగీకరించరు. అదే సమయంలో వక్రబుద్ధితో ఒక మతాన్ని వ్యక్తిగతంగా దూషించాలని, ఆ మత అనుయాయులను మానసికంగా హింసించాలని ప్రయత్నిస్తే సమాజంలో శాంతిభద్రతల పరిస్థితి తారుమారవుతుందనేది చరిత్ర చెప్పిన సత్యం.

> సమాజానికి చెడు చేసే ఏ మత సంప్రదాయాన్నీ సమాజంలోని విజ్ఞులు అంగీకరించరు. అదే సమయంలో వక్రబుద్ధితో ఒక మతాన్ని వ్యక్తిగతంగా దూషించాలని, ఆ మత అనుయాయులను మానసికంగా హింసించాలని ప్రయత్నిస్తే సమాజంలో శాంతిభద్రతల పరిస్థితి తారుమారవుతుందనేది చరిత్ర చెప్పిన సత్యం.



■ ఉల్లి బాలరంగయ్య
సామాజిక, రాజకీయ విశ్లేషకులు



ఇంద్రకీలాద్రిపై కూరగాయల తోరణాలు

శాకంబరీ శోభ

ఇంద్రకీలాద్రిపై నేటి నుంచి శాకంబరీ ఉత్సవాలు

- మూడు రోజుల పాటు పచ్చని పండుగ
- కూరగాయలు, ఆకుకూరలతో అలంకరణ

వన్‌టౌన్, జూలై 18 : ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం నుంచి మూడు రోజులు జరిగే శాకంబరీ ఉత్సవాలకు సర్వంసిద్ధమైంది. అమ్మవారి ఆలయంతో పాటు ఉపాలయాలను కూరగాయలతో అందంగా అలంకరించారు. కూరగాయల రాశికి గురువారం ఈవో రామారావు, అర్చకులు పూజలు చేశారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని అమ్మవారిని వేడుకున్నారు. శుక్ర, శని, ఆదివారాల్లో జరిగే ఈ ఉత్సవాల్లో హోమాలు, ప్రత్యేక అర్చనలు జరుగుతాయి. కూరగాయలతో వండిన కదంబ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేస్తారు. ఉత్సవాల నిమిత్తం పెద ఓగిరాల నుంచి మూడు మెట్రిక్ టన్నులు, గుంటూరు జిల్లా నారా కోడూరు, చేబ్రోలు, తెనాలి నుంచి ఒకటిన్నర మెట్రిక్ టన్నుల కూరగాయలు వితరణగా వచ్చాయి. యడ్లపల్లి, సంగం జాగర్లమూడి నుంచి మూడు మెట్రిక్ టన్నుల నిమ్మకాయలు, గుంటూరు, నూజివీడు, హనుమాన్ జంక్షన్ నుంచి ఆరు మెట్రిక్ టన్నులు, సిద్ధాంతం, తణుకు, తాడేపల్లిగూడెం, ఏలూరు నుంచి ఆరు టన్నులు, విజయవాడ నుంచి 500 కిలోల చొప్పున కూరగాయలు దాతల నుంచి అందాయి.



ప్రకాశం బ్యారేజీ వద్ద నిండుకుండలా కృష్ణమ్మ



ముసురుకుంది

రెండు రోజులుగా జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలు

పొంగుతున్న వాగులు, వంకలు.. ప్రకాశం బ్యారేజీ వద్దకు వరద నీరు

విజయవాడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు ముసురుపట్టింది. బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు హోరున వర్షం కురుస్తూనే ఉంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రెయిన్లు పొంగిపొర్లాయి. తిరువూరు మండలంలో 13.4 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా చందర్లపాడు మండలంలో 0.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నందిగామ, కంచికచర్ల మండలాల్లో ఎలాంటి వర్షపాతం నమోదు కాలేదు. వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయి. ఎగువన ఉన్న తెలంగాణ ప్రాంతంలోనూ వర్షాలు కురుస్తుండటంతో కట్టలేరు, వైరా వాగులు పొంగుతున్నాయి. ఈ వాగులు కీసర వద్ద కృష్ణానదిలో కలుస్తాయి. ఇక్కడి నుంచి 1400 క్యూసెక్కుల నీరు ప్రకాశం బ్యారేజీకి చేరుతోంది. మరోపక్క పట్టిసీమ నుంచి 2500 క్యూసెక్కుల గోదావరి నీరు కృష్ణానదిలోకి వస్తోంది. ప్రకాశం బ్యారేజీకి అనుబంధంగా ఉన్న తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వల్లో పూర్తి సామర్థ్యంతో నీరు ప్రవహిస్తోంది. వర్షాలు ముమ్మరంగా కురవడంతో కృష్ణాడెల్టా పరిధిలోని పొలాల్లో పనులు ఊపందుకుంటున్నాయి. వర్షాలకు విజయవాడ నగరం తడిసిముద్దయింది. బెంజిసర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, వారధి, లోబ్రిడ్జి, పీఎన్‌బీఎస్, కబేళా, విద్యాధరపురం, వించిపేట, హౌసింగ్‌బోర్డు కాలనీ ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. జాతీయ రహదారిపైనా ఇదే పరిస్థితి. నగరంలో మొత్తం 19.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాలకు రహదారులు దెబ్బతినగా, అంటువ్యాధులు ప్రబలుతాయేమోనని పేదలు భయాందోళన చెందుతున్నారు.

కలుషిత నీటిపై కదిలిన యంత్రాంగం

- వెంకటనరసింహాపురంలో మంచినీటి శాంపిళ్ల పరిశీలన
- మంచినీటి పైపులైను పునరుద్ధరణ, క్లోరినేషన్‌కు చర్యలు



నీటిని పరీక్షిస్తున్న అధికారి

గన్నవరం, జూలై 18 : కేసరపల్లి పంచాయతీ వెంకటనరసింహాపురంలో మంచినీటిని జిల్లా యంత్రాంగం గురువారం పరిశీలించింది. డ్రెయినేజీ నీరు మంచినీటి పైపుల ద్వారా ఇంటింటికీ సరఫరా అయిన ఉదంతాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీంతో గన్నవరం ఎండీవో ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూ ఎస్, వైద్య ఆరోగ్య సిబ్బంది వెంటనే స్పందిం చారు. డ్రెయినేజీ గుంటల వద్ద పగిలిన పైపులైన్లను పునరుద్ధరించారు. డ్రెయినేజీ నీరు రాకుండా పైపులను తొలగించి, సీల్ మూతలు బిగించారు. కొత్త పైపులు వేసే పనులు చేపట్టారు. కేసరపల్లి సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ నేతృత్వంలోని ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది కూడా స్పందించి కాలనీకి సరఫరా అయ్యే నీటిని పలుమార్లు క్లోరినేషన్ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, స్థానిక ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి వాటర్ శాంపిల్స్ పరిశీలించారు. కాగా, యుద్ధప్రాతిపదికన డ్రెయినేజీ లీకేజీలను గుర్తించి, మరమ్మతులు చేయాల్సిన అవసరముందని స్థానికులు చెబుతున్నారు. డ్రెయినేజీ కాల్వలు లేవు కాబట్టి, పైపులైన్లు ఏర్పాటు చేయటం ద్వారా సమస్యకు పరిష్కారం చూపాలంటున్నారు.

వాహనాలకు దారేదీ?

అడ్డదిడ్డంగా ఆటోనగర్ రోడ్లు

ఆటోనగర్‌లోని ప్రధాన రహదారిపై ప్రయాణం అంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ రోడ్లు.. ఒకవైపు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, మరోవైపు వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఉన్నా పట్టించుకునే వారు ఒక్కరు కూడా ఉండరు. అధికారులకు మామూళ్లు దండిగా అందుతుండటంతో 100 అడుగుల రోడ్డు నానాటికీ కుంచించుకుపోతోంది. రోడ్డును ఆక్రమించి షెడ్లు ఏర్పాటు చేసుకుని మరీ మరమ్మతులు చేస్తున్నా.. లారీలను రోడ్డుపైనే వదిలేసి వెళ్లిపోతున్నా.. నెల రోజుల్లో ఇద్దరు ద్విచక్రవాహనదారులు మృత్యువాత పడినా.. పట్టించుకునే వారు లేరు.. పరిష్కరించేవారు రారు.

- 100 అడుగుల రోడ్డు పొడవునా ఆక్రమణలే..
- ఆటోనగర్-కానూరు రహదారి మొత్తం లారీ షెడ్డులే..
- రోడ్డుపైనే లారీల విడిభాగాలు.. భారీ ట్రాలీలు..
- నిలిపి ఉంచిన లారీలు ఢీకొని నెలలో ఇద్దరు మృతి
- ఏడాదిలో 10 మంది మృత్యువాత.. గాయాలు
- ట్రాఫిక్, ఐలా, మున్సిపల్ అధికారులకు మామూళ్లు
- ఆటోనగర్ అసోసియేషన్ల వసూళ్ల దందా
- భయంభయంగా విద్యార్థుల రాకపోకలు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఆటోనగర్ 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్-కానూరు రోడ్డు మృత్యు రహదారులుగా మారాయి. ఈ రోడ్లలో ప్రమాదానికి గురై ఏడాది వ్యవధిలో 10 మంది మృత్యువాత పడగా, పదుల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. ఈ పాపంలో ఆటోనగర్‌ను పర్యవేక్షించే ఐలాతో పాటు పెనమలూరు ట్రాఫిక్ పోలీసులు, వైఎస్సార్ తాడిగడప మున్సిపల్ అధికారులు కూడా భాగస్వాములే. నెలవారీ మామూళ్ల మత్తులో పడి ఈ రోడ్లను షెడ్లుగా, డంపింగ్ యార్డుల్లా, పార్కింగ్ ప్రదేశాల్లా మార్చారు. ఆసియాలోనే అతిపెద్దదైన ఆటోనగర్ పారిశుధ్య పరిస్థితులపై వీఎంసీ అధికారులు కానీ, తాడిగడప మున్సిపల్ అధికారులు కానీ దృష్టి సారించరు. ఓవైపు డయేరియా ముప్పు వెంటాడుతున్నా ఆటోనగర్, కానూరు ప్రాంతాల్లో రహదారులే డంపింగ్ యార్డులుగా మారి ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నా పట్టించుకోరు. సుమారు 3 లక్షల పైచిలుకు జనాభా ఉన్న తాడిగడప మున్సిపాలిటీలో మూడో వంతు జనం కానూరులోనే ఉంటారు. వీరంతా విజయవాడ నగరంలోకి వెళ్లేందుకు ఆటోనగర్-కానూరు రహదారి, ఆటోనగర్ 100 అడుగుల రహదారే ప్రధానమైనవి. రెండు కిలోమీటర్ల మేర కానూరు-ఆటోనగర్ రహదారి విస్తరించి ఉండగా, 100 అడుగుల రహదారి మరో రెండు కిలోమీటర్లు ఉంటుంది. ప్రస్తుతం ఈ ప్రాంతం ఆక్రమణలతో నిండిపోయింది.



కానూరు వెళ్లే రహదారిలో రోజూ ఇదే పరిస్థితి

భారీగా మామూళ్లు

ఈ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతూ సామాన్యుల ప్రాణాలు పోతున్నా అటు అధికారులు కానీ, ఇటు ట్రాఫిక్ పోలీసులు కానీ కళ్లు తెరవడం లేదు. ఈ రహదారి వెంబడి పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు ఇటుగా తిరుగుతారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ప్రతినెలా ఐలా, మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులకు పెద్ద ఎత్తున మామూళ్లు వెళ్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక్క రోడ్డు నుంచే సుమారు అరకోటి వరకు నెలవారీ మామూళ్లు అందుతున్నాయని చెబుతున్నారు.



రోడ్డుపైనే లారీలు, విడిభాగాలు

నానాటికీ కుంచించుకుపోతూ..

కానూరు-ఆటోనగర్ రహదారి మాస్టర్ ప్లాన్‌లో 80 అడుగుల వెడల్పుగా ఉంది. కొద్దిరోజుల క్రితం సుమారు రూ.కోటిన్నర వ్యయంతో ఈ రహదారిని నిర్మించారు. 80 అడుగులు ఉండాల్సిన ఈ రోడ్డు క్షేత్రస్థాయిలో 30 అడుగులు కూడా కనిపించదు. రోడ్డు పొడవునా భారీ లారీలు అనధికారికంగా పార్కింగ్ చేసి ఉంటాయి. కొందరు ఏకంగా రోడ్డును ఆక్రమించి లారీ షెడ్డులే నిర్మించేసుకున్నారు. మరోవైపు ఆటోనగర్‌లోని చెత్త మొత్తం ఈ రోడ్డుపైనే వేసి డంపింగ్ యార్డుగా మార్చారు. ఈ చెత్తతో రోడ్డు సగం నిండిపోయింది. ఈ రహదారి వెంబడే నవత ప్రధాన కార్యాలయంతో పాటు క్రాంతి, వీఆర్ఎల్ వంటి లారీ ట్రాన్స్‌పోర్టు సంస్థలు ఉన్నాయి. ఈ సంస్థలకు చెందిన భారీ రవాణా వాహనాలు నిత్యం వందల సంఖ్యలో తిరుగుతుంటాయి. ఈ దారి పొడవునా వీధి దీపాల వెలుగులే కానరావు. దీంతో రాత్రివేళ పార్కింగ్ చేసిన భారీ వాహనాలను ఢీకొని పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు.

కన్నతల్లిపై పైశాచికం

- తాగిన మత్తులో కొడుకు లైంగిక వేధింపులు.. భరించలేక రోకలితో కొట్టి హత్యచేసిన తల్లి



రాంబాబు (ఫైల్)

పమిడిముక్కల, జూలై 18 : మద్యం మత్తు పేగుబంధానికి పాతరేస్తోంది. వావీవరసలకు సమాధి కడుతోంది. మానవ సంబంధాలనే శాసిస్తోంది. పమిడిముక్కల మండలం తాడంకిలో యువకుడి హత్య కేసే ఇందుకు నిదర్శనంగా నిలిచింది. 24 గంటల్లో ఈ కేసును పోలీసులు తేల్చేశారు. కన్నకొడుకు వికృత్యాన్ని భరించలేక.. తన బిడ్డను తానే హత్య చేసినట్టు తల్లి అంగీకరించింది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ కిషోర్‌బాబు, ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాడంకి బీసీ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి గండికోట రాంబాబు (35) హత్యకు గురయ్యాడు. గుర్తుతెలియని వ్యక్తులు ముసుగులు ధరించి తల్లి పద్మ కాళ్లు, చేతులు కట్టేసి.. నోట్లో గుడ్డలు కుక్కి.. పక్కగదిలో నిద్రిస్తున్న ఆమె కొడుకు రాంబాబు తలపై కొట్టి చంపారన్న ప్రాథమిక సమాచారం మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. తల్లి నుంచి పొంతన లేని సమాధానాలు రావడంతో తనయుడిని ఆమే హత్య చేసినట్టు పోలీసులకు అనుమానం వచ్చింది. ఈ నేపథ్యంలో పద్మను పూర్తిస్థాయిలో విచారణ చేయగా, కొడుకు వేధింపులు తాళలేక తలపై కొట్టి చంపినట్టు ఆమె అంగీకరించింది. ఈ క్రమంలోనే ఆశ్చర్యకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. రాంబాబు మద్యం సేవించి ఆ మత్తులో తల్లి పట్ల తరచూ అసభ్యంగా ప్రవర్తించేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి రాంబాబు మద్యం సేవించి అసభ్యంగా ప్రవర్తించడమే కాక లైంగికంగానూ వేధించాడు. ఆమె తప్పించుకుని చీకట్లో ఓ చోట దాక్కుంది. రాంబాబు తన గదిలోకి వెళ్లి నిద్రించాడు. కొడుకు చేష్టలు భరించలేక ఆ తల్లి రోకలిబండతో అతని తలపై బలంగా మోది చంపింది. హత్య కేసు నుంచి తప్పించుకునేందుకు నవ్వారుతో తన కాళ్లు, చేతులు తానే కట్టుకుని మెడలో తుండు చుట్టుకుని గుర్తుతెలియని వ్యక్తులు చంపినట్టు సృష్టించానని చెప్పింది. ఆమెను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు పోలీసులు తెలిపారు.

రైలుబండి.. కొత్త స్టాపులండి

- విజయవాడ డివిజన్ మీదుగా 40 రైళ్లకు కొత్త హాల్ట్
- ఈనెల 20 నుంచి దశలవారీగా..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : డిమాండ్ కలిగిన స్టేషన్లలో రైళ్లకు హాల్ట్ కల్పిస్తూ దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కారణంగా విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే రైళ్లు కొత్తగా మరో 30 స్టేషన్లలో ఆగనున్నాయి. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో అనేక స్టేషన్లలో రైళ్లు ఆగనున్నాయి. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మొత్తం 69 రైళ్లకు సరికొత్తగా హాల్ట్ ఇవ్వగా, ఇందులో విజయవాడ మీదుగా రాకపోకలు సాగించేవి 40కి పైగా ఉన్నాయి. అయితే, దీనిని ప్రయోగాత్మకంగానే అమలు చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి కొంతకాలం తర్వాత పునరాలోచన చేయాలని రైల్వే అధికారులు నిర్ణయించారు.

హాల్టింగ్ ఇలా..

ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు దశలవారీగా ఆయా రైళ్లలో నూతన హాల్ట్‌ను ప్రారంభించనున్నారు. సికింద్రాబాద్-రాయ్‌పూర్ (రైలు నెంబరు 12771), హెచ్.నిజాముద్దీన్-తిరుపతి (రైలు నెంబరు 12708)కు బెల్లంపల్లిలో హాల్టింగ్ ఇచ్చారు. ఎర్నాకుళం-పాట్నా (రైలు నెంబరు 22699)కు ఖమ్మం స్టేషన్‌లో స్టాపింగ్ ఇచ్చారు. తిరుపతి-సికింద్రాబాద్ (రైలు నెంబరు 12763), విశాఖపట్నం-మహబూబ్‌నగర్ (రైలు నెంబరు 12861)కు మధిర స్టేషన్‌లో స్టాపింగ్ ఇచ్చారు. హెచ్.నిజాముద్దీన్ (రైలు నెంబరు 12708), ఎర్నాకుళం-పాట్నా (రైలు నెంబరు 22699)కు మంచిర్యాల స్టేషన్‌లో హాల్ట్ ఇచ్చారు. బెంగళూరు-దానాపూర్ (రైలు నెంబరు 12295), ఎర్నాకుళం-పాట్నా (రైలు నెంబరు 22699)కు రామగుండంలో స్టాపింగ్ ఇచ్చారు. పూరి-తిరుపతి (రైలు నెంబరు 17479), తిరుపతి-కాకినాడ టౌన్ (రైలు నెంబరు 17249), బిలాస్‌పూర్-తిరుపతి (రైలు నెంబరు 17481)కు చినగంజాం స్టేషన్‌లో హాల్ట్ ఇచ్చారు. గుంటూరు-రాయగడ (రైలు నెంబరు 17243)కు భీమడోలు స్టేషన్‌లో హాల్ట్ ఇచ్చారు. గుంటూరు-నరసాపూర్ (రైలు నెంబరు 17281)కు పుట్లచెరువు స్టేషన్‌లో హాల్ట్ ఇచ్చారు. కాత్రా-కన్యాకుమారి (రైలు నెంబరు 16318)కు గూడూరు జంక్షన్‌లో, విజయవాడ-కాకినాడ పోర్టు (రైలు నెంబరు 17257)కు పసివేదల స్టేషన్‌లో, విజయవాడ-మచిలీపట్నం (రైలు నెంబరు 07866)కు ఉప్పులూరు స్టేషన్‌లో హాల్ట్ ఇచ్చారు. భువనేశ్వర్-సికింద్రాబాద్ (రైలు నెంబరు 17015)ను నడికుడి స్టేషన్‌లో, భువనేశ్వర్-సికింద్రాబాద్ (రైలు నెంబరు 17015)కు పిడుగురాళ్ల, సత్తెనపల్లి స్టేషన్లలో స్టాపింగ్ కల్పించారు. నాగర్‌సోల్-నర్సాపూర్ (రైలు నెంబరు 17232)కు కూడా సత్తెనపల్లి స్టేషన్‌తో పాటు నడికుడి, పిడుగురాళ్ల స్టేషన్లలో హాల్ట్ కల్పించారు. ధర్మవరం-రేపల్లె (రైలు నెంబరు 17216)కు గిద్దలూరు స్టేషన్‌లో, లింగంపల్లి-నర్సాపూర్ (రైలు నెంబరు 17256), చెంగల్‌పట్టు-కాకినాడ (రైలు నెంబరు 17643)కు మంగళగిరి స్టేషన్‌లో హాల్ట్ కల్పించారు. ధర్మవరం-మచిలీపట్నం (రైలు నెంబరు 17216)ను మార్కాపురం రోడ్డు స్టేషన్‌లో, భువనేశ్వర్-సికింద్రాబాద్ (రైలు నెంబరు 17015)కు మిర్యాలగూడ స్టేషన్‌లో, నర్సాపూర్-లింగంపల్లి (రైలు నెంబరు 17255)కు నల్గొండ స్టేషన్‌లో, చెంగల్‌పట్టు-కాకినాడ (రైలు నెంబరు 17643)ను న్యూ గుంటూరు స్టేషన్‌లో హాల్ట్ ఇచ్చారు. యశ్వంత్‌పూర్-మచిలీపట్నం (రైలు నెంబరు 17212)కు కంబం స్టేషన్‌లో హాల్ట్ ఇచ్చారు. నాగర్‌సోల్-నర్సాపూర్ (రైలు నెంబరు 17232)కు మిర్యాలగూడ, నల్గొండలో హాల్ట్ ఇచ్చారు. నాగర్‌సోల్-చెన్నై (రైలు నెంబరు 16004)కు మహబూబ్ నగర్‌లో, సికింద్రాబాద్-రాయ్‌పూర్ (రైలు నెంబరు 17271), రాయ్‌పూర్-సికింద్రాబాద్ (రైలు నెంబరు 17272)కు పెద్దపల్లిలో స్టాపింగ్ ఇచ్చారు. చెన్నై సెంట్రల్-నిజాముద్దీన్ (రైలు నెంబరు 12611), నిజాముద్దీన్-చెన్నై సెంట్రల్ (రైలు నెంబరు 12612)కు వరంగల్‌లో, అహ్మదాబాద్-చెన్నై సెంట్రల్ (12655)కు పెద్దపల్లిలో హాల్ట్ కల్పించారు.



జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్

పార్టీ సభ్యుడికి రూ.5 లక్షల బీమా

▸▸ జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్

వన్‌టౌన్, జూలై 18 : జనసేన పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి దేశంలో ఎక్కడా లేని విధంగా పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించారని, ఇది కార్యకర్తలకు గొప్ప నదుపాయమని పౌరసరఫరాలశాఖ మంత్రి, పార్టీ రాజకీయ కలాపాల చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం విజయవాడ భవానీపురం 40వ డివిజన్‌లోని ఫంక్షన్ హాలులో జనసేన పార్టీ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. ఐదు లక్షల బీమా కల్పించడం పవన్‌కల్యాణ్ గొప్ప మనస్సుకు నిదర్శనమని తెలిపారు. ఈ సందర్భంగా మృతి చెందిన ఇద్దరు జనసైనికుల కుటుంబాలకు బీమా పరిహారం చెక్కులను అందజేశారు. 40వ డివిజన్ జనసేన అధ్యక్షురాలు తిరుపతి అనూష మాట్లాడుతూ, పశ్చిమ నియోజకవర్గంలో పదివేల మందిని సభ్యులుగా చేర్పించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కమిటీ చైర్మన్ కల్యాణం శ్రీనివాసరావు, అమ్మిశెట్టి వాసు, మండలి రాజేష్, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు. మనోహర్‌ను నాయకులు సత్కరించారు.

పెద్దల సభ గౌరవానికే కళంకం..

▸▸ విజయసాయి రెడ్డి తీరుపై కేశినేని శివనాథ్ విమర్శ



నందిగామ, జూలై 18 : నీచమైన కార్యకలాపాలతో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి పెద్దల సభ గౌరవానికి భంగం కలిగిస్తున్నాడని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ విమర్శించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వయస్సును, పదవిని కించపరుస్తూ విజయసాయిరెడ్డి నీచమైన పనులు చేస్తున్నాడన్నారు. చేసిన తప్పుకు సిగ్గుపడాల్సిన ఆయన మీడియాను దూషించడం హేయమన్నారు. ప్రజలకు నిర్భయంగా నిజాలు తెలియజేస్తున్న మీడియా యాజమాన్యాలు, ప్రతినిధులను ఆయన దూషించిన విధానం హేయమన్నారు. వైసీపీలో అటువంటి కీచకులు ఎంతోమంది ఉన్నారని, అదొక సిగ్గుమాలిన పార్టీ అన్నారు. అటువంటి వ్యక్తులు రాజకీయాలలో ఉండడం దారుణమన్నారు. ఇప్పటికైనా విజయసాయిరెడ్డి తనపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని, మీడియాను క్షమాపణలు కోరాలని ఆయన సూచించారు.

సతీష్ రెడ్డికి తెలుగు వైభవ పురస్కారం



అవనిగడ్డ, జూలై 18 : భారత రక్షణ మంత్రి సలహాదారు, డీఆర్డీవో మాజీ చైర్మన్, అంతరిక్ష శాస్త్రవేత్త సతీష్ రెడ్డిని మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారానికి ఎంపిక చేసినట్టు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మండలి వెంకట కృష్ణారావు 99వ జయంతిని పురస్కరించుకుని గాంధీక్షేత్రంలో ఆగస్టు 4వ తేదీన జరిగే కార్యక్రమంలో సతీష్ రెడ్డికి ఈ పురస్కారాన్ని అందించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ పురస్కారం కింద సతీష్ రెడ్డికి లక్ష నగదు, మెమెంటో, ప్రశంసాపత్రం అందిస్తారని తెలిపారు. గతంలో ఈ పురస్కారాన్ని ప్రముఖ సినీ గాయని పి.సుశీల, ప్రపంచ ప్రసిద్ధ కేన్సర్ వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయలు అందుకున్నారని, భారతదేశానికి అబ్దుల్ కలాం తర్వాత ఆయన స్థాయిలో సేవ చేసిన సతీష్ రెడ్డిని ఈసారి మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం అందజేసే అవకాశం రావటం పట్ల బుద్ధప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.



ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)కి వినతి పత్రం ఇస్తున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

రైతుహిత విధానాలు అమలు చేయండి

▸▸ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)కు రైతు సంఘాల వినతి

విద్యాధరపురం, జూలై 18 : రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర రావాలంటే స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేసి రైతుహిత విధానాలను అమలు చేయాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)కు ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి విజ్ఞప్తి చేసింది. గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో సమన్వయ సమితి కన్వీనర్, ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయమంత్రిగా పనిచేసిన వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఏపీ రైతు సంఘం సీనియర్ నేత వై.కేశవరావు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకటగోపాలకృష్ణారావు, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్ర, కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్, సమన్వయ సమితి నాయకులు సింహాద్రి ఝాన్సీ, ఎం.యలమందరావు, మరీదు ప్రసాదబాబు, పీవీ ఆంజనేయులు, చల్లపల్లి విజయ, దడాల సుబ్బారావు, కోగంటి కోటయ్యలు ఎంపీని కలిసిన వారిలో ఉన్నారు. తొలుత ఎంపీకి శుభాకాంక్షలు తెలిపి అనంతరం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందచేశారు. 2020-2021లో జరిగిన రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రాత పూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చుకు అదనంగా 50 శాతం చేర్చి మద్దతు ధర నిర్ణయించాలన్నారు. స్వామి నాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల విధానాన్ని, 2022లో చేసిన విద్యుత్ ప్రైవేటీకరణ చట్టంను రద్దు చేయాలని, వ్యవసాయానికి సంబంధించిన అన్ని వస్తువులపైన జీఎస్టీ రద్దు చేయాలని కోరారు. భూసేకరణ సమయంలో ప్రతి ఏడాదీ పెరిగే ధరలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. రైతులు, కార్మికులకు ఒకేసారి రుణ విముక్తి కలుగ చేయాలన్నారు. రైతుల ఉద్యమంలో చనిపోయిన 736 మంది రైతుల జ్ఞాపకార్థం స్మారక స్థూపం ఏర్పాటు చేయాలని, రైతులపై పెట్టిన కేసులను రద్దు చేయాలని కోరారు. దీనిపై శివనాథ్ స్పందిస్తూ ప్రధాన డిమాండ్లను పార్లమెంట్‌లో ప్రస్తావించడంతోపాటు కేంద్ర వ్యవసాయ మంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు.

వసతి గృహం నుంచి పారిపోయిన ముగ్గురు బాలికలు

▸▸ సెక్యూరిటీ గార్డు చొరవతో నున్న పోలీసులకు అప్పగింత



పాయకాపురం, జూలై 18 : ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం నుంచి పారిపోయిన ముగ్గురు బాలికలు గురువారం నున్న రూరల్ స్టేషన్‌కు చేరారు. ఓ సెక్యూరిటీ గార్డు చొరవ చూపి బాలికలను సురక్షితంగా పోలీసులకు అప్పగించాడు. వెస్ట్ డీసీపీ టి.హరికృష్ణ గురువారం నున్న రూరల్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. డీసీపీ కథనం మేరకు.. నగరానికి చెందిన ముగ్గురు బాలికలు ఆగిరిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్నారు. బాలికలది విజయవాడ కావడంతో అక్కడ ఉండటం ఇష్టం లేక తల్లిదండ్రులను చూడాలని భావించారు. అనుకున్నట్టుగా గురువారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో గుట్టుచప్పుడు కాకుండా వసతి గృహం నుంచి బయటకు వచ్చేశారు. కొంతదూరం నడుచుకుని వచ్చిన తరువాత ఆగిరిపల్లి వద్ద విజయవాడ బస్సు కోసం ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో ఆగిరిపల్లి నుంచి నున్న గ్రామంలోని రిలయన్స్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న కూరపాటి రాజేష్ ముగ్గురు బాలికలను గమనించాడు. వారితో పాటు బస్సు ఎక్కిన రాజేష్ బాలికలతో మాట్లాడి వారు పారిపోతున్నారని తెలుసుకుని బస్సు కండక్టర్, డ్రైవర్లకు చెప్పి అప్రమత్తం చేసి నేరుగా నున్న రూరల్ పోలీసు స్టేషన్ వద్ద బస్సు ఆపి ముగ్గురు బాలికలను పోలీసులకు అప్పగించాడు. డీసీపీ బాలికలతో మాట్లాడి విషయం తెలుసుకుని బాలికల తల్లిదండ్రులకు అప్పగించారు. బాలికలను బాధ్యతగా పోలీసులకు అప్పగించినందుకుగాను డీసీపీ సెక్యూరిటీ గార్డు రాజేష్‌ను సత్కరించి, నగదు బహుమతిని అందజేశారు. అలాగే బాలికలు వసతి గృహం నుంచి వెళ్లిపోవడానికి గల కారణాలను విచారిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సీఐ దుర్గా ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణానికి రక్షణ

▸▸ నగరంలో న్యాయాధికారుల అవగాహన ర్యాలీ



హెల్మెట్ ధరించాలంటూ ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

విజయవాడ లీగల్, జూలై 18 : బెజవాడ బార్ అసోసియేషన్, మండల న్యాయసేవాధికార సంస్థ, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) సంయుక్త అధ్వర్యంలో 'హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి..' అని ప్లకార్డులు ధరించి న్యాయమూర్తులు, న్యాయవాదులు పెద్దఎత్తున సిటీ సివిల్ కోర్టుల నుంచి ఏదో నెంబరు రోడ్డు, మ్యూజియం రోడ్డు, బందరురోడ్డు మీదుగా గురువారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.సత్యానందం, రాష్ట్ర బార్‌కౌన్సిల్ మెంబర్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్‌లు మాట్లాడుతూ, హెల్మెట్ ధరించడం భారం కాదని, అది మనకు ఇచ్చే 'రక్షణ' అని తెలిపారు. 'హెల్మెట్ ధారణ.. ప్రాణానికి రక్షణ' అంటూ న్యాయమూర్తులు, న్యాయవాదులు నినాదాలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు హెల్మెట్ ధరించాలని, లేకుంటే కేసుల నమోదు, భారీ మొత్తంలో జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. ద్విచక్రవాహనంపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరిస్తే అనుకోకుండా ప్రమాదం సంభవిస్తే ప్రాణాపాయం తప్పుతుందన్నారు. జరగబోయే ప్రమాదాలను ముందుగా ఊహించి తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. యజమాని లేకపోతే ఆ కుటుంబం రోడ్డున పడే ప్రమాదముందని హెచ్చరించారు. అందరి క్షేమం కోసం అన్ని ప్రభుత్వ శాఖలు, కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు కలిసి వాహన చోదకులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు సత్యానందం, అజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో న్యాయాధికారులు, బెజవాడ బార్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగెల శివరాంప్రసాద్ (రాజా), ఉపాధ్యక్షుడు గండూరి రామశర్మ, న్యాయవాదులు పాల్గొన్నారు.

సహ పాఠ్య బోధనతో సమగ్రాభివృద్ధి

▸▸ ఉన్నత కెరీర్ దిశగా విద్యార్థులకు మార్గనిర్దేశనం చేయాలి

▸▸ సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన పెంపొందించాలి

▸▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

విజయవాడ లీగల్, జూలై 18 : టీచింగ్ ప్లాన్ ప్రకారం విద్యార్థులకు విద్యానైపుణ్యాలు అందించడంతో పాటు వారి సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడే సహపాఠ్య కార్యక్రమాల ద్వారా జీవన నైపుణ్యాలు అందించాలని, ఇందుకు ప్రత్యేక షెడ్యూల్‌ను అనుసరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆమె పాఠశాల విద్య, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ శాఖల పరిధిలో ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమాలు, పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అత్యుత్తమ బోధన ప్రణాళిక ద్వారా విద్యను అందించడంతో పాటు కో-కరిక్యులం కార్యక్రమాల ద్వారా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో ఉన్నత కెరీర్‌ను సొంతం చేసుకొనేందుకు అందుబాటులో వున్న అవకాశాలు, మార్గాలు, లక్ష్య సాధనకు అనుసరించాల్సిన ప్రణాళిక తదితరాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యకర జీవన విధానంపై దృష్టిసారించేలా సేంద్రీయ వ్యవసాయంపైనా అవగాహన పెంపొందించాలన్నారు. పాఠశాలలో అందుబాటులో ఉన్న స్థలాన్ని సద్వినియోగం చేసుకొనేలా కిచెన్ గార్డెనింగ్‌లో 6వ తరగతి, ఆపై తరగతుల విద్యార్థులను భాగస్వాములను చేయాలన్నారు. ఇలాంటి కార్యకలాపాల్లో భాగస్వాములు కావడం వల్ల విత్తన నిర్వహణ, మృత్తికా సంరక్షణ, సేంద్రీయ ఎరువులు, ఆరోగ్యవంతమైన పంట ఉత్పత్తులు ఇలా వివిధ అంశాలపై అవగాహన పెంపొందించుకొనేందుకు వీలుంటుందన్నారు. వివిధ విభాగాల్లో నిపుణులను ఆహ్వానించి, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా జిల్లాలోని 1,475 అంగన్వాడీ కేంద్రాల్లో అందుబాటులో వున్న స్థలం ఆధారంగా కిచెన్ గార్డెన్‌ను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. స్థలం అందుబాటులో లేకుంటే గ్రో బ్యాగ్స్ ద్వారా ఆకుకూరలను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైరిస్క్, రక్తహీనత సమస్య వున్న గర్భిణులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. బాల్య వివాహాలు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్ తదితర అంశాలపై షెడ్యూల్ ప్రకారం పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సృజన ఆదేశించారు. సమావేశంలో డీఈఓ యూవీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షా సమావేశంలో కలెక్టర్ సృజన

పర్యాటకం, క్రీడల అభివృద్ధికి ప్రత్యేక కృషి

కృష్ణలంక : ప్రజలకు ఆహ్లాదాన్ని పంచడంతో పాటు ఆర్థిక వ్యవస్థ, ఉపాధికి చోదక శక్తిగా పర్యాటక రంగం నిలుస్తోందని, అదేవిధంగా క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని, ఈ నేపథ్యంలో పర్యాటక, క్రీడారంగాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేయనున్నట్టు కలెక్టర్ జి.సృజన తెలిపారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో పర్యాటకం, క్రీడా రంగాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలు, క్రీడా మైదానాలు, శిక్షణ జరుగుతున్న తీరు తదితరాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పర్యాటకులను ఆకర్షించేందుకు ఆయా ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. కొండపల్లి ఫోర్ట్ ట్రెక్కింగ్ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా కొండపల్లి బొమ్మల కళాకారులను ప్రోత్సహించేలా, ఆ కళకు మరింత ఆదరణ లభించేలా ఆ ప్రాంతాన్ని టూరిజం కోణంలో అభివృద్ధి చేయాలని, ఇందుకు సరైన కార్యాచరణతో ముందుకెళ్లాలన్నారు. అదేవిధంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో వివిధ క్రీడల్లో అందిస్తున్న శిక్షణ, అందుబాటులో వున్న కోచ్‌లు, మౌలిక వసతులపై చర్చించి క్రీడారంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. త్వరలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియాన్ని సందర్శించనున్నట్టు తెలిపారు. విద్యాధరపురం స్టేడియం అభివృద్ధి ప్రణాళిక, డీఎస్ఏ పరిధిలోని మైదానాల వినియోగం తదితరాలపై సమావేశంలో చర్చించారు. జిల్లా టూరిజం అభివృద్ధి అధికారి బి.గోపాల్, డివిజనల్ మేనేజర్ (విజయవాడ) కృష్ణచైతన్య, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఎస్ఏ అజీజ్ పాల్గొన్నారు.

ప్రాణాలు బలిగొనేంత.. లాభాలు కావాలా!

▸▸ మనుషులను చంపి.. మీ బిడ్డలకు కూడు పెడతారా?

▸▸ చట్టానికి అతీతంగా వెళితే శిక్షపడేలా చేస్తాం

▸▸ క్వారీ లీజుదారులతో కలెక్టర్ సృజన ప్రత్యేక సమావేశం

▸▸ పరిటాల ఘటన నేపథ్యంలో లీజుదారులకు తీవ్ర హెచ్చరికలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): 'మనుషులను బలిచేసేంత లాభాలు కావాలా? పాప పుణ్యాలు అనేవి మీకు ఉండవా? మనం కూడా మనుషులమే! మనకూ కుటుంబాలు ఉన్నాయి కదా! ఇంకొకరిని బలి తీసుకుని మనింట్లో వారికి అన్నం పెట్టాలనుకోవాలన్న ధోరణి ఏమిటి? మనుషులను చంపి ఆ డబ్బును మన కుటుంబాలకు పెడదామా? ఇది ఎంత వరకు మీకు సమంజసం? అందరినీ మేనేజ్ చేద్దామనుకుంటే కుదరదు.. క్వారీయింగ్‌లో తప్పు జరిగితే సహించేది లేదు. చట్టానికి అతీతంగా వెళితే శిక్ష పడేలా చేస్తాం' అంటూ క్వారీ లీజుదారులపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన నిప్పులు చెరిగారు. పరిటాల శివారు క్వారీలో ఇటీవల జరిగిన దుర్ఘటన నేపథ్యంలో, జిల్లా వ్యాప్తంగా ఉన్న క్వారీ లీజుదారులతో గురువారం రాత్రి కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. క్వారీ దుర్ఘటనలో ముగ్గురు కార్మికులు మృతిచెందటం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తూ క్వారీ లీజుదారుల చర్యలపై భగ్గుమన్నారు. వ్యాపారం లాభం కోసం చేస్తారు కానీ, మనుషులను బలిచేసేంత వ్యాపారం చేస్తారా అని నిలదీశారు. క్వారీయింగ్‌లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని చెప్పారు. చట్టానికి వ్యతిరేకంగా ఏ చర్య జరిగినా శిక్షపడేలా చేస్తానన్నారు. అందరినీ మేనేజ్ చేద్దామనుకుంటే కుదరదన్నారు. ఇకపై క్వారీయింగ్‌లో మానవ తప్పిదం జరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో 154 క్వారీలు నమోదై ఉన్నాయని, వీటిలో 69 క్వారీలలో రోడ్ మెటల్‌కి సంబంధించిన కార్యకలాపాలు జరుగుతున్నాయని, మిగిలిన 85 క్వారీలలో ఎలాంటి కార్యకలాపాలు సాగటం లేదన్నారు. క్వారీల పరిశీలన కోసం విధిగా చివరి వరకు రోడ్డు ఉండాల్సిందేనన్నారు. ప్రతి క్వారీకి సెల్ఫ్ ఆడిట్ తప్పనిసరన్నారు. రక్షణాత్మకంగా నిర్వహించలేని క్వారీలను నిలుపుదల చేస్తామన్నారు. క్వారీ దారులకు వారం రోజులు సమయం ఇస్తున్నామని, ఈ లోగా రక్షణకి సంబంధించి తీసుకున్న చర్యలపై నివేదికను గనుల శాఖకు అందచేయాలన్నారు. క్వారీలలో పనిచేసే కార్మికులు , ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల పూర్తి వివరాలు రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. మైనింగ్ నిబంధనల ప్రకారం ఉండాల్సిన రిజిస్టర్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సేఫ్టీ ఆడిట్ తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ సమావేశం గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జీ వెంకటేశ్వర్లు, ఏడీ కే వీరాస్వామి తదితరులు ఉన్నారు.

బాబోయ్.. కర్మాగారాలు!



▸▸ సిమెంట్ ఫ్యాక్టరీలో వాహనం ఢీకొని కార్మికుడి మృతి

▸▸ వరుస ప్రమాదాలతో గ్రామస్థుల ఆందోళన

జగ్గయ్యపేట రూరల్, జూలై 18 : సిమెంట్ కర్మాగారాలలో వరుస ప్రమాదాలపై స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ఫ్యాక్టరీలలో రోజువారీ కూలీలు మృతి చెందటంపై కర్మాగారాల నిర్వహణను ప్రజలు సందేహిస్తున్నారు. గత వారం బూదవాడలోని అల్ట్రాటెక్ కర్మాగారంలో బాయిలర్ పేలిన ఘటనలో 16 మందికి తీవ్ర గాయాలు కాగా వారిలో నలుగురు మృతి చెందిన ఘటన తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానికంగా రామ్‌కో సిమెంట్స్‌లో ప్రమాదంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. రూ.కోట్లు వెచ్చించి కర్మాగారాలు నిర్మిస్తున్న యాజమాన్యాలు అదేస్థాయిలో కార్మికుల ప్రాణాలు, వారి కుటుంబాలకు విలువ ఇవ్వటం లేదని ఆరోపిస్తున్నారు. కర్మాగారం ఉన్న గ్రామాలలో సింహ భాగం గిరిజన ఆవాస ప్రాంతాలు కావటం కర్మాగారాలకు కల్పవృక్షంలా మారింది. విద్యార్హత, పనులపై స్కిల్ లేని కార్మికులను తక్కువ వేతనానికి తీసుకుంటూ తమ పబ్బం గడుపుకునేందుకు స్థానిక నాయకుల చెప్పు చేతుల్లో ఉండే కాంట్రాక్టర్లను ప్రోత్సహిస్తున్నారు. తక్కువ వేతనానికి వచ్చే వారినే కాంట్రాక్టర్‌లు పనులకు పంపుతుండటంతో తరచు ప్రమాదలు జరుగుతున్నాయి.

ఒక విధంగా కర్మాగారాలు రాజకీయ నాయకులకు పునరావాస కేంద్రాలుగా మారాయనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. రామ్‌కో సిమెంట్స్‌లో 70 మందికిపైగా కాంట్రాక్టర్‌ల అవతారమెత్తిన వ్యక్తులు ఆయా రాజకీయ పార్టీల నాయకుల అనుచరులే. వీరు రోజుకు 2000ల మందికి పైగా కార్మికులను కర్మాగారాలలోని పనులకు పంపుతున్నట్టు సమాచారం. పనుల పట్ల వారికి అవగాహన లేకపోవటంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మికులు అంటున్నారు.

నాగులు (45)కు భార్య జ్యోతి ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తె సంధ్య ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా రెండవ కుమార్తె దివ్యకు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. కుమారుడు నరసింహ ఇంటర్ పూర్తి చేసుకునిపై చదువులకు తయారవుతున్నాడు. భార్య జ్యోతి కూడా కూలీ పనులకే వెళ్తుంది. సంధ్యకు వివాహం కుదిరిందని మరో 15 రోజుల్లోనే ముహూర్తం నిర్ణయించటమైందని, పనుల్లో కుటుంబసభ్యుల తలమునకలు కాగా కుటుంబ పెద్ద మృతి చెందటం విషాదాన్ని నింపింది.

కర్మాగారంలో వాహనం ఢీకొని కార్మికుడి మృతి

జగ్గయ్యపేట రూరల్, జూలై 18 : రామ్‌కో సిమెంట్స్ కర్మాగారంలో గురువారం రోజువారీ కూలీ మూడు నాగులు (45)ను కర్మాగారంలో క్లీనింగ్ చేసే వాహనం ఢీకొనటంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని విజయవాడ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

ప్రధాన గేటు ఎదుట గ్రామస్థుల ఆందోళన

జయంతిపురం గ్రామానికి చెందిన నాగులు మృతిపై గ్రామస్థులు రామ్‌కో సిమెంట్స్‌కు చెందిన ధర్మవరప్పాడుతండా గ్రామంలోని ప్రధాన గేటు ఎదుట నాగులు కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఆందోళన చేశారు. సమాచారం తెలుసుకున్న సీఐ జానకిరామ్, ఎస్ఐ సతీష్‌లు కర్మాగారం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్డీవో రవీంద్రరావు, తహసీల్దార్ శేషగిరిలు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.



న్యాయం కోరుతూ కర్మాగారం ఎదుట గ్రామస్థుల ఆందోళన



ఎంపీడీవో కోసం గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

ఎంపీడీవో కోసం ప్రత్యేక బృందాల గాలింపు

▸▸ కొనసాగుతున్న ఎన్డీఆర్ఎఫ్ సెర్చ్ ఆపరేషన్

▸▸ డీఐజీ పర్యవేక్షణలో కృష్ణా ఎస్పీ దర్యాప్తు

పెనమలూరు, జూలై 18 : పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవోగా విధుల నిర్వహిస్తూ అదృశ్యమైన మండవ వెంకట రమణారావు కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్టు కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు గురువారం తెలిపారు. ప్రాథమిక దర్యాప్తు మేరకు రమణారావు మాధవాయిపాలెం ఫెర్రీ విషయంలో 55 లక్షల బకాయిల విషయంలో తీవ్ర ఒత్తిడికి గురైనట్టు తెలిసిందని ఎస్పీ తెలిపారు. అలాగే కొన్ని ఫోన్‌ల నుంచి కాల్స్ వచ్చినట్టు, ఆ కాల్స్ విషయంలో మరింత ఒత్తిడికి గురైనట్టు, కొంత డబ్బును ఆ కాలర్స్‌కు బ్యాంకు ద్వారా జమ చేసినట్టు తెలిసిందన్నారు. వీటన్నింటి మీద పూర్తి స్థాయి దర్యాప్తు జరుగున్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తు, గాలింపు చర్యలకు ప్రత్యక్ష పర్యవేక్షణలో నలుగురు డీఎస్పీలు, నలుగురు సీఐలు, 15 మంది ఎస్సైలు, 150 మంది సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. ఈ మొత్తం దర్యాప్తును పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీఅద్నాన్ నయీం అస్మి సహకారంతో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ పర్యవేక్షిస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. అదృశ్యమైన ఎంపీడీవో సమాచారాన్ని 9440797400, 9440627051, 9491063910 నంబర్లకు తెలియపరచాలని కోరారు.



దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి

వన్‌టౌన్, జూలై 18 : రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు కుటుంబసభ్యులతో కలిసి గురువారం దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో రామారావు ఆయనకు ఆలయ మర్యాదలు కల్పించగా దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం, ఆశీస్సులు అందచేశారు.

అమ్మవారిని దర్శించుకున్న పాండిచ్చేరి హోంమంత్రి

పాండిచ్చేరి హోంమంత్రి ఎ.నమశ్శివాయం కుటుంబసభ్యులతో కలిసి గురువారం దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం, ఆశీస్సులు అందజేశారు.

విజయవాడ మొగల్రాజపురం బీఎం రావు వీధికి చెందిన జేఎం కృష్ణారావు కుటుంబసభ్యులతో కలిసి దుర్గగుడిలో అన్న వితరణకు రూ. 1,11,111లు విరాళం చెక్కును ఈవో రామారావు ద్వారా ఆలయానికి అందజేశారు. కోట ఉమాదేవి రూ 50,116 అన్న వితరణకు విరాళం అందజేశారు.

గురుకులాల్లో పార్ట్‌టైం టీచర్ల నియామకం

విజయవాడ లీగల్, జూలై 18 : ఉమ్మడి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో పార్ట్ టైం గెస్ట్ టీచర్ల భర్తీ కోసం ఈనెల 23వ తేదీన జిల్లా సమన్వయ అధికారి కార్యాలయంలో డెమో నిర్వహించనున్నట్టు జిల్లా సమన్వయ అధికారి కె.ప్రేమావతి తెలిపారు. ఖాళీల వివరాలు.. కృష్ణారావుపాలెం (బాలురు) జెఎల్ కెమిస్ట్రీ, జెఎల్ ఫిజిక్స్, రుద్రవరం (బాలురు) జెఎల్ కెవిఎస్ట్రీ, టీజీటీ ఇంగ్లీష్, మోటూరు (బాలికలు) జేఎల్ కెవిఎస్ట్రీ, పీజీటీ మాథ్స్, పీఈటీ, రంగాపురం (బాలికలు) టీజీటీ ఇంగ్లీష్, ముప్పాళ్ల (బాలికలు) హెచ్ఎస్, పీజీటీ మాథ్స్, జెఎల్ ఇంగ్లీష్, జెఎల్ జువాలజీ, నర్సాపురం (బాలికలు) పీఈటీ, తిరువూరు (బాలురు) పీఈటీ, జెఎల్ బోటనీ, బల్లిపర్రు (బాలికలు) పీజీటీ, తెలుగు, చల్లపల్లి (బాలికలు) జెఎల్ కెమిస్ట్రీ.

అర్హతలు : బీఈడీ, పీజీ, టెట్ పూర్తి అయిన వారు మాత్రమే అర్హులు. పీఈటీ పోస్టుకు బీపీఈడీ అర్హత, హెచ్ఎస్ పోస్టుకు జీఎన్ఎం అర్హత కలిగి వుండాలి. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాను జిల్లా సమన్వయ అధికారి కార్యాలయం, స్టేట్ గెస్ట్ హౌస్ కాంపౌండ్, గోపాల రెడ్డి రోడ్డు, సీఎస్ఐ చర్చి ఎదురు, విజయవాడ నందు ఇవ్వాలి. బాలుర పాఠశాలకు బాలురు పార్ట్ టైం గెస్ట్ టీచర్లను మాత్రమే తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

కృష్ణా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా శ్రీనివాసరావు



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం జీవోఆర్‌టీ నెంబరు 122 జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఆయన కృష్ణా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొంది. కాకినాడ జేఎన్‌టీయూలో 1999లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరారు. ప్రతి పనిలోనూ పారదర్శకంగా ఉండే శ్రీనివాసరావును కూటమి ప్రభుత్వం ఎంచుకుని మరీ కృష్ణా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా నియమించినట్టు సమాచారం. ఈనెల 20వ తేదీన కృష్ణా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపడతానని ఆయన తెలిపారు. కాకినాడ జెఎన్‌టీయూలో పనిచేస్తున్న శోభన్‌బాబు ప్రస్తుతం కృష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. కృష్ణా యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌లు ఇద్దరూ కాకినాడ జేఎన్‌టీయూ నుంచి వచ్చినవారే కావడం గమనార్హం. ఇప్పటివరకు వీసీగా పనిచేసిన జ్ఞానమణి ఏడాదికాలం పాటు పనిచేశారు. గతంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ రామ్మోహనరావు ఏడునెలల పాటు కృష్ణా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా పనిచేశారు.

నూతన వీసీకి సమస్యల స్వాగతం

కృష్ణా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా వస్తున్న శ్రీనివాసరావుకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. కృష్ణా యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలో ఎంబీఏ తుది పరీక్షా ఫలితాలను వెల్లడించకుండా మూడునెలలుగా నిలిపివేశారు. 42 మంది విద్యార్థులు పరీక్షా ఫలితాలను విడుదల చేయాలని కోరుతున్నా పట్టించుకునేవారు లేరు. దీంతో పాటు యూనివర్సిటీలో బాలుర, బాలికల వసతిగృహాలు, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల భవనాల పనులు నిలిచిపోయాయి. రెండు సంవత్సరాలుగా ఈ పనులు నిలిచిపోయినా గతంలో పనిచేసిన వీసీలు, రిజిస్ట్రార్‌లు అంతగా పట్టించుకోలేదు. బిల్లులు మాత్రం చెల్లించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 123, 133
చికెన్ విత్ స్కిన్	218
చికెన్ స్కిన్‌లెస్	228

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భారతీనగర్, జూలై 18 : విద్యుత్‌లైన్లు మరమ్మతుల కారణంగా రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనగర్ కాలనీ, నోవాటెల్ హోటల్ వెనుక రోడ్డు, సర్వీస్ రోడ్డు, సమోసా కంపెనీ ఏరియా, అక్కినేని ఉమెన్స్ హాస్పిటల్, చందమామ హాస్పిటల్ ఏరియా, న్యూ పీ అండ్ టీ కాలనీ, విద్యుత్ కాలనీ, సాయిబాబా గుడి ఏరియా, ఎస్‌బీహెచ్ కాలనీ, ఎన్టీఆర్ సర్కిల్, భద్రయ్య నగర్, నిర్మలా కాన్వెంట్ రోడ్డు, కేపీ నగర్, సాయినగర్ ట్రెండ్ సెట్ మాల్ బ్యాక్ సైడ్, నేషనల్ హైవే సైడ్ రోడ్డు, పీవీపీ మాల్ ఏరియా, శంకర్ నేత్రాలయం, గాయత్రి నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్

చిట్టినగర్, జూలై 18: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ ఏ.మహేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు హెల్త్ సెక్రటరీలు ఇంటింటికి వెళ్లి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు.

గురువారం ఇన్‌చార్జి కమిషనర్ అధికారులతో కలసి నగరంలోని పలు డివిజన్లలో పారిశుధ్య పనులను పరిశీలించారు. 50వ డివిజన్ గొల్లపాలెంగట్టు పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. రాణిగారితోట, శ్రీనివాస్‌నగర్ కాలనీల్లో పర్యటించి కింద పడ్డ చెట్టు కొమ్మలను తొలగించాలని ఆదేశించారు. 16వ డివిజన్ కళానగర్, 18వ డివిజన్ రామాలయంవీధి తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. డ్రెయిన్లలో పూడికతీత పనులు నిర్వహించాలన్నారు.

రోడ్లపై ఉన్న ఆవులను షెడ్డులకు తరలించాలని, ఆవులను వదిలేసిన యజమానులకు జరిమానా విధించాలని ఆదేశించారు. 51వ డివిజన్‌లో పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, శానిటరీ సూపర్‌వైజర్ ఓబేశ్వరరావు, పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



మురుగు నీటిపారుదలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్

నగర సర్వతోముఖాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గుణదల, జూలై 18: ఏపీకి రాజధాని నగరంగా విజయవాడ నగరం రూపు దిద్దుకుంటుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. నాల్గవ డివిజన్లోని హరిజనవాడలో సమస్యలు తెలుసుకునేందుకు గురువారం ఇంటింటికి వెళ్లారు. విజయవాడ నగరాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయడానికి టీడీపీ ప్రభుత్వం రూపకల్పన చేస్తుందని చెప్పారు. ప్రధానంగా రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థపై దృష్టి పెడుతున్నామని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి రావడం, ఎంపీ కేశినేని చిన్ని చొరవతో స్మార్మ్ నిధులు రప్పించి నగరంలో అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తామని చెప్పారు. కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, వెలగలేటి విజయ కుమార్, తుల్లూరి సురేష్, క్రిష్టాఫర్, నాగరాజు, నాని, రవి, యలమంచలి పండు, గద్దె రమేష్, చలసాని రమణ, వీఎంసీ సీసీ సామ్రాజ్యం, ఏతే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిట్టినగర్ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో
నేటి నుంచి శాకంబరీ ఉత్సవాలు



చిట్టినగర్, జూలై 18: స్థానిక చిట్టినగర్ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 19 నుంచి 21 వరకు శాకంబరీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షకార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిల్లా శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాలు సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని కాయగూరలతో అలంకరించడం జరుగుతుందని తెలిపారు. ఐదుకిలో పలువురు భక్తులు కూరగాయలను అందజేశారని తెలిపారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

గుణదల, జూలై 18: ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కానిస్టేబుల్ మారెపోగు మోహన్‌రావు కుటుంబానికి యాక్సిస్‌బ్యాంకు తరపున రూ. 64లక్షల ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు తెలిపారు. సీపీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో కమిషనరేట్ పరిధిలోని సిటీ ఆర్మ్‌డ్ రిజర్వులో విధులు నిర్వహిస్తున్న మారెపోగు మోహనరావు మార్చి 28న విధులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు సీపీ చెప్పారు. ప్రమాద బీమా కింద రూ. 60లక్షలు, పిల్లల చదువుల నిమిత్తం రూ. 4లక్షలు మొత్తం కలిపి రూ. 64 లక్షలు యాక్సిస్ బ్యాంక్ నుంచి అందజేసినట్లు తెలిపారు. అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, ఏవో రంగారావు ఏఆర్ ఏసీపీ కృష్ణంరాజు, యాక్సిస్ బ్యాంక్ క్లస్టర్ హెడ్ మురళి, బీఎం ప్రదీప్, సీఎస్ఎం కె.వి.ప్రసన్న కుమార్, బీఆర్వో మహేష్, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సోమయ్య, ఏపీ పోలీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు నాగిని పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత ఉమెన్ చాందీకి ఘన నివాళి



గవర్నర్‌పేట, జూలై 18: ఏపీసీసీ, సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం కేరళ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉమెన్ చాందీ ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఆంధ్రరత్న భవన్‌లో జరిగింది. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, పీసీసీ ఉపాధ్యక్షుడు వి. గుర్నాథం చాందీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా చాందీ చేసిన సేవల్ని గుర్తు చేశారు. పీసీసీ సభ్యులు షేక్ అన్సారీ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్, లీగల్ సెల్ స్టేట్ సెక్రటరీ కండెల వరప్రసాద్, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జి.ఉమామహేశ్వరరావు, నగర కార్యదర్శి సీహెచ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ సమస్య పరిష్కరించండి

● ఎమ్మెల్యే బొండా ఉమాకు బాలస్వామి వినతి



గవర్నర్‌పేట, జూలై 18: యాభై సంవత్సరాల క్రితం వేసిన డ్రెయినేజీ పైప్ లైన్ సిస్టమ్ తరచూ ఇబ్బందులు పెడుతున్నందున 23వ డివిజన్ పరిధిలో నిత్యం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సమస్య తలెత్తుతోందని, పైప్‌లైన్ మార్చడం ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. గురువారం 23వ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనపై ఎమ్మెల్యేకు బాలస్వామి వినతిపత్రం అందజేశారు.

గురుపౌర్ణమికి సాయిబాబా ఆలయం సిద్ధం



భవానీపురం, జూలై 18: హెచ్‌బీ కాలనీ సంకల్పసిద్ధి షిర్డీ సాయిబాబా ఆలయంలో శుక్రవారం నుంచి జరగనున్న గురుపౌర్ణమి వేడుకలకు ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం బంగారు కిరీటానికి పాలాభిషేకం చేసి వేడుకలను ప్రారంభిస్తారు. 21న గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, 8 నుంచి 10వేల మందికి భారీ అన్నదానం నిర్వహించి, బాబాను సాయంత్రం ఘనంగా పురవీధుల్లో ఊరేగించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు తెలిపారు. 19, 20 తేదీల్లో ప్రతి రోజు 2వేల మందికి అన్నదానం చేస్తామన్నారు.

దక్షిణామూర్తికి ప్రత్యేక అర్చన



వన్‌టౌన్, జూలై 18: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో నెలకొన్న దక్షిణామూర్తి స్వామికి గురువారం సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. మంత్రపుష్పం, మంగళహారతులు, స్వస్తి, శాంతి మంత్ర పఠనాలతో ఘనంగా స్వామిని అర్చించారు.

ప్రకటన

నా క్లయింట్లు 1.పోతల శ్రీనివాసరావు గారి కుమార్తె పోతల జ్యోత్స్న, వయస్సు 47 సం.రాలు, నివాసం: డోర్ నెం.28-15-6, దాసువారి వీధి, అరండల్‌పేట, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా. 2. అమరపల్లి సుష్మ, భర్త. ఏ.వి.వి.ఆర్. శ్రీనివాస్ గారు, వయస్సు: 42 సం.రాలు, నివాసం: డోర్ నెం.20-3/1-89ఎ, ఫస్ట్ లైన్, అయోధ్య నగర్, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా వారలు సంబాయిషి పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కృష్ణా జిల్లా, ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ టౌన్, మొఘల్ రాజపురం, గద్దె టవర్, డోర్ నెం. 40-6/2-17 మరియు 18లు కాపురస్థులైన శ్రీ గద్దె కోటేశ్వరరావు గారి కుమారుడు శ్రీ గద్దె సురేష్ గారు వారి తల్లిగారైన గద్దె కమలకుమారి అలియాస్ కమలాదేవి గారి వీలునామా రీత్యా సంక్రమించిన ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి (ఇండ్ల స్థలము) నా క్లయింట్లు ఇరువురు కొనుగోలు చేయుటకు ఏర్పాటు చేసుకుని కొంత సొమ్మును బయానాగా చెల్లించి విక్రయ ఖరారు పొందియున్నారు. కావున షెడ్యూలు దాఖలా స్థిరాస్తిపై ఎవరికైనను ఏ విధమైన అభ్యంతరములు, క్లెయిములు, తనఖాలు, భాగలబ్ధ తగాయిదాలు, కోర్టు వ్యవహారములు మరి ఏ విధమైన చెల్లదగు లావాదేవీలు ఏమైనా ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలోగా తగిన ఆధారములతో లిఖిత పూర్వకముగా రిజిస్టరు పోస్టు ద్వారా ఈ క్రింది తెలిపిన మా అడ్రస్‌కు పంపగలరు. గడువు లోపు ఏ విధమైన అభ్యంతరములు రాని యెడల షెడ్యూలు ఆస్తిని నిర్వివాద ఆస్తిగా భావించి మా క్లయింట్లు వారి పేరున గానీ, వారి అనుమతి పొందిన వార్ల పేరున గానీ రిజిస్ట్రేషన్ పొందగలరు. గడువు దాటిన తరువాత వచ్చు ఎట్టి అభ్యంతరములు మా క్లయింట్లను గానీ, షెడ్యూలు ఆస్తిని గానీ బైండ చేయజాలవు. **షెడ్యూలు:** ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రిజిస్ట్రార్ జిల్లా, గుణదల సబ్ రిజిస్ట్రార్ వారి యిలాఖా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలోని, విజయవాడ టౌన్ బాగీరు మాచవరం లోని ఆస్తికి ఎన్‌టీఎస్ నెం.5, రెవెన్యూ వార్డు నెం.16, బ్లాక్ నెం.4, ప్లాట్ నెం.86 మరియు 87 (పార్ట్) దాఖలా **హద్దులు: తూర్పు:** గద్దె ప్రసన్న వగైరాలు ఇతరులకు విక్రయించిన ఆస్తి, అ.48.0లు, **దక్షిణం:** ప్లాటు నెం. 85, అ.52.0లు, **పడమర:** అ.30.0లు వెడల్పు గల రోడ్డు, అ.48.0లు, **ఉత్తరం:** గద్దె కోటేశ్వరరావు గారి ఆస్తిలో కొంత భాగం, అ.52.0లు. ఈ నాలుగు హద్దుల మధ్య చ.గ. 277.35 ఖాళీ నివేశన స్థలము స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలము. సదరు స్థలము యావత్ యీజిమెంట్ హక్కులతో సహా.

ఆర్.వి. సుబ్బారావు, న్యాయవాది.
కేరాఫ్. బెజవాడ బార్ అసోసియేషన్, విజయవాడ
సెల్: 9393037788, 9397837028
విజయవాడ తేది.17-07-2024

ద్విచక్రవాహనం చోరీ

అజిత్‌సింగ్‌నగర్, జూలై 18 : ద్విచక్రవాహనం చోరీ జరిగిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం అమరావతి కాలనీలో ఉంటున్న కందుల పద్మజ ఈనెల 16న ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చింది. ఇంటి బయట వాహనాన్ని పార్క్ చేసి లోపలికి వెళ్లింది. 17న ఉదయం చూడగా ద్విచక్రవాహనం కనిపించలేదు. చుట్టు ప్రక్కల ప్రాంతాలు వెతికినా ద్విచక్రవాహనం కనిపించకపోవడంతో అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పాములు పట్టుకునే వారిని రప్పిస్తాం

వన్‌టౌన్, జూలై 18: కొత్తపేట కొండప్రాంతం అడ్డరోడ్డులో గురువారం శుభోదయం ప్రజాదర్బార్ నిర్వహించారు. స్థానికులు పలువురు తమ నివాసాలలో పాములు తిరుగుతున్నాయని చెప్పడంతో నులకపేట నుంచి పాములు పట్టుకునే వారిని రప్పించి రక్షణ కల్పిస్తామని 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన పరిసరాల పరిశుభ్రత గురించి చెప్పారు. డివిజన్ సెక్రటరీ గోలి శ్రీనివాస్, రామకృష్ణ, బాబూరావు సతీష్, రాఘవ, శంకర్ పాల్గొన్నారు.

నిత్యావసరాలు వితరణ



భవానీపురం, జూలై 18 : అనారోగ్యంతో బాధపడుతున్న జోజినగర్ వాసి యర్రసాని విజయరాజు కుటుంబానికి గురువారం అమ్మసేవా చారిటబుల్ ట్రస్ట్ నెలకు సరిపడా నిత్యావసర సరకులు వితరణ చేసింది. ట్రస్ట్ నిర్వాహకులు రాళ్లపల్లి మాధవ, షేక్ గాలీషా, వీరారెడ్డి, గౌరీ, మస్తాన్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

స్టేట్ ఆడిట్ విభాగానికి బదిలీ అయిన నరసింహామూర్తికి సత్కారం



చిట్టినగర్, జూలై 18 : వీఎంసీ అకౌంట్స్ ఆఫీసర్ నరసింహామూర్తి స్టేట్ ఆడిట్ విభాగానికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో గురువారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఇన్‌ఛార్జి కమిషనర్ డాక్టర్ ఎ. మహేష్ హాజరై సత్కరించారు. నూతన అకౌంట్స్ ఆఫీసర్‌గా బి. సత్యనారాయణ మూర్తికి బాధ్యతలను అప్పగించారు. ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

ఇస్కాన్ రథఫెస్ట్‌లో నలంద విద్యార్థుల ప్రతిభ



గవర్నర్‌పేట, జూలై 18: రథఫెస్ట్ -2024 పోటీల్లో ప్రతిభ చాటిన నలంద విద్యానికేతన్ విద్యార్థుల అభినందన కార్యక్రమం గురువారం స్కూల్ ప్రాంగణంలో జరిగింది. ఇస్కాన్ శ్రీ జగన్నాథ్ మందిర్ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో భాగంగా జరిగిన వివిధ పోటీల్లో నలంద విద్యానికేతన్ విద్యార్థులు టాపర్స్‌గా నిలిచినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. ఓకల్ మ్యూజిక్ జూనియర్, సీనియర్, మ్యూజిక్ బ్యాండ్ విభాగాల్లో మొదటి బహుమతిని, సోలో డ్రామా, ఫ్యాన్సీ డ్రెస్, వెస్ట్రన్ డాన్స్ రెండు విభాగాలు, స్టోరీ రైటింగ్, క్విజ్, ఆర్ట్ విభాగాల్లో మొదటి బహుమతిని గెలుచుకున్నట్లు వివరించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరూ బహుమతులు సాధించడం అభినందనీయమన్నారు

అన్న క్యాంటీన్‌కు మరమ్మతులు

● ఆగస్టు 15న ప్రారంభం



ఆర్టీసీ వర్క్ షాపు రోడ్డులో ముస్తాబవుతున్న అన్న క్యాంటీన్

భవానీపురం, జూలై 18 : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అన్న క్యాంటీన్ పునః ప్రారంభోత్సవంలో భాగంగా ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులోని అన్న క్యాంటీన్‌ను వినియోగంలోకి తీసుకురావడానికి మరమ్మతు పనులు గురువారం ప్రారంభం అయ్యాయి. వీఎంసీ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో రూ.6.50లక్షల వ్యయంతో పనులు చేపట్టారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాల మేరకు పనులు చురుగ్గా చేపట్టారు. పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ త్వరలో ఇక్కడ పనులను పర్యవేక్షించే అవకాశం ఉంది. ఆగస్టు 15న రాష్ట్ర వ్యాప్తంగా కొన్నింటిని అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెల్సిందే. మాజీ కార్పొరేటర్ రామయ్య పనులను పర్యవేక్షిస్తున్నారు.

రైతుబజార్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పటమట, జూలై 18: స్థానిక రైతుబజార్ ప్రాంతంలో రోడ్లపై ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. 'దర్జాగా వ్యాపారాలు' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. నాల్గవ పట్టణ ట్రాఫిక్ సీఐ రామారావు ఆధ్వర్యంలో ఎస్ఐ రాజేష్, తదితర సిబ్బంది ఆక్రమణల తొలగింపులో పాల్గొన్నారు. రోడ్లపై ఆక్రమణల తొలగింపుతో రోడ్డు విశాలంగా మారింది.



ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు, విశాలంగా రైతుబజార్ పరిసరాలు

కృష్ణానదిలో పడవ బోల్తా.. యువకుడు మృతి

వన్‌టౌన్, జూలై 18: కృష్ణా నదిలో పడవ బోల్తా పడిన ఘటన లో విద్యాధరపురానికి చెందిన చెన్నా శ్రీను (20) మృతి చెందాడు.బుధవారం సాయంత్రం శ్రీను, అతని స్నేహితుడు కే రాజులు చేపలు పట్టేందుకు పడవలో నదిలోకి వెళ్లారు. రాత్రి గాలివాన రావడంతో ఒడ్డుకు చేరేందుకు ప్రయత్నించారు. అయితే గాలి బాగా వీయడంతో పడవ బోల్తా పడింది. అతి కష్టం మీద రాజు ఈదుకుంటూ ఒడ్డుకు చేరాడు. శ్రీను గల్లంతయ్యాడు. అనంతరం గాలించగా అతని మృతదేహం సమీపంలో గురువారం లభించింది. రాజు ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

జవహర్ నవోదయ విద్యాలయాల్లో
ఆరో తరగతి ప్రవేశాలు



నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్)- దేశ వ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 'జవహర్ నవోదయ విద్యాలయ సెలెక్షన్ టెస్ట్(జేఎన్‌వీఎస్‌టీ) 2025' ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఇవి కో-ఎడ్యుకేషనల్ రెసిడెన్షియల్ స్కూళ్లు. బాల బాలికలకు విడివిడిగా హాస్టల్స్ ఉంటాయి. భోజన, వసతి సౌకర్యాలతోపాటు పన్నెండో తరగతి వరకు బోధన ఉచితం. యూనిఫాం, పాఠ్య పుస్తకాలు కూడా ఇస్తారు.

అర్హత: ప్రస్తుతం ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో అయిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్ఐఓఎస్ నుంచి 2024 సెప్టెంబరు 15 నాటికి 'బి' సర్టిఫికెట్ కాంపిటెన్సీ కోర్సు పూర్తిచేసేవారు కూడా అర్హులే. విద్యార్థులు 2013 మే 1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి.

జేఎన్‌వీ సెలెక్షన్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం 2 గంటలు. మొత్తం మార్కులు 100. ఈ పరీక్షలో మూడు సెక్షన్లు ఉంటాయి. వీటిలో మొత్తం 80 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌లో 40 ప్రశ్నలు అడుగుతారు. దీనికి 50 మార్కులు కేటాయించారు. అర్థమెటిక్ టెస్ట్, లాంగ్వేజ్ టెస్ట్‌ల్లో ఒక్కోదానిలో 20 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో దానికి 25 మార్కులు ఉంటాయి. నెగెటివ్ మార్కులు లేవు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌కు గంట; మిగిలినవాటికి ఒక్కోదానికి అర్ధ గంట పరీక్ష సమయం ఇస్తారు. విద్యార్థులు బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద సమాధానాలు గుర్తించాలి. తెలుగు రాష్ట్రాల్లో ఈ పరీక్షని తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మరాఠీ, ఉర్దూ, ఒరియా, కన్నడ మాధ్యమాల్లో నిర్వహిస్తారు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **జేఎన్‌వీ సెలెక్షన్ టెస్ట్ తేదీలు:** 2025 జనవరి 18, ఏప్రిల్ 12
- **వెబ్‌సైట్:** www.navodaya.gov.in

దిక్సూచి
DIKSUCHI


సీఈసీఆర్ఐలో బీటెక్

కరైకుడి(తమిళనాడు)లోని సెంట్రల్ ఎలక్ట్రోకెమికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎస్ఐఆర్-సీఈసీఆర్ఐ)-బీటెక్ (కెమికల్ అండ్ ఎలక్ట్రోకెమికల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో అదర్ స్టేట్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. జేఈఈ మెయిన్ 2024 ఆలిండియా ర్యాంక్ ఆధారంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 6
- **ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** ఆగస్టు 9
- **ఆన్‌లైన్ కౌన్సెలింగ్:** ఆగస్టు 21
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 23
- **వెబ్‌సైట్:** cecri.res.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/NKB5u7vలో చదవండి.

ఐఐఎఫ్‌టీలో ఆన్‌లైన్ పీజీ డిప్లొమా



ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- ఎగ్జిక్యూటివ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(ఈపీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది 15 నెలల వ్యవధి గల వీకెండ్ ప్రోగ్రామ్. ఇందులో మూడు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లు పూర్తయిన తరవాత ప్రోగ్రామ్‌లో బ్రేక్ తీసుకోవచ్చు. గరిష్ఠంగా మూడేళ్లలో ప్రోగ్రామ్‌ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌ని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. వారాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు వరకు సెషన్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా పోర్ట్ విజిట్, ఇండస్ట్రీ విజిట్, రీసెర్చ్ ప్రాజెక్ట్, అసైన్‌మెంట్స్ ఉంటాయి. సెలెక్షన్ కమిటీ నిర్ణయం మేరకు అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం అయిదేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

మ్యాట్ నోటిఫికేషన్

ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ)-మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(మ్యాట్) 2024 ఆగస్టు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా దేశంలోని ప్రముఖ బిజినెస్ స్కూళ్లు అందిస్తున్న మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

మ్యాట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో అయిదు సెక్షన్‌లు ఉంటాయి. సెక్షన్‌కు 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 150 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

ఐబీటీ షెడ్యూల్: ఆగస్టు 14న ఎగ్జామ్ రాయాలనుకొనేవారు ఆగస్టు 9లోపు, ఆగస్టు 23న పరీక్ష రాయాలంటే ఆగస్టు 18లోపు దరఖాస్తు చేసుకోవాలి.

సీబీటీ షెడ్యూల్: చివరి తేదీ: ఆగస్టు 11
- **సీబీటీ టెస్ట్ తేదీ:** ఆగస్టు 18

పీబీటీ షెడ్యూల్: చివరి తేదీ: ఆగస్టు 18
- **పీబీటీ టెస్ట్ తేదీ:** ఆగస్టు 25
- **వెబ్‌సైట్:** mat.aima.in

పంచకర్మ టెక్నీషియన్ కోర్సు

భారత ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్(సీసీఆర్ఏఎస్)- పంచకర్మ టెక్నీషియన్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఏడాది వ్యవధి గల సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ రెగ్యులర్ నాన్ రెసిడెన్షియల్ కోర్సు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ట్రెయినింగ్ పూర్తయ్యేనాటికి అభ్యర్థులకు 18 ఏళ్లు నిండాలి.

- **రిజిస్టర్డ్/స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 31
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** అక్టోబరు 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.ccras.nic.in



మరో రికార్డును సాధించిన కల్కి



విడుదలైన మొదటి రోజు నుంచే హిట్ టాక్ తెచ్చుకుని వరుస రికార్డులు సృష్టిస్తోంది 'కల్కి 2898 ఏ.డీ' సినిమా. ఇటీవలే రూ.1000 కోట్లు సాధించిన ఏడవ ఇండియన్ సినిమాగా.. రెండవ ప్రభాస్ సినిమాగా నిలిచింది. ఈ రికార్డుల వేటలో భాగంగా ఈ సినిమా మరో అరుదైన ఘనతను సాధించింది. టికెట్ బుక్కింగ్స్ అప్లికేషన్ 'బుక్ మై షో'లో అత్యధిక టికెట్స్ బుక్ అయిన సినిమాగా ఖ్యాతి గడించింది. 12.15 మిలియన్స్ (దాదాపు రూ.1 కోటి 25 లక్షలు) టికెట్స్ బుక్ అయిన ఈ సినిమా అంతకుమందు 'జవాన్' సినిమా పేరిట ఉన్న రికార్డును తిరగరాసింది. 'జవాన్' 12.01 (దాదాపు రూ.1 కోటి 20 లక్షలు) మిలియన్స్ టికెట్ బుకింగ్స్‌తో ప్రస్తుతం రెండో స్థానంలో ఉంది. కాగా, నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పాన్ ఇండియన్ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్‌లో ప్రభాస్ 'భైరవ' పాత్రలో.. అమితాబ్ బచ్చన్ పురాణ యోధుడు 'అశ్వత్థామ'గా..కమల్ హాసన్, దీపికా పదుకొనే, రాజేంద్ర ప్రసాద్ కీలక పాత్రల్లో అలరించారు. ఈ సినిమాకు కొనసాగింపుగా పార్ట్-2 తెరకెక్కనుందని చిత్ర బృందం ప్రకటించిన సంగతి తెలిసిందే.




తమిళ చిత్రకథానాయకుడు విజయ్ నటిస్తున్న తాజా చిత్రం 'ది గోట్' (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలయ్యాయి. సినిమాలోని రెండో పాట 'నిన్ను కన్న కనులే'ను గురువారం విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ ఫ్యామిలీ సాంగ్‌ను యువన్ శంకర్‌రాజా, ఎస్పీ చరణ్, చిత్ర పాడారు. విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, ప్రభుదేవా, మోహన్, జయరామ్, స్నేహ, లైలా, మీనాక్షి చౌదరి తదితరులు ఇతర ముఖ్య తారాగణం. కల్పాతి ఎస్ అఘోరమ్, కల్పాతి ఎస్.గణేశ్, ఎస్.సురేశ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తోంది. వెంకట్ ప్రభు దర్శకుడు.



ఘట్టమనేని వంశం నుంచి
మరో హీరో

హీరో కృష్ణ మనవడు, నటుడు, నిర్మాత రమేశ్‌బాబు తనయుడు జయకృష్ణ హీరోగా అరంగేట్రం చేస్తున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా గురువారం పద్మాలయా సంస్థ కార్యాలయంలో అభిమానుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో జయకృష్ణ కేక్ కట్ చేశారు. దివంగత రమేశ్‌బాబు సతీమణి, జయకృష్ణ తల్లి మృదుల ఈ సందర్భంగా మాట్లాడుతూ 'బాబు కోసం కొన్ని కథలు విన్నాం. అందరం కలసి ఓ కథను ఎంపిక చేస్తాం. మంచి బేనర్ ద్వారా చక్కని సినిమాతో జయకృష్ణ త్వరలోనే మీ ముందుకు వస్తాడు' అని చెప్పారు. అభిమానులందరికీ జయకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతున్న
జాన్వీ కపూర్



బాలీవుడ్ నటి జాన్వీకపూర్ ఇటీవలే 'మిస్టర్ అండ్ మిసెస్ మహీ' చిత్రంతో ప్రేక్షకులను అలరించారు. ఓ పక్క బాలీవుడ్ చిత్రాల్లో నటిస్తూనే.. టాలీవుడ్‌లోనూ ఎన్టీఆర్, రామ్‌చరణ్, నాని సినిమాల్లో కథానాయిక పాత్రను పోషిస్తున్నారీ బ్యూటీ. తాజాగా, ఆమె అనారోగ్యానికి గురయ్యారు. ఫుడ్ పాయిజనింగ్ వల్ల తీవ్ర అనారోగ్యానికి గురైన ఆమెను ముంబైలోని హాస్పిటల్‌లో చేర్చారు. జాన్వీ ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారని.. తన కూతురి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు ఆమె తండ్రి బోనీ కపూర్ వెల్లడించారు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడ్డాక ఆమెను హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ చేస్తారని ఆయన చెప్పారు. ప్రస్తుతం జాన్వీ కపూర్ 'ఉలఝ్' అనే చిత్రంలో నటించారు. ఇందులో ఆమె పోషించే పాత్ర పేరు సుహాన భాటియా. దేశంలో అతి పిన్న వయసులోనే డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఎదిగిన సుహాన భాటియా విజయ ప్రస్థానమే ఈ సినిమా కథాంశం. సినిమా ఆగస్టు 2న విడుదలవుతోంది.

దీపావళికి రాకీ రాక



విష్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మెకానిక్ రాకీ'. కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంతో రవి తేజ ముళ్లపూడి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో విష్వక్ సరసన మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీని మేకర్స్ ఖరారు చేశారు. దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న 'మెకానిక్ రాకీ' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో విష్వక్‌సేన్ గన్, రెంచ్ పట్టుకొని గంభీరమైన లుక్‌లో కనిపించారు. వైవా హర్ష, హర్షవర్ధన్ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: సత్యం రాజేశ్, విద్యాసాగర్ జె, సినిమాటోగ్రఫీ: మనోజ్ కటసాని, ఎడిటర్: అన్వర్ అలీ

వారం రోజుల ముందుగానే..



రక్షిత్ అట్లూరి హీరోగా నటించిన తాజా చిత్రం 'ఆపరేషన్ రావణ్'. న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా దర్శకుడు వెంకట్ సత్య రూపొందించారు. తెలుగు, తమిళ భాషల్లో తయారైన ఈ సినిమాలో సంగీర్తన కథానాయిక. ముందు అనుకున్నట్లు కాకుండా వారం రోజుల ముందుగానే అంటే ఈ నెల 26న సినిమాను విడుదల చేస్తున్నట్లు చిత్ర నిర్మాత ధ్యాన్ అట్లూరి చెప్పారు. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చిందని ఆయన తెలిపారు. రాధిక శరత్‌కుమార్ ఓ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రంలో చరణ్‌రాజ్, విద్యాసాగర్, రాకెట్ రాఘవ, రఘు కుంచె ఇతర ముఖ్య తారాగణం.

కశ్మీర్ నేపథ్యంలో...



శివ కార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'అమరన్'. కమల్‌హాసన్ తన సొంత బేనర్ రాజ్‌కమల్ ఇంటర్నేషనల్ ఫిల్మ్స్‌పై సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్‌తో కలసి నిర్మిస్తున్నారు. సాయిపల్లవి కథానాయిక. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న 'అమరన్' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ బుధవారం ప్రకటించారు. ప్రముఖ జర్నలిస్ట్, రచయిత శివ్ అరూర్ రచించిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్' పుస్తకంలోని 'మేజర్ వరదరాజన్' జీవిత గాథ ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. కశ్మీర్ నేపథ్యంలో యాక్షన్ ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో సరికొత్త పాత్రలో శివకార్తికేయన్ కనిపించనున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సీహెచ్ సాయి.


ట్రోలర్స్‌పై డీజీపీకి
'మా' ఫిర్యాదు

సోషల్ మీడియా వేదికల ద్వారా సినిమా తారలపై జరుగుతున్న ట్రోలింగ్‌పై 'మా' (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) చర్యలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో భాగంగా 'మా' సభ్యులైన శివ బాలాజీ, రాజీవ్ కనకాల, శివకృష్ణ తెలంగాణ డీజీపీ జితేందర్‌ను కలసి వినతి పత్రం అందించారు. అందులో ఈ ట్రోలింగ్స్‌కు పాల్పడుతున్న 250 యూట్యూబ్ చానళ్లపై చర్యలు తీసుకోవాలని 'మా' సభ్యులు డీజీపీని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన డీజీపీ.. సైబర్ సెక్యూరిటీ సహకారంతో ఈ అంశంపై చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని.. అందులో ఇటువంటి ట్రోలర్స్‌పై నిఘా పెడతామని 'మా' సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 'మా' సభ్యులు మాట్లాడుతూ "ఈ ట్రోలింగ్స్ హద్దులు దాటిపోయాయి. వీటి వల్ల చాలా మంది నటీనటులు ఇబ్బంది పడుతున్నారు. 24 గంటల్లోపు ఓ ప్రత్యేక కో ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసి ట్రోలింగ్ చేసే చానళ్లను గుర్తిస్తాం" అని చెప్పారు.






ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 19 జూలై 2024



విశేషం

అతడే గురువు

21న
గురు పౌర్ణమి



గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురు స్సాక్షాత్ పరబ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః

గురువు సృష్టికర్త అయిన బ్రహ్మ. స్థితికర్త అయిన విష్ణువు. లయకర్త అయిన మహేశ్వరుడు. అందుకే గురువు పరబ్రహ్మం. అవ్యక్త స్వరూపుడు. గురుదేవుడు మానవ రూపంలోనే ఉండి జ్ఞానం బోధిస్తున్నాడు... ఈ మాటలు వేరెవరో అన్నవి కావు... సాక్షాత్తూ పరమేశ్వరుడే పార్వతికి చెప్పినవి. ఇది 'స్కాంద పురాణం'లో చోటుచేసుకున్న పవిత్ర విషయం. మూడు అధ్యాయాలతో, 351 శ్లోకాలతో 'సనత్కుమార సంహిత'గా ప్రాచుర్యం అది పొందింది.

తల్లితండ్రుల తరువాత స్థానం గురువుదే. 'ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్యవరాన్ నిబోధిత...'... మేలుకొని, మేలుకొలుపులో వెలిగిపోయి, సత్యాన్ని ఎరుకపరచుకొని ముందుకు సాగాలనీ, గమ్యాన్ని చేరుకోవాలనీ, జీవితాన్ని ధన్యం చేసుకోవాలనీ శ్రుతులు చెబుతున్నాయి. గమ్యాన్ని చేర్చేవాడు గురువు. అందుకే అతను పరబ్రహ్మ. 'గురుగీత'లో గురు వైభవాన్ని వివరిస్తూ "బ్రహ్మానంద స్వరూపుడు, పరమ సుఖాన్ని ప్రసాదించేవాడు, కేవలం జ్ఞాన స్వరూపమైనవాడు, ద్వంద్వాలకు అతీతుడు, ఆకాశ రూపుడు, 'తత్త్వమసి' తదితర మహా వాక్యాలకు లక్ష్యమైనవాడు, అద్వయుడు, నిత్యుడు, పరిశుద్ధుడు, నిశ్చలుడు, సర్వ సంకల్పాలకు సాక్షి అయినవాడు, భావాతీతుడు, గుణాతీతుడు... అతడే గురువు" అన్నాడు పార్వతితో పరమేశ్వరుడు.

గుకారశ్చ న్ధకారస్తు రుకార స్తన్నిరోధకృత్
అంధకార వినాశిత్వాత్ గురురిత్యభిధీయతే

"గుకారం అంటే చీకటి (అజ్ఞానం). చీకటిని పోగొట్టే ప్రకాశం... రుకారం (జ్ఞానం). గురువు అంటే అజ్ఞానాంధకారాన్ని దూరం చేసేవాడు" అంటోంది గురు గీత. "క్షీరాన్ని ఇచ్చేది ధేనువు, జ్ఞానాన్ని ఇచ్చేది గురువు. గాలిని ఇచ్చేది తరువు. జాలిని చూపేది గురువు" అన్నారు స్వామి సుందర చైతన్యానంద ఒక సందర్భంలో. శిష్యులే కాకుండా ఎవరు ఆపదల్లో ఉన్నా వారిని వెంటనే గురువు దరిచేర్చుకుంటాడు. వారి ఆర్తిని తీరుస్తాడు. అతను ఏ ఆశలు లేనివాడు. శాంత స్వభావుడు. అజేయ శక్తి. తనకన్నా తన శిష్యులు ఇంకా ఎత్తుకు ఎదగాలని ఆశిస్తాడు. అది తప్ప వేరే ఆలోచన, ఆకాంక్ష లేనివాడు. గురు హృదయం గురించి ఇంకా ఎంతైనా చెప్పవచ్చు.

భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉంది. గురువును త్రిమూర్తి స్వరూపుడిగా భావన చేస్తూ పూజించడం అనాదిగా వస్తోంది. జ్ఞానభిక్ష పెట్టే మహాత్ముడు గురువు. ఆ గురువులకే గురువు... వేదవ్యాసుడు. వ్యాసుడి అసలు పేరు కృష్ణుడు. నల్లని మేని ఛాయ కలిగినవాడు కనుక 'కృష్ణుడు' అనే పేరు వచ్చింది. సత్యవతీ పరాశరుల పుత్రుడైన అతను ద్వీపంలో జన్మించాడు. కాబట్టి 'కృష్ణ ద్వైపాయనుడు' అంటారు. ఆయనను కొందరు సాక్షాత్తూ నారాయణుడి అంశగా, మరికొందరు సదాశివుడి అవతారంగా భావిస్తారు. వ్యాసుడికి పూర్వం అనేక కల్పాలలో... పలువురు మహర్షులు వేద, పురాణ, ఇతిహాసాలను ప్రవచించారు. కాలక్రమంలో... వాటిలో చాలావరకూ శిథిలం అయిపోగా... ఈ కల్పంలో వ్యాసుడు వాటన్నిటినీ ఏర్చికూర్చి నాలుగు వేదాలతో పాటు పంచమ వేదమైన భారతాన్నీ, పురాణ వాఙ్మయాన్నీ ఉద్ధరించాడు. ఈ కారణంగా ఆయనను 'వేదవ్యాసుడి'గా కీర్తిస్తారు. ఆ వేద, పురాణ, ఇతిహాస వాఙ్మయాన్ని తన శిష్యుల ద్వారా జగత్తుకు అందించిన వ్యాసుణ్ణి తొలి గురువుగా పరిగణిస్తారు. వ్యాసుడు జన్మించిన ఆషాఢ పౌర్ణమిని గురుపౌర్ణమిగా, వ్యాస పౌర్ణమిగా... తరతరాలుగా జరుపుకొంటున్నారు.

ఆత్మ జ్ఞానాన్ని అందించేవాడు గురువు. 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' అన్నారు పూర్వులు. జ్ఞానార్జనలో ప్రధానమైనది గురుబోధ. గురు శిష్యుల మధ్య ఉండే బంధం పవిత్రమైనది. గురువులో ఉన్న పవిత్రత బోధించడంలో, శిష్యుడిలో ఉన్న పవిత్రత సేవించడంలో తెలుస్తుంది. మనల్ని మనం ఉద్ధరించుకోవడానికి, అహంకారాన్ని తగ్గించుకోవడానికి, గురు కృపను పొందడానికి గురుసేవ చేయాలి. గురు పౌర్ణమి నాడు వారిని గుర్తు చేసుకోవాలి. వారిపట్ల మన భక్తి శ్రద్ధలను, విధేయతను తెలుపుకోవాలి.

సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమాం
అస్మదాచార్య పర్యంతాం వందే గురు
పరంపరాం... అని గురువులకు
అంజలి ఘటిద్దాం.

● ఆయపిళ్ళ రాజపాప

గోరింటాకు... ఆషాఢం

ఆషాఢ మాసానికీ, గోరింటాకుకూ విడదీయలేని అనుబంధం. ఈ నెలలో ఒకసారైనా గోరింటాకు పెట్టుకొనే ఆనవాయితీ పూర్వకాలం నుంచీ ఉంది. వర్షాకాలంలో గోరింటాకు పెట్టుకోవడం ఆరోగ్యదాయకం కూడా. గోరింటాకు పుట్టుక గురించి ఒక కథ ప్రచారంలో ఉంది. దాని ప్రకారం:


గోరింటాకు అసలు పేరు గౌరింటి ఆకు... అంటే 'గౌరి ఇంటి ఆకు'. 'గౌరి' అంటే పార్వతీదేవి. ఆమె బాల్యంలో తన చెలికత్తెలతో ఉద్యానవనంలో ఆటలు ఆడుతూ రజస్వల అయింది. ఆమె నుంచి నేలపై నెత్తుటి చుక్క పడింది. అది పడిన ప్రదేశంలో ఒక మొక్క మొలిచింది. ఈ విషయాన్ని పర్వతరాజుకు గౌరీదేవి చెలికత్తెలు చెప్పారు. ఆయన తన పరివారంతో అక్కడికి వచ్చాడు. ఈలోగా చెట్టు పెద్దదయిపోయింది. పార్వతి తన బాల్య చాపల్యంతో... ఆ చెట్టు ఆకును కోసింది. ఆమె వేళ్ళు ఎర్రబడ్డాయి. ఏం జరిగిందోనని పర్వతరాజు కంగారు పడ్డాడు. "నాకు ఎలాంటి బాధా కలగలేదు. పైపెచ్చు ఇది వేళ్ళకు చక్కని అలంకారంగా కూడా కనిపిస్తోంది" అని చెప్పింది పార్వతి.

"నేను పార్వతీదేవి రుధిరాంశతో పుట్టాను. కానీ నా వల్ల ఈ లోకానికి ఏం ప్రయోజనం?" అని ఆ చెట్టు అడిగింది. అప్పుడు పర్వతరాజు "ఇక మీదట మానవ లోకంలో మహిళలకు సౌభాగ్య చిహ్నంగా ఈ ఆకు నిలిచి, లోక ప్రసిద్ధం అవుతుంది. రజస్వల సమయాన ఉద్భవించిన ఈ చెట్టు మహిళలలో గర్భాశయ దోషాలను, అతి ఉష్ణాన్నీ తొలగిస్తుంది. మహిళలకు ఆరోగ్యాన్ని చేకూరుతుంది. అంతేకాదు... చేతులకు, కాళ్ళకు అందాన్ని ఇచ్చే అలంకార వస్తువుగానూ వినియోగపడుతుంది. ఆ విధంగా నీ పుట్టుక సార్థకమవుతుంది. గౌరీదేవి ఇంటిలో పుట్టావు కాబట్టి నీ ఆకును 'గౌరింటాకు'గా పిలుస్తారు" అని ఆ చెట్టుకు వరం ఇచ్చాడు.

గౌరితో సహా మహిళలందరూ ఆ చెట్టు ఆకుల పసరును చేతులకూ, కాళ్ళకూ అందంగా తీర్చిదిద్దుకున్నారు. కుంకుమకు సందేహం కలిగింది. 'ఈ ఆకును నుదుట కూడా దిద్దుకుంటే... నా ప్రాధాన్యత తగ్గిపోతుందేమో' అనే తన అనుమానాన్ని గౌరీదేవికి చెప్పింది.. "ఇది నుదుటన పండదు" అని కుంకుమకు గౌరి అభయం ఇచ్చింది. అందుకే... నుదుటి మీద ఈ ఆకు పసరు రాసుకున్నా పండదు. కాలక్రమేణా 'గౌరింటాకు'... వాడుకలో 'గోరింటాకు' అయింది. గోరింటాకు ఏడాదికి ఒకసారి ఆషాఢమాసంలో పుట్టింటికి... అంటే పార్వతీదేవి దగ్గరకు వెళుతుందట! తాను అక్కడ ఉన్నప్పుడు కూడా తనను ఎవరూ మరచిపోకుండా ఉండడానికి... ఆ నెలలో మహిళలు తప్పకుండా గోరింటాకు పెట్టుకోవాలని కోరిందట! అదే సంప్రదాయంగా మారింది.



గోరింటాకుకు ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఇది గర్భాశయ దోషాలను నివారిస్తుంది. అరచేతి మధ్యలో మహిళల గర్భానికి రక్తాన్ని చేరవేసే ప్రధాన నాడులు ఉంటాయి. వాటిలో అతి ఉష్ణాన్ని గోరింటాకు తొలగించి, ప్రశాంతపరుస్తుంది. ప్రసవం వల్ల కలిగే గర్భాశయ బాధలు నయమవుతాయి. వర్షాకాలంలో... నీటి కారణంగా చర్మ సమస్యలు ఎదురవుతాయి. చేతులకు కాళ్ళకు గోరింటాకు పెట్టుకుంటే... ఈ సమస్యలను నివారించుకోవచ్చు.



సహజయోగ

స్వయం గురుతత్త్వం

న గురోరధికం తత్వం న గురోరధికం తపః
తత్వ జ్ఞానాత్పరం నాస్తి తస్మై శ్రీగురవే నమః

"గురువును మించిన తత్త్వం లేదు. గురువును విుంచిన తపస్సు లేదు. అటువంటి గురుదేవునికి నమస్కరిస్తున్నాను..."- గురువు ఉన్నత స్థానాన్ని గురుగీతలోని ఈ శ్లోకం వివరిస్తోంది. ప్రతి శిష్యుడు తన గురువును పూజించడం చాలా అవసరం. ఇది అనాదిగా వస్తున్న సంప్రదాయం. అయితే ఆ గురువు సద్గురువు అయి ఉండాలి. శ్రీగణేశుడు తన తల్లిని పూజించి... ఆది గురువు అయ్యాడు. గురుత్వానికి మూలం, సారం ఆయనే. గురువు స్త్రీ కావచ్చు, పురుషుడు కావచ్చు. కానీ ఆ గురువులోని మాతృ స్వభావమే తన శిష్యులను తీర్చిదిద్ది... గురువులుగా మారుస్తుంది. కాబట్టి మీరు ముందుగా గురువులు కావాలి. అయితే మీలో మాతృతత్త్వాన్ని పెంచుకుంటేనే అది సాధ్యం.


గురువు ప్రప్రథమంగా మనల్ని భగవంతుడితో అనుసంధానం చేయడానికి ప్రయత్నిస్తాడు. అంటే... మీ కుండలినీ శక్తిని జాగృతపరచి... సర్వవ్యాపితమైన శక్తితో విుమ్మల్ని అనుసంధానం చేసే సామర్థ్యం గురువుకు ఉండాలి. తమలోని గురుతత్త్వం లేనివారు కూడా ఇతరులకు గురువులు కావాలనుకుటారు. స్వయం గురువుగా వ్యక్తమైన వారు ఇతరులకు గురువు కావాలని ఎన్నడూ కోరుకోరు. మిమ్మల్ని మీరు గమనించుకోండి. ఉన్నతమైన స్థితికి చేరుకోవడానికి ప్రయత్నించండి. మీ ఆత్మ సాక్షాత్కారం పొందండి. అప్పుడే మీరు గురువు కాగలుగుతారు. అదే స్వయంగురుతత్త్వం.

'గురుః స్సాక్షాత్ పరబ్రహ్మ' అన్నారు పెద్దలు. పరబ్రహ్మ అంటే ఆదిశక్తి తాలూకు శక్తి. మీరు ఆత్మసాక్షాత్కారం పొందిన తరువాత... ఆ శక్తే మీలో ప్రవహిస్తుంది. అప్పుడు మీరు పరబ్రహ్మకు సాధనంగా మారుతారు. మీలో స్వయం గురుతత్త్వ స్థితిని పెంపొందించుకుంటారు. గురువుకు ఉండాల్సిన ఉత్తమ గుణాలు ఎన్నో ఉన్నాయి.. ఆ గుణాలకు యజమాని శివుడు. శివతత్త్వం అంటే గురుతత్త్వమే. ఆ గుణాలన్నీ మీలో ప్రస్ఫుటమవాలి. ప్రకాశించాలి. అప్పుడు మీరు విరాట్‌శక్తిలో భాగమవుతారు. ఇతరులకు ధర్మాన్ని బోధించగలుగుతారు. "కొందరు తమను గురువులుగా, పీఠాధిపతులుగా, ధర్మాధికారులుగా చిత్రించుకుంటూ... ధనవంతులను, అధికారులను శిష్యులుగా చేసుకుంటున్నారు. ప్రసార సాధనాల ద్వారా పేరు తెచ్చుకొని, సత్యాన్వేషకులను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఒక తల్లిగా మీకు నచ్చజెబుతున్నాను.... అటువంటి వారి వద్దకు వెళ్ళి మీ వినాశనాన్ని మీరే కొని తెచ్చుకోకండి. మీ ఆత్మను మీరే నాశనం చేసుకోకండి" అని శ్రీమాతాజీ నిర్మలాదేవి తన ప్రవచనాలలో స్పష్టంగా తెలియజేశారు.

"కుండలినీ జాగృతితో ఆత్మసాక్షాత్కారం పొంది సహజయోగ సాధన చేయగలిగితే... మీలో స్వయంగురుతత్త్వం పెంపొందుతుంది. ఆధ్యాత్మిక గురువుగా మీరు నిజాయితీగా ఉండాలి, సత్యాన్ని ధైర్యంగా ప్రకటించగలగాలి, నైతిక జీవనాన్ని కొనసాగించాలి. ప్రేమతో, మర్యాదతో, హుందాగా ఉండాలి. అన్ని వైషమ్యాలను, జాతి, వర్ణ బేధాలనూ విడనాడాలి. ధర్మాతీతులుగా, సంకుచిత మనస్తత్వం ఉండకూడదు. సర్వమతాల సారాన్ని గ్రహించాలి, గౌరవించాలి. ప్రజలను మీవైపు ఆకర్షించే శక్తిని కలిగి ఉండాలి. బంధారాహిత్యాన్ని కలిగి ఉండాలి. బంధరాహిత్యం అంటే నిర్మలత్వం, అదే అమాయకత్వం. దాని వెలుగులో అపరిశుద్ధమైనదేదీ మీకు కనబడదు. మీ శరీరాన్ని, కోరికలను అదుపులో ఉంచుకోవాలి. బద్ధకస్తులు, త్యాగానికి ఇష్టపడనివారు ఎన్నడూ గురువు కాలేరు. గురువుగా నిత్యజీవితంలో అనేక విషయాలకు అతీతంగా ఉండగలగాలి. మిమ్మల్ని వ్యతిరేకించేవారితో వాదించనక్కర్లేదు. గురువు అణకువ కలిగి, మృదువుగా వ్యవహరించాలి. దేన్నీ ఆశించకూడదు. గురువుకు జిహ్వా చాపల్యం ఉండకూడదు. ఎప్పుడు కోపం ప్రదర్శించాలో, ఎప్పుడు శాంతంగా ఉండాలో, ఎప్పుడు ఏది మాట్లాడాలో, ఎంతవరకూ మాట్లాడాలో తెలిసి ఉండాలి. చాలా మంది గురువులు మౌనం పాటించడం వల్ల శక్తిమంతులయ్యారు" అంటూ గురువుకు ఉండాల్సిన లక్షణాలను వివిధ సందర్భాల్లో మాతాజీ వివరించారు.

డాక్టర్ పి. రాకేష్ (8988982200)
'పరమ పూజ్యశ్రీ మాతాజీ
నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్',
తెలంగాణ





విశేషం

శ్రీ టీకారాయలు

కర్ణాటకలో సాదినాడు అనే రాజ్యానికి యువరాజు దోండు రఘునాథ రాయలు. అతను ఒక రోజు తన అనుయాయులతో వేటకు బయలుదేరాడు. మిట్ట మధ్యాహ్నం అయింది. అతనికి, అతని గుర్రానికి బాగా దాహం వేస్తోంది. కొంతదూరంలో భీమానది కనిపించింది. గుర్రాన్ని నేరుగా నదిలోకి నడిపించాడు. గుర్రం మీద నుంచి దిగకుండా, కిందికి వంగి.. నదీ ప్రవాహానికి నోరు తాకించి, నీరు తాగడం మొదలుపెట్టాడు.

శ్రీమధ్వాచార్యుల ప్రత్యక్ష శిష్యులలో ఒకరైన శ్రీ అక్షోభ్య తీర్థులు ఇదంతా నది ఒడ్డునుంచి గమనిస్తున్నారు. అంతకుముందు రోజు తనకు కలలో వెల్లడయిన సూచన మేరకు... ఆయన ఆ నదీతీరానికి వచ్చారు. తమ మఠానికి తదుపరి అధికారి కావలసిన మహానుభావుడి కోసం నిరీక్షిస్తున్నారు. 'భీమా నదిలో అశ్వారూఢుడై వంగి... నీటిని తాగే విచిత్ర వ్యక్తే మీ ఉత్తరాధికారి' అనేది ఆయనకు కలలో వచ్చిన సూచన. ఆ దృశ్యాన్ని ప్రత్యక్షంగా చూడగానే... "కిం పశుః పూర్వదేహే?" (నీవు కిందటి జన్మలో పశువువా?) అనే మాటలు ఆయన నోట వెలువడ్డాయి. ఆ మాటలు వినగానే రఘునాథ రాయలుకు గత జన్మ జ్ఞానం కలిగింది.

వాయుదేవుడి అవతారమైన శ్రీమధ్వాచార్యులు ఒక రోజు నిరుపమానమైన, రుద్రాది దేవతలకు కూడా ఆశ్చర్యం కలిగించే వాక్ ప్రవాహంతో... తను రాసిన భాష్యాలను శిష్యులకు వివరిస్తున్నారు. రోజూ ఆయన గ్రంథాలను మోసుకొని తీసుకొచ్చే ఎద్దు కూడా దూరంగా ఒక మూల కూర్చొని ఉంది. అప్పుడు ఆ శిష్యులలో కొందరు "స్వామీ! తమ అద్భుత గ్రంథాల అపురూప వివరణను మీరే స్వయంగా చెబుతున్నారు కాబట్టి మాకు చక్కగా అర్థమవుతోంది. కానీ వాటికి టీకా తాత్పర్యాలు రాసి... మాకు, లోకానికి తెలియజేసే భాగ్యశాలి ఎవరు?" అని ప్రశ్నించారు. ఆ పని ఆ వృషభం చేస్తుందని ఆయన సమాధానం ఇచ్చారు. అందరూ ఆశ్చర్యపోయారు. అది గ్రంథాలను మోసే ఎద్దు అనీ, రోజూ తమతో పాటే పాఠాలు వింటోందనీ వారికి తెలుసు కానీ, అది స్వర్గాధిపతి అయిన దేవేంద్ర స్వరూపమని తెలియదు.

గురువు మాటలు విన్న తరువాత... కొందరు శిష్యులు మాత్సర్యానికి గురయ్యారు. పాముకాటుకు గురై ఆ ఎద్దు మరణించాలని శపించారు. ఆ ప్రకారం ఒక పాము వచ్చి కాటు వేయడంతో... ఎద్దు మరణించింది సర్వజ్ఞుడైన శ్రీమధ్వాచార్యులు... తాను రచించిన 'ద్వాదశ స్తోత్రా'న్ని పఠిస్తూ... కమండలంలోని మంత్రజలాన్ని ఆ ఎద్దుమీద సంప్రోక్షణ చేయగానే... అది మళ్ళీ బతికింది. గత జన్మలో తాను వృషభమై... కన్నుల పండువగా చూసిన శ్రీమధ్వాచార్యుల విశ్వ మనోహరమైన ఆకృతి, అసమానమైన ఆయన శాస్త్ర గ్రంథాల ప్రవచనం, తన వీపు మీద వాటిని మోసుకొని తిరిగి జీవితాన్ని సార్థకం చేసుకోవడం... ఇలా ఎన్నో దృశ్యాలు రఘునాథ నాయకుల కళ్ళ ముందు కదిలాయి. ఆయన మనస్సును ఆవరించి ఉన్న అజ్ఞానపు తెర తొలగిపోయింది.

తన రాజ్యం, హోదా, ఇద్దరు భార్యలు, అపారమైన సంపద... అవన్నీ తృణప్రాయమనే సత్యం రఘునాథ నాయకుడి ముందు నిలిచింది. అతను అక్షోభ్యతీర్థుల దగ్గరకు పరుగున వచ్చాడు. తన తలను భక్తిగా ఆయన పాదాలకు తాకించాడు. "నన్ను మీ శిష్యుడిగా స్వీకరించండి. శ్రీమధ్వ శాస్త్రాన్ని ఉపదేశించి నన్ను పునీతుణ్ణి చెయ్యండి" అని వేడుకున్నాడు. అక్షోభ్యతీర్థులు అతణ్ణి సంతోషంగా పైకి లేపి "నీకు మధ్వశాస్త్ర ఉపదేశం కాదు, మధ్వాచార్యుల వేదాంత సామ్రాజ్యానికి అధిపతిగా పట్టాభిషిక్తుణ్ణి చేస్తాను. సన్యాసి కావడానికి సిద్ధంగా ఉండు" అన్నారు. "నాకు శాస్త్ర జ్ఞానం చాలు. అంతటి ఉన్నత పదవికి నేను అర్హుణ్ణి కాను" అన్నాడు రఘునాథరాయలు. "ఇది దైవ సంకల్పం. నువ్వు అంగీకరించాలి" అని చెప్పారు అక్షోభ్యతీర్థులు. "అది దైవ సంకల్పమైతే నాకూ సమ్మతమే. కానీ దాన్ని నేను ఎలా తెలుసుకోగలను?" అని ప్రశ్నించాడు రఘునాథుడు. "నీవు ఈ రోజంతా నాతోనే ఉండు. నాకు సూచన చేసిన దేవుడు... నీకు కూడా సూచన చేస్తాడు" అని బదులిచ్చారు అక్షోభ్యతీర్థులు,

ఆ రోజు రాత్రి రఘునాథ రాయలుకు కలలో శ్రీ వాయుదేవులు కనిపించి "నీవు సన్యాసాన్ని స్వీకరించు. శ్రీరాముణ్ణి పూజించు. విద్యలో అగ్రగణ్యుడవు అవుతావు. సర్వజ్ఞానులూ నిన్ను ఆశ్రయిస్తారు" అని నిర్దేశించారు. మరుసటిరోజే రఘునాథ రాయలు సన్యాస దీక్షను స్వీకరించాడు. ఆనాటి నుంచి 'జయతీర్థులు' అనే పేరుతో ప్రసిద్ధుడయ్యాడు.

అధికార పీఠాన్ని ఏలవలసిన తన కుమారుడు వేదాంత పీఠాన్ని అధిరోహించాడని తెలుసుకున్న రఘునాథ రాయల తండ్రి నరసింహరాయలు కోపంతో ఊగిపోయాడు. అక్షోభ్యతీర్థులును దారుణంగా దూషించాడు. అయితే దైవలీల ముందే తెలిసిన గురువు సంయమనాన్ని పాటిస్తూ "మీరు మీ కుమారుడితో మాట్లాడండి. కావాలంటే వెనక్కి తీసుకుపోవచ్చు" అని చెప్పారు. నరసింహరాయలు తన కుమారుణ్ణి ఇంటికి తీసుకువెళ్ళాడు. అతని బుద్ధిని మార్చడం కోసం... శయ్యాగృహాన్ని అలంకరించి... కోడలిని లోపలకు పంపాడు. అయితే మంచం మీద తన కుమారుడి స్థానంలో బుసలు కొడుతున్న భయంకరమైన సర్పం... జగత్తునే తనలో లీనం చేసుకొనే తేజోరాశి ప్రత్యక్షమయింది. తన కుమారుడు కేవలం తన వంశోద్ధారకుడు కాదు, లోకోద్ధారకుడు, అతను పుట్టినది సంసార బంధాల కోసం కాదు, తనలాంటి ఎందరినో సంసార సాగరాన్ని దాటించడానికి అని నరసింహరాయలుకు అర్థమయింది. తక్షణమే తన కుమారుణ్ణి అక్షోభ్యతీర్థులుకు అప్పగించాడు. తన అజ్ఞానాన్ని క్షమించాలని పశ్చాత్తాపంతో వేడుకున్నాడు. "దైవానుగ్రహం వల్ల మీకు మరొక కుమారుడు జన్మిస్తాడు" అని గురుశిష్యులిద్దరూ నరసింహరాయలుకు అభయం ఇచ్చారు.

పూర్వ జన్మలో శ్రీమధ్వాచార్యుల నుంచి విన్న శాస్త్రాన్నే... ఈ జన్మలో గురువైన అక్షోభ్యతీర్థులు ద్వారా శ్రీ జయతీర్థులు మరోసారి విన్నారు. "శ్రీ మధ్వాచార్యుల రచనలు శబ్దంలో వామన రూపంలో, అర్థాల పరంగా త్రివిక్రమ స్వరూపంలో ఉంటాయి. వారి భాష్యాలకు టీకా రాయడానికే నీ అవతారం" అని అక్షోభ్యతీర్థులు ఆయనను ఆదేశించారు. శ్రీమధ్వాచార్యుల బ్రహ్మసూత్ర భాష్యానికి 'తత్వ ప్రకాశిక', అణు వ్యాఖ్యానానికి 'న్యాయ సుధ' అనే టీకాలను శ్రీజయతీర్థులవారు రచించారు. వీటిలో 'న్యాయ సుధ మేరు శిఖరం లాంటిది. అలాగే మధ్వాచార్యుల గీతాభాష్యం, ఋుక్భాష్యం, ఉపనిషత్ భాష్యాలతో పాటు ఆచార్యుల పద్దెనిమిది గ్రంథాలకు సైతం టీకా రచన చేసి మధ్వపరంపరలో టీకారాయలుగా శ్రీ జయతీర్థులు' ప్రసిద్ధి చెందారు. పలు స్వతంత్ర గ్రంథాలను కూడా ఆయన రచించారు. ఆయన రచనా పటిమనూ, గొప్పతనాన్నీ ఎందరో మహనీయులు కొనియాడారు. "శ్రీ జయతీర్థుల గ్రంథాలను అధ్యయనం చేయడం మోక్షదాయకం. కానీ అందరికీ అది సాధ్యం కాకపోవచ్చు. కనీసం ఆయన పేరును స్మరిస్తే చాలు... 'జ' అంటే జయశీలులం అవుతాం, 'య' అంటే యముడు (రోగాలు, అపమృత్యువు) భయపడతాయి. 'తీ' అంటే తిమిర పాతకాలు నశిస్తాయి. 'థ' అంటే తాపత్రయం పరిహారమవుతుంది" అంటారు దాసవరేణ్యులైన విజయదాసులు. ఈనెల 24 నుంచి 26 వరకూ శ్రీజయతీర్థుల ఆరాధనోత్సవాలు దేశమంతటా... అన్ని మధ్వ మఠాలలో జరుగుతాయి. యోగులలో రాజు, కర్ణాటకలోని మలఖేడ్‌లో కొలువైన శ్రీజయతీర్థులను ఆ పుణ్య దినాలలో స్మరించుకొని పునీతులం అవుదాం.

● మధ్వ ప్రచార పరిషత్, (9440258841)

ఆ గురువును గుర్తించండి

'చంద్రమా మానసో జాతః'... మనస్సు చంద్రుడితో సంబంధం కలిగి ఉంటుంది. గురుపూర్ణిమ నాటి చంద్రుడు పూర్ణత్వానికి చిహ్నం. అందుకే ఆ పూర్ణత్వాన్ని ఒకసారి పరికించడానికి, మనలోకి మనం తొంగి చూసుకోవడానికి, జీవితాన్ని ఒకసారి అవలోకించడానికి గురుపూర్ణిమ మంచి తరుణం.

ఎవరికైనా జీవితాన్ని మించిన గురువు మరెవరు? ప్రతి ఒక్కరికీ జీవితం అనేక పాఠాలు నేర్పుతుంది. జీవితం వేరు, గురువు వేరు కాదు. అవి రెండూ విడదీయలేనివి. జీవితంలోకి చూసుకోలేనప్పుడు గురుతత్త్వాన్ని అనుభవించలేం. మనం తరచూ కళ్ళు మూసుకొని, మన కోరికల గుర్రాల మీద స్వారీ చేస్తూ ఉంటాం. జీవితం మనకు అందించే జ్ఞానాన్ని అగౌరవ పరుస్తూ ఉంటాం. జ్ఞానాన్ని గౌరవించడం అంటే జీవితాన్ని గౌరవించడమే. మన సొంత జీవితాన్ని తరచి చూడడానికీ, అది ఇచ్చిన జ్ఞానాన్ని గుర్తించడానికి గురుపూర్ణిమ మంచి రోజు.

గురుపూర్ణిమ నాడు గుర్తుంచుకోవాల్సిన మరో విషయం... జీవితం ఇచ్చిన బహుమతులను ఉపయోగించుకోవడం. మీలో ప్రతి ఒక్కరూ జీవితంలో చాలా ఆశీర్వాదాలు, బహుమతులు



ఆర్ట్ ఆఫ్ లివింగ్

పొందారు. వాటిని సద్వినియోగం చేసుకోండి. తద్వారా మరిన్ని బహుమతులు లభిస్తాయి. ఇచ్చేవాడు (భగవంతుడు) ఎలాంటి గుర్తింపునూ కోరుకోకుండా, అవిశ్రాంతంగా ఇస్తూనే ఉన్నాడనీ, అదంతా మీ ప్రతిభే అని మీరు అనుకునేలా మరీ ఇస్తున్నాడనీ, మీరే స్వయంగా సంపాదించుకున్నారని అనుకొనేలా ఇస్తున్నాడనీ గుర్తించండి. నిజానికి ఏదీ మీది కాదు. కానీ మీరు తీసుకున్నట్టు కూడా అనిపించని విధంగా అవన్నీ మీకు ఇస్తున్నాడు. ఇలా జీవితం ఇచ్చిన, ఇస్తున్న బహుమతులను సద్వినియోగం చేసుకోండి. అంటే.. సమాజ, ప్రపంచ శ్రేయస్సుకోసం, ఇతరులలో దైవిక గుణాలను ప్రేరేపించడం కోసం వాటిని ఉపయోగించండి. మీకు మంచి వాగ్ధాటి ఉంటే... మీ మాటలతో పదిమందికి ఉత్తేజం కలిగించండి. సాంత్వన పొందేలా చూడండి. అంతేకాని ఇతరులను నిందించడానికి, చెడు మాట్లాడేందుకు మీ మాటలు వృధా చేయకండి. మీకు అద్భుతమైన మేధస్సు లభించింది. దాన్ని మానవాళి మేలు కోసం మరింత ఉత్తమంగా ఉపయోగించండి. మీకు మంచి కంఠ స్వరం ఉంటే... దాన్ని సద్వినియోగపరచుకోండి. శారీరక బలం ఉంటే సేవ చెయ్యండి. ప్రపంచానికి సేవ చేయడం అంటే పరమాత్మను ఆరాధించడమే. జ్ఞానాన్ని గౌరవించడం ద్వారా మీ జీవితంతో పాటు మీ చుట్టూ ఉన్న అనేక జీవితాలు మెరుగుపడతాయి. ఉన్నత స్థితికి ఎదుగుతాయి.

జీవితంలో అనుసరించవలసిన మరో అందమైన లక్షణం... ఆర్భాటం లేకుండా ధర్మాన్ని పాటించడం. మీకు ఎవరైనా బహుమతి ఇచ్చారని అనుకుందాం. ఆ తరువాత వాళ్ళు దాని గురించి పదేపదే మీకు గుర్తు చేస్తూ ఉంటే ఎలా ఉంటుంది? చికాకుగా అనిపిస్తుంది కదా! మీరు పాటించే ధర్మం గురించి ప్రచారం చేసుకోవడం, పదేపదే చెప్పుకోవడం కూడా అలాంటిదే.

ప్రతి ఒక్కరిలోనూ ఒక గురువు ఉన్నాడు. మీ జ్ఞాన జ్యోతిని వెలిగించండి, మీలోని ఆ గురువుకు హారతి ఇవ్వండి. ఇంతకూ హారతి అంటే ఏమిటి? జ్ఞానంలో, ఆనంద పారవశ్యంలో లీనం కావడాన్నీ, కరిగిపోవడాన్నీ అది సూచిస్తుంది. ఏది సత్యం? ఏది మిథ్య? ఏది సరైనది? ఏది సరైనది కాదు? ఈ ప్రశ్నలు వేరే ఎవ్వరినీ అడగవలసిన అవసరం లేదు. మీలో ఉన్న గురుతత్త్వమే ఇది సరైనదనీ, ఇది తప్పు అనీ చెబుతుంది. ఆ గురుతత్త్వాన్ని తప్పకుండా గౌరవించాలి.

గురుపూర్ణిమ... సాధకులకు పండగ రోజు. ఈ రోజున వారు తమ ప్రయాణాన్ని అవలోకించుకొని, సాధించినదాన్ని, సాధించాల్సిన లక్ష్యాన్నీ గురువుకు సమర్పణ చేస్తారు. కృతజ్ఞతా భావంతో ఉత్సవం చేసుకుంటారు. అందుకే గురుపూర్ణిమ జీవన ప్రయాణాన్ని సమీక్షించుకొనే రోజు, సరిదిద్దుకొనే రోజు. తాము జీవితంలో ఎంత దూరం ప్రయాణించాం, ఏయే అనుభవాలు పొందాం, ఏ జ్ఞానాన్ని సంపాదించాం, ఎన్ని ఆటంకాలను అధిగమించాం, అంతిమంగా ప్రయాణం ఎటువైపు సాగుతోంది? అనే అంశాలను సమీక్షించుకొనే రోజు. మళ్ళీ సేవకు, సత్సంగానికీ, ఆధ్యాత్మిక సాధనకు తమను తాము పునరంకితం చేసుకొనే రోజు.

● గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్

ఇన్ఫీ లాభం రూ.6,368 కోట్లు

2024-25 ఆదాయ అంచనా 3-4 శాతానికి పెంచిన సంస్థ

ఈసారి 20,000 వరకు ఫ్రెషర్ల నియామకాలు

బెంగళూరు: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి (క్యూ1) కంపెనీ ఏకీకృత నికర లాభం రూ.6,368 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి నమోదైన రూ.5,945 కోట్ల లాభంతో పోలిస్తే 7.1 శాతం వృద్ధి నమోదైంది. ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో ఆర్జించిన రూ.7,969 కోట్ల లాభంతో పోలిస్తే మాత్రం 20.1 శాతం క్షీణించింది. కాగా, ఈ క్యూ1లో కంపెనీకి కార్యకలాపాల ద్వారా సమకూరిన ఆదాయం వార్షిక ప్రాతిపదికన 3.6 శాతం వృద్ధితో రూ.39,315 కోట్లకు పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి స్థిర కరెన్సీ ఆధారిత ఆదాయ వృద్ధి అంచనాను కంపెనీ గతంలో ప్రకటించిన 1-3 శాతం నుంచి 3-4 శాతానికి పెంచింది. నిర్వహణ లాభాల మార్జిన్ అంచనాను మాత్రం యథాతథంగా 20-22 శాతంగా కొనసాగించింది. క్యూ1 నిర్వహణ మార్జిన్ 21.1 శాతంగా నమోదైంది. "బలమైన, విస్తృత స్థాయి వృద్ధి, మెరుగైన నిర్వహణ మార్జిన్, సమృద్ధికరమైన డీల్స్, అత్యధిక నగదు సృష్టితో ఈ ఆర్థిక సంవత్సరానికి అద్భుతమైన ప్రారంభం లభించింది. మా వైవిధ్య సేవలు, క్లయింట్లకు మాపైన అపార నమ్మకం, నిర్విరామ కృషికిదే సాక్ష్య"మని ఇన్ఫోసిస్ సీఈఓ, ఎండీ సలీల్ పరేఖ్ అన్నారు.



కర్ణాటక ప్రభుత్వ నిర్ణయమేదైనా మద్దతిస్తాం

ఉద్యోగ నియామకాలకు సంబంధించి కర్ణాటక ప్రభుత్వం ఏ నిబంధనలు లేదా మార్గదర్శకాలు ప్రవేశ పెట్టినా మా కంపెనీ అందుకు లోబడి ఉంటుందని ఇన్ఫీ చీఫ్ సలీల్ పరేఖ్ స్పష్టం చేశారు. "రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మేం కార్యకలాపాలు సాగిస్తాం. ప్రభుత్వాలు ఏ నియమ, నిబంధనలు తీసుకొచ్చినా మేం మద్దతిస్తా"మని పేర్కొన్నారు.

మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఇన్ఫోసిస్ 410 కోట్ల డాలర్ల విలువైన భారీ డీల్స్‌ను దక్కించుకుంది. అయితే, మార్కెట్ అంచనా 500 కోట్ల డాలర్ల కంటే తక్కువిది. అంతే కాదు, ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో లభించిన 450 కోట్ల డాలర్ల భారీ డీల్స్‌తో పోల్చినా తగ్గింది.
- ఇన్ఫీ అతిపెద్ద ఆదాయ వనరు అయిన ఆర్థిక సేవల రంగం నుంచి రాబడి ఈ క్యూ1లో 0.3 శాతం తగ్గి 27.5 శాతానికి పరిమితమైంది. రిటైల్ రంగ ఆదాయం వాటా కూడా 3 శాతం తగ్గి 13.8 శాతానికి జారుకుంది
- ఐటీ రంగానికి అతిపెద్ద మార్కెట్ అయిన ఉత్తర అమెరికా నుంచి ఆదాయం 1.2 శాతం తగ్గగా.. యూరప్ మార్కెట్ నుంచి రాబడి 9.1 శాతం పెరిగింది. ఇండియా మార్కెట్ రెవెన్యూ 19.9 శాతం వృద్ధి చెందగా.. మిగతా ప్రాంతాల నుంచి ఆదాయం 2.3 శాతం పెరిగింది.
- ఈ మార్చి త్రైమాసికం చివరి నాటితో పోలిస్తే, గడిచిన మూడు నెలల్లో ఇన్ఫోసిస్ ఉద్యోగుల సంఖ్య నికరంగా 1,908 తగ్గి 3,15,332కు పరిమితమైంది. ఏడాది క్రితం స్థాయితో పోలిస్తే ఉద్యోగులు 6 శాతం తగ్గారు. వరుసగా ఆరు త్రైమాసికాలుగా కంపెనీ ఉద్యోగుల సంఖ్య తగ్గుతూ వస్తోంది.
- ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో కంపెనీ ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 12.7 శాతానికి పెరిగింది. మార్చితో ముగిసిన క్వార్టర్‌లో అట్రిషన్ రేటు 12.6 శాతంగా ఉంది.
- ఈ ఆర్థిక సంవత్సరంలో అవసరానుగుణంగా 15,000-20,000 మంది ఫ్రెషర్లను నియమించుకోనున్నట్లు ఇన్ఫోసిస్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ జయేష్ సంఘ్రాజ్కా తెలిపారు.

తోషిబా ట్రాన్స్‌మిషన్ రూ.500 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విద్యుత్ పరికరాల తయారీలోని తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ (టీటీడీఐ) ఉత్పత్తి సామర్థ్యాల విస్తరణపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్ కేంద్రంగా ఉన్న తమ ప్లాంట్‌లో 1,000 కోట్ల జపాన్ యెన్‌లు (సుమారు రూ.500 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు ప్రకటించింది. ఉత్పత్తి సామర్థ్యాలను 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే రాబోయే మూడేళ్ల కాలంలో (2024-2026 ఆర్థిక సంవత్సరాల నాటికి) ఒకటిన్నర రెట్లు పెంచనున్నట్టు తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో సర్జ్ అరెస్టర్ల తయారీకి కొత్త తయారీ ప్లాంట్ కూడా కంపెనీ ఏర్పాటు చేస్తోంది. ద్వితీయార్థంలో ఈ ప్లాంట్ ఉత్పత్తులు వాణిజ్యపరంగా అందుబాటులోకి వస్తాయని తెలిపింది.

రేసింగ్ కార్ల కోసం స్టార్మ్-ఎక్స్ పెట్రోల్

ఐఓసీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) రేసింగ్ కార్లలో ఉపయోగించేందుకు ఆక్టేన్ పరిమాణం అధికంగా ఉండే ప్రత్యేక ఇంధనం స్టార్మ్-ఎక్స్ పెట్రోల్ ఉత్పత్తిని ప్రారంభించింది. దేశంలోని అతి పెద్ద ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ అయిన ఐఓసీ 40 శాతం మార్కెట్ వాటా కలిగి ఉంది. ప్రపంచంలో ఎఫ్ 1 రేసింగ్ కార్లలో ఉపయోగించే ప్రత్యేక ఇంధనం తయారుచేస్తున్న కొద్ది కంపెనీల్లో ఒకటిగా ఐఓసీ చేరింది. ఫరీదాబాద్‌లోని తమ ఆర్ అండ్ డీ కేంద్రం ఈ ప్రత్యేక ఇంధనాన్ని అభివృద్ధి చేసిందని పేర్కొంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,840 ▼	68,600 ▼	99,200 ▼
ముంబై	73,979 ▲	67,765 ▲	91,555 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	555
వరంగల్	542	గోదావరి	555
చిత్తూరు	573	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	115
వరంగల్	110	గుంటూరు	116
కరీంనగర్	110	ఒంగోలు	116
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	121
కర్నూలు	110	నెల్లూరు	121
విశాఖపట్నం	106	అనంతపురం	115
గోదావరి	115		

తగ్గిన సాగర్ సిమెంట్ నష్టాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి గాను సాగర్ సిమెంట్ నష్టాలు తగ్గాయి. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో కంపెనీ రూ.560.6 కోట్ల కన్సాలిడేటెడ్ రెవెన్యూపై రూ.32.2 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ రెవెన్యూ రూ.539.67 కోట్లుగా ఉండగా నికర నష్టం రూ.42.28 కోట్లుగా ఉంది. సమీక్షా కాలంలో మొత్తం వ్యయాలు రూ.602.75 కోట్ల నుంచి రూ.616.45 కోట్లకు పెరిగాయి. సమీక్షా త్రైమాసిక కాలంలో సార్వత్రిక ఎన్నికలు, ఎండల తీవ్రత కారణంగా అమ్మకాలు తగ్గినప్పటికీ ఆర్థిక ఫలితాలు అంచనాలకు తగ్గట్టుగానే ఉన్నాయని సాగర్ సిమెంట్ జాయింట్ ఎండీ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

విలాస భవనాలు తెగ కొనేస్తున్నారు..!

హైదరాబాద్‌లో 44% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో రూ.4 కోట్లకు పైబడిన విలువ గల విలాసవంతమైన భవనాలకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. ఈ ఏడాది జనవరి-జూన్ మధ్య కాలంలో దేశంలోని 7 ప్రధాన నగరాల్లో విలాసవంతమైన ఇళ్లకు డిమాండ్ 27 శాతం పెరిగింది. ఈ ఆరు నెలల కాలంలో 8,500 లగ్జరీ ఇళ్లు అమ్ముడుపోయాయని సీబీఆర్‌ఈ తాజా నివేదికలో తెలిపింది. గత ఏడాది ఇదే కాలంలో అమ్ముడుపోయిన లగ్జరీ ఇళ్ల సంఖ్య 6,700 గా ఉంది. ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, హైదరాబాద్ నగరాలు లగ్జరీ ఇళ్లకు ప్రముఖ మార్కెట్లుగా మారాయి. ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో 3,300 యూనిట్లు, ముంబైలో 2,500 యూనిట్లు, హైదరాబాద్‌లో 1,300 యూనిట్లు అమ్ముడుపోయాయి. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే హైదరాబాద్ మార్కెట్లో లగ్జరీ ఇళ్ల అమ్మకాలు 44 శాతం పెరిగాయి.

విశాఖ, విజయవాడల్లో భారీగా పెరిగిన ఇళ్ల ధరలు: దేశంలోని 30 అగ్రగామి మార్కెట్లలో నివాస గృహాలకు డిమాండ్ భారీగా పెరిగిన కారణంగా ఇళ్ల ధరలు గత నాలుగేళ్ల కాలంలో 94 శాతం పెరిగాయని రియల్ ఎస్టేట్ డేటా అనలిటిక్ కంపెనీ ప్రాప్ ఈక్విటీ తెలిపింది. 2019-20తో పోల్చితే 2023-24 నాటికి ప్రాజెక్టు సగటు ప్రారంభ ధరను పరిగణనలోకి తీసుకుని ప్రాప్ ఈక్విటీ ఈ నివేదిక తయారుచేసింది. ఈ టాప్ 30 మార్కెట్లలో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం, విజయవాడ, గుంటూరు ఉన్నాయి. ఆ నివేదిక ప్రకారం 24 ద్వితీయ శ్రేణి మార్కెట్లలో ఇళ్ల ధరల్లో రెండంకెల వృద్ధి చోటు చేసుకుంది. వీటిలో కూడా టాప్ 10 మార్కెట్లలో ధరల వృద్ధి 54 శాతం నుంచి 94 శాతం మధ్యన ఉంది. విశాఖలో ఇళ్ల ధర 11 శాతం మేరకు పెరిగింది.



సెన్సెక్స్ @ 81,000

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా నాలుగో రోజూ సరికొత్త శిఖరాలకు ఎగబాకాయి. సెన్సెక్స్ తొలిసారిగా 81,000 మైలురాయిని దాటగా.. నిఫ్టీ 24,800 స్థాయిని అధిగమించింది. ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. గురువారం నష్టాల్లో ప్రారంభమైన సెన్సెక్స్.. 326 పాయింట్ల మేర క్షీణించి 80,390 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. మధ్యాహ్నం నుంచి కొనుగోళ్లు పుంజుకోవడంతో సూచీ మళ్లీ లాభాల్లో పయనించి ఏకంగా 81,000 స్థాయిని దాటేసింది. ఒక దశలో 806 పాయింట్ల లాభంతో 81,522.55 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి సెన్సెక్స్ 626.91 పాయింట్ల లాభంతో 81,343.46 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ప్రారంభ నష్టాల నుంచి తేరుకుని ఒక దశలో 224.75 పాయింట్ల వృద్ధితో 24,837.75 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివరికి 187.85 పాయింట్ల లాభంతో 24,800.85 వద్ద జీవితకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి దేశీయ ఐటీ దిగ్గజాలు అంచనాలకు మించిన పనితీరు కనబర్చడంతో పాటు రూపాయి మరింత క్షీణించడంతో ఈ రంగ షేర్లలో ఇన్వెస్టర్లు జోరుగా కొనుగోళ్లు జరిపారని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. కాగా ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.454.32 లక్షల కోట్లకు (5.43 లక్షల కోట్ల డాలర్లు) పరిమితమైంది.

రూ.750 కోట్లతో అరబిందో ఫార్మా షేర్ల బైబ్యాక్

0.88 శాతం వాటా వెనక్కు
ఒక్కో షేరుకు రూ.1,460 చెల్లింపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అరబిందో ఫార్మా రూ.750 కోట్లతో షేర్ల బైబ్యాక్‌ను చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా 0.88 శాతం వాటాకు సమానమైన మొత్తం 51,36,986 షేర్లను వెనక్కు తీసుకోనున్నట్లు తెలిపింది. ఒక్కో షేరును రూ.1,460కి బైబ్యాక్ చేయనున్నట్లు పేర్కొంది. టెండర్ ఆఫర్ రూట్ ద్వారా చేపట్టనున్న ఈ బైబ్యాక్‌కు రూ.750 కోట్ల వరకు వెచ్చించనున్నట్లు అరబిందో ఫార్మా వెల్లడించింది. ఇందుకు జూలై 30వ తేదీని రికార్డు తేదీగా నిర్ణయించినట్లు తెలిపింది. జూన్ త్రైమాసికం ముగిసేనాటికి కంపెనీలో ప్రమోటర్లకు 51.8 శాతం వాటా ఉండగా విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ)కు 16.73 శాతం, మ్యూచువల్ ఫండ్స్‌కు 19.17 శాతం వాటాలున్నాయి. కాగా కంపెనీ షేర్ల బైబ్యాక్‌ను చేపట్టడం ఇదే తొలిసారి. గురువారం బీఎస్ఈలో అరబిందో ఫార్మా షేరు 2.49 శాతం నష్టంతో రూ.1,337.50 వద్ద క్లోజైంది.

ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణలో కీలక పురోగతి

బిడ్డర్లకు ఆర్‌బీఐ అనుమతి జారీ

న్యూఢిల్లీ: ప్రస్తుతం ఎల్ఐసీ ఆధీనంలో ఉన్న ఐడీబీఐ బ్యాంక్‌ను కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చిన బిడ్డర్లకు ఆర్‌బీఐ 'ఫిట్ అండ్ ప్రాపర్' అనుమతిని మంజూరు చేసినట్లు తెలిసింది. తద్వారా బ్యాంక్ ప్రైవేటీకరణ ప్రక్రియలో మరో అడుగు ముందుకు పడింది. ఎందుకంటే, బిడ్డర్లు బ్యాంకింగ్ నియంత్రణ నియమావళికి లోబడి ఉన్నారని ఆర్‌బీఐ ధ్రువీకరించడం ఈ ప్రక్రియ పురోగతికి కీలకం. ఇక తుది నిర్ణయం కేంద్రం చేతుల్లో ఉంది. వచ్చేవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే 2024-25 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల ఇందుకు సంబంధించిన సంకేతాలిచ్చే అవకాశాలున్నాయి. ఐడీబీఐ బ్యాంక్ కొనుగోలు బరిలో కోటక్ మహీంద్రా బ్యాంక్‌తో పాటు సీఎస్‌బీ బ్యాంక్ ప్రమోటర్ ఫెయిర్‌ఫాక్స్ ఇండియా హోల్డింగ్స్ కూడా ఉన్నట్లు సమాచారం. ఐడీబీఐ బ్యాంక్‌లో కేంద్రం 45.5 శాతం వాటా కలిగి ఉండగా.. ఎల్ఐసీ 49.24 శాతం వాటాతో అతిపెద్ద వాటాదారుగా కొనసాగుతోంది.

కేవీబీ లాభంలో 28% వృద్ధి

చెన్నై: ప్రైవేట్ రంగంలోని కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ).. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.458.65 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.358.63 కోట్లు)తో పోల్చితే లాభం 27.86 శాతం వృద్ధి చెందింది. సమీక్షా కాలంలో నికర వడ్డీ ఆదాయం కూడా 14.27 శాతం వృద్ధితో రూ.1,025 కోట్లకు చేరుకుంది. కాగా స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 1.99 శాతం నుంచి 1.32 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.59 శాతం నుంచి 0.38 శాతానికి తగ్గినట్లు పేర్కొంది. వృద్ధి, లాభదాయకతపరంగా మెరుగైన పనితీరును కనబరచటం ఎంతగానో కలిసి వచ్చిందని తెలిపింది. కాగా జూన్ త్రైమాసికం ముగిసే నాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.1,70,059 కోట్లు అధిగమించింది

స్పోర్ట్స్

సూర్యకే పగ్గాలు

- శుభ్‌మన్‌కు వైస్ కెప్టెన్సీ
- వన్డేలకు రోహిత్, కోహ్లీ
- లంక టూర్‌కు భారత జట్లు



టీ20 జట్టు

సూర్యకుమార్ (కెప్టెన్), గిల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, రింకూ సింగ్, రియాన్ పరాగ్, రిషభ్ పంత్, శాంసన్, హార్దిక్, శివమ్ దూబే, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, ఖలీల్ అహ్మద్, సిరాజ్.
(15 మంది)

వన్డే జట్టు

రోహిత్ శర్మ (కెప్టెన్), గిల్ (వైస్ కెప్టెన్), కోహ్లీ, కేఎల్ రాహుల్, పంత్, శ్రేయాస్ అయ్యర్, శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, సిరాజ్, సుందర్, అర్ష్‌దీప్, రియాన్ పరాగ్, అక్షర్, ఖలీల్, హర్షిత్ రాణా.
(15 మంది)

న్యూఢిల్లీ: భారత టీ20 జట్టు కొత్త కెప్టెన్‌గా డాషింగ్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్‌ను ఎంపికచేశారు. లంకతో టీ20, వన్డే సిరీస్‌లకు భారత జట్లను గురువారం బీసీసీఐ ప్రకటించింది. పొట్టి వరల్డ్‌కప్ తర్వాత విశ్రాంతిలో ఉన్న రోహిత్, విరాట్ కోహ్లీ వన్డే జట్టులోకి వచ్చారు. ఈ నెల 27 నుంచి శ్రీలంకతో జరిగే మూడు టీ20ల సిరీస్ నుంచి ఫుల్‌టైమ్ సారథిగా సూర్య ప్రయాణం ఆరంభం కానుంది. ఇక మూడు వన్డేల సిరీస్ వచ్చే నెల 2 నుంచి జరగనుంది. రాహుల్ ద్రవిడ్ తర్వాత కోచ్‌గా నియమితుడైన గౌతమ్ గంభీర్ ఇదే తొలి సిరీస్. శుభ్‌మన్ గిల్‌ను వైస్ కెప్టెన్‌గా ప్రకటించారు. టీ20 ఫార్మాట్‌కు రోహిత్ వీడ్కోలు పలకడంతో.. హార్దిక్ పాండ్యాకు పగ్గాలు అప్పగిస్తారని భావించారు. కానీ, హార్దిక్‌కు టీమ్ పగ్గాలు అప్పజెప్పేందుకు కొత్త కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఆసక్తి కనబర్చలేదు. 2026 పొట్టికప్‌ను దృష్టిలో ఉంచుకొని జట్టును తయారు చేస్తున్న విషయాన్ని పాండ్యాకు అర్థమయ్యే విధంగా చెప్పినట్టు సమాచారం. టీ20లు ఆడేందుకు అంగీకరించిన హార్దిక్.. వ్యక్తిగత కారణాలతో వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. రియాన్ పరాగ్, ఢిల్లీ పేసర్ హర్షిత్ రాణాకు 50 ఓవర్ల ఫార్మాట్‌లో తొలిసారి చోటు దక్కింది. కాగా, శ్రేయాస్ అయ్యర్ అనూహ్యంగా వన్డే టీమ్‌లో రీఎంట్రీ ఇచ్చాడు. బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ నిలిపివేయడంతో అయ్యర్ అంతర్జాతీయ కెరీర్ ముగిసిందని భావించారు. కానీ, గౌతీతో ఉన్న సాన్నిహిత్యం శ్రేయాస్ కెరీర్‌కు ఒకరకంగా ఊపిరిలూదింది.



హర్షిత్ రాణా

మా బంధం ముగిసింది



నటాషా, నేను విడిపోయాం
హార్దిక్ వెల్లడి

న్యూఢిల్లీ: టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, అతడి సెర్బియా భార్య నటాషా స్టాన్కోవిచ్ విడిపోయారు. ఈ విషయాన్ని హార్దిక్, నటాష ఇన్‌స్టా వేదికగా గురువారం రాత్రి అధికారికంగా ప్రకటించారు. నాలుగేళ్ల తమ వైవాహిక బంధానికి ముగింపు పలుకుతున్నట్టు హార్దిక్ వెల్లడించాడు. కుమారుడు అగస్త్యను తీసుకుని నటాషా బుధవారం సెర్బియా వెళ్లిపోయింది. కలిసి సాగేందుకు ప్రయత్నించినా కుదరలేదని..అందువల్ల పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకున్నట్టు హార్దిక్ వివరించాడు. 2020లో హార్దిక్, నటాషా వివాహ బంధంతో ఒక్కటికాగా..మరుసటి ఏడాది వారికి మగబిడ్డ జన్మించాడు. బాబు బాధ్యతను తామిద్దరం చూసుకుంటామని వారు చెప్పారు.

మనం 124లోనే !

ఫిఫా వరల్డ్ ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) తాజా ర్యాంకింగ్స్‌లో భారత జట్టు 124వ స్థానంలోనే కొనసాగుతోంది. నిరుడు టాప్-100లోకి దూసుకొచ్చిన భారత్ అత్యుత్తమ ర్యాంక్ 99. కానీ అప్పటినుంచి మన జట్టు ర్యాంక్ దిగజారుతూ వస్తుండడం గమనార్హం. ఇక ఆసియా ర్యాంకింగ్స్ విషయానికొస్తే..మనోళ్లు 22వ స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అర్జెంటీనా అగ్రభాగాన కొనసాగుతోంది.

తులిక.. తెచ్చేనా పతకం?



తులికా మాన్
జూడో

పారిస్‌కు వందమందికి పైగా బృందంతో భారత్ బరిలో దిగుతోంది. ఇందులో ఒక్క ప్లేయరే తలపడుతున్న క్రీడాంశాలు మూడున్నాయి. వాటిలో జూడో ఒకటి. అది కూడా మహిళల విభాగంలో. ఆమే ఢిల్లీకి చెందిన 25 ఏళ్ల తులికా మాన్. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల్లో తులిక రజత పతకం సొంతం చేసుకుంది. మహిళల +78 కిలోల విభాగంలో మొత్తం 1345 పాయింట్లు సాధించిన ఆమె..ఒలింపిక్ క్వాలిఫికేషన్ ర్యాంకింగ్స్‌లో 36వ స్థానంలో నిలిచింది. తులిక ప్రస్తుతం స్పెయిన్‌లోని వలెన్సియాలో శిక్షణ తీసుకుంటోంది. అటు నుంచే ఈనెల 26న ఒలింపిక్స్ ప్రారంభం నాటికి పారిస్ చేరుకోనుంది. తులిక తొలి బౌట్ ఆగస్టు రెండున జరగనుంది. గత టోక్యో విశ్వక్రీడల్లోనూ జూడోలో భారత్ నుంచి ఒక్కరే బరిలో ఉన్నారు. మహిళల 48 కిలోల విభాగంలో సుశీలా దేవి లిక్‌మబమ్ తలపడింది. కానీ ఆమె తొలి రౌండ్‌ను దాటలేకపోయింది. ఈనేపథ్యంలో తులికా మాన్ అయినా ఒలింపిక్స్‌లో భారత్ తొలి పతకం అందిస్తుందేమో చూడాలి.



పారిస్‌లో ఇనుప తెర !

పారిస్: మరికొద్ది రోజుల్లో ఒలింపిక్స్ ప్రారంభం కానుండడంతో క్రీడల నిర్వాహకులు భద్రతా చర్యలపై దృష్టి సారించారు. ఉగ్రవాద చర్యల నిరోధంలో భాగంగా..సెంట్రల్ పారిస్ సహా సెన్ నదీపరివాహక ప్రాంతంలో గురువారం ఇనుప తెరను ఏర్పాటు చేశారు. ఈనేపథ్యంలో పోలీసులు ప్రత్యేకంగా జారీ చేసిన పాస్ ఉంటే తప్ప సెన్ నదిని దాటేందుకు, సెంట్రల్ పారిస్‌లో తిరిగేందుకు అనుమతించడంలేదు. కిలోమీటర్ల పొడవున ఇనుప తెర ఏర్పాటు చేయడంతోపాటు పోలీసులనూ భారీగా మోహరించారు. ఫోన్‌లో క్యూఆర్ కోడ్ లేదా పేపర్ ప్రింట్ ఉన్నవారినే ఈ ప్రాంతంలో తిరిగేందుకు పోలీసులు అనుమతిస్తున్నారు.

'ఆసియా' పోరుకు అమ్మాయిలు సై

బరిలో ఎనిమిది జట్లు
ఆరంభ మ్యాచ్‌లో నేపాల్ x యూఏఈ
మధ్యాహ్నం 2 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



ట్రోఫీతో కెప్టెన్లు

దంబుల్లా: ఈ ఏడాది అక్టోబరులో మహిళా టీ20 ప్రపంచకప్ జరగాల్సి ఉంది. అయితే అంత కంటే ముందే ఆసియాకప్‌తో అలరించేందుకు ఆయా జట్లు సిద్ధమవుతున్నాయి. శ్రీలంక ఆతిథ్యమివ్వనున్న ఈ టోర్నీ శుక్రవారం నుంచి ఈనెల 28 వరకు జరుగుతుంది. ఆరంభ మ్యాచ్‌ల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి నేపాల్-యూఏఈ.. రాత్రి 7.30 నుంచి భారత్-పాక్ తలపడనున్నాయి. ఇక టోర్నీలోని ఫైనల్ సహా మొత్తం 15 మ్యాచ్‌లూ రణ్‌గిరి దంబుల్లా అంతర్జాతీయ స్టేడియంలోనే నిర్వహించనున్నారు. మొత్తంగా పాల్గొనే 8 జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. **గ్రూప్-ఎ**లో భారత్, నేపాల్, పాక్, యూఏఈ ఉండగా.. **గ్రూప్-బి**లో బంగ్లాదేశ్, మలేసియా, శ్రీలంక, థాయ్‌లాండ్ జట్లున్నాయి. ఒక్కో జట్టు తమ గ్రూపులో మూడు మ్యాచ్‌లు ఆడుతుంది. అనంతరం రెండు గ్రూపుల్లోని టాప్-2 జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి.

మనదే ఆధిపత్యం: ఆసియాకప్ ఆరంభం నుంచే భారత మహిళల జట్టు తమ హవాను కొనసాగిస్తోంది. మొత్తం 8సార్లు ఈ టోర్నీ జరగ్గా కేవలం 2018ని మినహాయిస్తే అన్నిసార్లూ భారత జట్టే చాంపియన్‌గా నిలిచింది. మొదట 2004 నుంచి 2008 వరకు వన్డే ఫార్మాట్‌లో జరిగిన ఆసియాకప్.. 2012 నుంచి పొట్టి ఫార్మాట్‌కు మారింది. రెండేళ్ల క్రితం బంగ్లాదేశ్‌లో జరిగిన ఆసియాకప్‌లోనూ హర్మన్‌ప్రీత్ సేన గెలిచింది. అలాగే టీ20 ఆసియాకప్‌లో 20 మ్యాచ్‌లు ఆడగా 17 గెలిచింది. ఇప్పుడు డిఫెండింగ్ చాంపియన్‌గా మరోసారి తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలనుకుంటోంది. మరోవైపు నేపాల్ జట్టు 2016 తర్వాత ఆసియాకప్‌లో చోటు దక్కించుకోగా.. యూఏఈకిది వరుసగా రెండో టోర్నీ.

పాక్‌తో టైటిల్ వేట

నేడు టీమిండియా తొలి మ్యాచ్
రాత్రి 7 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..


మహిళల ఆసియాకప్ ఆరంభ మ్యాచ్‌లోనే భారత జట్టు తమ చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను ఎదుర్కొనబోతోంది. ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్‌కప్‌నకు సన్నాహకంగానే కాకుండా టీమ్ కాంబినేషన్ కోసం కూడా హర్మన్‌ప్రీత్ సేన ఈ టోర్నీని వినియోగించుకోవాలనుకుంటోంది. టీ20 ఫార్మాట్‌లో జరిగిన నాలుగు పర్యాయాల్లో మూడుసార్లు భారత్ విజేతగా నిలిచింది. అలాగే అంతర్జాతీయ టీ20ల్లో ప్రత్యర్థి పాక్‌పై భారత మహిళలు సంపూర్ణ ఆధిపత్యంతో ఉన్నారు. ఆడిన 14 మ్యాచ్‌ల్లో 11-3తో పైచేయిగా ఉండడం విశేషం. ఇప్పుడు తమ గ్రూప్ 'ఎ'లోనే ఉన్న పాక్‌ను చిత్తుగా ఓడించి అద్భుత బోణీతో టైటిల్ వేటను ఆరంభించాలనుకుంటోంది. ఇటీవల దక్షిణాఫ్రికాతో ముగిసిన మూడు టీ20ల సిరీస్‌ను 1-1తో డ్రా చేసుకున్న భారత్ చక్కటి ఆత్మవిశ్వాసంతో ఉంది. అలాగే రెగ్యులర్ మ్యాచ్‌లతో ప్రాక్టీస్‌కు ఢోకా లేకుండాపోయింది. భారత బ్యాటింగ్‌లో స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన తిరుగులేని ఫామ్ కొనసాగిస్తోంది. అటు షఫాలీ ఆటలోనూ మెరుపులు కనిపిస్తే ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు కనిపిస్తాయి. కెప్టెన్ హర్మన్ మిడిలార్డర్‌లో నిలకడగా ఆడుతోంది. అన్నింటికంటే ముఖ్యంగా జట్టు బౌలర్లు అన్ని ఫార్మాట్లలోనూ అదరగొడుతుండడం సానుకూలాంశం. అటు గత మేలో ఇంగ్లండ్‌పై 0-3తో టీ20 సిరీస్‌ను కోల్పోయిన పాక్ జట్టులో ఆరుగురిని తొలగించారు. మరో ముగ్గురికి ఈ ఏడాది ఒక్క మ్యాచ్ కూడా ఆడిన అనుభవం లేదు. దీంతో పటిష్ఠ భారత్‌కు పాక్ ఏమేరకు పోటీనిస్తుందో వేచిచూడాల్సిందే..

గ్రూప్ 'ఎ'లో భారత్ షెడ్యూల్

తేదీ	ప్రత్యర్థి
జూలై 19	పాకిస్థాన్
జూలై 21	యూఏఈ
జూలై 23	నేపాల్

ఇంగ్లండ్ వరల్డ్ రికార్డు

4.2 ఓవర్లలోనే 50 రన్స్
తొలి ఇన్నింగ్స్ 416



పోప్ (121)

నాటింగ్‌హామ్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఇంగ్లండ్ జట్టు బజ్‌బాల్ గేమ్‌తో చెలరేగింది. గురువారం ఆరంభమైన ఈ టెస్టులో మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య జట్టు మొదటి 4.2 ఓవర్లలోనే 50 పరుగులు పూర్తి చేసి అత్యంత వేగంగా ఈ ఫీట్‌ను సాధించిన టీమ్‌గా చరిత్రకెక్కింది. గతంలోనూ ఈ రికార్డు (1994లో దక్షిణాఫ్రికాపై 4.3 బంతుల్లో) ఇంగ్లండ్ పేరిటే ఉంది. ఈ దూకుడైన ఆటతీరుతో మొదటి రోజు ఆట ముగిసేసరికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 88.3 ఓవర్లలో 416 పరుగులకు ఆలౌటైంది. పోప్ (121) శతకం, ఓపెనర్ డకెట్ (71) హాఫ్‌సెంచరీ సాధించారు. అలాగే మిడిలార్డర్‌లో కెప్టెన్ స్టోక్స్ (69), వోక్స్ (37), బ్రూక్, (36), స్మిత్ (36) రాణించారు. అల్జారికి 3.. హాడ్జ్, సింక్లెయిర్, సీల్స్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

అరాచకం గురించి జగన్ మాట్లాడితే రోత పుడుతోంది: లోకేశ్



అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): హింస, విధ్వంసం, అరాచకం గురించి వైఎస్ జగన్ మాట్లాడితే రోత పుడుతోందని మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. గురువారం ఆయన ఇక్కడ ఒక ప్రకటన విడుదల చేశారు. 'బాధితులనే నిందితులుగా చేసి ప్రభుత్వం తానే టెర్రరిజానికి పాల్పడిన ఆ చీకటి రోజులు రాష్ట్రంలో పోయి నెల దాటింది. మిగిలిన ఆ అరాచకపు ఆనవాళ్లను కూడా కూటమి ప్రభుత్వం కూకటివేళ్లతో పెళ్లగించి వేస్తోంది. ప్రజా తీర్పుతో ఉనికి కోల్పోయిన జగన్ తనకు పేటెంట్ ఉన్న ఫేక్ ప్రచారాలతో.. అబద్ధపు పునాదులపై మళ్లీ నిలబడాలని చూస్తున్నాడు. అందుకే రాష్ట్రంలో ఎక్కడ ఏం జరిగినా హత్యా రాజకీయాలంటూ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తున్నాడు. శవాలతో రాజకీయాలు చేసే మీ విషపు సంస్కృతికి తెర దించుతూ ప్రజలు ఇచ్చిన తీర్పే మొన్నటి ఎన్నికల ఫలితాలు. మీకు అర్థం కాదా?' అని ప్రశ్నించారు. నేరాలు చేసి మళ్లీ వాటిని వేరేవారిపై నెట్టే మీ కపట నాటకాలకు కాలం చెల్లింది. జగన్ హెచ్చరికలకు భయపడే ప్రభుత్వం కాదు. ప్రజలకు, వారి మాన ప్రాణాలకు జవాబుదారిగా ఉండే ప్రజా ప్రభుత్వం మాది' అని లోకేశ్ పేర్కొన్నారు.

ఎంపీ విజయసాయిరెడ్డికి పిచ్చి పట్టింది: మంత్రి కొల్లు



మచిలీపట్నం, జూలై 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి పిచ్చి పట్టిందని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. "విజయసాయిరెడ్డి తనపై వచ్చిన ఆరోపణలకు సరైన సమాధానం చెప్పలేక విలేకరులను 'ఏరా, ఒరేయ్' అనడం సిగ్గుచేటు. చేసిన పాపాలను కప్పిపుచ్చుకునేందుకు బాధ్యత కలిగిన ఎంపీ హోదాలో ఉన్న విజయసాయిరెడ్డి దుర్మార్గంగా, బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నారు. మీడియాసంస్థల యాజమాన్యాలపై, విలేకర్లపై విమర్శలు సిగ్గుచేటు. భవిష్యత్తులో ఆయన తగిన మూల్యం తప్పక చెల్లించుకుంటారు. విజయసాయిరెడ్డికి కామంతో, పేర్ని నానికి డబ్బు మదంతో కళ్లుమూసుకుపోయి మాట్లాడుతున్నారు. పేర్ని అక్రమ ఆస్తుల చిట్టాలన్నీ మా వద్ద ఉన్నాయి. వాటిపై పూర్తిస్థాయి విచారణ చేసి అన్ని లెక్కలు త్వరలోనే తేలుస్తాం. ఆయన ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడితే మంచిది' అని మంత్రి కొల్లు హెచ్చరించారు.

ఇసుక మాఫియాను విడిచిపెట్టం: మంత్రి సుభాశ్



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం, జూలై 18: గత ప్రభుత్వ హయాంలో ఇసుక మాఫియాకు పాల్పడిన దళారులను, ప్రోత్సహించిన అధికారులను విడిచి పెట్టేదే లేదని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సు భాశ్ హెచ్చరించారు. గురువారం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'జగన్ పాలనలో ఒక్క కార్మిక శాఖలోనే రూ.3 వేల కోట్లను దారి మళ్లించారు. ఈఎస్‌ఐ ఆస్పత్రులు అస్తవ్యస్తంగా మారాయి. ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా నిర్వహిస్తాం. అభివృద్ధి పేరుతో తమకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి అయిన కాడికి వైసీపీ నేతలు కమీషన్లు దండుకున్నారు. కొన్ని పనుల్లో అంచనా వ్యయాలు రెండు నుంచి మూడు రేట్లు ఎక్కువగా ఉన్నాయి. వీటన్నింటిని విచారణ చేయిస్తున్నాం' అని మంత్రి తెలిపారు.

ఫిర్యాదులన్నీ వైసీపీ నేతల అరాచకాలపైనే

- ప్రభుత్వ పరంగా పరిష్కరించదగినవి పరిష్కరిస్తాం
- టీడీపీ కార్యాలయంలోని గ్రీవెన్స్ సెల్‌లో మంత్రి ఎండీ ఫరూఖ్



అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ నేతల అరాచకాలు, దోపిడీల మీద ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి. వారి హయాంలో ఏ ఒక్క సమస్య పరిష్కరించలేదనడానికి ఇప్పుడు వస్తున్న ఫిర్యాదులే సాక్ష్యం' అని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూఖ్ అన్నారు. గురువారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వై.ప్రభాకర్ చౌదరితో పాటు కలసి మంత్రి గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'వచ్చిన ఫిర్యాదులను కూలంకషంగా పరిశీలించి ప్రభుత్వం పరిష్కరించగలిగిన ఫిర్యాదులను ఆయా శాఖలకు పంపించి వీలైనంత త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. మరికొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాం. కొన్నింటిని పరిష్కరించాలని అధికారులకు ఫోన్ చేసి సూచించాం. మరికొన్నింటిని ఎమ్మెల్యేల దృష్టికి పంపించాం. టీడీపీ ప్రజాప్రతినిధులు పరిష్కరించదగిన సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్తాం. పార్టీ పరంగా పదవులు కోరుతూ కొన్ని దరఖాస్తులు వచ్చాయి. వాటిని కూడా పరిశీలించి కష్టపడ్డ వారికి కచ్చితంగా న్యాయం చేస్తాం' అని మంత్రి హామీ ఇచ్చారు.

విశాఖను చిగురుటాకులా వణికించారు

- ఇన్నాళ్లూ నిద్రపోయి ఇప్పుడు ఎర్రమట్టి దిబ్బలనడం కుసంస్కారం: గంటా



విశాఖపట్నం, జూలై 18(ఆంధ్రజ్యోతి): 'అధికారం చేతిలో ఉందని ఎక్కడ పడితే అక్కడ భూములు కబ్జా చేశారు. ప్రశాంతమైన విశాఖ నగరాన్ని చిగురుటాకులా వణికింపజేసిన చరిత్ర వైసీపీది. అవన్నీ మరిచిపోయి ఇప్పుడు ఎర్రమట్టి దిబ్బలపై మాట్లాడడం కుసంస్కారానికి నిదర్శనం' అని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు. ఈమేరకు గురువారం ఆయన ఎక్స్‌లో స్పందించారు. భీమిలి మండలంలోని ఎర్రమట్టి దిబ్బల తవ్వకాలకు గత ఏడాది వైసీపీ ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని, ఆరు నెలల నుంచి తవ్వకాలు జరుపుతున్నామని భీమిలి కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి సూరిబాబు బుధవారం వెల్లడించారు. దీనిని పక్కనపెట్టి... తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 40 రోజుల్లోనే భౌగోళిక వారసత్వ సంపదైన ఎర్రమట్టి దిబ్బలను తవ్వేస్తున్నారంటూ వైసీపీ మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. దీనిని గంటా శ్రీనివాసరావు తిప్పి కొట్టారు. 'ఎర్రమట్టి దిబ్బల తవ్వకాల వెనుక ఎవరు ఉన్నారనే విషయం నిగ్గు తేల్చడానికి విచారణ కమిటీని నియమించాం. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు దరఖాస్తు చేయగానే అనుమతులు ఇచ్చింది. ఇన్నాళ్లూ మొద్దు నిద్ర నటించి, ఇప్పుడు బురద జల్లడం తగదు' అని అమర్‌నాథ్‌కు హితవు పలికారు.

పిన్నెల్లి బెయిల్ పిటిషన్ డిస్మిస్

గుంటూరు(లీగల్), జూలై 18: పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం పాల్వాయి గేటు పోలింగ్ బూత్‌లో ఈవీఎం ధ్వంసం, కారంపూడి సీఐ నారాయణస్వామిపై దాడి సంఘటనలపై దాఖలైన కేసుల్లో ప్రస్తుతం నెల్లూరు జైలులో రిమాండ్‌లో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ గురజాల అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న గుంటూరు నాలుగో అదనపు జిల్లా కోర్టు జడ్జి రుద్రపాటి శరత్‌బాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బెయిల్ పిటిషన్‌పై ఈ నెల 10న ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తరఫున మాజీ పీపీ ఇనకొల్లు వెంకటేశ్వర్లు వాదనలు వినిపించగా ప్రాసిక్యూషన్ తరఫున ఈ కేసుల్లో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన హైకోర్టు న్యాయవాది అశ్వినీ కుమార్ వాదనలు వినిపిస్తూ... 'ఈ కేసులో దర్యాప్తు పూర్తి కాలేదు. పిన్నెల్లి, పోలీసులకు విచారణలో ఏ మాత్రం సహకరించలేదు. మరికొందరు నిందితులు పరారీలో ఉన్నారు' అని కోర్టుకు తెలిపారు.

వైసీపీ భూతానికి చంద్రబాబు సమాధి కట్టారు

- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేశ్

అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ భూతానికి చంద్రబాబు సమాధి కట్టారు. అరుంధతి సినిమాలో పశుపతిలా సమాధి నుంచి వైసీపీ ఫేక్ ప్రచారాలు చేస్తోంది' అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేశ్ అన్నారు. గురువారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వాన్ని ఇరికించేందుకు జగన్ కుట్రలు చేస్తున్నారు. హత్యలు, అరాచకాలంటూ అబద్ధాలు ఆడుతున్నారు. సమాధిలో ఉన్న వైసీపీ భూతాలను బయటికి రానిస్తే ప్రజల రక్తం తాగుతాయి. వైసీపీ ఫేక్ ప్రచారాన్ని ప్రజలే తిప్పికొట్టాలి' అని పిలుపునిచ్చారు.

గంజాయి మత్తు వదిలేదెలా?

(మొదటి పేజీ తరువాయి)



విషయాలు బయటపడుతున్నాయి. ప్రభుత్వం గంజాయిపై హోం మంత్రి అనిత నేతృత్వంలో ఐదుగురు (విద్య, వైద్య, గిరిజన, ఎక్సైజ్) మంత్రులతో ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఇటీవల సుదీర్ఘంగా చర్చించిన మంత్రుల కమిటీ ఒక ఐజీ నేతృత్వంలో యాంటీ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మత్తుముఠాలపై నిఘా పెట్టడం.. కింగ్‌పిన్‌ల ఆచూకీ కనిపెట్టడం.. 2014-19 మధ్యలో ఇతర రాష్ట్రాలకు వెళ్లి ఎర్రచందనం స్మగ్లర్లపై దాడులు చేసిన తరహాలో గంజాయి స్మగ్లర్లపై దాడులు చేయడం.. స్మగ్లర్ల ఆస్తులు గుర్తించి జప్తు చేయడం.. మత్తు మాఫియాతో సంబంధాలున్న ప్రతి ఒక్కరికీ ఉచ్చు బిగించడం వంటి చర్యలు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. అంతేగాక వర్షాలు పడుతున్న ఈ సమయంలో అసలు గంజాయి సాగే చేయకుండా అడ్డుకోవడం.. గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించడం.. గంజాయి విత్తనాలు, సాగుకు పెట్టుబడి ఇస్తున్న దళారులకు సంకెళ్లు వేయాలని నిర్ణయించింది. మార్కెట్ విలువ ప్రకారం కనీసం పాతికవేల కోట్ల మత్తు వ్యాపార వ్యవస్థీకృత దందాను బొంద పెట్టేందుకు సిద్ధమవుతోంది.

అంతులేని నిర్లక్ష్యం

విజయవాడలో బ్లేడ్ బ్యాచ్ ఆగడాల నుంచి రాష్ట్రంలో ఎక్కడ నేరాలు జరిగినా దాని వెనుక మత్తు ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. నిందితులు గంజాయి మత్తులో నేరాలు చేశారని గత ప్రభుత్వంలో అప్పటి హోంశాఖ మంత్రి తానేటి వనిత వెల్లడించిన సందర్భాలున్నాయి. అయితే గంజాయి కట్టడికి జగన్ ప్రభుత్వం ఆచరణలో ఏ మాత్రం పనిచేయలేదు. కేవలం ప్రకటనలు, సమీక్షలతో సరిపెట్టింది. జగన్ పాలనలో ఊరు ఊరు, వీధి వీధికి చిల్లరకొట్టుల్లో చాక్లెట్ల తరహాలో గంజాయి విక్రయాలు వ్యాపించాయి. వైసీపీ నాయకులు స్మగ్లర్లతో కుమ్మక్కై సాగుకు ప్రోత్సహించి లాభపడ్డారు. మత్తుముఠాలు విద్యాసంస్థలే లక్ష్యంగా యువతపై గురిపెట్టాయి. ఈ విష సంస్కృతి రోజురోజుకూ విస్తరిస్తూ రాష్ట్రంలోని పాఠశాలలకు కూడా వ్యాపించింది. ఇటీవల హోంశాఖ మంత్రి అనిత ఒక పాఠశాలను సందర్శించినప్పుడు ఓ టీచర్ చేసిన విజ్ఞప్తి పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. 'విద్యార్థుల స్కూల్ బ్యాగుల్లో గంజాయి ఉంటోంది మేడం. పోలీసులతో కట్టడి చేయించండి' అని టీచర్ ఫిర్యాదు చేశారు.

మత్తులో యువత

- ఆంధ్రప్రదేశ్‌లో మాదక ద్రవ్యాలకు అలవాటుపడ్డ బాధితుల సంఖ్య గత ఏడాది చివరి నాటికి సుమారు 23 లక్షలు. కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ స్థాయీ సంఘం పార్లమెంటుకు సమర్పించిన నివేదికతో పాటు రాష్ట్రంలో గంజాయి కట్టడికి ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) చెప్పిన లెక్కలివి.
- మాదక ద్రవ్యాలు వినియోగించే వారిలో అత్యధికంగా యువత ఉన్నారు.
- మాదక ద్రవ్యాల బాధితుల్లో మైనర్లు సుమారు 17 శాతం ఉన్నారు. ఇందులో కేవలం గంజాయి బానిసలుగా పాతిక వేల మందికి పైగా బాలురు ఉన్నట్లు సెబ్ చెబుతోంది.

స్మగ్లింగ్‌లో ఏపీ టాప్

- జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్ మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌లో మొదటి స్థానం సాధించింది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ), నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) లాంటి కేంద్ర విభాగాల నివేదికలు వెల్లడించడం రాష్ట్రంలో దారుణ పరిస్థితులకు నిదర్శనం.
- 2021లో దేశవ్యాప్తంగా ఎన్‌సీబీ 7.50 లక్షల కిలోల గంజాయి స్వాధీనం చేసుకోగా... ఇందులో ఏపీ వాటా రెండు లక్షల కిలోలకు (27శాతం) పైనే.
- 2020లో దేశవ్యాప్తంగా ఎన్‌సీబీ 5.82 లక్షల కిలోల గంజాయి స్వాధీనం చేసుకోగా.. ఇందులో ఏపీ వాటా 98 వేల కిలోలు.
- 2019లో దేశవ్యాప్తంగా 3.42 లక్షల కిలోల గంజాయి స్వాధీనం చేసుకోగా.. ఇందులో ఏపీ వాటా 71 వేల కిలోలు.
- 2019, 2021లో అత్యధికంగా గంజాయి పట్టుబడ్డ రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన నిలిచింది. 2020లో రెండో స్థానంలో ఉంది.

రెండేళ్లలో 293% పెరుగుదల

మాదక ద్రవ్యాలకు అలవాటు పడ్డ బాధితుల్ని గుర్తించి విముక్తి కల్పించేందుకు కేంద్రం కృషి చేస్తోంది. నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ డిమాండ్ రిడక్షన్ కార్యక్రమం అమలు చేస్తోంది. 2018-19లో ఇందులో ఏపీ నుంచి 1752 మంది నమోదయ్యారు. 2021 నాటికి ఈ సంఖ్య ఏకంగా 6,898కు చేరింది. కేవలం రెండేళ్లలోనే మత్తు బానిసల సంఖ్య 293 శాతం పెరిగింది. 2023 చివరి నాటికి మరింత వేగంగా ప్రమాదకర స్థాయికి చేరినట్లు సెబ్ వర్గాలు చెబుతున్నాయి. గడిచిన ఐదేళ్లలో మన రాష్ట్రంలో ఆత్మహత్యలకు పాల్పడిన వారిలో వందకు ఐదుగురు మత్తు బానిసలేనని నేషనల్ పోలీస్ రికార్డ్స్ బ్యూరో గణాంకాలు చెబుతున్నాయి.

ఓపియెడ్స్ తర్వాత గంజాయే

రాష్ట్రంలో అత్యధికంగా పది లక్షల మంది ఓపియెడ్స్‌కు బానిసలుగా మారారు. ఆ తర్వాత గంజాయి వినియోగమే ఎక్కువగా ఉన్నట్లు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సర్వేలు చెబుతున్నాయి. ఓపియెడ్స్, ఇన్‌హెలెంట్స్, సెడెటివ్స్‌కు సంబంధించిన మత్తు వినియోగం 18 ఏళ్లు దాటిన యువతతో పాటు మైనర్లలోనూ ఎక్కువగా ఉంటోంది. ఈ పరిస్థితిని అరికట్టేందుకు నిషా ముక్త భారత్ పేరుతో కేంద్రం చర్యలు చేపట్టింది. దేశంలోని 272 జిల్లాల్లో మత్తు వినియోగం, ప్రభావం తీవ్రతను గుర్తించింది. ఇందులో రాష్ట్రంలో ఉమ్మడి విశాఖపట్నం, ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలు ఉన్నాయి. విశాఖ మన్యం గంజాయి సాగు, సరఫరాకు కేంద్రంగా ఉన్నట్లు ఎన్‌సీబీ నివేదికలో పేర్కొంది. మత్తు అంటే.. ఒకప్పుడు పంజాబ్ గుర్తొచ్చేది. గడిచిన ఐదేళ్లలో పరిస్థితులపై అధ్యయనం చేసిన కేంద్ర సంస్థలు అంతకు ఐదు రెట్లు ఏపీలో ఉన్నట్లు చెబుతుండటం భయాందోళన కలిగించే విషయం.

పట్టుబడింది రెండు శాతమే..

వైసీపీ అధికారంలోకి వచ్చాక ఏపీలో గంజాయి సాగు, స్మగ్లింగ్ విచ్చలవిడిగా పెరిగింది. డీఆర్ఐ, ఎన్‌సీబీ, సెబ్, పోలీసు విభాగాలన్నీ కలిపి తనిఖీల్లో గత ఏడాది చివరి నాటికి ఏడు లక్షల కిలోలు స్వాధీనం చేసుకున్నాయి. ఒక్క విశాఖ మన్యం నుంచే ఏటా లక్ష కిలోల గంజాయి ఏపీలోని పలు జిల్లాలతో పాటు దేశంలోని పలు రాష్ట్రాలకు రవాణా అవుతోంది. అయితే ఏపీ నుంచి రవాణా అవుతున్న గంజాయిలో దేశవ్యాప్తంగా పట్టుబడింది కేవలం రెండు శాతమేనని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

వైసీపీ కవ్వింపులకు రెచ్చిపోవద్దు

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

- బాబు, పవన్ మన కంటే పెద్ద బాధితులు
- అందరూ సంయమనంగా ఉండాలి
- టీడీపీ, జనసేన శ్రేణులకు హోంమంత్రి పిలుపు



అమరావతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సైకో పాలనలో అందరి కన్నా ఎక్కువగా చంద్రబాబు, పవన్ కల్యాణే ఇబ్బంది పడ్డారని, వారే అతిపెద్ద బాధితులని హోం మంత్రి అనిత అన్నారు. జగన్ ప్రభుత్వంలో ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలే కాదు.. సామాన్య ప్రజలు కూడా ఇబ్బంది పడ్డారని చెప్పారు. ఆ అరాచక పాలనకు ముగింపు పలికిన జనం.. ఇప్పుడు మనకు అధికారం ఇచ్చారని, వైసీపీ కవ్వింపు చర్యలతో రెచ్చిపోకుండా సంయమనం పాటించాల్సిన బాధ్యత టీడీపీ, జనసేన కార్యకర్తలపై ఉందని స్పష్టం చేశారు. గురువారమిక్కడ వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. అరాచక శక్తులు అశాంతి సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. వైసీపీ వాళ్లు రెచ్చగొడుతున్నా.. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దని.. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చే పని చేయొద్దని కూటమి శ్రేణులను కోరారు. చట్టపరంగానే అరాచక శక్తులను అణచివేస్తామన్నారు. 'గడచిన ఐదేళ్లలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైంది. ఇంకా గాడిన పడని డిపార్ట్‌మెంట్‌ను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. ఇటీవల జరుగుతున్న ఘటనలకు గత ప్రభుత్వ విధ్వంసం తాలుకా అవశేషాలే మూలాలు' అని చెప్పారు. శాంతి భద్రతలు సరిదిద్దేందుకు కొంతసమయం పడుతుందని, చంద్రబాబు ప్రభుత్వం వీలైనంత త్వరలో సరిచేస్తుందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో అమాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధించారని.. టీడీపీ, జనసేన కార్యకర్తలే కాకుండా నేతలు అంతకంటే ఎక్కువ వేధింపులకు గురయ్యారని.. చంద్రబాబును మరీ ఎక్కువగా బాధించారని గుర్తు చేశారు. బాధ్యులపై చట్టపరంగా చర్యలుంటాయన్నారు. 'టీడీపీ, జనసేన కార్యకర్తల ఆవేదన అర్థం చేసుకున్నాం. అయితే మీరు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదు. చంద్రబాబు పాలన అంటేనే శాంతిభద్రతలకు భరోసా అని దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ పోగొట్టవద్దు' అని సూచించారు. గత ఐదేళ్లలో చేసిన అరాచకాల్లో ఒక్కటి కూడా ఉపేక్షించేది లేదని చెప్పారు.

బాబాయి హత్యపై జగన్ లేఖ రాయాలి..

రాష్ట్రంలో హింసాత్మక ఘటనలపై రాష్ట్రపతి, కేంద్ర హోం మంత్రికి వైసీపీ అధ్యక్షుడు జగన్ లేఖ రాయడంపై అనిత స్పందించారు. సొంత చిన్నాన్న వివేకా హత్య, ఎమ్మెల్సీ అనంత్ బాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి శవాన్ని డోర్ డెలివరీ లాంటిపైనా లేఖ రాస్తే మంచిదని హితవు పలికారు. జగన్‌లాగా చంద్రబాబు వాడిని చంపు.. వీడిని చంపు అనే నాయకుడు కాదన్నారు. అధికారం కోసం సొంత చిన్నాన్న రక్తాన్ని ఆయనకు పూసేందుకు ప్రయత్నించిన జగన్.. కోడికత్తి డ్రామా తరహాలో గులక రాయి డ్రామాను రక్తి కట్టించలేక పోయారని ఎద్దేవా చేశారు.

ముంచెత్తిన వాన

(మొదటి పేజీ తరువాయి)

95.8, కూనవరంలో 74, పెంటపాడులో 73.5, కొవ్వూరులో 71.25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బంగాళాఖాతంలో గురువారం అల్పపీడనం ఏర్పడింది. ఇది రాత్రికి బలపడి తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది వాయువ్యంగా పయనించి శుక్రవారం నాటికి వాయువ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ప్రవేశించి వాయుగుండంగా బలపడుతుందని వాతావరణశాఖ తెలిపింది. తరువాత వాయువ్యంగా పయనించి శనివారం ఒడిశాలో తీరం దాటుతుందని పేర్కొంది. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతుండడంతో గురువారం తెల్లవారుజాము నుంచి ఉత్తర కోస్తాలో అనేకచోట్ల, దక్షిణ కోస్తాలో పలుచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీవర్షాలు కురిశాయి. శుక్రవారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడ కుంభవృష్టిగా, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, కోనసీమ, ఉభయ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీగా, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, బాపట్ల, ప్రకాశం, నంద్యాల, కర్నూలు జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తాతీరం వెంబడి గాలులు వీస్తున్నాయని మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

ఏలూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

ఏలూరు జిల్లాలో ఎడతెరపిలేకుండా భారీగా వర్షాలు కురుస్తుండటంతో ఏజెన్సీ ప్రాంతాల్లో కొండవాగులు పొంగి రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు మండలంలో పెదవాగు ప్రమాద స్థాయిలో ప్రవహిస్తోంది. గండిపడే అవకాశాలు ఉండడంతో ప్రజలను అప్రమత్తం చేశారు. పోలవరం మండలం, బుట్టాయిగూడెం మండలాల్లో కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రాజవరం బ్రిడ్జివద్ద ఎర్రకాల్వ ప్రమాదస్థాయిలో ప్రవహిస్తోంది. జంగారెడ్డిగూడెం మండలం పట్టెన్నపాలెం వద్ద జల్లేరు వాగు పొంగడంతో రాకపోకలు స్తంభించాయి. గోదావరి వరద పెరుగుతుండటంతో అధికారులు, సిబ్బందిని ఇరిగేషన్ ఎస్ఈ అప్రమత్తం చేశారు. తమ్మిలేరు వరద వల్ల ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్టు ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రకటించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఏలూరులో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశామని, అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు చేసినట్టు కలెక్టర్ ప్రకటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.



నారాయణపురం కట్టమైసమ్మ ఆలయం వద్ద వరదల్లో చిక్కుకున్న వారిని హెలికాప్టర్ ద్వారా కాపాడుతున్న దృశ్యం



బుట్టాయగూడెం వద్ద వాగులో చిక్కుకుపోయిన స్కూల్ బస్సును ఒడ్డుకు తోసుకెళ్తున్న గ్రామస్థులు

వరదలో చిక్కుకున్న స్కూల్ బస్సు

ఏలూరు జిల్లా బుట్టాయగూడెం వద్ద పంటకాల్వ వరదలో జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఓ ప్రైవేటు స్కూలు బస్సు చిక్కుకుంది. బస్సులో ఎనిమిది మంది పిల్లలు ఉన్నారు. స్థానికులతో పాటు విద్యార్థులు ధైర్యం చేసి వాగులో దిగి బస్సును బయటకు నెట్టడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పెదవాగు ఉగ్రరూపం

వేలేరుపాడు మండలంలోని ఎద్దువాగు బ్రిడ్జిపై నుంచి కొన్ని మీటర్ల ఎత్తున వరద ప్రవహించటంతో ఎద్దువాగు వంతెనకు ఇరువైపులా నిర్మించిన అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయి కేవలం వంతెన మిగిలింది. పెదవాగు ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండిపోయింది. ప్రాజెక్టు దిగువన కమ్మరగూడెం, అల్లూరి నగర్, కోయమాధారం ఒంటిబండ, ఊటగుంపు, రామవరం, గుళ్ళవాయి, గ్రామాల్లోకి వరద పోటెత్తి కొన్ని ఇళ్లు నేలమట్టమయ్యాయి. కమ్మరగూడెం గ్రామస్థులు సమీప కొండగుట్టపైకి పరుగెత్తి ప్రాణాలు దక్కించుకున్నారు. అనేక చోట్ల రహదారికి గండ్లుపడ్డాయి. నాళ్ళవరం కాలనీ వద్ద కొండవాగులు పొంగడంతో పశువులు కొట్టుకుపోయాయి. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో మండలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

వరదలో చిక్కుకున్న 30 మంది..

పెదవాగు వరద కారణంగా తెలంగాణలోని నారాయణపురం సమీపంలోని కట్టమైసమ్మ ఆలయం వద్ద సుమారు 10 అడుగుల మేర రహదారిపై వరద నీరు ప్రవహించింది. అంతకు ముందే అశ్వారావుపేట వైపు నుంచి వేలేరుపాడు వైపు వస్తున్న వాహనదారులు పెదవాగు బ్రిడ్జిపై ఎటూ వెళ్లే వీలు లేక చిక్కుకుపోయారు. ఇందులో కొందరు కట్టమైసమ్మ ఆలయంలో ఆశ్రయం పొందగా క్షణ క్షణానికి వరద పెరిగిపోయి ఆలయం సగానికి పైనే మునిగిపోవడంతో ఆలయం షెడ్ల పైకి ఎక్కారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అక్కడికి చేరుకొని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి పరిస్థితి వివరించి 30 మందికి పైనే వరదలో చిక్కుకున్నట్లు తెలిపారు. రెండు హెలికాప్టర్లతో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. సాయంత్రానికి 25మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు సమాచారం. మిగిలిన వారిని కాపాడే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. కృష్ణా నదికి అనుసంధానంగా ఉన్న వాగులు, వంకలు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రకాశం బ్యారేజీ దిగువన కాలవలు పూర్తిస్థాయి నీటిసామర్థ్యంతో ప్రవహిస్తున్నాయి.

కొండవాగులో చిక్కుకున్న కారు..

ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం కొండవాగు ఉధృతిలో ఒక కారు కొట్టుకుపోయింది. రాజమహేంద్రవరం నుంచి వేలేరుపాడు మండలం రుద్రంకోటకు కారు వెళ్తుండగా కొండ వాగు ప్రవాహంలో వీరి కారు కొట్టుకుపోయింది. కారులో ముగ్గురు పెద్దలు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కారు ఎదురుపొదల్లో చిక్కుకోవడంతో 40 మంది గ్రామస్థులు పీకల్లోతు నీళ్లలో ఈదుకుంటూ వెళ్లి వారిని కాపాడారు. భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను అప్రమత్తం చేశారు. ఏలూరు జిల్లాలో పెదవాగుకు గండి పడే అవకాశం ఉండటంతో ఏలూరు జిల్లా కలెక్టర్, ఎస్పీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

'చావు' రాజకీయం!

(గుంటూరు - ఆంధ్రజ్యోతి)

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శుక్రవారం వినుకొండకు వెళ్తున్నారు. ఎందుకో తెలుసా!? వైసీపీలో గ్యాంగ్ వార్ కారణంగా మరణించిన వైసీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు! హత్యా రాజకీయాలను ఖండించేందుకు! జరిగింది దారుణం.. ఘోరం! ఇందులో ఎలాంటి సందేహమూ లేదు. కానీ... ఈ హత్యను టీడీపీపైకి నెట్టేసి పరామర్శకు బయలుదేరడమే జగన్ మార్కు రాజకీయం! ఐదేళ్ల తన పాలనలో పల్నాడులో వైసీపీ నేతలు ఎన్ని అరాచకాలు సాగించినా పట్టించుకోకుండా, హత్యలు జరిగినా స్పందించని జగన్...ఇప్పుడు వినుకొండకు బయలుదేరడమే పెద్ద విచిత్రం!

పక్కా గ్యాంగ్ వార్...

బుధవారం రాత్రి వినుకొండలో... నడి వీధిలో రషీద్ అనే యువకుడిని షేక్ జిలానీ అనే మరో యువకుడు హత్య చేశాడు. వీళ్లిద్దరూ ఒకప్పుడు స్నేహితులే. వైసీపీలో క్రియాశీలంగా వ్యవహరించే వాళ్లు. వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రోత్సాహంతో వినుకొండలో రౌడీగా ఎదిగిన పీఎస్ ఖాన్ గ్యాంగ్‌లో రషీద్, జిలానీ సభ్యులు. వీరిద్దరి మధ్య ఆధిపత్యపోరు మొదలైంది. ఏటా తొలి ఏకాదశి రోజున వినుకొండలో కొండ తిరునాళ్లు నిర్వహిస్తుంటారు. గత ఏడాది తిరునాళ్ల సందర్భంగా గ్యాంగ్ లీడర్ ఖాన్ ఓ లాడ్జిలో పార్టీ ఏర్పాటు చేశాడు. జిలానీ ఆ రోజు బీర్ బాటిళ్లతో దాడి చేయడంతో ఒక యువకుడు గాయపడ్డాడు. పీఎస్ ఖాన్ రషీద్‌కు మద్దతుగా నిలిచాడు. రషీద్, ఖాన్ గ్యాంగ్‌లో మరి కొందరు కలిసి గత సంవత్సరం జూలైలో జిలానీ ఇంటిపై దాడికి వెళ్లారు. జిలానీ ఇంట్లో లేకపోవడంతో... అతని అన్న జిమ్ జానీపై దాడి చేసి గాయపరిచారు. ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. ఇంటి ముందు ఉన్న బుల్లెట్ వాహనాన్ని కూడా తగలపెట్టారు. ఈ విషయంపై జానీ పోలీసులకు ఫిర్యాదు చేసినా... అప్పటి ఎమ్మెల్యే బొల్లా కారణంగా పోలీసులు పట్టించుకోలేదు. అంతటితో ఆగకుండా జిలానీపైనే హత్యాయత్నం కేసు పెట్టి జైలుకు పంపారు. జిలానీని, ఆయన సోదరుడిని లక్ష్యంగా చేసుకుని మరిన్ని కేసులు పెట్టారు. దీంతో... రషీద్‌పై జిలానీ కక్ష పెంచుకున్నాడు. మళ్లీ సరిగ్గా తొలి ఏకాదశి రోజునే రషీద్‌ను చంపాలని జిలానీ పథకం రచించుకున్నాడు. కొబ్బరిబోండాల కత్తితో నడి వీధిలో రషీద్‌ను జిలానీ నరికి చంపేశాడు! ఈ హత్య వెనుక ఇంత నేపథ్యముంది! కానీ... రషీద్‌ను చంపింది టీడీపీ వాళ్లేనంటూ జగన్ రోత పత్రిక భారీ కథనాన్ని వండి వార్చింది. ఇక... జగన్ ఏకంగా వినుకొండకు 'హత్యా రాజకీయ పరామర్శ'కు బయలుదేరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ, ఎస్పీ

వ్యక్తిగత కక్షలే కారణం: ఐజీ, ఎస్పీ

రషీద్ హత్యకు వ్యక్తిగత కక్షలే కారణమని... ఇందులో రాజకీయ కోణం లేదని గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పల్నాడు ఎస్పీ కె. శ్రీనివాసరావులు తెలిపారు. గురువారం వినుకొండ పట్టణ పోలీస్ స్టేషన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు.

నేడు వినుకొండకు మాజీ సీఎం జగన్

వైసీపీ కార్యకర్త రషీద్ కుటుంబ సభ్యులకు పరామర్శ

అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): సహచర కార్యకర్త చేతిలో వైసీపీ కార్యకర్త రషీద్ హత్యపై వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. గురువారం బెంగళూరు నుంచి తాడేపల్లికి చేరుకున్న ఆయన శుక్రవారం వినుకొండకు వెళ్లనున్నారు. రషీద్ కుటుంబ సభ్యులను పరామర్శించడానికి శుక్రవారం వస్తున్నట్లు ఆయన స్వయంగా మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుకు సమాచారం ఇచ్చారు. గురువారం సామాజిక మాధ్యమంలో ఘటనపై స్పందిస్తూ... 'రాష్ట్రంలో రాక్షసపాలన కొనసాగుతుంది. లా అండ్ ఆర్డర్ అన్నది ఎక్కడా కనిపించడం లేదు. ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. వైసీపీని అణగదొక్కాలన్న కోణంలో ఈ దారుణాలకు పాల్పడుతున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన నెలన్నర రోజుల్లోనే ఆంధ్రప్రదేశ్ అంటే... హత్యలు, అత్యాచారాలు, రాజకీయ కక్షలతో చేస్తున్న దాడులు, విధ్వంసాలకు చిరునామాగా మారిపోయింది. నిన్నటి వినుకొండ హత్య ఘటన దీనికి పరాకాష్ఠ. ముఖ్యమంత్రి సహా బాధ్యతతో వ్యవహరించాల్సిన వ్యక్తులు రాజకీయ దురుద్దేశాలతో వెనకుండి ఇలాంటి దారుణాలను ప్రోత్సహిస్తున్నారు' అని ఆరోపించారు.

ఇంజనీరింగ్ కనీస ఫీజు 43 వేలు

- రూ.3 వేలు పెంచుతూ ఉత్తర్వులు జారీ

అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల కనీస ఫీజును రూ.43వేలుగా నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ఇచ్చిన జీవోలో కనీస ఫీజు రూ.40వేలుగా పేర్కొంది. గతేడాది కనీస ఫీజు రూ.43 వేలుగా ఉందని, ఇప్పుడు ఇంకా తగ్గిందని కాలేజీల యాజమాన్యాలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చాయి. అలాగే గతేడాది యాజమాన్యాలు ఫీజులపై హైకోర్టుకు వెళ్లగా దానిపై న్యాయస్థానం ఆదేశాలు ఇటీవల వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో కనీస ఫీజును రూ.3వేలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇది ప్రస్తుత విద్యా సంవత్సరానికే వర్తిస్తుందని స్పష్టం చేసింది. అయితే రూ.1.05 లక్షలుగా నిర్ణయించిన గరిష్ఠ ఫీజులో మాత్రం ఎలాంటి మార్పులు ఉండవు. తాజా నిర్ణయంతో 120కి పైగా కాలేజీలకు మేలు జరగనుంది. మరోవైపు ఎంటెక్ కనీస ఫీజు రూ.50వేలుగా నిర్ణయిస్తూ ఉన్నత విద్యాశాఖ మరో ఉత్తర్వు జారీ చేసింది. 178 కాలేజీలకు ఎంటెక్ ఫీజులు ఖరారు చేసింది. గరిష్ఠ ఫీజు రూ.90వేలుగా నిర్ణయించింది. ఈ ఫీజులు ప్రస్తుత విద్యా సంవత్సరానికే వర్తిస్తాయని స్పష్టంచేసింది.

ఇంజనీరింగ్ కాలేజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కృతజ్ఞతలు

పెదకాకాని, జూలై 18: ఏపీలో ఇంజనీరింగ్ విద్యాభివృద్ధికి, వెనుకబడిన కళాశాలల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చూపిన చొరవ ప్రశంసనీయమని ఏపీ ఇంజనీరింగ్ కాలేజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. గురువారం జరిగిన సంఘం సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా మొదటి దశ కౌన్సెలింగ్‌ను త్వరితగతిన పూర్తిచేసి జూలై 19 నుంచి తరగతులు ప్రారంభించేలా చొరవ తీసుకున్న సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లకు ఏపీ ఇంజనీరింగ్ కాలేజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. లోకేశ్ చొరవతో గత సంవత్సరం కంటే అదనంగా 20 వేల మంది విద్యార్థులు రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే సౌలభ్యం కలిగిందని తెలిపారు. కళాశాలల ఫీజులు రూ.43వేల నుంచి గరిష్ఠంగా రూ.1.05 లక్షల వరకు అమలు చేసినందుకు, విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈభేటీలో సంఘం ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రావు, ఉపాధ్యక్షుడు కంచర్ల శ్రీకాంత్(ఎమ్మెల్సీ), ట్రెజరర్ సత్యనారాయణ, సభ్యులు రాజలింగం, రాంమోహనరావు పాల్గొన్నారు.

నేడు రాజమౌళి బాధ్యతలు

- జీఏడీలో రిపోర్టు చేసిన కృష్ణతేజ

అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): యూపీ నుంచి ఏపీకి డిప్యూటేషన్ వచ్చిన అడుసుమిల్లి రాజమౌళి నేడు బాధ్యతలు తీసుకొనున్నారు. 2014-19 మధ్యలో ఆయన సీఎంఓలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు కూడా ప్రభుత్వం ఆయన సేవలను సీఎంఓలో ఉపయోగించుకోనుంది. మూడు రోజుల క్రితమే ఆయనను రిలీవ్ చేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. యుపీ ప్రభుత్వం కూడా ఆమోదించడంతో ఆయన ఏపీకి వచ్చారు. శుక్రవారం ఉదయం సీఎం చంద్రబాబుని కలిసిన అనంతరం సీఎంఓలో బాధ్యతలు తీసుకొనున్నారు. ఆయన కోసం బ్లాక్ 1లో ప్రత్యేక చాంబర్ ఏర్పాటు చేశారు. సీఎం కార్యదర్శిగా ఆయనకు పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉంది. కాగా, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సిఫార్సుతో కేరళ నుంచి ఏపీకి వచ్చిన కృష్ణతేజ కూడా ఏపీలో రిపోర్టు చేశారు. మూడు రోజుల క్రితమే కేంద్ర ప్రభుత్వం ఆయన డిప్యూటేషన్‌ను ఆమోదించింది. కేరళ ప్రభుత్వం కూడా డిప్యూటేషన్‌కు ఆమోదించడంతో ఆయన గురువారం మధ్యాహ్నం జీఏడీలో రిపోర్టు చేశారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్రను కలిశారు. శుక్రవారం ఆయన పోస్టింగ్ ఆర్డర్ కూడా రానుంది. రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్ కమిషనర్ లేదా డైరెక్టర్‌గా ఆయనను నియమించే అవకాశం ఉంది.

పోస్టు నుంచి లేపేస్తాం!

- మరెక్కడా పోస్టింగు రాకుండా చేస్తాం
- పెద్దాయన ఫోన్‌చేసినా వినవా?
- సర్వే-సెటిల్‌మెంట్ కమిషనర్‌కు పెద్దిరెడ్డి మనుషుల బెదిరింపులు
- అయినా లొంగని సిద్ధార్థ్ జైన్
- రాగానిపల్లె భూమి కేసులో కొత్తకోణం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

> విలువైన భూమిపై కన్నేసిన జగన్ ప్రభుత్వ పెద్దలు దాన్ని హస్తగతం చేసుకోవాలనుకున్నారు. తామేం చెప్పినా చేయాలని, ఎక్కడ అంటే అక్కడ సంతకం పెట్టాలని అధికారులను బెదిరించారు. మాట వినని వారిపై అసమర్థులు, టీడీపీ కోవర్టులన్న ముద్రవేసి పోస్టుల నుంచి తప్పించారు. మాట వినే వారిని తెచ్చుకుని భూములు స్వాహా చేశారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో భూదోపిడీకి పెద్దలు ప్రయోగించిన మంత్రాంగం ఇదీ. అచ్చం ఇలాగే చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం రాగానిపల్లె ఎస్టేట్ భూముల విషయంలో నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మనుషులు రెవెన్యూ, సర్వే అధికారులను తీవ్రస్థాయిలో బెదిరించారు. మాట వినని తహసీల్దార్, సర్వేయర్, ఆర్డీవోలపై దాడులకు తెగబడ్డారు. సీనియర్ ఐఏఎస్‌లను సైతం తీవ్రంగా బెదిరించి లొంగదీసుకునే ప్రయత్నం చేశారు.

చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం రాగానిపల్లెలోని 982 ఎకరాల ఎస్టేట్ భూములపై 1970 నుంచీ వివాదం నడుస్తోంది. దీన్ని పట్టా భూమిగా పేర్కొంటూ ఇచ్చిన ఉత్తర్వులను అనేక దశల్లో అధికారులు కొట్టివేస్తూ వచ్చారు. చివరకు కొందరు 2006లో హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సర్వే-సెటిల్‌మెంట్ కమిషనర్‌ను కోర్టు ఆదేశించింది. అందరికీ నోటీసులిచ్చి వారి వాదనలు వినాలని, పుంగనూరు తహశీల్దార్ వాదన కూడా వినాలని కోర్టు చెప్పింది. అయితే ఆ తర్వాత 2022 వరకు ఈ భూమిపై ఎలాంటి పురోగతి లేదు. దీనిపై చిత్తూరు జిల్లా వైసీపీ నేతలు కన్నేసిన తర్వాతే కదలిక వచ్చింది. ఎలాగూ సర్వే, సెటిల్‌మెంట్ కమిషనర్‌నే కేసు సెటిల్ చేయాలని కోర్టు చెప్పినందున.. నాటి కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారి సిద్ధార్థ్ జైన్‌ను ముగ్గులోకి దించి తమకు అనుకూలంగా ఉత్తర్వులు పొందాలని భావించారు. పెద్దిరెడ్డి మనుషులు పలుమార్లు ప్రభుత్వ పెద్దల ద్వారా ఆయనపై ఒత్తిడి తెచ్చారు. నేరుగా పెద్దిరెడ్డి కూడా మూడుసార్లు ఫోన్ చేసి సానుకూల ఉత్తర్వులు ఇవ్వాలంటూ జైన్‌ను ఆదేశించినట్లు తెలిసింది. అయితే ప్రభుత్వ పెద్దలు కోరినట్లుగా ఉత్తర్వులిస్తే ఏం జరుగుతుందో ఆయనకు తెలుసు. ఆయన గతంలో చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ఈ భూమి గురించిన పూర్తి వివరాలూ తెలుసు. గతంలో చిత్తూరు జేసీగా ఉన్న ఓ ఐఏఎస్ అధికారి ఇనాం, ఎస్టేట్ భూములను అడ్డగోలు ఉత్తర్వులతో పరాధీనం చేస్తే కలెక్టర్ హోదాలో జైన్ సెటిల్‌మెంట్ కమిషనర్ వద్ద అప్పీల్ చేయించి ఆ ఉత్తర్వులను నిలుపుదల చేయించారు. తర్వాత ఆ కేసులపై విచారణ జరుగగా.. సంబంధిత అధికారిపై సర్కారు చర్యలు తీసుకుంది. ఈ అనుభవం ఉన్న జైన్ రాగానపల్లె కేసు వివరాలను అధ్యయనం చేశాక ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ఫైలును పక్కనబెట్టారు. దీంతో పెద్దిరెడ్డి మనుషులు.. 'సారు చెప్పిన కేసు ఏమైంది? ఏం నిర్ణయం తీసుకున్నారు' అంటూ పలుమార్లు ఫోన్లు చేసి వెంటనే సెటిల్ చేయాలని హుకుం జారీ చేశారు. నేరుగా సర్వే-సెటిల్‌మెంట్ కార్యాలయానికి వెళ్లి బెదిరింపులకు దిగినట్లు తెలిసింది. 'మేమంటే లెక్కలేదా? సారు చెప్పినా ఎందుకు సెటిల్ చేయడం లేదు? ఈ రోజు క్లియర్ చేయాల్సిందే. మేం చెప్పినట్లుగా అనుకూలమైన ఆర్డర్ ఇవ్వాలి. లేకుంటే పోస్టులోనే లేకుండా చేస్తాం. మరెక్కడా పోస్టు ఇవ్వకుండా కూడా చేస్తాం' అని తీవ్రంగా బెదిరించినట్లు తెలిసింది, అయినా ఆయన లొంగకపోవడంతో అప్పటి ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) అధికారిని సైతం రంగంలోకి దించినట్లు సమాచారం.

రూల్స్ అంగీకరించవని చెప్పినా..

కోర్టు చెప్పినట్లుగా తనస్థాయిలో విచారించడం కుదరదని, అందుకు రూల్స్ సమ్మతించవని కమిషనర్ చెప్పినట్లు తెలిసింది. తొలుత సెటిల్‌మెంట్ అధికారి (జేసీ) ఉత్తర్వులివ్వాల్సి ఉంటుందని జైన్ స్పష్టం చేసినట్లు సమాచారం. ఎస్టేట్ రద్దు చట్టం ప్రకారం కొత్తగా విచారణ చేపట్టి నిర్ణయం తీసుకోవాలని కమిషనర్ నాటి జేసీ, ప్రస్తుత తిరుపతి కలెక్టర్ వెంకటేశ్‌ను ఆదేశిస్తూ 2022 ఏప్రిల్ 28న లేఖ రాశారు. నాటి ప్రభుత్వ పెద్ద జోక్యంతో వెంకటేశ్ ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించారు. కమిషనర్ లేఖను లెక్కచేయకుండా.. పెద్దిరెడ్డి మనుషుల ఒత్తిళ్లకు లొంగి రఫ్ పట్టాయే ప్రామాణికమైనదని తేల్చారు.

పట్టణాల్లో పడకేసిన పారిశుధ్యం

- వర్షాకాలంతో ముంచుకొస్తున్న ప్రమాదం
- వేధిస్తోన్న కమిషనర్ల కొరత.. కొరవడిన పర్యవేక్షణ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వానికి పలు సవాళ్లు ఎదురవుతున్నాయి. వైసీపీ సర్కార్ దిగిపోతూ ఖాళీ ఖజానాను ఇచ్చిపోవడంతో కనీస సౌకర్యాలకు కూడా కొత్త సర్కార్ ఇబ్బందులు పడుతోంది. ముఖ్యంగా పట్టణాల్లో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు తంటాలు పడుతున్నారు. ఓ వైపు నిధులు లేకపోవడం, మరో పక్క మున్సిపల్, కార్పొరేషన్లలో కమిషనర్ల కొరతతో విపత్కర పరిస్థితులను అధిగమించేందుకు కొత్త సర్కార్ కుస్తీలు పడుతోంది. మంత్రి నారాయణ పదే పదే సమీక్షలు, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించి ఎన్ని ప్రయత్నాలు చేసినా పట్టణ, స్థానికసంస్థల స్థాయిలో అధికారుల ఆయన వేగాన్ని అందుకోలేకపోతున్నారని చెప్తున్నారు. ఎన్నికల ముందు నుంచే రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. బ్లీచింగ్ తదితర పారిశుధ్య నివారణకు అవసరమైన నిధులు కూడా లేకపోవడంతో పాటు పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా కరువయ్యారు.

ఇన్‌చార్జి పాలనలోనే సీడీఎంఏ

రాష్ట్రంలో పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కమిషనర్లు లేరు. విజయవాడ లాంటి పెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌లో కూడా రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో పట్టణ పాలన కుంటుపడింది. బాపట్ల, నందికొట్కూరు, కల్యాణదుర్గం, సాలూరు, యలమంచిలి మున్సిపాలిటీల్లో కమిషనర్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జ్‌తో కొనసాగుతోంది. అన్ని మున్సిపల్, కార్పొరేషన్లను పర్యవేక్షించాల్సిన సీడీఎంఏ సైతం ఇన్‌చార్జ్‌తోనే నడుస్తోంది. టిడ్కో ఎండీ ఈ బాధ్యతలు చేపడుతుండగా ఆయనకు బదిలీ రావడంతో మరో అధికారిని ఇన్‌చార్జ్‌గా పెట్టారు. ఇలా మొత్తం మున్సిపల్ శాఖలో పాలన అస్తవ్యస్తంగా మారిపోయింది. మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖలో పలువురు అధికారులు, ఉద్యోగులు డిప్యూటేషన్‌పై వచ్చి పనిచేస్తున్నారు. కొత్త సర్కార్ వచ్చిన తర్వాత వాళ్లంతా మాతృశాఖలకు వెళ్లడానికి ఉద్యుక్తులయ్యారు. పలువురు బదిలీల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. బదిలీ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో వారంతా చిత్తశుద్ధితో పనిచేసే పరిస్థితులు కొరవడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ప్రభుత్వం ముందుగా అధికారుల బదిలీ ప్రక్రియను వేగవంతం చేసి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పారిశుధ్యంపై పర్యవేక్షణ పెంచాల్సిన అవసరముందని పలువురు పేర్కొంటున్నారు.

మిగతా శ్వేతపత్రాలు అసెంబ్లీలోనే!

- రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- 22 నుంచి 26 వరకు సమావేశాలు
- తొలిరోజు ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం
- మర్నాడు ధన్యవాద తీర్మానంపై చర్చ-ఆమోదం
- సెప్టెంబరులో పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలు!

అమరావతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జగన్ ఏలుబడిలో కొన్ని కీలక రంగాల్లో జరిగిన విధ్వంసంపై రూపొందిస్తున్న శ్వేతపత్రాలను అసెంబ్లీ సమావేశాల్లో విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం ఏడు శ్వేతపత్రాలకుగాను నాలుగింటిని సీఎం చంద్రబాబు ఇప్పటికే విడుదల చేశారు. ఇందులోని ముఖ్యాంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విలేకరుల సమావేశాల్లో వివరించారు. వైసీపీ పాలనలో దిగజారిన శాంతి భద్రతలు-గంజాయి డ్రగ్స్ విశ్వరూపం.. మద్యం రూపంలో రూ.వేల కోట్ల దోపిడీ.. కుదేలైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అన్న అంశాలపై ఇంకా మూడు పత్రాలను విడుదల చేయాల్సి ఉంది. ఈ నెల 22వ తేదీన (సోమవారం) అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రోజులపాటు వీటిని నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉంది. ఈ సమావేశాల్లోనే సభ ముందు ఈ మిగిలిన శ్వేతపత్రాలను పెట్టాలని నిర్ణయించింది. 'అసెంబ్లీలో ప్రతిపక్షం కూడా ఉంటుంది. మేం చెప్పిన అంశాలపై ప్రతిపక్ష సభ్యులు వారి అభిప్రాయం కూడా చెప్పవచ్చు. చర్చ జరుగుతుంది. ప్రజలకు వాస్తవాలు అర్థమవుతాయి. మేం ప్రజాస్వామ్యబద్ధంగా చర్చ నిర్వహించాలనుకుంటున్నాం. దానికి ఇది ఉపకరిస్తుంది' అని ప్రభుత్వ ముఖ్యుడొకరు చెప్పారు. సభలో మొదటి రోజు ఉభయసభల సభ్యులనుద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తారు. రెండో రోజు ఆయన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చించి ఆమోదిస్తారు. మిగిలిన మూడ్రోజుల్లో రోజుకో శ్వేతపత్రాన్ని సభలో ప్రవేశపెట్టి.. అదే రోజు దానిపై చర్చ పూర్తి చేయాలని భావిస్తున్నారు. 26వ తేదీతో సమావేశాలు ముగుస్తాయి. తిరిగి సెప్టెంబరులో పూర్తి స్థాయి బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని సర్కారు యోచిస్తోంది.

మాజీ ప్రజాప్రతినిధుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి

- ఏపీ లెజిస్లేచర్స్ ఫోరం నిర్ణయం

అమరావతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న మాజీ ప్రజాప్రతినిధుల సమస్యలను ఈ నెల 23, 24వ తేదీల్లో కొత్త ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని ఏపీ ఫార్మర్ లెజిస్లేచర్స్ ఫోరం సమావేశం నిర్ణయించింది. ఫోరం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎం.వి.శివారెడ్డి అధ్యక్షతన గురువారం విజయవాడలో సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇళ్ల స్థలాల మంజూరు, పెన్షన్ పెంపు, వాహనాలకు టోల్ ఫ్రీ, ఢిల్లీలోని ఏపీ గెస్ట్‌హౌస్‌లో క్లాస్-3లో సౌకర్యాలతోపాటు మందుల పంపిణీ, మెడికల్ బిల్లుల్లో సగం రాయితీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ప్రకారం తగిన గౌరవం, ప్రముఖ దేవాలయాల్లో దైవ దర్శనాల్లో ప్రాధాన్యం కల్పించాలని కోరుతూ ప్రభుత్వ పెద్దలకు వినతిపత్రాలు సమర్పించాలని ఈ సమావేశంలో తీర్మానించారు.

కేసు నమోదయింది.. సస్పెండ్ చేయండి

- నా హత్యకు నేరపూరిత కుట్ర జరిగింది
- ఆధారాలు ఇవిగో... విచారణ త్వరగా పూర్తి చేయండి: రఘురామరాజు



గుంటూరు, జూలై 18: సీఐడీ అధికారులపై కేసు నమోదైనందున వారిని వెంటనే సస్పెండ్ చేయాలని ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన గుంటూరులోని ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. ఎస్పీ సతీశ్ కుమార్‌ను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'గుంటూరులోని సీఐడీ కార్యాలయంలో నన్ను హత్యచేసి గుండెపోటుగా చిత్రీకరించాలనే కుట్ర జరిగింది. దానికి సంబంధించి ఈ నెల 13న గుంటూరు, నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో హత్యాయత్నం, కుట్ర కేసు నమోదయ్యాయి. సీఐడీ చీఫ్, అదనపు డీజీ పీవీ సునీల్ కుమార్, ఇంటెలిజెన్స్ డీజీపీ సీతారామాంజనేయులు, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి, సీఐడీ అదనపు ఎస్పీ కే విజయపాల్, నాటి జీజీహెచ్ సూపరింటెండెంట్ జి.ప్రభావతి తదితరులను నిందితులుగా పేర్కొన్న విషయం తెలిసిందే. నా వద్ద ఉన్న ఆధారాలను ఎస్పీకి అందజేసి, కేసు దర్యాప్తు పురోగతి తెలుసుకునేందుకే వచ్చా. నాటి కుట్రలో అప్పటి గుంటూరు జిల్లా కలెక్టర్ పాత్ర కూడా ఉంది. ఆనాటి జీజీహెచ్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ శ్రీకాంత్‌ను అందుబాటులో ఉండాలంటూ కలెక్టర్ ఎందుకు లేఖ రాశారో తేలాలి. నన్ను హత్య చేసేందుకు నేరపూరిత కుట్ర జరిగిందనడానికి ఆధారాలను ఎస్పీకి అందించా. ఈ కేసులో త్వరితగతిన విచారణ పూర్తి చేసి నిందితులను శిక్షించాలని కోరాను. ఈ కేసులో నలుగురు అధికారులు ఉంటే వారిని ఎందుకు సస్పెండ్ చేయలేదో నాకు అర్థం కావడం లేదు' అని ఎమ్మెల్యే అన్నారు. ప్రాథమిక విచారణ పూర్తయిన తర్వాత సస్పెండ్ చేయవచ్చన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ కేసులో ప్రధాన పాత్రధారి అయిన అదనపు ఎస్పీ కే విజయ్ పాల్ పరారీలో ఉన్నారన్నారు. ఆయనను అరెస్టు చేసి విచారిస్తే కుట్ర కోణం బయటపడుతుందన్నారు.

పుంగనూరులో హైటెన్షన్!

- టీడీపీ కార్యకర్తలపై వైసీపీ దాడులు
- పోలీసులకు సమాచారం ఇవ్వకుండా వచ్చిన ఎంపీ మిథున్‌రెడ్డి
- మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంట్లో మకాం
- నేతిగుట్టపల్లి రిజర్వాయర్ కింద పరిహారం కోసం తరలివచ్చిన రైతులు
- టీడీపీ కార్యకర్తలతో కలిసి రెడ్డెప్ప ఇల్లు దిగ్బంధం
- రాళ్లు, కర్రలతో మిథున్‌రెడ్డి బృందం దాడి
- ప్రతిఘటించిన టీడీపీ శ్రేణులు
- పరస్పర దాడుల్లో కానిస్టేబుల్ సహా 12 మంది టీడీపీ కార్యకర్తలకు గాయాలు





టీడీపీ వారిపై దాడి చేస్తున్న వైసీపీ శ్రేణులు; దహనమవుతున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప కారు

పుంగనూరు, జూలై 18: వైసీపీ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి గురువారం చిత్తూరు జిల్లా పుంగనూరుకు రావడంతో హైటెన్షన్ నెలకొంది. టీడీపీ కార్యకర్తలపై వైసీపీ శ్రేణులు పథకం ప్రకారం దాడికి దిగారు. పట్టణంలో అడుగుపెట్టేందుకు గతంలో ప్రయత్నించిన ఎంపీని రెండు సార్లు, ఆయన తండ్రి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఒకసారి టీడీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. ఉద్రిక్తతల నేపథ్యంలో పోలీసులు వారిని ఇక్కడకు రానివ్వలేదు. అయితే గురువారం మిథున్‌రెడ్డి వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తిరుపతి నుంచి తన అనుచరులతో కలిసి పుంగనూరులోని ఒంటిళ్లలో మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటికి చేరుకున్నారు. వైసీపీ ముఖ్య నేతలతో మాట్లాడి ఇటీవల ధ్వంసమైన ఇండోర్ షటిల్ కోర్టును పరిశీలిస్తారన్న సమాచారం బయటకు వచ్చింది. పుంగనూరు మండలం నేతిగుట్లపల్లిలో రిజర్వాయర్ నిర్మాణం కోసం ప్రభుత్వం తీసుకున్న భూములకు రైతులకు నష్టపరిహారం ఇప్పిస్తామని, వైసీపీకి ఓట్లు వేస్తే సమస్య పరిష్కరిస్తామని మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి ప్రచారం సందర్భంగా హామీ ఇచ్చారు. ఇప్పుడు ఎంపీ రావడంతో పరిహారం కోరేందుకు రైతులు టీడీపీ నేతలతో కలిసి అంబేడ్కర్ విగ్రహం నుంచి రెడ్డెప్ప ఇంటికి ర్యాలీగా బయల్దేరారు. రిజర్వాయర్ రైతులకు న్యాయం చేయాలని, గో బ్యాక్ మిథున్‌రెడ్డి అంటూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు వేరే వీధుల గుండా రెడ్డెప్ప ఇంటికి చేరుకుని దిగ్బంధించారు. అయితే మిథున్‌రెడ్డితో పాటు తిరుపతి, సదుం, చిన్నగొట్టికల్లు, మదనపల్లె, పీలేరు నుంచి వచ్చిన వైసీపీ శ్రేణులు ముందుగానే రాళ్లు, కర్రలు, బాటిళ్లు సిద్ధం చేసుకుని ఉన్నారు. టీడీపీ కార్యకర్తలు, నేతలు అక్కడకు రాగానే ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఇదే సమయంలో వైసీపీ శ్రేణులు రాళ్లు, కర్రలు, బాటిళ్లు, కుర్చీలతో టీడీపీ శ్రేణులపై దాడికి దిగారు. వారు కూడా ప్రతిఘటించారు. ఈ క్రమంలో ఎస్టీఎఫ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి, టీడీపీకి చెందిన అస్రఫ్, అజీం, నూర్‌షా, సుధాకర్, నాగరాజ, సుహీల్‌బాషా, వివేక్, షామీర్, ప్రసాద్‌స్వామి, సల్మాన్, సయ్యద్, పెద్ద మోహన్‌నాయుడికి రక్తగాయాలయ్యాయి. ఇంకా కొందరు గాయపడ్డారు. అటు టీడీపీ కార్యకర్తలు రెడ్డెప్ప ఇంటిపై రాళ్లతో దాడి చేసి మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, వైసీపీ నేతలకు చెందిన 9 వాహనాలను ధ్వంసం చేశారు. రెడ్డెప్పకు చెందిన స్కార్పియో వాహనాన్ని దహనం చేశారు. పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారడంతో ఎంపీ గన్‌మెన్ గాల్లోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3.30 వరకు మిథున్‌రెడ్డి మాజీ ఎంపీ ఇంట్లోనే ఉన్నారు. మధ్యాహ్నం 3.30కి చిత్తూరు ఏఎస్పీ ఆరీపుల్లా తన వాహనంలో పోలీసు బందోబస్తు నడుమ మిథున్‌రెడ్డిని తిరుపతికి తరలించారు. రైతులకు పరిహారం ఇవ్వాలని కోరడానికి వస్తున్న టీడీపీ శ్రేణులపై అన్యాయంగా వైసీపీ రౌడీలు దాడులు చేశారని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ఎం.శ్రీకాంత్, మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి తదితరులు మండిపడ్డారు.

గన్‌మెన్ కోసమే అల్లర్లు: టీడీపీ

పుంగనూరులో వైసీపీ శ్రేణుల రాళ్ల దాడిని రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ పుంగనూరు ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తీవ్రంగా ఖండించారు. తనకు ఎక్కువ మంది గన్‌మెన్ కావాలని అడగడం కోసమే ఎంపీ అల్లర్లు సృష్టించారని ఆరోపించారు. అందరినీ బలి తీసుకుంటున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో వైసీపీ దాడులు పునరావృతం చేస్తే ప్రతి దాడులు తప్పవని మంత్రి హెచ్చరించారు.

ఆ ముగ్గురితో ప్రాణహాని

- హోం మంత్రి, డీజీపీలకు శాంతి భర్త మదన్‌మోహన్ ఫిర్యాదు



హోం మంత్రికి ఫిర్యాదు చేస్తున్న మదన్‌మోహన్

అమరావతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, మాజీ ప్రభుత్వ ప్లీడర్ పోతిరెడ్డి సుభాశ్‌రెడ్డి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కాళింగరి శాంతిల నుంచి నాకు ప్రాణ హాని ఉంది. రక్షణ కల్పించాలని శాంతి భర్త మదన్‌మోహన్ విజయవాడలో హోం మంత్రి అనితకు, డీజీపీకి గురువారం ఫిర్యాదు చేశారు. తాను విదేశాలలో ఉన్న సమయంలో తన భార్య శాంతి మగబిడ్డకు జన్మ ఇచ్చిందని, దానికి కారణం వారిద్దరేనని ఆయన ఆరోపించారు. ఈ నెల 8న తన భార్య శాంతి హైదరాబాద్ సనత్‌నగర్‌లోని కార్యాలయానికి వచ్చి 'మర్యాదగా విడాకుల పత్రాలపై సంతకం చేయకపోతే నా చేతిలోనే చచ్చిపోతావ్, నిన్ను లేపేస్తా, నా వెనుక ఎవరు ఉన్నారో తెలుసుగా' అంటూ బెదిరించిందని వివరించారు. ఆ తర్వాత నుంచి తనకు పలు నంబర్ల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయన్నారు. తనకు రక్షణ కల్పించడంతో పాటు మగబిడ్డకు తండ్రి ఎవరో శాస్త్రీయంగా నిర్ధారించాలని కోరారు. డీజీపీ ద్వారకా తిరుమలరావుకు కూడా ఆయన లేఖ రాశారు.

17 యూనివర్సిటీలకు ఇన్‌చార్జ్ వీసీలు

అమరావతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లు రాజీనామాలు చేసిన నేపథ్యంలో ఇన్‌చార్జ్ వీసీలను నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 17 యూనివర్సిటీలకు సీనియర్ ప్రొఫెసర్లను ఇన్‌చార్జ్ వీసీలుగా నియమించింది. ఆ యూనివర్సిటీల వీసీల రాజీనామాలను గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోదించడంతో.. ఈ మేరకు చర్యలు చేపట్టింది. శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీకి చిప్పాడ అప్పారావు, శ్రీకృష్ణదేవరాయ వర్సిటీకి బి.అనిత, ఆంధ్రా వర్సిటీకి జి.శశిభూషణ్‌రావు, నాగార్జున యూనివర్సిటీకి కంచర్ల గంగాధర్, జేఎన్‌టీయూ-అనంతపురంకు హెచ్.సుదర్శన్‌రావు, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి వి.ఉమా, జేఎటీయూ-విజయనగరంకు డి.రాజ్యలక్ష్మి, జేఎన్‌టీయూ-కాకినాడకు కేవీఎస్‌జీ మురళీకృష్ణ, ఆదికవి నన్నయకి వై.శ్రీనివాసరావు, విక్రమ సింహపురికి ఎస్.విజయభాస్కరరావు, కృష్ణా వర్సిటీకి ఆర్.శ్రీనివాసరావు, రాయలసీమ వర్సిటీకి ఎన్‌టీకే నాయక్, ద్రవిడియన్ యూనివర్సిటీకి ఎం.దొరస్వామి, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీకి జి.విశ్వనాథకుమార్, ఆంధ్రకేసరికి డీవీఆర్ మూర్తి, అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీకి పఠాన్ షేక్ షావలి ఖాన్, యోగి వేమన యూనివర్సిటీకి కె.కృష్ణారెడ్డి.. ఇన్‌చార్జ్ వీసీలుగా నియమితులయ్యారు. ప్రభుత్వం త్వరలోనే సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసి పూర్తిస్థాయి వీసీలను నియమించనుంది.

ఆగస్టు 15న అన్న క్యాంటీన్లు

- ఆహారం సరఫరాకు టెండర్లు
- 22న ఖరారు చేస్తాం... రూ.5కే ఆహారం
- డ్రైన్ల పూడికతీతకు 50 కోట్లు
- 10 రోజుల్లో పనుల పూర్తికి ఆదేశం
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు
- చెత్త పన్నుపై సీఎంతో చర్చించి నిర్ణయం
- మునిసిపల్ కమిషనర్లతో నారాయణ వీసీ సమీక్ష



అన్న క్యాంటీన్లపై వీసీలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలోని 106 మున్సిపాలిటీల్లో డ్రైన్ల పూడికతీత పనులకు రూ.50 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఆ నిధులను నిర్దేశిత పనులకు మాత్రమే వినియోగించాలి. తీసిన పూడికను 24 గంటల్లో తరలించాలి. వచ్చే పది రోజుల్లో శత శాతం పూడికతీత పనులు పూర్తి చేయాలి' అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయంలో మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'గత ప్రభుత్వం మున్సిపాలిటీల్లో ఖజానాను ఖాళీ చేసింది. సాధారణ నిధులను కూడా ఇతర అవసరాలకు వాడేసింది. చెత్త పన్నుపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ప్రస్తుత సీజన్‌లో ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని ఆదేశించాం. పిడుగురాళ్ల మున్సిపాలిటీలో నీరు కలుషితమై వంద మందికి డయేరియా సోకింది. వెంటనే అందుకు గల కారణాన్ని గుర్తించడంతో నియంత్రించగలిగాం. మురికి కాల్వల నిర్వహణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. గత ప్రభుత్వం మున్సిపాలిటీల్లో పన్నులు పెంచుతూ ఇచ్చిన జీవోలను అధ్యయనం చేస్తున్నాం. సీఆర్‌డీఏను విచ్ఛిన్నం చేయడానికి వైసీపీ ప్రభుత్వం విభిన్న పద్ధతులను అవలంభించింది. వాటన్నింటిపైనా అధ్యయనం చేస్తున్నాం. మరో నెల రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది' అంటూ మంత్రి మీడియా అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఏఐఐబీ ప్రాజెక్టు మరో రెండేళ్లు పొడిగింపునకు చర్యలు

'గతంలో మా ప్రభుత్వం హయాంలో మునిసిపాలిటీల్లో, కార్పొరేషన్లలో 24 గంటలు మంచినీటి సరఫరా, మురుగు నీటిపారుదల వ్యవస్థ మెరుగుదల కోసం ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ) నుంచి రూ.5,350 కోట్లు రుణం తీసుకున్నాం. వైసీపీ ప్రభుత్వం దానిలో కేవలం రూ.240 కోట్లను మాత్రమే ఖర్చు చేసింది. మిగిలిన నిధుల వినియోగానికి రాష్ట్రం తన వాటాను కేటాయించకపోవడంతో ఏఐఐబీ నిధులు నిరుపయోగంగా ఉండిపోయాయి. ఆ ప్రాజెక్టు గడువు జూన్ నెలాఖరుకు ముగిసింది. మా విజ్ఞప్తిపై ఇప్పటికే నెల రోజులపాటు ప్రాజెక్టు గడువును పొడిగించింది. అయితే మరో రెండేళ్లపాటు గడువును పొడిగించాలని బ్యాంకును ప్రభుత్వం కోరింది. ప్రాజెక్టు పూర్తి అయి ఉంటే కనీసం 50 శాతం మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య ఉండేది కాదు. లక్షలోపు జనాభా ఉన్న నగర పంచాయతీల్లో మౌలిక వసతుల మెరుగుకు అమృత్ 1, 2 ప్రాజెక్టులను మా ప్రభుత్వ హయాంలో చేపట్టాం. వైసీపీ ప్రభుత్వం దానినీ నీరుగార్చింది. ఆ పథకాలను పునరుద్ధరించి, తిరిగి అమలు చేసేందుకు అవకాశం కల్పించాలని కేంద్రాన్ని కోరనున్నాం' అని మంత్రి నారాయణ వివరించారు.

ఏకరీతిలో అన్న క్యాంటీన్లు

'నిరుపేదలకు అతి తక్కువ రేట్లకే నాణ్యమైన ఆహారాన్ని, ఆహ్లాదకర వాతావరణంలో అందించే అన్న క్యాంటీన్లను ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలో ప్రారంభిస్తున్నాం. గత ప్రభుత్వం వాటిని తీసేసి కొన్నింటిని వార్డు సచివాలయాలుగా, మరికొన్నింటిని స్టోరేజ్ రూములుగా వినియోగించింది. ఆయా భవనాలు అన్నింటినీ పూర్తిస్థాయిలో క్యాంటీన్లుగా తీర్చిదిద్దేందుకు, అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను 10వ తేదీ లోపు పూర్తి చేసేందుకు టెండర్లను ఖరారు చేశాం. గతంలో అక్షయపాత్ర సంస్థ ఎంతో చక్కగా నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేసేది. అదే తరహాలో అదే రేట్లకు ఈసారి కూడా ఆహారాన్ని సరఫరా చేసేందుకు టెండర్లను స్వీకరించాం. వాటిని ఈ నెల 22న తెరుస్తున్నాం. అన్ని అన్న క్యాంటీన్లు ఒకే మోడల్‌లో ఉంటాయి. రూ.5 కే అల్పాహారం, భోజనం అందిస్తాం' అని మంత్రి వివరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

మాజీ సీఎం జగన్‌కు స్వాగతం

గన్నవరం: స్థానిక విమానాశ్రయంలో మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి వైసీపీ నేతలు, కార్యకర్తలు స్వాగతం పలికారు. గురువారం బెంగళూరు నుంచి ఇండిగో విమానంలో ఇక్కడికి విచ్చేశారు. ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, మొండితోక అరుణ్‌కుమార్, మాజీ మంత్రి అంబటి రాంబాబు, కొమ్మా కోట్లు, సమ్మెట సాంబశివరావు, శీలం రంగారావు, దేవభక్తుని చక్రవర్తి, కొత్తపల్లి రజని స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తాడేపల్లి వెళ్లారు.


ఇబ్రహీం ఖతీబ్‌ను సత్కరిస్తున్న తరుణ్ కాకాని

టూరిజం, వాటర్ స్పోర్ట్స్ అవకాశాలపై చర్చ

విజయవాడ స్పోర్ట్స్: నోవాటెల్‌లో జరుగుతున్న వ్యాపార విస్తరణ అవకాశాలు బీ2బీ సమావేశాల్లో భాగంగా గురువారం షార్జా విమానాశ్రయ అంతర్జాతీయ ఫ్రీజోన్ (సెయిఫ్) అథారిటీ సేల్స్ ఎగ్జిక్యూటివ్ షోయెబ్ ఇబ్రహీం ఖతీబ్‌తో ఏబీసీ-అమరావతి బోటింగ్ క్లబ్ ద్వారా ఏపీలో టూరిజం, వాటర్‌స్పోర్ట్స్ అవకాశాలపై సీగా ఈవో డాక్టర్ తరుణ్ కాకాని చర్చించారు. పరస్పర పెట్టుబడులు, ఇతర అంశాలపై చర్చానంతరం ఖతీబ్‌ను కాకానీ సత్కరించారు. గ్రానైట్, పప్పుధాన్యాలు ఎగుమంతి వంటి ఇతర రంగాలపై ఎస్ఎస్ గ్రూప్ సీఎండీ సాయి నవీన్ బోడపాటితోను చర్చించారు. ఆరోగ్య సంరక్షణ అవకాశాలపై నపమిడి భానుచందర్ ఏపీ పారిశ్రామికవేత్తలకు పెట్టుబడి అవకాశాలపై అవగాహన కల్పించారు.

రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా యర్రంశెట్టి

కృష్ణలంక: రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా యర్రంశెట్టి అంజిబాబును నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు రమేష్ చంద్ర ద్వివేది, అయోధ్య ట్రస్ట్ నిర్వాహకులు చంపక్ రాయి, సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె శ్రీనివాసులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు గురువారం అంజిబాబుకు అందాయి. గోరక్ష సంరక్షణ, దేవాలయాల పరిరక్షణ తదితర హిందూత్వ సంబంధిత విషయాలను రాష్ట్ర వ్యాప్తంగా సంరక్షించడం తన విధి అని అంజిబాబు తెలిపారు. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.


రాజశేఖర్‌బాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరిస్తున్న సత్యనారాయణ

సీపీని కలిసిన ఏఆర్పీవో నేత సత్యనారాయణ

విజయవాడ: నగర పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబును అసోసియేషన్ ఆఫ్ రిటైర్డ్ పోలీసు ఆఫీసర్స్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ గురువారం కలిశారు. సీపీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి అభినందించారు. రిటైర్డ్ పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు.

కమ్యూనికేషన్ నైపుణ్యత, ప్రాధాన్యతపై అవగాహన సదస్సు

భారతీనగర్: ఆంధ్రా లయోలాలో ద ఆర్ట్ ఆఫ్ పర్‌సుషన్ మాస్టరింగ్ ఇన్‌ఫ్లూయెంటల్ కమ్యూనికేషన్ అంశంపై ఐక్యూఏసీ, గెస్ట్‌లెక్చర్ ప్లేస్‌మెంట్ సెల్‌తో కలిసి గురువారం ఆన్‌లైన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ వి.సునీత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సదస్సులో మాట్లాడుతూ వ్యక్తిగత, వృత్తిపర, సామాజిక సంబంధాల్లో విజయం సాధించాలంటే కమ్యూనికేషన్ నైపుణ్యత ప్రాధాన్యత అవసరమన్నారు. కళాశాల డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఒ.మహేష్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సిస్టర్ క్యాండీ, ప్లేస్‌మెంట్ సెల్ అధ్యాపకులు పి.ప్రిస్కిల్లా, ఇనమల కళావతి, విభాగ అధ్యాపకులు, 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాజీవ్, సుధారాణి

20న రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

విజయవాడ స్పోర్ట్స్: ప్రపంచ చెస్ డే సందర్భంగా ఈ నెల 20న నగరంలోని ఫన్‌టైమ్స్ వేదికగా రాష్ట్రస్థాయి చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. పోటీల బ్రోచర్లను ముఖ్య అతిథి అట్లూరి సుధారాణి, రాజీవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫన్‌టైమ్స్ వైస్ ప్రెసిడెంట్ అట్లూరి సుమబిందు, కార్యదర్శులు శివాజీ, సతీష్ పాల్గొని మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా సహాయ సహకారాలను అందిస్తామన్నారు. 26 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొంటారని 20మంది క్రీడాకారులకు, ప్రత్యేకంగా అండర్-7,9,11,13,15 వివిధ ఏజ్ గ్రూప్‌ల్లో రూ.30వేల నగదు పారితోషికాలు, మెడల్స్ సర్టిఫికెట్లను ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి కలిగినవారు 9246181858 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. చెస్ జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసీమ్, కార్యదర్శి మందుల రాజీవ్ పాల్గొన్నారు.

భూ సేకరణ తప్పదా?

సీడ్ యాక్సెస్ రోడ్డుకు భూములపై తర్జన భర్జనలు

- పూలింగ్ కింద తీసుకోవాలంటే రిటర్నబుల్ ప్లాట్లకు పెద్దగా భూముల్లేవు
- సీడ్‌తో పాటు ఈ-11, ఈ-13 రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు
- అన్నింటికీ కలిపి భూ సేకరణ దిశగా వెళితేనే ప్రయోజనకరమని భావన
- ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపు

విజయవాడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సీడ్ యాక్సెస్ రోడ్డుకు 2వ దశ (బ్యాలెన్స్) పనులకు భూ సేకరణ దిశగానే వెళ్లాలని సీఆర్‌డీఏ మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. భూ సేకరణ దిశగా వెళ్లాలన్నది అధికారికంగా సీఆర్‌డీఏ ప్రకటించలేదు. భూసేకరణ అంశంపై మరోమారు సీఆర్‌డీఏ అధికారులు పునరాలోచన చేయాలని భావిస్తున్నారు. రెండు రోజుల్లో ఈ అంశంపై పూర్తి స్పష్టత వస్తుంది. ప్రభుత్వ స్థాయిలో జోక్యం ఉంటే భూ సమీకరణ వైపు మొగ్గు చూపే అవకాశాలున్నాయి. అమరావతి పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన సీడ్ యాక్సెస్ రోడ్డును పూర్తి చేయాలన్నది సీఆర్‌డీఏ ప్రధాన లక్ష్యం. సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రస్తుతం వెంకటపాలెం వరకు 18 కిలోమీటర్ల నిడివిన ఉంది. ఇక్కడి నుంచి మరో 3 కిలోమీటర్ల మేర బ్యాలెన్స్ పనులు మిగిలిఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఉండవల్లి మండలం పెనుమాక నుంచి కనకదుర్గ వారధి దిగువున మణిపాల్ హాస్పిటల్ పక్కనుంచి ఎన్‌హెచ్-16కు సీడ్ యాక్సెస్ రోడ్డును అనుసంధానించటం ఆగిపోయింది. మళ్లీ ప్రభుత్వం కొలువు తీరాక.. అమరావతి రాజధాని విధ్వంసాన్ని కళ్లారా చూసిన అనుభవంతో తమకు తాముగా సహకరించేందుకు రైతులు సంసిద్ధమయ్యారు. మంత్రి నారాయణ రాజధానిలో పర్యటించిన సందర్భంలో రైతులు తమ సమ్మతిని తెలిపారు. దీంతో సీఆర్‌డీఏ అధికారులు రైతులతో సంప్రదింపులు జరిపారు. ఉండవల్లి మండల పరిధిలో భూములు అవసరమైన గ్రామాల్లో సమావేశాలను తలపెట్టారు.



రైతుల్లో మిశ్రమ అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. తమ భూముల ధరలు ఎక్కువగా ఉన్నందున పూలింగ్ ప్యాకేజీని పెంచాలన్నది వీరి ప్రధాన డిమాండ్. దాదాపుగా 2వేల చదరపు గజాల మేర అభివృద్ధి చేసిన ప్లాట్లు కోరుతున్నారు. అందరి రైతుల్లోనూ ఇదే ప్యాకేజీ కావాలన్న డిమాండ్ రావటం లేదు. పలువురు రైతులు ఇంకా ఎక్కువ డిమాండ్ చేస్తున్నారు. రైతుల మధ్య భిన్నాభిప్రాయాలు నెలకొనటంతో ఏకాభిప్రాయానికి వచ్చేవరకు కొంత సమయం ఇవ్వాలని సీఆర్‌డీఏను రైతులు కోరారు. ఫలితంగా రైతులతో సంప్రదింపుల ప్రక్రియను తాత్కాలికంగా సీఆర్‌డీఏ అధికారులు నిలిపివేశారు. రైతులు కోరినట్టుగా గరిష్ఠ ప్యాకేజీ ఇచ్చే విషయంలో కొన్ని సమస్యలున్నాయి. ప్రస్తుతం అదనంగా పూలింగ్ కింద భూములిచ్చే పరిస్థితి దాదాపుగా లేదని తెలుస్తోంది. పూలింగ్ కింద కొత్తగా రిటర్నబుల్ ప్లాట్లను ఇవ్వటం కొంత కష్టంగానే ఉందని తెలుస్తోంది. పూలింగ్ కింద ప్యాకేజీ కల్పించాలంటే.. ఈ ప్యాకేజీ కోసం మళ్లీ భూములు తీసుకోవాల్సిన పరిస్థితి ఉందని తెలుస్తోంది. దీనికి తోడు ప్యాకేజీ ఎక్కువగా అడగటం ఇంకాస్త ఇబ్బందిగా ఉంటోంది. దీని కంటే భూ సేకరణ దిశగా వెళ్లటం వల్లనే సమస్య తేలిగ్గా పరిష్కారమౌతుందన్న ఆలోచనను కూడా చేస్తున్నట్టు తెలుస్తోంది. దీనికి తోడు సీడ్ యాక్సెస్ రోడ్డు (ఈ 3 రోడ్డు)తో పాటుగా ఈ-11, ఈ-13 రోడ్లను కూడా ఎన్‌హెచ్-16కు అనుసంధానించాలని సీఆర్‌డీఏ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ రెండు రోడ్లను ఎన్‌హెచ్-16కు అనుసంధానించటానికి పెద్దగా భూములు అవసరం లేదు. ఉండవల్లి కొండ ప్రాంతం వెంబడి విస్తరించటం ద్వారా పెద్దగా భూముల అవసరం అయితే ఉండదు. జాతీయ రహదారి దగ్గర అనుసంధానించేచోట కొంత మేర భూములు సేకరించాల్సిన అవసరం ఉంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని భూ సేకరణ దిశగా వెళ్లాలని భావిస్తున్నప్పటికీ.. ప్రభుత్వం భూ సమీకరణ దిశగానే వెళ్లమంటే మాత్రం ఆ దిశగానే సీఆర్‌డీఏ అడుగులేసే అవకాశం ఉంది.



బడ్డీలను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

బీఆర్‌టీఎస్ రోడ్డులో నీలిబడ్డీల తొలగింపు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన టౌన్ ప్లానింగ్ అధికారులు
- బడ్డీలు మొత్తం తొలగిస్తామంటున్న బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్

మధురానగర్, జూలై 18: మధురానగర్ బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కనే, కాల్వ ఒడ్డున ఉన్న స్థలంలో వెలసిన నీలిరంగు బడ్డీల దందా గురించి ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించారు. గురువారం మధ్యాహ్నం పడవలరేవు వైపు నుంచి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అరుణ సిబ్బందితో వచ్చి బడ్డీల తొలగింపును మొదలు పెట్టారు. తొలిరోజు 5 బడ్డీలను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె అరుణ మాట్లాడుతూ కాల్వ ఒడ్డు మొత్తం ఆక్రమణ చేశారని మొత్తం పడవల రేవు నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డు వంతెన వరకున్న మొత్తం బడ్డీలను తొలగించాల్సిందేనన్నారు. ఇప్పటికే వారందరికీ చెప్పామని శుక్రవారం కూడా బడ్డీలను తొలగిస్తామన్నారు. ఎవరికి వారు తొలగించుకుంటే పర్లేదని తాము తొలగించే వరకు తెచ్చుకోవద్దని ఆక్రమణదారులకు చెప్పామని ఆమె తెలిపారు.

వైసీపీ నేతల భూ దందాకు చెక్

టీడీపీ బాపులపాడు మండలాధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు

హనుమాన్‌జంక్షన్, జూలై 18: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు భూ ఆక్రమణలకు పాల్పడినట్టు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, కలెక్టర్ బాలాజీతో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అనేక అర్జీలందడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని టీడీపీ బాపులపాడు మండలాధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక టీడీపీ మండల కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలు అనేక భూ దందాలకు పాల్పడ్డారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వీటిపై కఠినచర్యలు తీసుకోబోతోందన్నారు. దాదాపు 1.75 లక్షల ఎకరాలు ఆక్రమణలకు గురైందన్నారు. వాటిని తిరిగి స్వాధీనం చేసుకునే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు పేరుతో రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి ప్రభుత్వానికి ఎక్కువ ధరకు అమ్మి కోట్లాది రూపాయలు దోపిడికి పాల్పడ్డారన్నారు. ఇళ్ల లబ్ధిదారులకు ఉచిత ఇసుక పేరుతో రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రూపాయలు దోపిడీ చేశారన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఇసుకను ఉచితంగా అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రజల భూములను ల్యాండ్ టైటిలింగ్ పేరుతో కబ్జా చేయడానికి పూనుకుందన్నారు. దానికి టీడీపీ కూటమి ప్రభుత్వం చెక్ పెట్టి ఆ చట్టాన్ని రద్దుచేయడం అభినందనీయమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన అక్రమాలపై టీడీపీ కూటమి ప్రభుత్వం శ్వేత పత్రాలు విడుదల చేస్తున్నాయని ప్రజలు వీటిని గమనించాలన్నారు. తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి గండేపూడి నితీష్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి మండాది రవీంద్ర, నేతలు చెరుకూరి హరికృష్ణ, దయాల రాజీవ్‌కాంత్, కర్రా ప్రసాద్ పౌల్, అక్కినేని రాఘవేంద్రరావు, కొత్తూరు అంజనేయులు, ఆరేపల్లి సుబ్బారావు, బోడిచర్ల స్వామి, ఫణి, చిన్ని పాల్గొన్నారు.

ఎంతో మానసిక వ్యథకు గురయ్యారు..!

- ఎంపీడీవో కుటుంబసభ్యుల ఆవేదన

పెనమలూరు, జూలై 18: కొన్నినెలలుగా తమ తండ్రి ఎంతో మానసిక వ్యధకు గురయ్యాడని ఆయన పెద్ద కుమారుడు సాయిరామ్ కృష్ణ, భార్య సునీత స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీమంత్రి దేవినేని ఉమా, నరసాపురం మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడు వద్ద తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో కుటుంబాన్ని పరామర్శించేందుకు కానూరు మహదేవపురం కాలనీకి వచ్చిన నేతల వద్ద వారు తమ గోడు వెళ్లబోసుకున్నారు. కాంట్రాక్టరు అందుబాటులో లేకపోవడం, ఎప్పుడు ఫోన్ చేసినా ఇతర రాష్ట్రాల్లో ఉన్నానంటూ సమాధానం ఎప్పడం, తన పైఅధికారులు నెలవారీ కాంట్రాక్టు బిల్లుల చెల్లింపులో తనను బాధ్యుడిని చేస్తారేమోనన్న భయంతో కొన్ని నెలలుగా ఎంతో మానసిక వ్యధకు గురయ్యాడని వారు కన్నీటి పర్యంతమయ్యారు.

వైసీపీ నేతల తప్పులు అధికారులపైకి నెట్టడం దారుణం: బోడె, ఉమా

వైసీపీ హయాంలో అధికారంలో ఉన్న ప్రజా ప్రతినిధులు తాము చేసిన తప్పులను కింది స్థాయి అధికారులపైకి నెట్టేయడం, వారిని బాధ్యులను చేయడం వల్ల నిజాయితీగా పని చేసిన వెంకటరమణారావు లాంటి అధికారులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ మంత్రి దేవినేని ఉమా వ్యాఖ్యానించారు. ఎంపీడీవో అదృశ్యం కేసులో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చాలా సీరియస్‌గా ఉన్నారని, కేసులో బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు.



ఎంపీడీవో కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి, స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, దేవినేని ఉమా

కేసరపల్లి ఏలూరు కాలువలో గాలింపు

గన్నవరం: మండలంలోని కేసరపల్లి ఏలూరు కాలువలో ఎంపీడీవో రమణారావు ఆచూకీ కోసం గురువారం ఎన్‌డీఆర్ఎఫ్ బృందం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నెల 15న ఇంట్లో నుంచి వెళ్లిన రమణారావు తిరిగి రాని సంగతి తెలిసిందే. మచిలీపట్నం రైల్వే స్టేషన్‌లో బైక్‌పార్క్ చేసి యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి నగరంలోని మధురనగర్ స్టేషన్‌లో దిగి అక్కడి నుంచి అదృశ్యమయ్యారు. సూసైడ్ నోట్ రాసి కుటుంబ సభ్యులకు పంపిన ఆయన దాన్ని చూసి కుటుంబ సభ్యులు పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఏలూరు కాలువలో దూకి ఉండవచ్చునన్న అనుమానంతో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు చేపట్టారు. కేసరపల్లి నుంచి విజయవాడ వైపునకు ఏలూరు కాలువలో గాలిస్తూ వెళ్లారు.


కాలువలో గాలిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

సీఎం రిలీఫ్ ఫండ్, అన్న క్యాంటీన్‌కు సబ్కా విరాళం


మంత్రులు నారాయణ, కేశవ్‌కు విరాళం ఇస్తున్న సబ్కా

వన్‌టౌన్, జూలై 18: స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు గురువారం మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.2 లక్షలు, మునిసిపల్ మంత్రి పొంగూరు నారాయణను కలిసి సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.10 వేలు విరాళాన్ని చెక్కురూపంలో అందజేశారు సబ్కా అధ్యక్షుడు విజయకుమార్, కార్యదర్శి సూర్యప్రకాష్, కోశాధికారి అప్పారావు, డిప్యూటీ కో-ఆర్డినేటర్ కూచిపూడి శ్రీనివాసరావు ఆఫీసు సెక్రటరీ వెంకట్రావు, గుంటూరు, ప్రకాశం సబ్కా ప్రెసిడెంట్ కొండా రమేష్, సలహాదారు మండవ సాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మునిసిపల్ కార్పొరేషన్లలోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అమరావతిలో సీఆర్‌డీయే చేపట్టనున్న పనులలో ఎంఎస్ఎంఈ కేటగిరీ కాంట్రాక్టర్లకు అవకాశాలు కల్పించాలని కోరారు. దీనికి మంత్రి అంగీకరించారన్నారు. మరోవైపు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.2లక్షల విరాళాన్ని చెక్కురూపంలో అందజేశారు.

గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లను

ప్రభుత్వ శాఖల్లో విలీనం చేయాలి

- ఏఎస్ఈ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధులు


మంత్రి లోకేష్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఉంగుటూరు, జూలై 18: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ప్రభుత్వ ఇంజనీరింగ్ శాఖల్లో విలీనం (రేషనలైజ్) చేయాలని కోరుతూ అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ (ఏఎస్ఈ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధులు గురువారం రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో జరుగుతున్న ప్రజాదర్బార్‌లో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రౌండ్‌లెవెల్‌లోని అన్ని సమస్యలను వివరించి, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని మంత్రి లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఏఎస్ఈ స్టేట్ ప్రెసిడెంట్ బి.యువషణ్ముఖ మాట్లాడుతూ గ్రామ సచివాలయ పరిధిలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, హౌసింగ్, ఎస్ఎస్ఏ తదితర విభాగాల్లో ఐదేళ్లుగా సేవలందిస్తున్నామన్నారు. ఆయాశాఖల్లో మండల, డివిజన్, స్థాయిల్లో ఖాళీగా ఉన్న ఏఈ పోస్టులను తమకు ప్రమోషన్ ద్వారా భర్తీచేయాలని, సివిల్, మెకానికల్ విభాగాల్లో డిప్లొమో, బీటెక్ పూర్తిచేసిన తమకు నాన్‌టెక్నికల్ వర్క్‌లు మినహాయించి, టెక్నికల్ వర్క్‌లు మాత్రమే కేటాయించాలని, ఏపీపీఎస్‌సీ, ఏఈ/ఏఈఈ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ (ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్)లో తమకు వెయిటేజ్ ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల గురించి ఇదివరకే చర్చలు జరిగాయని, సర్వీస్‌రూల్స్ అమెండ్మెంట్ జరగని కారణంగా కొంచెం సమయం పడుతుందని, ఈ వ్యవస్థలో ఉన్న అనేక లోటుపాట్లను సరిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, తప్పకుండా ఒక కమిటీవేసి త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని షణ్ముఖ పేర్కొన్నారు. ఏఎస్ఈ స్టేట్ జాయింట్ సెక్రటరీ జే నాగరాజు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు గురజాపు నాగరాజు, శిఖా అరుణ్ కుమార్, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



అధికారుల నిర్లక్ష్యం.. అంబులెన్స్‌కు శాపం!

ప్రభుత్వాసుపత్రి, జూలై 18: నగరంలోని ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల సౌకర్యార్థం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ బహూకరించిన అంబులెన్స్ నిరుపయోగంగా మారింది. ప్రభుత్వాసుపత్రి నుంచి పాత ఆసుపత్రికి వైద్యులను తీసుకుని వెళ్లేందుకు అంబులెన్స్‌ను వినియోగిస్తున్నారు. అలాగే డీఎంఈ కార్యాలయం, సచివాలయం, కలెక్టర్ కార్యాలయం పనులకూ ఈ అంబులెన్స్‌నే వినియోగిస్తున్నారు. కానీ అంబులెన్స్ నిర్వాహణలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు. అంబులెన్స్ టైర్లు పాడైనందున వాటిస్థానంలో కొత్తటైర్లను ఏర్పాటు చేయకపోవడంతో అంబులెన్స్ అలంకారప్రాయంగా మారింది. అత్యవసర విధులకు వెళ్లాలంటే సమయానికి అంబులెన్స్ లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో వైద్యులు ఆటోల్లో ప్రయాణించాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మంత్రి రామ్‌ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఔట్ సోర్సింగ్ కోచ్‌లు

మినిమమ్ టైమ్‌స్కేల్ ఇవ్వాలి

- క్రీడాశాఖ మంత్రికి వినతి

విజయవాడ స్పోర్ట్స్, జూలై 18: ఔట్‌సోర్సింగ్ కోచ్‌లను కాంట్రాక్ట్ పద్ధతి నుంచి మార్పు చేస్తూ మినిమమ్ టైమ్ స్కేల్ వర్తింపజేయాలని శాప్ ఔట్ సోర్సింగ్ కోచ్‌ల అసోసియేషన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసరాజు, జనరల్ సెక్రటరీలు పాణ్యం వేణు, ట్రెజరర్ నాగరాజులు రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి ఎం.రామ్‌ప్రసాద్‌రెడ్డిని గురువారం కలిసి వినతిపత్రంలో కోరారు. కోచ్‌లకు సత్వరం న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఔట్ సోర్సింగ్ కోచ్‌లు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి: దాడి

వన్‌టౌన్, జూలై 18: కార్పొరేషన్‌కు డబ్బులు కట్టకుండా పార్కింగ్ ఫీజును అక్రమంగా వసూలు చేసుకుని జేబులు నింపుకుంటున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేత దాడి జగన్ మునిసిపల్ అధికారులను కోరారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కార్పొరేటర్లు కొందరు పార్కింగ్ స్థలాలను లీజుకు తీసుకుని డబ్బులు ఎగ్గొట్టారన్నారు. 2022లో కాళేశ్వరరావు మార్కెట్, గాంధీజీ మునిసిపల్ హైస్కూల్ పార్కింగ్‌లను పాడుకుని డబ్బు జమచేయలేదన్నారు. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా మరో 2 నెలలు కాంట్రాక్ట్‌ను పొడిగించుకున్నారన్నారు. పార్కింగ్ ఫీజు దందా పై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని చూపిస్తూ, దందా వల్ల కార్పొరేషన్ ఆదాయానికి ఏ మేరకు గండి పడిందో అర్థమవుతోందన్నారు. కార్పొరేషన్ ఆదాయానికి గండి కొట్టినవారిలో ఎంతటి వారున్నా వారందరి చేత డబ్బు కట్టించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఇకపై పార్కింగ్ ఏరియాలను లీజులకిచ్చేటప్పుడు అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ అంశాన్ని ఎమ్మెల్యే సుజనాచౌదరి దృష్టికి తీసుకువెళతామన్నారు.


దుర్గమ్మ సన్నిధిలో హీరో వరుణ్ సందేశ్, చిత్ర యూనిట్

దుర్గమ్మ సన్నిధిలో హీరో వరుణ్ సందేశ్

వన్‌టౌన్, జూలై 18: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను గురువారం సినీ హీరో వరుణ్ సందేశ్ దర్శించుకున్నారు. ఆలయంలో ఆయనకు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు ఈవో రామారావు ప్రసాదం, శేషవస్త్రం తదితరాలను అందజేశారు. అర్చకులు వేద ఆశీస్సులు అందించారు.


ఎస్వీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న హజరత్తయ్య గుప్తా

మహోన్నత నటశిఖరం ఎస్వీ రంగారావు

- వేముల హజరత్తయ్య గుప్తా

విజయవాడ కల్చరల్, జూలై 18: ఎస్వీ రంగారావు మహోన్నత నటశిఖరమని, హావ భావ ప్రకటనతో డైలాగుల ఉచ్చరణలో ప్రత్యేకతను సంతరించుకొని నటసార్వభౌముడిగా కొనియాడబడ్డారని, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సాంఘిక జానపద, పౌరాణిక, చరిత్రాత్మక చిత్రాల్లో ఒక ప్రత్యేకతను సంతరింపజేసుకొన్న నటుడు ఎస్వీ రంగారావు అని ప్రముఖ సామాజికవేత్త, రంగస్థల, సినీ, రేడియో, టీవీ కళాకారులు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. ఎస్వీఆర్ 50వ వర్ధంతి సందర్భంగా గురువారం ఉదయం తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళారంజని సాంస్కృతిక సేవా సంస్థ శ్రీ రామ్మోహనరావు కల్చరల్ ఆర్గనైజేషన్ ఎస్వీఆర్ సేవా సమితి ముసెట్టి నువ్వుశెట్టి ఎస్.రామ్మోహనరావు విగ్రహ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడగా నర్సింహారావు, పీఎల్‌కే శర్మ, గోపాల్, పిచ్చయ్య నాయుడు, రామారావు, విజయలక్ష్మి పాల్గొని నివాళులర్పించారు.


రాజరాజన్‌ను సత్కరిస్తున్న వీఆర్ సిద్ధార్థ యాజమాన్యం

సిద్ధార్థలో ఘనంగా అంతర్జాతీయ సదస్సు

పెనమలూరు, జూలై 18: గ్రీన్ అండ్ సస్టెయినబుల్ సాంకేతికత కోసం కాంప్యుటేషనల్ ఇంటెలిజెన్సు (ఐసీసీఐజీఎస్టీ-2024) అంతర్జాతీయ సదస్సు మొదటి రోజు ఘనంగా నిర్వహించారు. సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వర్సిటీలో ఈసీఈ, ఈఐఈ విభాగంతో కలిసి ఈఈఈ సంయుక్త ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన ఇస్రో డైరెక్టర్ ఏ రాజరాజన్ మాట్లాడుతూ దేశానికి సేవ చేయడానికి మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సుపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. భూమిపై ఉష్ణోగ్రతలు పెరగడం, ఆక్సిజన్ లెవల్స్ తగ్గడం వంటి వాటి వల్ల విద్యార్థులు భూమిని గురించిన స్థిరమైన ఆలోచనలు చేయాల్సి ఉందన్నారు. వీఆర్ సిద్ధార్థ డీమ్డ్ టుబి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ తమ సంస్థ రాష్ట్రంలో స్వయం ప్రతిపత్తి పొందిన మొదటి సంస్థని పేర్కొన్నారు. ప్రకృతిని పచ్చగా, స్థిరంగా ఉంచడంలో మనకు సాయపడే విభిన్న పరిష్కారాలను తీసుకురావడానికి కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరచాలని సూచించారు. డాక్టర్ సుభోజిత్ డాన్, డాక్టర్ ధనంజయరావు, డాక్టర్ వెంకటరావు, డాక్టర్ స్వామి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దుర్గగుడి

అవుట్ సోర్సింగ్ ఉద్యోగి మృతి



వన్‌టౌన్, జూలై 18: దుర్గగుడిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న దేవనబోయిన నాగరాజు (35) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం విధులు ముగించుకుని సిటీ బస్సులో దిగి సింగ్‌నగర్‌లోని తన ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగ ఆటో ఢీకొనడంతో గాయలయ్యాయి. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. నాగరాజుకు భార్య ఐదేళ్ల కుమార్తె, ఏడాదిన్నరేళ్ల కమారుడు ఉన్నారు. 20ఏళ్లుగా ఆలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కుమార్తె క్యాన్సర్‌కు గురికావడంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యాడు. దుర్గగుడి ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు సింహాచలం చొరవతో సహ ఉద్యోగులు రూ.లక్ష సేకరించారు. ఈ డబ్బుతో ఇటీవల కుమార్తెకు చికిత్స చేయించారు. బుధవారం రాత్రి విధులు ముగించుకుని సింగ్‌నగర్‌లో ఇంటికెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఆటో అతడిని ఢీకొంది. తలకు తీవ్రగాయాలు కాగా సమాచారం తెలుసుకున్న తోటి ఉద్యోగులు, అక్కడికి వచ్చి స్థానికుల సాయంతో అతడిని బీఆర్‌టీఎస్ రోడ్డులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తరువాత మెరుగైన చికిత్సకు సూర్యారావుపేటలోని మరో ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రాణం కోల్పోయాడు. సహచర ఉద్యోగులు అతడి మృతి పట్ల సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.

విజయసాయి విశాఖ దందాలో సుభాశ్, శాంతి ప్రమేయం

- అవకతవకలపై త్రిసభ్య కమిటీ
- 'విజిలెన్స్' కూడా విచారిస్తోంది: ఆనం



నెల్లూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): 'వైజాగ్‌లో విజయసాయిరెడ్డి చేసిన ప్రతి రెవెన్యూ దందాలో ప్రభుత్వ న్యాయవాది సుభాశ్ రెడ్డి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి ప్రమేయం ఉన్నట్లు మాకు ప్రాథమిక సమాచారం ఉంది. ప్రభుత్వ, రెవెన్యూ భూములకు సంబంధించి రికార్డులు మార్చినట్లు కొన్ని ఫిర్యాదులూ ఉన్నాయి' అని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'జరిగిన అవకతవకలపై శాఖ ఉన్నతాధికారులతో త్రిసభ్య కమిటీ వేశాం. దేవదాయ శాఖ విజిలెన్స్ కూడా విచారణ జరుపుతోంది. ఈ నివేదికలు వారంలో అందుతాయి. విశాఖలో కోల్పోయిన భూములపై రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులూ విచారణ చేస్తున్నారు. ఆ నివేదికలూ అందాక వాటిని సీఎం చంద్రబాబు ముందుంచుతాం. ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం. అవినీతి ఆరోపణలపై సస్పెండైన శాంతికి విస్తృత రాజకీయ సంబంధాలు ఉన్నాయి. ఆమె చాలా చోట్ల అవినీతికి పాల్పడినట్లు తేలింది. విల్లా కొనుగోలుకు అనుమతి కోసం కమిషనర్‌కు శాంతి దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం అంత విలువైన విల్లాను ఆమె కొనుగోలు చేయడానికి అర్హత లేదు కాబట్టి మా కమిషనర్ పర్మిషన్ ఇవ్వలేదు. తర్వాత అపార్ట్‌మెంట్ కొనుక్కునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. దీనికి కమిషనర్ అనుమతిచ్చారు. విల్లా కొన్న విషయం మాకు తెలియదు. దీనిపై విచారణ జరుపుతాం. విజయసాయిరెడ్డి ఎక్స్‌లో పెట్టిన సందేశానికి శాంతి స్పందిస్తూ.. 'మీరు వైసీపీకి వెన్నెముక వంటి వారు' అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ అధికారిగా ఉన్నప్పుడు ఇలా చేయడం తప్పు. విజయసాయి తండ్రి ఓ హత్య కేసులో ఏ 2గా ఉన్నారు. ఇప్పుడు విజయసాయి కూడా ఏ 2గా మారారు. ఏ1గా ఉన్న జగన్మోహన్‌రెడ్డి ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయారు కాబట్టి ఆ ఏ1 స్థానానికి ఎదగాలని విజయసాయిరెడ్డి దుర్మార్గాలు చేశారు. సభ్యసమాజం ఛీ కొట్టేలా వైజాగ్‌లో అరాచకాలు చేశారు. తనపై వచ్చిన ఆరోపణల గురించి మాట్లాడడం మాని మీడియాపై ఇష్టానుసారంగా మాట్లాడడం విడ్డూరంగా ఉంది. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ వ్యక్తిగత వ్యవహారాల గురించి మాట్లాడిన విజయసాయిరెడ్డి ఇప్పుడు నీతులు చెప్పడం సిగ్గుచేటు' అని ఆనం మండిపడ్డారు.

గడ్చిరోలి ఎన్‌కౌంటర్ మృతదేహాల గుర్తింపు

చర్ల, బీజాపూర్, మహదేవపూర్, జూలై 18: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో బుధవారం మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన 12 మంది మావోయిస్టులను పోలీసులు గుర్తించారు. నక్సల్స్ మృతదేహాలను మహారాష్ట్ర బలగాలు బుధవారం అర్ధరాత్రి గడ్చిరోలి జిల్లా కేంద్రానికి తరలించాయి. చనిపోయిన మావోయిస్టుల్లో ఏరియా కమిటీ సభ్యులు, డివిజన్ కమిటీ, దళ సభ్యులు ఉన్నారు. డీవీఎంసీ సభ్యులైన యోగేశ్ దావ్‌సింగ్, ప్రమోద్ లాల్సే కచ్లామి, విశాల్ కుల్లే ఆత్రంలపై తలా రూ. 16 లక్షల రివార్డు ఉంది. అలాగే ఏరియా కమిటీ సభ్యులైన మహార్ ధోబీ, అనిల్ దేవ్‌సే, విజ్జు, సరితా, రాజ్జోలపై ఒక్కొక్కరి మీద రూ. 6 లక్షల రివార్డు.. రోజా, సాగర్, సీతాహక్, చందం పోద్యంలపై తలా 2 లక్షల రివార్డు ఉంది. వీరి నుంచి అధునాతన తుపాకులు స్వాధీనం చేసుకున్నారు.

మందుపాతర పేల్చిన మావోయిస్టులు

- ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు జవాన్లు మృతి.. మరో నలుగురికి గాయాలు

చింతూరు, జూలై 18: మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని గడ్చిరోలి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగిన మర్నాడే మావోయిస్టులు రెచ్చిపోయారు. గురువారం ఛత్తీస్‌గఢ్‌లో మందుపాతర పేల్చి ఇద్దరు జవాన్లను బలితీసుకున్నారు. ఛత్తీసగఢ్‌లోని బీజాపూర్, దంతెవాడ, సుక్మా జిల్లాల సరిహద్దున ధర్బా, పశ్చిమ బస్తర్ డివిజన్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్న సమాచారం అందుకున్న ఎస్టీఎఫ్, డీఆర్‌జీ, కోబ్రా జవాన్లు ఈ నెల 16న కూంబింగ్ చేపట్టారు. కూంబింగ్ ముగించుకొని గురువారం తిరిగి క్యాంపులకు చేరుకుంటున్న క్రమంలో బీజాపూర్ జిల్లా టర్రెమ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు జవాన్లను టార్గెట్ చేసుకుని మందుపాతర పేల్చారు. ఈ ఘటనలో కానిస్టేబుళ్లు భరత్‌సాహు, సత్వేర్ సింగ్ అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురు జవాన్లు గాయపడ్డారు.

20, 21 తేదీల్లో ప్రపంచ కమ్మ మహాసభలు

- మాదాపూర్ హెచ్ఐసీసీలో ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి

పంజాగుట్ట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20, 21 తేదీల్లో తొలిసారిగా ప్రపంచ కమ్మ మహాసభలు నిర్వహిస్తున్నామని కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు జెట్టి కుసుమ కుమార్ తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించనున్న ఈ సభలను శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ మేరకు ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫెడరేషన్ సభ్యులతో కలిసి జెట్టి కుసుమకుమార్ ఈ సభలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

ఉత్సాహంగా జనసేన సభ్యత్వ నమోదు

- విజయవాడలో లాంఛనంగా ప్రారంభించిన మంత్రి నాదెండ్ల

అమరావతి, జూలై 18(ఆంధ్రజ్యోతి): జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో గురువారం ఉదయం ప్రారంభమైంది. జనసేన ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, వీర మహిళలు, జన సైనికులు ఉత్సాహంగా పాల్గొని సభ్యత్వ నమోదు చేస్తున్నారు. ఇందుకోసం ప్రతి నియోజకవర్గంలో వలంటీర్లను పార్టీ ఎంపిక చేసింది. నమోదు కోసం ప్రత్యేక యాప్‌ను ఉపయోగిస్తున్నారు. విజయవాడ పశ్చిమలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ లాంఛనంగా ప్రారంభించారు. సభ్యత్వం పొందిన వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా లభిస్తుందని, ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందితే రూ.50 వేలు వరకూ మెడిక్లెయిమ్ సదుపాయం ఉంటుందని తెలిపారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. 2021 నవంబరు నుంచి క్రియాశీల సభ్యత్వ కార్యక్రమం చేపడుతున్నామని, ఇప్పటి వరకూ ప్రమాదంలో మరణించిన 344 మంది క్రియాశీల కార్యకర్తల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున బీమా చెక్కులు అందించామని తెలిపారు. సభ్యత నమోదును పర్యవేక్షించేందుకు కేంద్ర కార్యాలయంలో 9951073038, 9951073097, 7993552354 నంబర్లతో కాల్ సెంటర్‌ను సిద్ధం చేశారు.

పిల్లల అశ్లీల చిత్రాలు చూస్తే నేరం కాదు

- ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం తప్పు: కర్ణాటక హైకోర్టు

బెంగళూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో పిల్లల అశ్లీల చిత్రాలు, వీడియోలు చూడటం నేరం కాదని, కానీ వాటిని అప్‌లోడ్ చేయడం నేరమని కర్ణాటక హైకోర్టు వ్యాఖ్యానించింది. బెంగళూరు గ్రామీణ జిల్లా సీఈఎన్ పోలీసులు తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ.. హొసకోటకు చెందిన ఇనాయతుల్లా హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. సమాచార చట్టం సెక్షన్ 67(బి) ప్రకారం డిజిటల్ రూపంలో పిల్లల అశ్లీల దృశ్యాలు ప్రసారం చేయడం, ప్రకటించడం, ఇతరులకు పంపించడం వంటివి నేరాలు అవుతాయని ధర్మాసనం స్పష్టం చేసింది. సీఈఎన్ పోలీసుల ఎఫ్ఐఆర్ ప్రకారం.. పిటిషనర్ అశ్లీల చిత్రాలను కేవలం చూశారని కోర్టు పేర్కొంది. ఇది సమాచార చట్టం పరిధిలోకి రాదని స్పష్టం చేసింది. పిటిషనర్ అశ్లీల చిత్రాలు చూసే విషయంలో బానిసై ఉండొచ్చని, అంతకుమించి అతడిపై ఆరోపణలు లేవని పేర్కొంది. కేవలం అశ్లీల చిత్రాలు చూశాడనే కారణంతో క్రిమినల్ కేసును కొనసాగించలేమని తేల్చి చెప్పింది. అతడిపై ఉన్న ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసింది.

ఉద్యోగాల్లో కన్నడిగులకు మొదటి హక్కు

- కర్ణాటక కంపెనీలకు ఏపీ గాలం: ప్రియాంక ఖర్గే

బెంగళూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కన్నడిగులకు రాష్ట్రంలోని ఉద్యోగాల్లో మొదటి హక్కు ఉంటుందని ఐటీ బీటీ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే స్పష్టం చేశారు. ప్రైవేటు సంస్థలు, పరిశ్రమల్లో కన్నడిగులకు ఉద్యోగావకాశాలు కల్పించే రిజర్వేషన్ల విషయంపై తదుపరి చర్చలు కొనసాగుతాయని తెలిపారు. రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణబైరేగౌడ, వైద్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావుతో కలిసి గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేబినెట్‌లో తీర్మానించినా అమలుకు ఎన్నో ప్రక్రియలు ఉంటాయన్నారు. కర్ణాటకలోని పలు కంపెనీలకు ఆంధ్రప్రదేశ్ గాలం వేస్తోందని అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ నాస్కాంను తమ రాష్ట్రానికి రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించిన విషయాన్ని గుర్తు చేశారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ విధానసౌధలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రైవేటు సంస్థల్లో సాంకేతిక ఉద్యోగాల విషయంలో తాము జోక్యం చేసుకునేది లేదని స్పష్టం చేశారు. సాంకేతిక అంశాల గురించి తాము ప్రస్తావించలేదని, పరిశ్రమలకు ఎటువంటి మానవ వనరులు కావాలనేది వారే నిర్ణయించుకుంటారన్నారు.

కళతప్పిన కృష్ణపట్నం

- అదానీ స్వార్థం, కాకాణి దందాలకు బలి
- కంటైనర్ కార్గో నిలిపివేతతో తీరని నష్టం
- రోడ్డునపడ్డ వేలాదిమంది ఉద్యోగులు
- ఎగుమతుల్లేక సాగు ఉత్పత్తుల ధర పతనం
- గ్రానైట్ పరిశ్రమపైనా పెనుభారం

(నెల్లూరు-ఆంధ్రజ్యోతి)

కృష్ణపట్నం పోర్టు.. రాష్ట్రంలో అతిపెద్ద వ్యాపార కేంద్రం. ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి కేంద్రం. మూడేళ్ల క్రితం వరకు దేశంలోనే పెద్ద కంటైనర్ కార్గో కేంద్రంగా గుర్తింపు పొందింది. జగన్ ప్రభుత్వంలో పోర్టు యాజమాన్య బాధ్యతలు నవయుగ నుంచి అదానీకి మారడంతో పరిస్థితి మారిపోయింది. అదానీ స్వార్థం, నాటి మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి అక్రమ వసూళ్ల కారణంగా పోర్టు క్రమేణా నిర్వీర్యం అయింది. వ్యాపారం తగ్గిందనే సాకు చూపి అదానీ కంటైనర్ కార్గో నిలిపివేసి, సొంత వ్యాపార ప్రయోజనాల కోసం పోర్టును డర్టీ కార్గోగా మార్చివేసింది. తమిళనాడులో అదానీకే చెందిన ఎన్నూరు పోర్టులో బొగ్గు, ఐరన్ కార్గో పట్ల అక్కడ తీవ్ర వ్యతిరేకత రావడంతో కృష్ణపట్నం పోర్టుకు మార్చింది.

కంటైనర్ కార్గో నిలిపివేతతో ఎగుమతుల్లేక వ్యవసాయ ఉత్పత్తుల ధరలను పతనం చేసింది. రాయలసీమ గ్రానైట్ పరిశ్రమలను దెబ్బతీసింది. వేలాది మంది కార్మికులు, ఉద్యోగులను వీధిన పడేసింది. పోర్టు ఆధారంగా ఏర్పడిన పరిశ్రమలను శాశ్వతంగా మూసేలా చేసింది. వైసీపీ అధికారంలోకి రాకముందు 2009 నుంచి 2019 వరకు ఉజ్వలంగా వెలిగిన కృష్ణపట్నం పోర్టు గత మూడేళ్ల కాలంలో నిర్వీర్యమైంది. పోర్టును నమ్ముకున్న రైతులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారు.



నవయుగ నుంచి అదానీకి

కృష్ణపట్నం పోర్టు నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకర్గ రైతుల త్యాగఫలంతో ఏర్పాటైంది. 1996లో పోర్టు స్థాపించారు. 2007 నుంచి కంటైనర్ ఆపరేషన్లు ప్రారంభమయ్యాయి. 2020 మార్చి వరకు ఈ పోర్టు నవయుగ సంస్థ ఆధీనంలో నడిచింది. 2007 నుంచి 2020 వరకు పోర్టులో కంటైనర్ ఆపరేషన్లు అద్భుతంగా నడిచాయి. మొత్తం 14 బెర్తుల్లో 4 బెర్తులు కంటైనర్ కార్గోకు కేటాయించారు. వీటి ద్వారా రాష్ట్రం నుంచి వ్యవసాయ ఉత్పత్తులు, గ్రానైట్ తదితరాలు ఎగుమతయ్యేవి. పరిశ్రమలకు సంబంధించిన మిషనరీ తదితరాలు విదేశాల నుంచి దిగుమతయ్యేవి. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పోర్టుకు గ్రహణం పట్టింది. నవయుగ సంస్థకు ఇబ్బందులు మొదలయ్యాయి. 2020లో పోర్టును అదానీ చేతుల్లో పెట్టకతప్పని పరిస్థితులను నవయుగ సంస్థకు కల్పించారు. ఈ కుట్రలో అప్పటి సీఎం జగన్ హస్తం ఉందనే ఆరోపణలు పెద్దఎత్తున వచ్చాయి. 2019కి ముందు రాజకీయాలకు అతీతంగా పోర్టులో వ్యాపార కార్యకలాపాలు సాగేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక పోర్టుపై ఆ పార్టీ నాయకుల పెత్తనం పెరిగిపోయింది. కరోనా ప్రభావం తగ్గిన వెంటనే అప్పటి స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అయిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి కృష్ణపట్నం పోర్టు వ్యవహారాల్లోకి కాలుపెట్టారు. ఒకవైపు కాకాణి వర్గం అక్రమ వసూళ్ల దందా సాగిస్తుండగా, అదే సమయంలో అదానీ ముందస్తు వ్యూహంతో బెర్త్ ఇన్‌చార్జీలు, హ్యాండిలింగ్ చార్జీలు భారీగా పెంచేశారు. భరించలేక పలువురు పెద్ద లైనర్లు కృష్ణపట్నం పోర్టుకు రావడం మానేశారు. కృష్ణపట్నం కంటైనర్ బిజినెస్‌లో మస్క్ వాటానే 50 శాతం. ఆయన రెండేళ్ల క్రితమే కృష్ణపట్నం పోర్టు వదిలి పెట్టేశారు. దీంతో కంటైనర్ బిజినెస్ ఒక్కసారిగా సగానికి పడిపోయింది. అదానీకి చెందిన ఎన్నూరు (తమిళనాడు) పోర్టులో ఆ కంపెనీ ఉత్పత్తులైన బొగ్గు, ఐరన్ ఓర్ కార్గో పట్ల స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. దాంతో బొగ్గు, ఐరన్ ఓర్ తదితర డర్టీ కార్గోను కృష్ణపట్నం మార్చారు. ఇక్కడ వ్యాపారం తగ్గిందనే సాకు చూపి ఎన్నూరు పోర్టును కంటైనర్ కార్గోగా మార్చుకొని, కృష్ణపట్నం పోర్టును డర్టీ కార్గోగా మార్చేశారు. 2024 జనవరి 31 నుంచి పోర్టులో కంటైనర్ కార్గో పూర్తిగా ఆపేశారు. దీంతో ఎగుమతుల్లేక వ్యవసాయ ఉత్పత్తులు, గ్రానైట్ ధరల పతనం మొదలైంది. ప్రధానంగా నెల్లూరు జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కృష్ణపట్నం పోర్టు నుంచి సగటున నెలకు 1000 కంటైనర్ల బియ్యం విదేశాలకు ఎగుమతి అయ్యేది. ఒక్కో కంటైనర్‌లో 25 టన్నుల బియ్యం బస్తాలు చొప్పున నెలకు 25 వేల టన్నుల బియ్యం ఎగుమతి అయ్యేది. పూర్తిగా ఆగిపోవడంతో ఇప్పుడు చెన్నై, ఎన్నూరు పోర్టులపై ఆధారపడాల్సి వస్తోంది. దీనివల్ల అదనపు రవాణా చార్జీలు, హ్యాండిలింగ్ చార్జీలు పెరుగుతున్నాయి. ఈ ప్రభావం వరి ధాన్యం ధరలపై పడుతోంది. కంటైనర్ కార్గో ఆగిపోవడంతో పన్నుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.2-3 వేల కోట్లు నష్టపోతుందన్నది అంచనా.

కాకాణి అవినీతితో ముసలం

కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ కార్గో మూతపడటానికి ప్రధాన కారణం కాకాణి గోవర్ధన్‌రెడ్డి అవినీతే అనే వాదన బలంగా వినిపిస్తోంది. 2021కి ముందు పోర్టులో చిన్న చిన్న కాంట్రాక్టు పనులు ప్రధాన పార్టీల నాయకులు పంచుకునేవారు. అధికార పార్టీ నాయకులు 60 శాతం, ప్రతిపక్షనేతలు 40 శాతం పనులు చేసుకునేవారు. కంటైనర్ కార్గో కాంట్రాక్టులను మాత్రం సర్టిఫైడ్ కంపెనీలకే కేటాయించేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కంటైనర్ కార్గో కార్యకలాపాల ద్వారా కూడా డబ్బు సంపాదించుకోవాలనే ఆశతో స్థానిక వైసీపీ నాయకులు లారీ అసోసియేషన్ అనే దానిని ఏర్పాటు చేసుకున్నారు. పోర్టులోకి కంటైనర్లను రవాణా చేసే యజమానులను భయపెట్టి అసోసియేషన్‌లో చేర్చుకున్నారు. పోర్టు బయట ఒక టోల్‌గేట్ పెట్టి లారీలను ఆపేయించారు. ప్రైవేటు సైన్యాన్ని రంగంలోకి దింపి లారీ టైర్లలో గాలి తీయించారు. పోలీసులు, ఆర్టీఏ అధికారుల ద్వారా తప్పుడు కేసులు పెట్టించారు. ఈ టోల్‌గేట్‌కి కాకాణి టోల్‌గేట్ అనే పేరు ప్రచారంలోకి వచ్చింది. దీంతో విధిలేక ట్రాన్స్‌పోర్టర్లు అందరూ ఈ అసోసియేషన్‌లో చేరారు. తర్వాత దందాలు మొదలయ్యాయి. ప్రతి వాహనం కాకాణి టోల్‌గేట్ వద్ద రూ.2వేలు చెల్లించాలి. అంతేగాక కంపెనీ లేదా డీలర్ ట్రాన్స్‌పోర్టర్‌కు చెల్లించే అద్దెలో 20 శాతం కమీషన్ ఇవ్వాలి. ఇలా లారీ అసోసియేషన్ పేరుతో ప్రతి లోడుపై రూ.5-7 వేలు దండుకున్నారు. కమీషన్ల బెడదతో ట్రాన్స్‌పోర్టర్లు, డీలర్లు ఈ పోర్టుకు రాకుండా చెన్నై పోర్టుకు వెళ్లడం ప్రారంభించారు. అయినా వైసీపీ గ్యాంగ్ అరాచకాలు ఆపలేదు. అనధికారిక టోల్‌గేట్ ఏర్పాటు చేసి వెంకటాచలం హైవే మీదుగా వెళ్లే వారి నుంచి వసూళ్లు చేసింది. దీన్ని కాకాణి టోల్‌గేట్ నంబర్-2గా పిలిచేవారు.

ఎన్నో అనర్థాలు...

కంటైనర్ కార్గో ద్వారా గతంలో 10 వేలమంది ఉద్యోగులు పోర్టులో పనిచేసేవారు. పోర్టులో 600 కంపెనీల కార్యకలాపాలు ఉండేవి. ఇప్పుడు కార్గో మూతపడటంతో వీరందరూ ఉపాధి కోల్పోయారు. ఆరు వేల ఎకరాల్లో విస్తరించిన పోర్టులో ప్రస్తుతం నికరంగా పనిచేస్తున్న కార్మిక, ఉద్యోగులు 300 నుంచి 400 మంది మాత్రమే. బొగ్గు దిగుమతుల కారణంగా కాలుష్యం విస్తరిస్తోంది. ముత్తుకూరు, చిల్లకూరు మండలాల్లో విషకారకాల వల్ల ప్రజలకు చర్మవాధులు వస్తున్నాయి. బొగ్గురేణువుల కాలుష్యం నెల్లూరు నగరం హరినాథపురం వరకు వస్తోంది. భవిష్యతులో పోర్టు కాలుష్యం నెల్లూరు నగరంతో పాటు గూడూరు, సూళ్లూరుపేట, కావలి, కందుకూరు డివిజన్ల ప్రాంతాలను సైతం కమ్మేస్తుందనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

3 నెలలుగా జీతాలు బంద్

- గత ప్రభుత్వ నిర్వాకంతో హౌసింగ్ ఉద్యోగుల గగ్గోలు
- ఏప్రిల్ నుంచి ఆపివేత.. 45 కోట్లకు పైగా పెండింగ్
- ఎన్నికల ముందు కార్పొరేషన్ నిధులూ మళ్లింపు
- కూటమి సర్కారు జీతాలివ్వాలని ఉద్యోగుల వినతి

అమరావతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం ఏప్రిల్ నెల నుంచే ఉద్యోగులకు జీతాలను నిలిపివేసింది. ఎన్నికల తర్వాత ఏర్పడిన కొత్త ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు ఈ నెల ఒకటో తేదీనే జీతాలు చెల్లించింది. హౌసింగ్ కార్పొరేషన్ ఉద్యోగులకు మాత్రం ఈ నెల కూడా జీతాలు జమ కాలేదు. 18వ తేదీ వచ్చినా ఇంకా జీతాలు చెల్లించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 900 మందికి పైగా ఇంజనీరింగ్, అడ్మినిస్ట్రేటివ్ విభాగాల రెగ్యులర్ ఉద్యోగులు, కిందిస్థాయి సిబ్బంది గగ్గోలు పెడుతున్నారు. గత మూడు నెలలుగా హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారంటూ ఉద్యోగులు వాపోతున్నారు. ప్రతినెలా హౌసింగ్ కార్పొరేషన్ ఉద్యోగులకు జీతాల కింద రూ.15 కోట్లు చెల్లించాల్సి ఉంది. కొత్త ప్రభుత్వం గత పెండింగ్ బిల్లులతో సహా రూ.45 కోట్ల వరకు విడుదల చేయాల్సి ఉంది. జీతాలు లేకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, పిల్లల స్కూలు, కాలేజీల ఫీజులు, బ్యాంకులకు ఈఎంఐలు చెల్లించలేక అనేక ఇబ్బందులు పడుతున్నామంటూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం రాకముందు హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా నిర్వహించే కార్యకలాపాలకు అడ్మినిస్ట్రేటివ్ చార్జీల కింద 3 శాతం నిధులు వసూలు చేసేవారని, దాంతో కార్పొరేషన్‌లో రూ.300 కోట్లకు పైగా నిధులు అందుబాటులో ఉండేవని, గతంలో తమ జీతాలకు ఎప్పుడూ నిధుల కొరత ఉండేది కాదని ఉద్యోగులు చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక హౌసింగ్ కార్పొరేషన్ వసూలు చేసుకునే 3 శాతం నిధులు కూడా తీసేసుకుని, ఉద్యోగులకు ప్రతినెలా ప్రభుత్వమే సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతాలు చెల్లిస్తూ వస్తోందని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ముందు హౌసింగ్ కార్పొరేషన్ నిధులను వైసీపీ ప్రభుత్వం మళ్లించడంతో ప్రస్తుతం కార్పొరేషన్‌లో నిధులు పూర్తిగా నిండుకున్నాయని చెబుతున్నారు. దీంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా క్రమం తప్పకుండా జీతాలు చెల్లించలేని దుస్థితి నెలకొందని చెబుతున్నారు. జీతాల బిల్లులు రాష్ట్ర ఆర్థిక శాఖ వద్ద పరిశీలనలో ఉన్నాయని, నేడో, రేపో విడుదలవుతాయని చెబుతూ ఉన్నతాధికారులు కాలం గడుపుతున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. కొత్త ప్రభుత్వం తమ జీతాల బిల్లులు విడుదల

మణిపాల్ ఆస్పత్రికి గవర్నర్



తాడేపల్లి టౌన్, జూలై 18: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ గురువారం గుంటూరు జిల్లా తాడేపల్లి పరిధిలోని మణిపాల్ ఆస్పత్రికి వచ్చారు. గతంలో శస్త్ర చికిత్స చేయించుకున్న గవర్నర్ సాధారణ వైద్యపరీక్షల నిమిత్తం వచ్చినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.పరీక్షల అనంతరం విజయవాడ రాజ్‌భవన్‌కు తిరిగి వెళ్లారు. గవర్నర్ రాక సందర్భంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సచివాలయాలను ఏంచేద్దాం!

- కూటమి ప్రభుత్వం తర్జనభర్జన
- మానవ వనరుల సద్వినియోగం దిశగా ఆలోచన
- పని తక్కువ.. మంది ఎక్కువ
- ఖజానాపై అనవసర భారం
- 1.26 లక్షల మందికి ఏటా రూ.4 వేల కోట్ల జీతాలు
- వలంటీర్ల కోసం మరో 2 వేల కోట్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



ప్రజలకు ప్రభుత్వ సేవలను ఇంటి ముంగిటకు అందించాలన్న లక్ష్యంతో తీసుకొచ్చిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ అంతగా ప్రజాదరణ పొందలేకపోయాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ సర్కార్ అడ్డగోలుగా సచివాలయ ఉద్యోగులను నియమించడం, పార్టీ కార్యకర్తలను వలంటీర్లుగా నియమించి పని లేకుండానే జీతాలివ్వడంతో ఏటా ప్రభుత్వ ఖజానాపై భారం పడుతోంది. 'సిబ్బంది ఫుల్.. పనులు నిల్' అన్న ధోరణిలో గ్రామ, వార్డు సచివాలయాలున్నాయి. గ్రామ పంచాయతీల్లో సేవలందించే ఈ వ్యవస్థలను పంచాయతీలకు సంబంధం లేకుండా చేయడంతో మరోవైపు గ్రామ పంచాయతీలు ఆదరణ కోల్పోయాయి. పైగా వైసీపీ సర్కార్ హయాంలో గ్రామ పంచాయతీలకు నిధులివ్వకుండా నిర్వీర్యం చేయడంతో సర్పంచులు ఉత్సవ విగ్రహాల్లా తయారయ్యారు. పంచాయతీ భవనాలను సచివాలయాలకు వాడుకోవడంతో గ్రామ పంచాయతీ భవనాల్లోనే సర్పంచికి స్థానం లేకుండా పోయింది. పంచాయతీ నిధులను సచివాలయాలకు వాడుకుంటూ ఆ వ్యవస్థను అధోగతి పాలు చేశారు. సచివాలయాల ద్వారా గ్రామ పంచాయతీలపై ప్రభుత్వ పెత్తనం విపరీతం కావడంతో రాష్ట్రంలో స్థానికసంస్థల ఉనికి లేకుండా పోయింది. ఈ తప్పులను సరిదిద్దాల్సిన ఆవశ్యకత కొత్త సర్కార్‌పై పడింది. 1.26 లక్షల మంది సచివాలయ ఉద్యోగుల సేవలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలన్న లక్ష్యంతో కూటమి సర్కార్ ప్రయత్నాలు ప్రారంభించింది. గ్రామ, వార్డు సచివాలయాలు, గ్రామీణ, పట్టణ స్థానికసంస్థలు, వలంటీర్లు.. ఈ మూడు వ్యవస్థలను కలిపి ఒక పటిష్ఠమైన వ్యవస్థను రూపకల్పన చేయాలని సర్కారు భావిస్తోంది. సేవల నెపంతో పంచాయతీలు, మున్సిపాలిటీల సార్వభౌమాధికారానికి ఆటంకం కలగకుండా స్థానికసంస్థల ప్రతినిధులకు పెద్దపీట వేయాలని నిర్ణయించింది. అందుకోసం ఏయే గ్రామాల్లో ఎంత జనాభా ఉన్నారు? ఆ జనాభాకు పంచాయతీ కార్యాలయాల్లో అందించాల్సిన సేవలు, అందుకు అవసరమైన సిబ్బంది తదితర వివరాలు సేకరించాల్సిన అవసరముంది. తద్వారా మానవ వనరులను వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త ప్రభుత్వంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు కుదురుకున్న తర్వాత ఆ మేరకు అధ్యయనం చేపట్టి ప్రక్షాళన చేయాలనే యోచనలో కొత్త సర్కార్ ఉంది.

నగదు పంపిణీ విధులతోనే సరి..

గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న 1.26 లక్షల మందికి ఏటా రూ.4వేల కోట్లు జీతాల రూపంలో చెల్లిస్తున్నారు. వీరుకాక 2.5లక్షల మంది వలంటీర్లకు గౌరవవేతనాల రూపంలో మరో రూ.1,560 కోట్లు, వారికి ఇన్సెంటివ్‌ల పేరుతో మరో రూ.400కోట్లు వెరసి మొత్తం సుమారు రూ.6వేల కోట్లు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్ల కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో ఎక్కువగా నగదు బదిలీ పథకాల కోసమే వారిని ఉపయోగించుకున్నారు. జగన్ ఇచ్చామని చెప్పుకొన్న 2.5 లక్షల కోట్ల నగదు బదిలీ పంపిణీ కోసమే వారు పనిచేశారు. అంటే గత ఐదేళ్లలో 2.5లక్షల కోట్ల పంపిణీ కోసం సుమారు రూ.30వేల కోట్లు సచివాలయ వ్యవస్థపై ఖర్చు చేశారు. వారిని సక్రమంగా వినియోగించి ఉంటే అత్యుత్తమ ఫలితాలను సాధించే అవకాశముండేది. ఆ మేరకు వైసీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో ఉద్యోగులు, వలంటీర్ల సేవలు నిర్వీర్యమయ్యాయి.

గందరగోళ వ్యవస్థ..

వైసీపీ సర్కార్ సచివాలయ వ్యవస్థ స్వరూపం ఏర్పడక ముందే ఉద్యోగులను ఎంపిక చేయడం, ఉద్యోగంలో చేరినవారికి సుదీర్ఘకాలం జాబ్‌చార్ట్ రూపొందించలేకపోవడం, జాబ్‌చార్ట్‌పై రోజుకో రకంగా ఉత్తర్వులు మార్చడంతో ఆ ఉద్యోగాల్లో చేరిన లక్ష మందికిపైగా అయోమయానికి గురయ్యారు. వీఆర్వోలు నామమాత్రంగా సచివాలయాలకు వచ్చినా, పౌర సేవలు మాత్రం తహసీల్దార్ కార్యాలయాల నుంచి అందిస్తున్నారు. రెవెన్యూ సమస్యలకు గ్రామ సచివాలయాల్లో ఏ మాత్రం పరిష్కారం లభించడం లేదు. మహిళా పోలీసు ఏం విధులు నిర్వర్తిస్తున్నారో ఎవ్వరికీ తెలియడం లేదు. ఎప్పటి లాగానే ఏఎన్ఎంలు డాక్టర్ల కనుసన్నల్లో పనిచేస్తున్నారు. రికార్డింగ్ అసిస్టెంట్ స్థాయి పోస్టుకు గ్రూప్-1 స్థాయి పరీక్షలు నిర్వహించి ఎంపిక చేసిన ప్రభుత్వం వారి సేవల వినియోగంలో విఫలమైందంటున్నారు. 14 రకాల సచివాలయ ఉద్యోగులుంటే.. అందులో ప్రతి శాఖ ఉద్యోగులకూ ఉద్యోగరీత్యా సమస్యలున్నాయి. కొత్తగా ఏర్పడిన వ్యవస్థకు అన్ని హంగులు సమకూర్చాల్సిన ప్రభుత్వం గాలికొదిలేయడంతో ఆదిలోనే సమస్యల పుట్టగా సచివాలయ వ్యవస్థ మారింది.

పెత్తనం వలంటీర్లదే!

వైసీపీ కార్యకర్తలను గ్రామ, వార్డు వలంటీర్లుగా నియమించి సమాజం మీదకు ఒదిలేశారని విమర్శలు వెల్లువెత్తాయి. గ్రామ, వార్డుల్లోని కుటుంబాల గుట్టును రెండున్నర లక్షల మంది వలంటీర్ల చేతిలో పెట్టి ప్రభుత్వం చోద్యం చూసింది. ప్రజలకు జవాబుదారిగా ఉండాల్సిన వ్యవస్థను వైసీపీ కార్యకర్తల కనుసన్నల్లోకి నెట్టేశారు. లక్ష మంది సచివాలయ ఉద్యోగులను వలంటీర్లకు రిమోట్ కంట్రోల్‌గా మార్చేశారు. నగదు పంపిణీ తప్ప ఒక్క సేవ కూడా అందించని ఈ వ్యవస్థను ప్రజల నెత్తిన రుద్దారన్న విమర్శలు వెల్లువెత్తాయి. క్లిష్టమైన కరోనా సమయంలో ఇంటింటికీ రేషన్ అందిస్తారని ఆర్భాటం చేసిన ప్రభుత్వం చివరకు పేదలను రేషన్ షాపుల ముందు క్యూల్లో నిలబెట్టింది. కొత్త ప్రభుత్వం ఈ వ్యవస్థకు స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కాంట్రాక్టు ఉద్యోగులుగా కొంత మంది సిబ్బందిని నియమించి సంక్షేమ కార్యక్రమాల అమలుకు వినియోగించుకోవాల్సిన అవసరముంది.

ఏపీకి చేయూత ఇవ్వండి

- కేంద్ర మంత్రులకు సత్యకుమార్ వినతి



న్యూఢిల్లీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పునర్ నిర్మాణానికి చేయూత ఇవ్వాలని కేంద్ర మంత్రులను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కోరారు. గత ఐదేళ్లలో ఏపీలోని అన్ని రంగాలు విధ్వంసానికి గురయ్యాయని కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రులు గిరిరాజ్ సింగ్, భూపేంద్ర యాదవ్, నితిన్ గడ్కరీలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్రంలో చేనేత వస్త్రాల ఉత్పత్తులు పెంచేందుకు చేయూత ఇవ్వాలని కోరారు. ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరిల ప్రత్యేకతలను వివరించారు. ధర్మవరంలో సిల్క్ పార్క్, మంగళగిరిలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయాలని కోరారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటు పడిందని, పర్యావరణ ఉల్లంఘనలు జరిగాయని తెలిపారు. విశాఖపట్నం రుషికొండపై వందల కోట్లు ఖర్చు పెట్టి ఒక కుటుంబం కోసం ప్యాలెస్ కట్టారని, ఆ విషయాన్ని తీవ్రంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కేంద్ర విధానాలతోనే విశాఖ ఉక్కుకు నష్టం

- సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్

విశాఖపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే విశాఖ ఉక్కు కర్మాగారం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుందని సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఆరోపించారు. 'సంక్షోభంలో విశాఖ ఉక్కు...పరిష్కారం ఎలా?' అనే అంశంపై సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఉక్కు ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కేంద్రంలో మరోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను ఇప్పుడైనా విరమించుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే స్టీల్‌ప్లాంటు అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. సెయిల్‌లో విలీనం ప్రతిపాదనను తాము స్వాగతిస్తున్నామని ప్రకటించారు. సొంత గనులు వెంటనే కేటాయించాలన్నారు. కార్మిక సంఘాలు మరింత ఐక్యతతో పోరాడి విశాఖ ఉక్కును రక్షించుకోవాలన్నారు. ముఖ్య వక్తగా హాజరైన స్టీల్ ప్లాంటు మాజీ సీఎండీ వై.శివసాగరరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కులో సంక్షోభం నివారణకు ఐరన్‌ఓర్ గనులను కేటాయించాలన్నారు. బైలదిల్లా 4, 5 బ్లాకుల నుంచి ముడి ఇనుము ఖనిజ సరఫరా ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వం కొనసాగించాలన్నారు. స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, స్టీల్ ప్లాంటు మాజీ డైరెక్టర్ కేకే రావు, మాజీ ఈడీ జీఎస్ఎన్ మూర్తి ప్రసంగించారు.

శ్రీశైలంలో చిరుత సంచారం



శ్రీశైలం, జులై 18: శ్రీశైలం దేవస్థానం పరిధిలోని పాతాళగంగ పాతమెట్ల రోడ్డు సమీపంలో చిరుత సంచారం కలకలం రేపింది. బుధవారం అర్ధరాత్రి పాతాళగంగ పాతమెట్ల రోడ్డు మార్గం రన్‌వేపై చిరుత కూర్చుని ఉండగా గమనించిన స్థానికులు తమ ఫోన్లలో దృశ్యాలను చిత్రీకరించారు. అటవీ ప్రాంతానికి సమీపంలో నివాసం ఉంటున్న స్థానికులు, సమీప రహదారివెంట ప్రయాణించే భక్తులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

మోదీ పాలనలో సమస్యలతో దేశం సతమతం: రామకృష్ణ

గుంటూరు(తూర్పు), జూలై 18: మోదీ పాలనలో దేశం అనేక సమస్యలతో సతమతమౌతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ విమర్శించారు. గురువారం గుంటూరులో జరిగిన ఆ పార్టీ జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ అమలుపై ప్రధాని మోదీ స్పందించకపోవడం శోచనీయం. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రత్యేక హోదా, విభజన హామీలను సాధించుకోవాల్సిన అవసరముంది. ప్రత్యేక హోదా ఇస్తే తప్ప ఆర్థిక అవస్థల నుంచి రాష్ట్రం బయటపడదు' అని అన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ, పార్టీ శత వార్షికోత్సవాలను వాడవాడల ఘనంగా నిర్వహించేందుకు శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్)- దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 'జవహర్ నవోదయ విద్యాలయ సెలెక్షన్ టెస్ట్(జేఎన్‌వీఎస్‌టీ) 2025' ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఇవి కో-ఎడ్యుకేషనల్ రెసిడెన్షియల్ స్కూళ్లు. బాల బాలికలకు విడివిడిగా హాస్టల్స్ ఉంటాయి. భోజన, వసతి సౌకర్యాలతోపాటు పన్నెండో తరగతి వరకు బోధన ఉచితం. యూనిఫాం, పాఠ్య పుస్తకాలు కూడా ఇస్తారు. తొమ్మిది నుంచి పన్నెండో తరగతి విద్యార్థులు మాత్రం విద్యాలయ వికాస్ నిధి కోసం నెలకు రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. బాలికలు; దివ్యాంగులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు; పేదింటి పిల్లలకు దీని నుంచి మినహాయింపు వర్తిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలైతే నెలకు రూ.1500 చెల్లించాలి. ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు మాతృభాష/ప్రాంతీయ భాషలో బోధన ఉంటుంది. తరవాత మేథమెటిక్స్, సైన్స్ సబ్జెక్టులను ఆంగ్ల మాధ్యమంలో; సోషల్ సైన్స్‌ను హిందీలో బోధిస్తారు. ఈ విద్యాలయాల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) వార్షిక పరీక్షలు నిర్వహిస్తుంది.

జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరోతరగతి ప్రవేశాలు



విద్యాలయాలు-సీట్లు: దేశవ్యాప్తంగా మొత్తం 653 జేఎన్‌వీలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 13 విద్యాలయాలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ వర్గాల జనాభా అధికంగా ఉన్న ప్రాంతాలకు మరో రెండు విద్యాలయాలు కేటాయించారు. తెలంగాణలో 9 జేఎన్‌వీలు ఉన్నాయి. ఒక్కో విద్యాలయంలో ఆరోతరగతిలో గరిష్ఠంగా 80 మందికి అవకాశం కల్పిస్తారు. జిల్లాల వారీగా సంబంధిత జేఎన్‌వీల్లో గ్రామీణ విద్యార్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు.

అర్హత వివరాలు: ప్రస్తుతం ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో అయిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్ఐఓఎస్ నుంచి 2024 సెప్టెంబరు 15 నాటికి 'బి' సర్టిఫికెట్ కాంపిటెన్సీ కోర్సు పూర్తిచేసేవారు కూడా అర్హులే. విద్యార్థులు 2013 మే 1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి.

జేఎన్‌వీ సెలెక్షన్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం 2 గంటలు. మొత్తం మార్కులు 100. ఈ పరీక్షలో మూడు సెక్షన్లు ఉంటాయి. వీటిలో మొత్తం 80 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌లో 40 ప్రశ్నలు అడుగుతారు. దీనికి 50 మార్కులు కేటాయించారు. అర్థమెటిక్ టెస్ట్, లాంగ్వేజ్ టెస్ట్‌ల్లో ఒక్కోదానిలో 20 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో దానికి 25 మార్కులు ఉంటాయి. నెగెటివ్ మార్కులు లేవు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌కు గంట; మిగిలినవాటికి ఒక్కోదానికి అర్థగంట పరీక్ష సమయం ఇస్తారు. విద్యార్థులు బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద సమాధానాలు గుర్తించాలి. తెలుగు రాష్ట్రాల్లో ఈ పరీక్షని తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మరాఠీ, ఉర్దూ, ఒరియా, కన్నడ మాధ్యమాల్లో నిర్వహిస్తారు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **జేఎన్‌వీ సెలెక్షన్ టెస్ట్ తేదీలు:** 2025 జనవరి 18, ఏప్రిల్ 12
- **వెబ్‌సైట్:** www.navodaya.gov.in

పంచకర్మ టెక్నీషియన్ కోర్సు

భారత ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్(సీసీఆర్ఏఎస్)- పంచకర్మ టెక్నీషియన్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. హెల్త్‌కేర్ సెక్టర్ స్కిల్ కౌన్సిల్(హెచ్ఎ స్ఎస్‌సీ)-నేషనల్ స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎస్‌డీసీ)కి అనుబంధంగా ఉన్న ట్రెయినింగ్ సెంటర్లలో శిక్షణ ఇస్తారు. ఇది ఏడాది వ్యవధి గల సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ రెగ్యులర్ నాన్ రెసిడెన్షియల్ కోర్సు. ప్రతి రోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు థియరీ తరగతులు, ప్రాక్టికల్ సెషన్స్ నిర్వహిస్తారు. హిందీ, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన ఉంటుంది. అవసరం మేరకు ప్రాంతీయ భాషల్లో వివరణ ఇస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. నిబంధనల ప్రకారం కోర్సు పూర్తి చేసినవారికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు. శిక్షణ సమయంలో ఇతర కోర్సుల్లో చేరేందుకు అనుమతించరు. అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ట్రెయినింగ్ సెంటర్లు-సీట్లు: సెంట్రల్ ఆయుర్వేద రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఏఆర్ఐ)కి సంబంధించి న్యూఢిల్లీ, గువహటి సెంటర్లలో ఒక్కోదానిలో 10 సీట్లు; కేరళ - చెరుతురుతిలోని నేషనల్ ఆయుర్వేద రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పంచకర్మ(ఎన్ఏఆర్ఐపీ)లో 30 సీట్లు; జమ్ములోని రీజనల్ ఆయుర్వేద రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఆర్ఏఆర్ఐ)లో 15 సీట్లు ఉన్నాయి. ప్రతి సెంటర్లో సగం సీట్లను మహిళలకు ప్రత్యేకించారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ట్రెయినింగ్ పూర్తయ్యేనాటికి అభ్యర్థులకు 18 ఏళ్లు నిండాలి.

ముఖ్య సమాచారం

- ఈ కోర్సు పూర్తిచేసినవారికి దేశవిదేశాల్లోని ఆయుర్వేదిక్ సంస్థలు, ఆసుపత్రుల్లో పంచకర్మ టెక్నీషియన్, పంచకర్మ అసిస్టెంట్ తదితర ఉద్యోగావకాశాలు లభిస్తాయి.
- **కోర్సు ఫీజు:** రూ.30,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **రిజిస్టర్డ్/స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 31
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 31
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** అక్టోబరు 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.ccras.nic.in

సీఈసీఆర్ఐలో బీటెక్

కరైకుడి(తమిళనాడు)లోని సెంట్రల్ ఎలక్ట్రోకెమికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎస్ఐఆర్-సీఈసీ ఆర్ఐ)-బీటెక్ (కెమికల్ అండ్ ఎలక్ట్రోకెమికల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో అదర్ స్టేట్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అయిదు సీట్లు ఉన్నాయి. జేఈఈ మెయిన్ 2024 ఆలిండియా ర్యాంక్ ఆధారంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు(తమిళనాడు మినహా) నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్, ఓబీసీ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 40 శాతం మార్కులు ఉండాలి. జేఈఈ మెయిన్ 2024 అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 6
- **ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** ఆగస్టు 9
- **ఆన్‌లైన్ కౌన్సెలింగ్:** ఆగస్టు 21
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 23
- **వెబ్‌సైట్:** cecri.res.in

మ్యాట్ నోటిఫికేషన్



ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ)-మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(మ్యాట్) 2024 ఆగస్టు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా దేశంలోని ప్రముఖ బిజినెస్ స్కూళ్లు అందిస్తున్న మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఎంబీఏ, పీజీడీఎం, ఎంఎంఎస్ తదితర ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు. మ్యాట్‌ను ఇంటర్నెట్ బేస్డ్ టెస్ట్, పేపర్ బేస్డ్ టెస్ట్, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానాల్లో నిర్వహిస్తారు. వీటిలో ఒకదాన్ని లేదా రెంటిని అభ్యర్థులు ఎంచుకోవచ్చు. పీబీటీ, సీబీటీలకు పరీక్ష కేంద్రాలు వేరుగా ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

మ్యాట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో లాంగ్వేజ్ కాంప్రహెన్షన్, ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్, మేథమెటిక్ స్కిల్స్, డేటా అనాలిసిస్ అండ్ సఫిషియెన్సీ, ఎకనామిక్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ అనే అయిదు సెక్షన్‌లు ఉంటాయి. సెక్షన్‌కు 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 150 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

ఐబీటీ షెడ్యూల్: ఆగస్టు 14న ఎగ్జామ్ రాయాలనుకొనేవారు ఆగస్టు 9లోపు, ఆగస్టు 23న పరీక్ష రాయాలంటే ఆగస్టు 18లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఎగ్జామ్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ తరవాత రెండోరోజు నుంచి అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

సీబీటీ షెడ్యూల్

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 11
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** ఆగస్టు 14 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- **సీబీటీ టెస్ట్ తేదీ:** ఆగస్టు 18

పీబీటీ షెడ్యూల్

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 18
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** ఆగస్టు 21 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం
- **పీబీటీ టెస్ట్ తేదీ:** ఆగస్టు 25

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** ఒక టెస్ట్(ఐబీటీ/పీబీటీ/సీబీటీ)నకు రూ.2100; రెండు టెస్ట్‌లు అంటే డబుల్(ఐబీటీ/పీబీటీ/సీబీటీ) లేదా (పీబీటీ+ఐబీటీ)/ (పీబీటీ+సీబీటీ)/(సీబీటీ+ఐబీటీ)లకు రూ.3,600.
- **వెబ్‌సైట్:** mat.aima.in

ఐఐఎఫ్‌టీలో ఆన్‌లైన్ పీజీ డిప్లొమా



ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- ఎగ్జిక్యూటివ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(ఈపీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది 15 నెలల వ్యవధి గల వీకెండ్ ప్రోగ్రామ్. ఇందులో మూడు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లు పూర్తయిన తరవాత ప్రోగ్రామ్‌లో బ్రేక్ తీసుకోవచ్చు. గరిష్ఠంగా మూడేళ్లలో ప్రోగ్రామ్‌ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌ని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. వారాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు వరకు సెషన్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా పోర్ట్ విజిట్, ఇండస్ట్రీ విజిట్, రీసెర్చ్ ప్రాజెక్ట్, అసైన్‌మెంట్స్ ఉంటాయి. సెలెక్షన్ కమిటీ నిర్ణయం మేరకు అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం అయిదేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. పనిచేస్తున్న సంస్థ నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 20
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** సెప్టెంబరు 14 నుంచి
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

జాబ్ కార్నర్

పోస్టల్ శాఖలో ఉద్యోగాలు

ఖాళీలు 44228

దేశ వ్యాప్తంగా వివిధ పోస్టల్ సర్కిళ్లలో గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్) ఖాళీల భర్తీకి ప్రకటన వెలువడింది. పదో తరగతిలో సాధించిన మార్కులతో ఉద్యోగం పొందవచ్చు.

మొత్తం ఖాళీలు: 44,228(ఆంధ్రప్రదేశ్-1,355, తెలంగాణ-981)

పోస్టుల వివరాలు

1. బ్రాంచ్ పోస్టు మాస్టర్(బీపీఎం)
2. అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్(ఏబీపీఎం)
3. డాక్ సేవక్

అర్హతలు: పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి

జీతభత్యాలు: నెలకు బ్రాంచ్ పోస్టు మాస్టర్ పోస్టుకు రూ.12,000 నుంచి రూ.29,380; అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్/డాక్ సేవక్ పోస్టుకు రూ.10,000 నుంచి రూ.24,470 చెల్లిస్తారు.

వయోపరిమితి: 18 నుంచి 40 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది.

ఎంపిక విధానం: పదోతరగతిలో సాధించిన మెరిట్‌లిస్ట్ మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 5

వెబ్‌సైట్: https://indiapostgdsonline.gov.in/

ఇండియన్ ఆర్మీలో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్

ఇండియన్ ఆర్మీ... షార్ట్ సర్వీస్ కమిషన్ ద్వారా స్పెషల్ ఎంట్రీ స్కీమ్ 57వ కోర్సులో ప్రవేశాలకు అర్హులైన అవివాహిత పురుషులు, మహిళల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ 57వ కోర్సు (ఏప్రిల్ 2025)

కేటగిరీ వారీగా ఖాళీలు

- ఎన్‌సీసీ పురుషులు: **70 పోస్టులు**
- ఎన్‌సీసీ మహిళలు: **6 పోస్టులు**
- ఈ రెండు విభాగాల్లోనూ 8 పోస్టులను యుద్ధంలో మరణించిన ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు కేటాయించారు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే మూడు అకడమిక్ సంవత్సరాలు ఎన్‌సీసీ సీనియర్ డివిజన్ వింగ్‌లో కొనసాగి ఉండాలి. ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్‌లో కనీసం 'బి' గ్రేడ్ పొంది ఉండాలి. యుద్ధంలో మరణించిన ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు ఎన్‌సిసి 'సి' సర్టిఫికెట్ అవసరం లేదు.

వయోపరిమితి: 2025 జనవరి 1 నాటికి 19 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: అప్లికేషన్ షార్ట్‌లిస్ట్, స్టేజ్-1, స్టేజ్-2 టెస్టులు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారు.

శిక్షణ, వేతనాలు: ఎంపికైన అభ్యర్థులకు ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ చెన్నైలో 49 వారాల శిక్షణ ఉంటుంది. ఈ సమయంలో ప్రతి నెలా రూ.56,100 స్టయిపెండ్ చెల్లిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్నవారికి పీజీ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ డిగ్రీని మద్రాస్ యూనివర్సిటీ ప్రదానం చేస్తుంది. వీరిని లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 9

వెబ్‌సైట్: joinindianarmy.nic.in



మెకాన్ లిమిటెడ్‌లో ప్రొఫెషనల్ పోస్టులు

రాంచీలోని మెకాన్ లిమిటెడ్... ఫుల్ టైం ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న విభాగాల్లో ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. డిప్యూటీ ఇంజనీర్
2. ఇంజనీర్
3. అసిస్టెంట్ ఇంజనీర్
4. జూనియర్ ఇంజనీర్
5. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్
6. జూనియర్ ఎగ్జిక్యూటివ్
7. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్
8. ఎగ్జిక్యూటివ్

విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్, డిజైన్, స్ట్రక్చరల్, సేఫ్టీ, ఐటీ, హెచ్ఆర్, పర్చేజ్ అండ్ స్టోర్, ఎస్టేట్, ప్రాజెక్ట్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్.

అర్హత: సంబంధిత విభాగంలో సీఎంఏ/సీఏ/డిప్లొమా/డిగ్రీ/పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 జూన్ 15 నాటికి 50 ఏళ్లు మించకూడదు

ఎంపిక: విద్యార్హతలు, పని అనుభవం, పర్సనల్ ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ల వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 31


వెబ్‌సైట్: www.meconlimited.co.in/

లిటిల్స్




అద్భుతమైన అద్దం

ఒక దేశాన్ని పాలించే రాజుకు విక్రముడు అనే కొడుకు ఉన్నాడు అతనికి వివాహం చేయాలని నిర్ణయించుకుని, రాజు తన మంత్రులను పిలిచి ఇలా చెప్పాడు 'అందగాడు, గుణవంతుడు ధైర్యశాలి ఐన విక్రముడికి అంతే సుగుణాలున్న వధువును వెతకాలి. మీరు ఇలా ప్రకటన చేయించండి. 'మన దగ్గర ఒక అద్భుతమైన మాయా అద్దం ఉందనీ అందులో మొహం చూసుకున్నా వారి మనసులో ఏమైనా దురాలోచనలు ఉంటే, అద్దంలో వారి మొహం మీద నల్లటి మచ్చలు కనిపిస్తాయనీ దీనికి సిద్ధ పడినవారు పరీక్షలో నెగ్గి, యువరాణి కావచ్చుననీ ప్రచారం చేయండి అని చెప్పి మంత్రులను పంపేశాడు రాజు. చాలా మంది అమ్మాయిలు యువరాజును వివాహమాడాలి అనుకున్నారు కానీ, అద్దంలో చూసుకున్నపుడు తమ మొహం మీద మచ్చలు కనిపిస్తే ఎలా అన్న భయంతో వారెవరూ అద్దం పరీక్షకు ముందుకు రాలేదు. చివరగా ఒక పల్లె పడుచు పరీక్షకు తాను సిద్ధం అని ముందుకు వచ్చింది. నిబంధన తెలుసుగా అన్నాడు రాజు తెలుసు మహారాజా.. నా మనసులో ఎలాంటి దురాలోచనలు ఉండవు. మా పల్లెలో ఎవరైనా తప్పులు చేస్తే, దిద్దుకుంటాం, ఒకరినొకరు క్షమించుకుంటాం అన్నది ఆమె. అద్దంలో తన మొహం చూసుకుంది. మచ్చలేమీ కనపడలేదు అపుడు మహారాజు ఇది మిగతావాటిలాగే ఒక సాధారణ అద్దం కానీ దురాలోచన విషయం చెప్పేసరికి ఎవ్వరూ సాహసం చేయలేదు. ఈ అమ్మాయి మాత్రమే ఆత్మ విశ్వాసంతో ముందుకు వచ్చింది కాబట్టి, ఈమెనే విక్రముడికి కాబోయే భార్య, మరియు ఈ దేశపు యువరాణి ఇలాంటి ఆత్మ విశ్వాసం కల అమ్మాయిని వెతకడానికే ఈ పరీక్ష, ప్రకటన అంతానూ అన్నాడు మహారాజు.



10 తేడాలను గుర్తించండి?






రంగులు వేయండి



సరైన నీడ ఏది?



2		1	
	2		3

డైలీ సుడోకు - 362

సుడోకు - 361 సమాధానం

3	6	4	2	5	1
5	1	2	3	6	4
1	2	6	4	3	5
4	5	3	6	1	2
6	4	1	5	2	3
2	3	5	1	4	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.